

# దివ్య కుర్‌ఆన్ పరిచయం

**Qur'an Majeed ka Ta'aruf**
(Telugu)

# దివ్య కుర్‌ఆన్ పరిచయం


*మూలం :*

**మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ (అలైహిర్రహ్మాహ్)**

*అనువాదం:*

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



**ప్రకాశకులు**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

సందేశ భవనం, లక్కడ్ కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్–500 002 ఫోన్ : 040–24576237

| | | |
|---|---|---|
| Name of Book | : | **DIVYA QUR'AN PARICHAYAM** |
| Urdu Name | : | Qur'an Majeed ka Ta'aruf (Telugu) |
| **TIP Series No.** | : | **288** |
| Written by | : | **Maulana Sadruddeen Islahi (R.A.)** |
| Translated by | : | **Muhammad Azeezur Rahman** |

*All Rights Reserved with Publishers*

| | | |
|---|---|---|
| First Edition | : | July 2015 |
| Copies | : | 1000 |
| **Price** | : | **Rs. 100** |
| ISBN | : | 978 - 93 - 81111 - 38 - 3 |
| Published by | : | **Telugu Islamic Publications Trust** (Regd.)<br>Sandesha Bhavanam,<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500 002. India.<br>Phone: 040 - 24564583, 24576237<br>E-mail: geeturaiweekly@gmail.com |
| Typeset by | : | Geeturai Graphics<br>Lakkadkot, Hyderabad-2. |
| Printed at : | : | Cosmic Printers<br>Lakkadkot, Hyderabad-2. |

# విషయ సూచిక

**1. పీఠిక** **04**

**2. దివ్య కుర్‌ఆన్ స్థాయి** **06**

సృష్టికర్త–ఆయన మార్గదర్శక ప్రయోజనం; దివ్య కుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి సాక్ష్యాధారం; కుర్‌ఆన్‌కు – ఇతర ఆకాశ గ్రంథాలకు మధ్య గల సంబంధం; కుర్‌ఆన్ వైశిష్ట్యం; కుర్‌ఆన్ అధ్యయనం : బాధ్యతలు

**3. అవతరణ, క్రోడీకరణ** **51**

అవతరణ చరిత్ర; అవతరణా స్థితి; కుర్‌ఆన్ క్రోడీకరణ; క్రోడీకరణ చరిత్ర

**4. సురక్షిత గ్రంథం** **69**

సురక్షితం అంటే భావం; సురక్షితంగా ఉండటం అనివార్యం; కుర్‌ఆన్ పరిరక్షణకై తీసుకోబడిన క్రియాత్మక జాగ్రత్తలు; కుర్‌ఆన్ సురక్షిత గ్రంథం అనడానికి ప్రబల నిదర్శనాలు; బౌద్ధిక నిదర్శనాలు; కుర్‌ఆనీ నిదర్శనాలు

**5. బోధనా శైలి** **89**

విలక్షణమైన బోధనా శైలి; విలక్షణా శైలికి గల కారణాలు; విషయాల పునరుక్తి

**6. కుర్‌ఆన్ – కుర్‌ఆన్ భాగాలు** **97**

కుర్‌ఆన్ నామకరణం; సూరా; సూక్తి; పారాలు, రుకూలు

**7. ముఖ్యమైన పారిభాషిక పదాలు** **107**

అల్లాహ్; ప్రవక్త, సందేశహరుడు; వహీ (దివ్య వాణి); ఇస్లామ్; మూమిన్, ముస్లిమ్; కుఫ్ర్, కాఫిర్; షిర్క్, ముష్రిక్; గ్రంథవహులు

*అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో*

# పీఠిక

మహోన్నతుడయిన అల్లాహ్ తరఫున ఈ భూమండలంపైకి పంపబడిన మహా గొప్ప వరం దివ్య కుర్‌ఆన్. అది మానవులకు అతి పెద్ద అవసరం కూడా. మానవుడు గనక ఈ వర ప్రసాదం పట్ల విముఖత ప్రదర్శిస్తే మానవ శ్రేయోసాఫల్యాలకు అర్థమే లేకుండాపోతుంది. ఈ వాస్తవాలు వాంఛించేదేమిటంటే మానవ జాతికి చెందిన ఒక్కొక్క వ్యక్తి ఈ ఉద్గ్రంథం గురించి తెలుసుకోవాలి. తెలియని వారికి దీని గురించి తెలియపరచాలి. దివ్య కుర్‌ఆన్‌ను వారి చేతికి ఇచ్చి దీనిని అధ్యయనం చేయండి అని చెప్పినప్పుడే తెలియపరచినట్లు లెక్క. వారు దీని కోసం సంసిద్ధమైనప్పుడు కుర్‌ఆన్ భావార్థాలను అవగతం చేసుకోవటంలో వారికి సహాయపడాలి. అయితే మీరు లోతుగా ఆలోచించినట్లయితే ఈ గొప్ప విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చక ముందు చేయాల్సింది ఇంకా చాలా ఉంది అన్న సంగతి బోధపడుతుంది. ఎందుకంటే కుర్‌ఆన్ దైవగ్రంథం. ఇది మానవ రచన కానేకాదు. కాబట్టి దీని అధ్యయనం కూడా సాదాసీదా విషయం కాదు. ఇదొక అసాధారణ విషయం. ఒక మానవ రచనను కేవలం ఒక రచనగా చూడవచ్చు, చదవవచ్చు. కాని 'దివ్య రచన' అని ప్రకటించబడే గ్రంథాన్ని చదవడానికి సాధారణంగా జనుల మస్తిష్కాలలో కొన్ని ప్రశ్నలు ఉత్పన్నం అవటం అవశ్యం. ఉదాహరణకు : ఇది నిజంగా దైవ రచనయేనా? ఇది దైవ గ్రంథమేనా? దీనిని తీసుకువచ్చిన సందేశహరుడు (14 శతాబ్దాల క్రితం) మానవతకు అందజేసినట్లుగానే నేటికీ అది ఎలాంటి హెచ్చు తగ్గులు లేకుండా సురక్షితంగా ఉందా? దాని అవతరణకు సంబంధించిన చరిత్ర ఎట్టిది? దాని క్రోడీకరణకు, రక్షణకు తీసుకోబడ్డ చర్యలేవి? అసలు దాని ప్రాచుర్యం ఎలా జరిగింది? లాంటి ప్రశ్నలు పాఠకులలో సహజంగానే జనిస్తాయి. కుర్‌ఆన్ విషయంలో కూడా ఇలాంటి ప్రశ్నలకు సమాధానం దొరకనంత వరకూ ఏ వ్యక్తికీ దీని అధ్యయనం ఆవశ్యకత తెలిసిరాదు.

ఈ అవసరాన్ని తీర్చడానికే ఈ పుస్తక రచన జరిగింది. ప్రజలు కుర్‌ఆన్ అధ్యయనం ఆవశ్యకతను గ్రహించి, దాని హక్కును నెరవేర్చేందుకు కృషి చేయాలన్నదే

ఈ రచన ప్రధానోద్దేశం. ఒకవిధంగా చెప్పాలంటే ఈ పుస్తకం ముస్లిములకన్నా ముస్లిమేతర సోదరుల కోసం రూపొందించబడింది. ఇందులోని కొన్ని అంశాలు, చర్చలు ముస్లింలకు అంతగా అవసరం లేకపోవచ్చు. అయితే ముస్లిమేతర పాఠకులకు అవి చాలా అవసరం. కాబట్టి వాటిని ఉపేక్షించటం ఏ విధంగానూ భావ్యం కాదనిపించింది.

ఏ లక్ష్యంతో దీనిని వ్రాయటం జరిగిందో అది నెరవేరేలా తోడ్పడమని కారుణ్య ప్రభువును వేడుకుంటున్నాను. తన దాసులకు, తన గ్రంథ అధ్యయనం ఆవశ్యకతను, ప్రాముఖ్యాన్ని తెలుసుకోవటంలో ఈ పుస్తకం దోహదకారి అయ్యేలా చేయమని ప్రార్థిస్తున్నాను.

**– సద్రుద్దీన్**
(శుక్రవారం, హి.శ. 1382, జిల్ హజ్జా)

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో

# దివ్య ఖుర్ఆన్ స్థాయి

## సృష్టికర్త - మార్గదర్శకత్వ అనుగ్రహం

ఈ సమస్త జగతికి ఒక సృష్టికర్త, యజమాని ఉన్నాడన్న భావన, నమ్మకం యుగయుగాలుగా మనిషి ఆంతర్యంలో అంతర్లీనమై ఉంది. భౌతిక తత్వానికి అలవాటుపడిన ఆధునిక యుగపు కమ్యూనిస్టులను, కొందరు మనోనేత్రం లేని తాత్వికులను, వారిని గుడ్డిగా అనుసరించే అనుయాయులను మినహాయిస్తే చరిత్ర పుటలలో ఈ యదార్థాన్ని త్రోసిపుచ్చేవారు అరుదుగానే కనిపిస్తారు. ఈ విశ్వజనీన భావం, నమ్మకం ఉన్నప్పుడు మానవ మస్తిష్కంలో ఆ సృష్టికర్త, యజమాని గురించి కొన్ని ప్రశ్నలు జనించడం అనివార్యం. ఆ మహోన్నతునితో తనకున్న సంబంధం ఎట్టిది? ఆయన సృష్టికర్త, ప్రభువు అవడం మన నుండి వాంఛించేదేమిటి? అది ఎలాంటి ఆలోచనాసరళిని, మరెలాంటి ఆచరణను మన నుండి ఆశిస్తోంది? – ఈ ప్రశ్నలు మనిషిని నిర్లిప్తంగా ఉండనివ్వలేదు. ఆ ప్రశ్నల నుండి మనిషి తన చెవులను మూసుకోలేడు. అతని బుద్ధి వాటి పట్ల స్పందించింది. అతని నైజం అతనికి సమాధానమిచ్చింది – “నీవు ఒక బాధ్యతాయుత జీవివి. ఎందుకంటే మహా వివేకి అయిన సృష్టికర్త నీకు జ్ఞానాన్ని, యుక్తిని ప్రసాదించాడు. మంచీ చెడుల విచక్షణా శక్తిని అనుగ్రహించాడు. ఎంపిక స్వేచ్ఛను వొసగాడు. కాబట్టి నీ పరిస్థితి రాళ్లు రప్పల వంటిది కాదు. నీవు బుద్ధిలేని జంతువులకంటే భిన్నమైన వాడివి. ఈ విశిష్ఠ గుణాలు, శక్తియుక్తులు నీలో ఉన్నాయంటే, సృష్టికర్త నీ నుండి ఓ విశిష్ఠ వైఖరిని, నడవడిని ఆశిస్తున్నాడన్న దానికి ఇది ప్రబల తార్కాణం. నీకు నీ ఇష్టమొచ్చిన ఆచరణా మార్గాన్ని ఎన్నుకునే స్వేచ్ఛాధికారం ఉన్నప్పటికీ నీవు విశృంఖలంగా వ్యవహరించలేవు. బుద్ధిలేని పశువుల్లా నీవు ఇష్టానుసారం మసలుకుంటే నీకు లభించిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకున్నవాడవవుతావు. కాబట్టి నీవు ఒక మానవునికి శోభాయమానమైన పనులే చేయాలి. నీవు చేసే పనులు సజావుగా, సముచితమైనవిగా ఉండాలి. అవి నీ సృష్టికర్త తరపున సమ్మతించి, ఆమోదించబడినవై ఉండాలి.”

మానవ నైజం, మానవ బుద్ధీవివేకాల ఈ సమాధానం సహజంగానే మనిషిని మార్గదర్శకత్వపు ఆవశ్యకత ఉందని తెలియజెప్పింది. ఏది ఉచితం? ఏది అనుచితం? అనేవి అతని ముందు సదా స్పష్టంగా ఉండాలి. జీవితపు సువిశాలమైన మైదానంలో అడుగడుగునా సవ్యమయినదేదో, అపసవ్యమయినదేదో అతనికి తెలియాలి. తన నిజ ప్రభువు సన్నిధిలో ఏది వాంఛనీయమైనదో, మరేది అవాంఛనీయమో అతనికి బోధపడాలి. అన్నిటికన్నా ముఖ్యమైన, అన్నిటికన్నా కీలకమయిన ఈ అవసరం తీరేదెలా? ఏది సమంజసం? ఏది అసమంజసం? ఏది తప్పు? ఏది ఒప్పు? ఏది ఇష్టకరమైనది? ఏది అయిష్టకరమైనది? – ఈ విషయాల సంపూర్ణ జ్ఞానం అతనికి ఎక్కడి నుండి లభించాలి? ఎలా లభించాలి?

అతని బుద్ధీ వివేకాల, తెలివితేటల విషయానికివస్తే అవి ఏ విధంగానూ అతని అవసరాలను తీర్చేవిగా కనిపించవు. ఈ విషయంలో అతని ప్రవృత్తి అతనికి ఏ విధంగానూ తోడ్పడలేదు. పాపం ఆ పేదది ఆ సమస్యనే అర్థం చేసుకోలేకపోయింది. అతని బుద్ధిగాని, అతనిలోని కనుగొనే శక్తిగానీ అతనికి ఈ వ్యవహారంలో చెప్పుకోదగ్గ తోడ్పాటును అందించలేకపోయాయి. కొంతదూరం పోయాక అవి కూడా తమ నిస్సహాయస్థితిని వ్యక్తపరిచాయి. మొత్తమ్మీద తేలిందేమిటంటే ఈ సమస్యకు పరిష్కారం చూపే 'శక్తి' ఏదీ ఆకాశం క్రింద లేదు. ఈ ప్రశ్నకు బదులు ఇవ్వగల విజ్ఞాన సాధనమేదీ ఈ ధరిత్రిపై లేదు. ఈ సమస్యకు పరిష్కారం, ఈ ప్రశ్నకు జవాబు ఆకాశం క్రింద కాదు, ఆకాశంపైనే లభిస్తుందని పరిస్థితుల స్వరూపం చెప్పకనే చెబుతుంది.

అలాంటప్పుడు మానవుడు ఆ సృష్టికర్త, పాలకుని వైపునకు మరలటం తప్ప మార్గాంతరం లేదు. మానవుని భౌతిక అవసరాల కొరకు ఇంతపెద్ద కర్మాగారాన్ని స్థాపించినవాడు, దీనికి కావలసిన శక్తియుక్తుల్ని, స్వాభావికమయిన నిర్దేశాలను మనిషిలో పొందుపరచినవాడు, పుట్టిన శిశువుకు సయితం కన్న తల్లి చనుబాలను పీల్చే దిశానిర్దేశన చేసినవాడు – ఇంత గొప్ప యుక్తిపరుడు, కృపాకరుడు, ఉదాత్తుడు అయిన ఆ ప్రభువు అన్నిటికన్నా ముఖ్యమయిన సమస్యను – మార్గదర్శక వ్యవహారాన్ని – పరిష్కరించకుండా వదలివేయటమనేది సంభవమా? నిశ్చయంగా అది ఆయన ప్రభుతకు, పాలనకు ఎంతమాత్రం శోభాయమానం కాదు. ఆయన వివేకం, ఆయన ఉదాత్త గుణం, ఆయన కారుణ్యం, ఆయన న్యాయశీలత ఇందుకు ఎంతమాత్రం అంగీకరించవు. కనుక అవగతమయ్యేదేమిటంటే ఈ ప్రపంచం ఎన్నడూ దేవుని మార్గదర్శక గ్రంథాలు లేకుండా ఉండలేదు.

# దివ్య కుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి సాక్ష్యాధారం

దేవుని మార్గదర్శక గ్రంథాలుగా నేడు ప్రపంచంలో ఉన్న గ్రంథాలలో 'దివ్య కుర్‌ఆన్' ఒకటి. చారిత్రకంగా చూస్తే ఇది దైవ గ్రంథాలలో చిట్టచివరిది; దేవుని అంతిమ మార్గదర్శిని. రానున్న పుటలలో ఈ గ్రంథరాజం గురించిన పరిచయం ఉంది.

అయితే ఈ పరిచయానికి ముందు, అసలు ఈ గ్రంథం ఏ స్థాయికి చెందినది? ఇది దైవగ్రంథం అనడానికి తగిన సాక్ష్యాధారాలేమిటి? అన్నది మనకు తెలియాలి. ఎందుకంటే ఏదయినా గ్రంథం దివ్య గ్రంథం అని ప్రకటించబడినపుడు, అది నిజంగా దైవగ్రంథమో కాదో నిర్ధారణ అవటం చాలా అవసరం. ఎందుకంటే ప్రపంచంలో చేయబడే ప్రకటనలలో అనేకం కేవలం ప్రకటనలే! వివిధ మతాల చరిత్రను శోధించినపుడు ఈ విషయం మనకు బాగా తెలిసివస్తుంది – తమను దైవప్రవక్తగా ప్రకటించుకున్న అబద్ధీకులు కూడా ఈ లోకంలో పుట్టుకొచ్చారు. తమ కట్టుకథలను దివ్య వాణిగా చెప్పుకున్న అసత్యవాదులు కూడా చరిత్రలో గతించారు. అలాంటప్పుడు దివ్య కుర్‌ఆన్ మాత్రం 'దైవగ్రంథం' అనడానికి రుజువు ఏమిటి? అన్న ప్రశ్న ఉదయించటం అనివార్యమే. దివ్య కుర్‌ఆన్ తనను తాను పరిచయం చేసుకుంటున్నప్పుడు 'ఇది దైవగ్రంథం' అన్న విషయాన్ని ఘంటాపథంగా ప్రకటించింది. అదీ కేవలం ప్రకటనగా కాదు, సాక్ష్యాధారాలతో కూడిన ప్రకటన. అదీ విశేషం!

దివ్య కుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి కొన్ని ప్రత్యేక సాక్ష్యాధారాలు ఇవి :

## మొదటి సాక్ష్యాధారం

ఇది దివ్య గ్రంథం అనడానికి మొట్టమొదటి ఆధారం స్వయంగా కుర్‌ఆన్ ప్రకటనే. ఇది కేవలం దానిని నమ్మినడుచుకునే వారి దావా కాదు. "నేను ఏ మానవమాత్రుడో పలికిన పలుకును కాను. నేను లోకేశ్వరుడైన అల్లాహ్ ప్రోక్తాన్ని. నన్ను ఆయన తన ప్రత్యేక 'దూత' జిబ్రీల్ (అలైహిస్సలామ్) ద్వారా, తన దాసుడు, ప్రవక్త అయిన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)కు చేరవేశాడు.

ఉదాహరణకు –

وَاِنَّهٗ لَتَنْزِيْلُ رَبِّ الْعٰلَمِيْنَ ۝١٩٢ نَزَلَ بِهِ الرُّوْحُ الْاَمِيْنُ ۝١٩٣ عَلٰى قَلْبِكَ لِتَكُوْنَ مِنَ الْمُنْذِرِيْنَ ۝١٩٤ بِلِسَانٍ عَرَبِيٍّ مُّبِيْنٍ ۝١٩٥

(سورۂ شعراء)

“ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసినది. దీనిని తీసుకుని విశ్వసనీయమయిన ఆత్మ నీ హృదయ ఫలకంపై అవతరించింది – స్వచ్ఛమయిన అరబీ భాషలో–హెచ్చరిక చేసే వారిలో నీవు చేరిపోవాలని.”

*(అష్ షుఅరా: 192–195)*

‘నేను దైవగ్రంథాన్ని’ అని కుర్‌ఆన్ తన గురించి ప్రకటించుకోవటం కూడా నిశ్చయంగా ఒక దావాయే. అలా ప్రకటించుకున్నంత మాత్రాన అది దైవగ్రంథమని రూఢీ అవదు. అయినప్పటికీ దాని ప్రకటనా స్థాయి ఒక ‘ప్రాథమిక నిరూపణ’ లాంటిదే. ఎందుకంటే ఇది లేకుండా ఆధారాలు, నిరూపణల చర్చ ముందుకు సాగదు. అసలు చర్చే మొదలవదని అంటే బావుంటుంది. ఎందుకంటారేమో! అసలు ఈ ప్రకటనే కుర్‌ఆన్ విషయంలో – అది దైవగ్రంథమనే దావాను – గమనార్హ విషయంగా, చర్చనీయాంశంగా చేసింది. దీనికి సూత్రప్రాయమయిన రెండు కారణాలున్నాయి –

ఒకటి : అల్లాహ్ తరఫు నుండి వచ్చిన గ్రంథం సాధారణ భావంలో గ్రంథం లేక రచన అయి ఉండదు – అందులో చెప్పబడిన అంశాలతో ప్రజలు ఏకీభవించడానికి లేక విభేదించడానికి ! పైగా అది విశ్వ సార్వభౌముని తరఫు నుండి విధించబడిన ఉత్తర్వు అయి ఉంటుంది. తన సూచనలను బేషరతుగా శిరసావహించాలన్న డిమాండుతో సహా అది వస్తుంది. తన ప్రబోధనలను ఎలాంటి సంకోచం లేకుండా అవలంబించాలని, అన్యథా మానవునికి వినాశం తప్పదని శాసిస్తున్నట్లుగానే ఉంటాయి దాని పలుకులు. ఒక గ్రంథం ఇటువంటి ఉద్దేశం, ప్రాముఖ్యం, ఔన్నత్యం కలిగి ఉన్నప్పుడు అది స్వయంగా తన ‘స్థాయి’ని గురించి నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా ప్రకటించుకోక తప్పదు మరి! అలా ప్రకటించుకోనంతవరకూ జనులకు దాని ఆవశ్యకత తెలిసిరాదు. అలా దావా చేయనంతవరకూ మానవులు దాని గురించి సీరియస్‌గా యోచన చేయరు! అది నిజంగానే దైవగ్రంథమేనా? కాదా? అన్న చర్చకు తెరలేవదు, అది నిజంగానే నిజదైవం అవతరింపజేసిన ‘సన్మార్గ దర్శిని’ అని నమ్మి నడుచుకునేందుకు ఆస్కారం ఏర్పడదు. ప్రభుత్వాలు తమ శాసనాలను, నిర్దేశిక నియమాలను గెజిట్‌లో ప్రచురించి దేశపౌరుల కొరకు ఇవి చేయబడ్డాయని ప్రకటన చేయటం లాంటిదే ఇదీను. ప్రభుత్వాలు ఈ విధంగా చేయనంతవరకూ ఆ శాసనాలకు కట్టుబడి

ఉండాల్సిన బాధ్యత పౌరులపై ఉండదు.

రెండు : ఏదయినా ఒక గ్రంథం దైవగ్రంథం అనే దావా స్వయంగా ఆ గ్రంథానిదై ఉంటుంది – లేదా దానిని తీసుకువచ్చిన సందేశహరునిదై ఉంటుంది. అంతేగాని అది దానిని అనుసరించేవారి దావా అయి ఉండదు. దాని అనుయాయులైతే ఆ 'దావా'ను నమ్ముతారంతే. కాబట్టి 'ఇది దైవగ్రంథం' అని వారు చెప్పేది 'సాక్ష్యం' మాత్రమేగాని అది నిజంగా 'దావా' కాదు. ఎవరయినా ఏదేని విషయంలో 'దావా' చేసినప్పుడే 'సాక్ష్యం' ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతుంది. అసలు 'దావా' అనేదే లేనప్పుడు 'సాక్ష్యం' ఇవ్వటం అసందర్భం, అనవసరం! ఒక వ్యక్తి తనను ప్రవక్తగా ప్రకటించుకోకపోయినప్పటికీ ఆయన ప్రవక్త అని సాక్ష్యమివ్వటం ఎటువంటిదో ఇదీ అటువంటిదే! ఒక గ్రంథం 'దైవగ్రంథం' అని స్వయంగా ప్రకటించుకోక పోయినప్పటికీ 'ఇది దైవగ్రంథం' అని నొక్కి వక్కాణించడం ఎలాంటిదో ఇదీ అలాంటిదే. మతాల చరిత్ర పుటలను తిరగవేసిపుడు ఇలాంటి అవకాశాలకు తావు కలిగిందన్న సంగతి మనకు తెలుస్తుంది. మతావలంబీకులు తమ 'విశ్వాసాల'లో అతిశయానికి లోనయి తమ ఊహలకు వాస్తవికతా రూపం ఇచ్చేందుకు యత్నించారు. ఒక మత గ్రంథంలో ఎక్కడా అది దైవగ్రంథమనే విషయం ప్రస్తావనకు రాకపోయినా, కనీసం ఒక పంక్తి కూడా మచ్చుకు కానరాకపోయినా దానిని అవలంబించే జనులు మాత్రం తమ తరపున 'దావా' చేశారు – అది దైవ గ్రంథమేనని! ఆ విధంగా వారు ఒక మానవ ప్రోక్తానికి దైవాదేశం, దైవోపదేశం అనే స్థాయిని కట్టబెట్టేశారు.

ఈ కారణాల దృష్ట్యా కుర్‌ఆన్ దైవగ్రంథమేననే చర్చను, అది స్వయంగా దీని గురించి దావా చేస్తోందా? లేదా? అనే అంశం ఆధారంగా ముందుకు తీసుకెళ్ళాలి. ఒకవేళ అది దావా చేస్తున్నట్లయితే అది అనుశీలనకు, పరిశీలనకు యోగ్యమైనదని భావించాలి. లేకుంటే లేదు. అందుకే 'నేను అల్లాహ్ అవతరింపజేసిన దానిని' అని కుర్‌ఆన్ స్వయంగా చెప్పుకోవటం ఎంతో ప్రాధాన్యతగల అంశం. ఈ ప్రకటన వల్ల కూడా దాని స్థాయి పెరిగింది. ఒకవిధంగా అది సాక్ష్యాధారం లేదా రుజువుగా పరిణమించింది.

## రెండవ సాక్ష్యాధారం

కుర్‌ఆన్ గురించి, దానిని తీసుకువచ్చిన ప్రవక్త రాక గురించి వెనుకటి దైవ గ్రంథాల (తౌరాతు, ఇంజీలు)లో శుభవార్తగా ప్రస్తావించబడింది. ఆ 'గ్రంథాల'లో చెప్పబడిన విధంగా – సరిగ్గా ఆ లక్షణాలతోనే – ప్రపంచం ముందుకు వచ్చారు. ఆయన ఆ శుభవార్తను తన సంబోధితుల ముందు ఒక 'ప్రమాణం'గా పదే పదే సమర్పించారు కూడా.

ఉదాహరణకు :

مَا كَانَ حَدِيثًا يُفْتَرٰى وَلٰكِنْ تَصْدِيقَ الَّذِىْ بَيْنَ يَدَيْهِ ـ ـ ـ (سورة يوسف:١١١)

"పూర్వజనుల ఈ గాథల్లో బుద్ధీ వివేకాలున్న వారికి గుణపాఠం ఉంది. కుర్‌ఆన్‌లో వివరించే ఈ విషయాలన్నీ కాల్పనికమయిన మాటలు కావు, పైగా ఇవి లోగడ వచ్చిన గ్రంథాలనే ధ్రువీకరిస్తున్నాయి, (వీటిలో) ప్రతి విషయానికి వివరణలు, విశ్వాసం గైకొనే వారికొరకు మార్గదర్శనం, కారుణ్యం కూడా ఉన్నాయి."

*(యూసుఫ్ : 111)*

اَلَّذِيْنَ يَتَّبِعُوْنَ الرَّسُوْلَ النَّبِىَّ الْاُمِّىَّ الَّذِىْ يَجِدُوْنَهٗ مَكْتُوْبًا عِنْدَهُمْ فِى التَّوْرٰىةِ وَالْاِنْجِيْلِ ـ ـ ـ (الاعراف:١٥٧)

"(కనుక నేడు ఈ కారుణ్యం వీరి సౌభాగ్యం:) ఇది ఈ సందేశహరుడు, నిరక్షరాసి ప్రవక్తను అనుసరించే వారికి చెందినది - ఇతని ప్రస్తావన వారికి తమ వద్ద ఉన్న తౌరాత్‌లోనూ, ఇన్జీల్‌లోనూ వ్రాత మూలకంగా లభిస్తుంది." *(అల్ ఆరాఫ్ : 157)*

తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో ఈ శుభవార్త, ఈ భవిష్యవాణి ఎక్కడెక్కడ ఉంది, ఏ పదజాలంతో ఉంది? అనే ప్రశ్నకు సంపూర్ణ సమాధానం - ఆ గ్రంథాలు యధాస్థితిలో ఉండేటట్లయితే - లభించేదే. కాని ఆ గ్రంథాలు ప్రస్తుతం వాటి నిజరూపంలో లేవు; అవి ప్రక్షిప్తాలకు లోనయ్యాయనేది చారిత్రక సత్యం. ఆ గ్రంథాలను లోకానికి పరిచయం చేసే బాధ్యత తీసుకున్న మతాధిపతులు వాటిలో తమ స్వప్రయోజనాలకనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకున్నారు. అలాంటప్పుడు ఆ శుభవార్తలు, భవిష్యవాణులు కూడా సురక్షితంగా - యధాస్థితిలో - ఉండలేవు. ముఖ్యంగా కుర్‌ఆన్ గురించి, ముహమ్మద్ (స) రాక గురించి ఆ గ్రంథాలలో ఉన్న వాక్యాలు తప్పకుండా మార్చబడి ఉంటాయి. ఎందుకంటే ఆ గ్రంథాలను అనుసరించే ప్రబోధకులకు కుర్‌ఆన్ అంతిమ దైవగ్రంథం అవటం, ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్తగా రావటం ఎంతమాత్రం జీర్ణమయ్యే విషయం కాదు. అబ్బురపరచే

విషయం ఏమిటంటే, ఇన్ని ప్రక్షిప్తాల తరువాత కూడా – నేటికీ – ఆ గ్రంథాలలో ఉన్న కొన్ని వాక్యాలు ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త అనీ, కురాన్ దేవుని అంతిమ మార్గదర్శక గ్రంథమని ధ్రువపరుస్తున్నాయి. ఉదాహరణకు : క్రింద పొందుపరచబడిన కొన్ని వాక్యాలను గమనించండి –

(1) యెహోవా సీనాయి నుండి వచ్చెను. శేయీదులో నుండి వారికి ఉదయించెను. ఆయన **పారాను కొండ నుండి ప్రకాశించెను.**

వేనవేల పరిశుద్ధ సమూహముల మధ్య నుండి ఆయన వచ్చెను. ఆయన కుడి పార్శ్వమున **అగ్ని జ్వాలలు మెరియుచుండెను.** (ద్వితీయోపదేశ కాండము; అధ్యాయం : 33)

(2) **"వారి సహోదరులలో నుండి** నీ వంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను; అతని నోట నా మాటల నుంచెదను; నేను అతని కాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును. అతడు నా నామమున చెప్పు నా మాటలను విననివానిని దానిని గురించి విచారణ చేసెదను." (ద్వితీయోపదేశ కాండము, అధ్యాయము : 18, వచనములు – 18, 19)

(3) యేసు వారిని చూచి ఇట్లనెను :

"ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి **మూలకు తలరాయి ఆయెను.** ఇది **ప్రభువు వలననే** కలిగెను. ఇది మన కన్నులకు ఆశ్చర్యము అను మాట మీరు లేఖనములలో ఎన్నడునూ చదవలేదా? కాబట్టి **దేవుని రాజ్యము** మీ యొద్ద నుండి తొలగింపబడి, **దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని మీతో చెప్పుచున్నాను.** మరియు ఈ రాతి మీద పడువాడు తునకలైపోవునుగాని అది ఎవని మీద పడునో వానిని నలిపేయుననెను." (మత్తయి, 21వ అధ్యాయము – వచనములు : 42-44)

(4) "నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు. కాని యిప్పుడు **మీరు వాటిని సహింపలేరు**. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును." (యోహాను – అధ్యాయం : 16, వచనములు – 12, 13)

(5) ఇదిగో నాకు ముందుగా మార్గము సిద్ధపరచుటకై నేను నా దూతను పంపుచున్నాను; మీరు వెదకుచున్న ప్రభువు, అనగా మీరు కోరు నిబంధన

దూత, తన ఆలయమునకు హఠాత్తుగా వచ్చును; ఇదిగో ఆయన వచ్చుచున్నాడని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. (మలాకీ – 3వ అధ్యాయం, మొదటి వచనము)

(6) "అప్పటి నుండి యేసు – పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారు మనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలుపెట్టెను." (మత్తయి, 4వ అధ్యాయము – 17వ వచనము)

(7) "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు. నేను తండ్రిని వేడుకొందును, **మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను** మీకు అనుగ్రహించును." (యోహాను, 14వ అధ్యాయము – వచనములు : 15–17)

"ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటినీ మీకు జ్ఞాపకం చేయును." (యోహాను : 14 : వచనము – 26)

"ఈ సంగతి సంభవించినప్పుడు, మీరు నమ్మవలెనని అది సంభవింపక ముందే మీతో చెప్పుచున్నాను. ఇకను మీతో విస్తరించి మాటలాడను; **ఈ లోకాధికారి వచ్చుచున్నాడు. నాతో వానికి సంబంధమేమియు లేదు."** (యోహాను : 14 : వచనములు – 29, 30)

"అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్ళిపోవుట వలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళని యెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్ళిన యెడల ఆయనను మీ వద్దకు పంపుదును. ఆయన వచ్చి, పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును." (యోహాను : 16వ అధ్యాయము–వచనములు : 7, 8)

(8) "చూడండి! మునుపటి సంగతులు సంభవించెను గదా! పుట్టక మునుపే వాటిని మీకు తెలుపుచున్నాను. **సముద్ర ప్రయాణము చేయువారలారా!** సముద్రంలోని సమస్తమా! ద్వీపములారా! ద్వీపనివాసులారా! **యెహోవాకు కొత్త గీతము పాడండి.** భూ దిగంతముల నుండి **ఆయనను స్తుతించండి.** అరణ్యమును, దాని పురములును, **కేదారు** నివాస గ్రామములును బిగ్గరగా పాడవలెను. **'సెల'** నివాసులు సంతోషించుదురుగాక! పర్వత శిఖరముల నుండి వారు కేకలు వేయుదురుగాక! ప్రభావము గలవాడని మనుష్యులు యెహోవాను కొనియాడుదురుగాక! ద్వీపములలో ఆయన స్తోత్రము ప్రచురము చేయుదురుగాక! యెహోవా శూరుని వలె బయలుదేరును. యోధుని వలె

ఆయన తన ఆసక్తి రేపుకొనును. ఆయన హూంకరించుచు తన శత్రువులను ఎదిరించును. వారి యెదుట తన పరాక్రమము కనపరచుకొనును. **చిరకాలము నుండి నేను దూరముగా (మౌనంగా) ఉంటిని.** ప్రసవ వేదన పడు స్త్రీ వలె విడువకుండ నేను బలవంతముగా ఊపిరితీయుచు, ఒగర్చుచు రోజుచున్నాను. పర్వతములను, కొండలను పాడు చేయుదును. వాటి మీది చెట్టు చేమలన్నిటినీ ఎండిపోచేయుదును. నదులను ద్వీపములుగా చేయుదును. మడుగులను ఆరిపోచేయుదును. వారెరుగని మార్గమున గుడ్డివారిని తీసుకొని వచ్చెదను. వారెరుగని త్రోవలలో వారిని నడిపింతును. వారి యెదుట చీకటిని వెలుగు గాను, వంకర త్రోవలను చక్కగానూ చేయుదును. నేను వారిని విడువక ఈ కార్యములు చేయుదును. చెక్కిన విగ్రహములను ఆశ్రయించి, పాత విగ్రహములను చూచి, మీరే మాకు దేవతలని చెప్పువారు వెనుకకు తొలగి కేవలం సిగ్గుపడుచున్నారు." (యెషయా; 42వ అధ్యాయం – వచనములు : 9–17)

తౌరాతు, ఇంజీలు (పాత నిబంధన, కొత్త నిబంధన) లోని ఈ వాక్యాలపై, భవిష్యవాణిపై వివరంగా చర్చించడానికి ఇక్కడ అవకాశం లేదు. అయితే కొన్ని ప్రత్యేక పదాలపై, చిన్న వాక్యాలపై అవసరమగు 'వివరణ' ఇవ్వదలిచాము.

**'ఫారాను కొండ'** ఎక్కడో కాదు, మక్కా నగరంలోనే ఉంది. **'అగ్ని జ్వాలలు మెరియుచుండెను'** అంటే యుద్ధాలు, రాజ్యాధికారము గల షరీఅత్ అన్నమాట. **'వారి సహోదరులలో నుండి'** (అంటే ఇస్రాయీలేయుల సోదరులు) అంటే ఇస్మాయీల్ సంతతివారన్నమాట. ఈ సంతతి నుండే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) పుట్టారు. **'నీవంటి ప్రవక్తను'** అంటే అతను కూడా నీ వలెనే (అంటే మహనీయ మోషే మాదిరిగానే) ఒక శాశ్వతమయిన గ్రంథాన్ని, ధర్మశాస్త్రాన్ని తెచ్చే ప్రవక్త అయి ఉంటాడు అన్నమాట.

**'ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి'** అనే వాక్యం ముఖ్యంగా గమనార్హం. ఇది కూడా ఇస్మాయీల్ సంతతివారి పట్ల సంజ్ఞే. ఎందుకంటే, ఇస్రాయీలు సంతతివారికి సుదీర్ఘ కాలం సారధ్య బాధ్యతలు వొసగబడ్డాయి. వారి వంశంలోనే గ్రంథం, ప్రవక్తాపదవి – పరంపరానుగతంగా – ఉండేవి. అయితే వారు ఈ అనుగ్రహ భాగ్యానికి తగినవారం కామని నిరూపించుకున్నారు. **'మూలకు తలరాయి ఆయెను'** – అంటే ఇస్మాయీల్ సంతతివారికి ఆ ప్రపంచ సారధ్యబాధ్యత కట్టబెట్టబడింది. దేవుని అంతిమ గ్రంథం (కుర్‌ఆన్) ఈ వంశంలోనే అవతరించింది. **'దేవుని రాజ్యము'** అంటే సంపూర్ణమైన, ప్రమాణబద్ధమయిన దైవశాసనాలు గల ప్రభుత్వం అన్నమాట.

**'ఫలమిచ్చు'** అంటే, అది దైవాజ్ఞలను భూమండలంపై కచ్చితంగా ప్రవేశపెడుతుంది. దైవేచ్ఛకనుగుణంగా పరిపాలన జరిపిస్తూ తన శుభాలను ఇస్తుంది. **'మీరు వాటిని సహింపలేరు'** అంటే యెహోవా మోపే మరిన్ని బాధ్యతలను, బరువులను (అమానతును) భరించే శక్తి మీలో లేదు. కాబట్టి దేవుడు నా ద్వారా తన ధర్మాన్ని పరిపూర్ణం గావించటం జరుగదు.

**'తన ఆలయమునకు హఠాత్తుగా వచ్చును'** అంటే రావలసివున్న 'ఆ ప్రవక్త' ఏ విధంగా, ఎక్కడ, ఎలా వస్తాడంటే, ఎటువంటి జనుల మధ్యన ప్రభవిస్తాడంటే ఆ రాకడ తీరు మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది. **'నిబంధన దూత'.** ఇక్కడ నిబంధన అంటే ఖత్నా (సున్నతీ) నిబంధన అన్నమాట. అది మహనీయ ఇబ్రాహీమ్, అతని సంతతి నుండి గ్రహించబడినది (ఆదికాండం, 17వ అధ్యాయంలో ఈ వివరాలున్నాయి). కాబట్టి 'నిబంధన దూత' అంటే సున్నతీ చేయించుకునే ఆచారాన్ని విశ్వవ్యాప్తం చేసే ప్రవక్త అన్న భావం వస్తుంది. ఈ ఆచారం 'ఆ ప్రవక్త' ఇచ్చిన షరీఅతు (శాసనాంగం)లో, అతని అనుచర సమాజంలో ఓ ప్రఖ్యాత అంశంగా రూపొందుతుంది.

**'ఆదరణకర్త'** అనేది అసలు హెబ్రూ పదానికి అనువాదం. అరబీ భాషలో ఉన్న ఇంజీలులో దీనికి **'ఫార్కలీత్'** అని అనువదించటం జరిగింది. ఫార్కలీత్ అంటే **'ముహమ్మద్', 'అహ్మద్'** భావార్థాలే ఇంచుమించు వస్తాయి. **'మీ వద్ద ఎల్లప్పుడూ నుండుటకై'** అనేది సుస్పష్టమే. అంటే అతను తెచ్చిన గ్రంథం, షరీఅత్ తౌరాతు, ఇంజీలు గ్రంథాల మాదిరిగా ఒక పరిమిత కాలానికి ప్రత్యేకం కావు, అవి ఎల్లకాలం ఉంటాయి అని అర్థం.

**'ఈ లోకాధికారి వచ్చుచున్నాడు'** – అంటే 'ఆ ప్రవక్త' ఒక ప్రత్యేక ప్రాంతం కొరకో, ఒక ప్రత్యేక జాతి లేక వర్గం కొరకో కాకుండా సమస్త మానవాళికి దైవభక్తినీ, నైతిక రీతినీ బోధించే ప్రవక్తగా – విశ్వనాయకునిగా – రానున్నాడు. **'నాతో వానికి సంబంధమేమియు లేదు'** – అంటే నాకన్నా (యేసుకన్నా) ఆయన స్థానం ఎంతో ఉన్నతమైనదై ఉంటుంది.

**'యెహోవాకు కొత్త గీతము పాడండి'** అంటే సమస్త లోకవాసుల కోసం – సముద్రంలోనూ, భూభాగంపైన ఉండేవారి కోసం – ఓ కొత్త గ్రంథం, ఓ నూతన శాసనాంగం రానున్నది. ఇస్మాయీలు సంతతిలో **'కేదార్'** అనే ఒక ప్రఖ్యాత వ్యక్తి గడచి ఉన్నాడు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా అతని వంశంలోనే జన్మించారు. **'సెల'** అనేది మదీనా సమీపంలో ఉన్న ఒక పర్వతశ్రేణి పేరు. **'చిరకాలము నుండి నేను దూరముగా యుంటిని'** అంటే సుదీర్ఘ కాలంగా దైవదౌత్య పరంపర ఆగి ఉంది అని భావం.

ఈ సంక్షిప్త వివరణ కూడా ఈ వాక్యాల అసలు ఉద్దేశాన్ని తెలుసుకునే ప్రయత్నంలో చాలావరకు దోహదపడతాయని ఆశిస్తాము. దీని తరువాత సత్య ప్రేమికుడు, రుజువర్తనుడు అయిన ప్రతి వ్యక్తికీ అర్థమైపోతుంది – తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో భవిష్యవాణిగా చెప్పబడిన ఆ గ్రంథం కుర్‌ఆన్ గ్రంథమే అని! ఆ ప్రవక్త ముహమ్మదే (స)అని!! అందుకే దివ్య కురాన్ అవతరించినప్పుడు ఆ గ్రంథం తాము చాలా కాలంగా నిరీక్షిస్తున్న గ్రంథమేనని తెలుసుకోవటంలో యూదులకు క్రైస్తవులకు అట్టే సమయం పట్టలేదు. దివ్య కుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చినట్లుగా,

وَالَّذِيْنَ اٰتَيْنٰهُمُ الْكِتٰبَ يَعْلَمُوْنَ اَنَّهٗ مُنَزَّلٌ مِّنْ رَّبِّكَ بِالْحَقِّ ---- (انعام:۱۱۴)

“మేము (నీకు పూర్వం) గ్రంథం ఇచ్చిన వారికి తెలుసు, ఈ గ్రంథం నీ ప్రభువు తరఫు నుండే సత్యం ఆధారంగా అవతరించిందని.”

*(అల్ అన్ ఆమ్ : 114)*

اَنْ يَّعْلَمَهٗ عُلَمٰٓؤُا بَنِيْٓ اِسْرَآءِيْلَ ﴿۱۹۷﴾ (شعراء:۱۹۷)

“దీనిని ఇస్రాయీలు సంతతి వారి విద్వాంసులు ఎరుగుదురనే విషయం వారికి (మక్కావాసులకు) ఏ సూచనా కాదా?” *(అష్ షుఅరా : 197)*

అందుకే నిజభావంలో ‘విద్వాంసులు’ అయిన గ్రంథవహులు హృదయాలలో దైవభీతికలవారు, సత్యప్రేమ విషయంలో వర్గ దురభిమానానికి తావు ఇవ్వనివారు ఏమాత్రం తాత్సారం చేయకుండా అంతిమ దైవగ్రంథం వైపునకు మరలివచ్చారు. వారి ముందు కుర్‌ఆన్ సందేశం వినిపించినప్పుడు అది వారి హృదయ స్పందన అనిపించింది. వారు కోరుకుంటున్నది వారికి ఇవ్వబడుతుందనిపించింది. దివ్య కుర్‌ఆన్‌లో ఈ చారిత్రక వాస్తవం ఈ విధంగా ప్రకటించబడింది :

فَالَّذِيْنَ اٰتَيْنٰهُمُ الْكِتٰبَ يُؤْمِنُوْنَ بِهٖ (عنکبوت:۴۷)

“అందువల్ల పూర్వం మేము గ్రంథాన్ని ఇచ్చినవారు దీనిని (ఈ కుర్‌ఆన్‌ను) విశ్వసిస్తారు.” *(అల్ అన్ కబూత్ : 47)*

وَاِذَا سَمِعُوْا مَآ اُنْزِلَ اِلَى الرَّسُوْلِ تَرٰٓى اَعْيُنَهُمْ تَفِيْضُ مِنَ الدَّمْعِ مِمَّا عَرَفُوْا مِنَ الْحَقِّ ۚ يَقُوْلُوْنَ رَبَّنَآ اٰمَنَّا فَاكْتُبْنَا

“ప్రవక్తపై అవతరించిన ఈ గ్రంథాన్ని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళు అశ్రువులతో చెమ్మగిల్లటం నీవు చూస్తావు. వారు

مَعَ الشّٰهِدِيْنَ ﴿٨٣﴾ (المائدة)

ఇలా అనేస్తారు : "ప్రభూ! మేము విశ్వసించాము. మా పేర్లను సాక్ష్యం ఇచ్చేవారిలో వ్రాయి."

*(అల్ మాయిద : 83)*

చరిత్ర మనకు సమర్పించే ఇలాంటి సత్యప్రేమికుల జాబితా చాలా పెద్దది. వీరిలో అబిసీనియా చక్రవర్తి నజాషీ, అతని సోదర తనయుడు జూ మఖ్‌మర్, పాలస్తీనాలోని రోము గవర్నర్, ఇస్‌ఖఫ్ ఇబ్నె నాతూర్, నజరాన్ క్రైస్తవ పాలకుని సోదరుడు కర్జ్ బిన్ అల్కమా, 'తై' తెగ సర్దారు అయిన అదీ బిన్ హాతిమ్, తౌరాతు గ్రంథ పండితుల్లో ప్రముఖులైన కాబ్ అల్ అహ్బార్, వహబ్ బిన్ మన్బ, అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (ర.అన్‌హుమ్) వంటి వారున్నారు. ఇలాంటి అసంఖ్యాకమయిన యూద, క్రైస్తవ ప్రముఖులు కురాన్‌ను విశ్వసించడం తౌరాతు, ఇంజీలులోని ఈ భవిష్యవాణులకు ప్రబల తార్కాణం వంటిది. ఎందుకంటే ఈ ప్రముఖులు మొదటి నుండే గ్రంథం కలవారు, దేవుని శాసనాంగం పొందివున్నవారు. కురైషుల మాదిరిగా వారు గ్రంథజ్ఞానం లేని జనులు కారు. వారు తౌరాతు, ఇంజీలు గ్రంథాల స్థానంలో కురాన్ అనుసరణకు నిర్ణయించుకున్నారంటే, మూసా, ఈసా సముదాయాలతో తమకున్న ప్రాచీన సైద్ధాంతిక అనుబంధాన్ని త్రెంచుకుని ముహమ్మద్ అనుచర సముదాయంలో చేరిపోయారంటే మానసికంగా, బౌద్ధికంగా కూడా వారు దానికి సంసిద్ధులయ్యారన్నమాట. ఎందుకంటే వారు తమ గ్రంథాలలో ఉన్న భవిష్యవాణిని అధ్యయనం చేసివున్నవారు. మరోవైపు కుర్‌ఆన్‌ను, కుర్‌ఆన్‌ను తెచ్చిన సందేశహరుణ్ణి కూడా ప్రత్యేకంగా గమనించినవారు. అందుకే సత్యవాణికి వారి మేను పులకించింది. వారి మనస్సాక్షి సత్యాన్ని స్వీకరించమని వారికి ప్రబోధించింది.

## మూడవ సాక్ష్యాధారం

దివ్య కురాన్‌లో ఎక్కడా వైరుధ్యం, వ్యాఘాతం కానరాదు. దీని ఈ విశిష్ఠ గుణం దీని సత్య నిబద్ధతకు ఒక స్పష్టమయిన ఆధారం. ఉదాహరణకు : దీని గురించి అది స్వయంగా ఇలా అంటోంది :

وَلَوْ كَانَ مِنْ عِنْدِ غَيْرِ اللّٰهِ لَوَجَدُوْا فِيْهِ اخْتِلَافًا كَثِيْرًا ﴿٨٢﴾

(النساء:٨٢)

"ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫు నుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి."

*(అన్ నిసా : 82)*

ఇలా ఎందుకంటే ఈ గ్రంథం 23 ఏండ్ల సుదీర్ఘకాలంలో, అత్యంత గడ్డు పరిస్థితులలో పరిపూర్తి అయింది. ఒకవేళ ఇది మానవ రచన అయివుంటే ఇందలి విషయాలు, సిద్ధాంతాలు, భావాలు భావనలు వైరుధ్యం నుండి సురక్షితంగా ఉండేవి కావు. ఒక మనిషి కేవలం కొన్ని నెలలలో చేసే రచనలోనే పరస్పర విరుద్ధాంశాలు కనిపిస్తుంటాయి. కాని కురాన్‌నే చూడండి, దాని అవతరణ పూర్తయ్యేటప్పటికి ఏండ్లు పట్టాయి. వేలాది రోజులు గడిచాయి. ఈ లోగా అది ఎన్నో కాల చక్రపు ఎగుళ్ళు దిగుళ్ళను ఎదుర్కొంది. అలాంటప్పుడు అందులో వైరుధ్యం, వ్యాఘాతం లేకపోవటం ఎలా సాధ్యం? కాని కుర్‌ఆన్‌లో ఈ 'అసంభవం' సంభవమయింది. ఎంతో విస్తార మయిన ఇందలి అంశాలలో, ఆదేశాలలో, ఉపదేశాలలో అసాధారణమయిన సమన్వయం, సామరస్యం కనిపిస్తుంది. అంటే దీని రచయిత ఒక మానవమాత్రుడు కానే కాదు. సర్వజ్ఞాని, సర్వాధిక్యుడు అయిన దేవుని ప్రోక్తమిది. ఆయన 'పరిజ్ఞానం'లో ఎక్కడా 'వైరుధ్యం' అనేది జొరబడదు. ఆయన సెలవిచ్చిన విషయాలలో కాలంలోని దూరాలు సయితం వ్యాఘాతాన్ని పుట్టించలేవు.

## నాల్గవ సాక్ష్యాధారం

కుర్‌ఆన్ తన ధ్యేయానికి సంబంధించి ఎన్నో శుభవార్తలను ముందస్తుగా ప్రకటించింది. అదీ ఎప్పుడు? అవి నెరవేరే అవకాశాలు ఎంతమాత్రం లేని పరిస్థితులలో! అయితే వాటిలో ఒక్కొక్క భవిష్యవాణి అక్షర సత్యమవటాన్ని ఈ ప్రపంచం తన చర్మచక్షువులతో వీక్షించింది. వాటిలో ఏ ఒక్క భవిష్యవాణి కూడా తప్పుగా తేలలేదు. ఉదాహరణకు :

(అ) అది హిజ్రీ శకం 6వ యేట హుదైబియా ఒడంబడిక సందర్భంగా ఇలా ముస్లింలకు శుభవార్త వినిపించింది –

لَتَدْخُلُنَّ الْمَسْجِدَ الْحَرَامَ اِنْ شَآءَ اللّٰهُ اٰمِنِيْنَ ۙ مُحَلِّقِيْنَ رُءُوْسَكُمْ وَمُقَصِّرِيْنَ ۙ لَا تَخَافُوْنَ ؕ

(الفتح:٢٧)

"అల్లాహ్ సంకల్పిస్తే మీరు తప్పకుండా మస్జిదె హరామ్‌లో పూర్తి శాంతితో ప్రవేశిస్తారు. మీరు శిరోముండనం చేయించుకుంటారు. వెంట్రుకలను కత్తిరించుకుంటారు. మీకు ఏ భయమూ ఉండదు." *(అల్ ఫత్‌హ్ : 27)*

ఈ వాక్యాల్లోని పటిష్ఠతను ధీమాను గురించి కాస్త ఆలోచించండి! చూడబోతే హుదైబియా ఒడంబడిక జరిగిన సందర్భం చాలా గడ్డు సందర్భంగా కనిపిస్తుంది.

ఆనాడు ముస్లింలు మక్కా అవిశ్వాసులకు భయపడి సంధికి తలొగ్గినట్లు అనిపిస్తుంది. వారు తమ ధార్మిక కేంద్రబిందువు (కాబా)ను సమీపించినపుడు, దైవ గృహాన్ని సందర్శించకుండా బలవంతంగా నిలువరించబడ్డారు. కాబా గృహ ప్రదక్షిణ చేయకుండానే వారు హుదైబియా లోయ నుండి భగ్న హృదయంతో తమ నివాస గృహాలకు తిరోన్ముఖులు కావలసిన దయనీయ స్థితి అది! అలాంటి పరిస్థితులను గమనించిన వారెవరికయినా ముస్లింలు త్వరలోనే మక్కా నగరిలో విజేతలుగా ప్రవేశిస్తారన్న భవిష్యవాణి అతిశయోక్తిగానే ఉంటుంది. అయితే దివ్య కుర్ఆన్ ఈ భవిష్యవాణి కేవలం ఆశావహ దృక్పథంతో గాకుండా నిర్దిష్టంగా, ఘంటాపథంగా ప్రకటించింది. ఇది జరిగితీరుతుంది అని చెప్పింది. అంతేకాదు, వారక్కడ ప్రవేశించినపుడు ఏమేమి జరుగుతుందో కూడా చిత్రపటం గీసినట్లుగా చెప్పటం విశేషం! కేవలం రెండు సంవత్సరాల తరువాత ఈ భవిష్యవాణి నిజమయింది. ముస్లింలు కుర్ఆన్ చెప్పినట్లుగానే సగౌరవంగా మక్కాలో ప్రవేశించారు.

(ఆ) అది ముస్లిములతో ఇలా చెప్పింది :

“మీలో విశ్వసించి మంచి పనులు చేసే వారికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే, ఆయన వారిని, వారికి పూర్వం గతించిన ప్రజలను చేసిన విధంగా, భూమిపై ఖలీఫాలు (ప్రతినిధులు)గా చేస్తాడు. అల్లాహ్ వారికై అంగీకరించిన వారి ధర్మాన్ని వారి కొరకు పటిష్ఠమైన పునాదులపై స్థాపిస్తాడు. వారిలోని (ప్రస్తుత) భయస్థితిని శాంతి భద్రతలతో కూడిన స్థితిగా మారుస్తాడు.”

*(అన్ నూర్ : 55)*

وَعَدَ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا مِنْكُمْ وَعَمِلُوا الصّٰلِحٰتِ لَيَسْتَخْلِفَنَّهُمْ فِي الْاَرْضِ كَمَا اسْتَخْلَفَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ۖ وَلَيُمَكِّنَنَّ لَهُمْ دِيْنَهُمُ الَّذِي ارْتَضٰى لَهُمْ وَلَيُبَدِّلَنَّهُمْ مِّنْ بَعْدِ خَوْفِهِمْ اَمْنًا ؕ ...

(النور:٥٥)

ఈ విషయం ముస్లిములతో ఏ సమయంలో, ఎలాంటి పరిస్థితులలో చెప్పబడిందో ఆ వాక్యాలు చెప్పకనే చెబుతున్నాయి. నలువైపులా అరాచకం, అవ్యవస్థ తాండవిస్తున్న కాలమది! భయోత్పాతంతో మానవత విలవిల్లాడుతున్న రోజులవి! ధార్మికంగా ముస్లిములకు ఇంకా సుస్థిరత చేకూరని తరుణమది! రాజ్యాధికారం

గురించి ఊహించనయినాలేని గడ్డు పరిస్థితి అది! – కాని కేవలం కొన్నేండ్లలోనే పరిస్థితులు అనూహ్యంగా కొత్త మలుపు తిరిగాయి. అరేబియా పరిధిలోని గగన భువనాలు చూస్తుండగానే మారిపోయాయి. ఇది జగమెరిగిన చరిత్రే.

(ఇ) ఇది (కుర్‌ఆన్) మదీనాలోని యుద్ధమేఘాల వాతావరణంలో – నలువైపులా ప్రజలు భయంతో బిక్కు బిక్కుమంటున్న గడియలలో తన ప్రవక్త (స) తో ఇలా చెబుతుంది :

وَاللّٰهُ يَعْصِمُكَ مِنَ النَّاسِ ط (المائدہ:٦٧)

"అల్లాహ్ ప్రజల బారి నుండి నిన్ను రక్షిస్తాడు." *(అల్ మాయిద : 67)*

మక్కాలో హింసా దౌర్జన్యాల పరంపర నిరాఘాటంగా కొనసాగుతున్న రోజులలో కూడా ప్రవక్తను ఈ విధంగా ఓదార్చటం జరిగింది :

وَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ فَاِنَّكَ بِاَعْيُنِنَا (الطور:٤٨)

"ప్రవక్తా! నీ ప్రభువు ఉత్తరువు వచ్చేవరకు ఓర్పు వహించు. నీవు మా దృష్టిలో ఉన్నావు." *(అత్ తూర్ : 48)*

మక్కాలోని అధికార మదాంధులైన బహుదైవోపాసకులు, మదీనాలోని కుల్లుమోతు స్వభావులైన కపటులు, వంచనా శిల్పనిష్ణాతులైన యూదులు, సమస్త అరేబియాలోని ఇస్లాం వ్యతిరేక శక్తులు – అందరూ ఏకమై సత్యామృతాన్ని ఆస్వాదించిన శుభాత్ములపై విరుచుకుపడాలని చూస్తున్న తరుణంలో దివ్య కుర్‌ఆన్ చెప్పిన ఓదార్పు వచనాలు నూటికి నూరుశాతం నిజమయ్యాయన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దైవప్రవక్తకు వ్యతిరేకంగా వేసిన ఏ ఎత్తుగడా, పన్నిన ఏ పన్నాగమూ, చేసిన ఏ యత్నమూ ఫలించలేదు. మరి చూడబోతే దైవదౌత్యపు 23 ఏండ్ల కాలంలో ఆయన (స) ఎన్నెన్నో గండాల నుండి గట్టెక్కవలసి వచ్చింది. ఆ నికృష్ట ఘడియల్లో ఆయన (స) సజీవంగా ఉండటం దుర్లభం అనిపిస్తుంది. మక్కాలో ఉండగా ఒక్క బనీ హాషిమ్ కుటుంబీకులు తప్ప మిగతా కురైషు తెగలన్నీ కలసి ఆయన్ని (స) హతమార్చాలని కుట్రపన్నాయి. హిజ్రత్ (వలస) సందర్భంగా ఆయన్ని వెంబడించే శత్రువులు, ఆయన తలదాచుకున్న పర్వత గుహ (సౌర్) ముఖద్వారం వరకూ వెళ్ళిపోయారు. బహుమానానికి ఆశపడి ఆయనను వెంబడించిన ఒక శత్రువు (సురాకా బిన్ మాలిక్) ఆయనను సమీపించాడు కూడా. ఆ క్షణంలో అతని గుర్రం కాళ్ళు పదే పదే నేలలో కూరుకుపోవటం కూడా అందరికీ విదితమే. ఒకసారి యూదులు మహనీయ ముహమ్మద్ (స)ను విందు భోజనం వంకతో ఒక ప్రత్యేక త్రోవ గుండా

తీసుకుపోయి, గోడమీది నుండి పెద్ద బండరాయిని ఆయన మీద పడవేసి హతమార్చాలని ప్రయత్నించారు కూడా. ఒకసారి అడవిలో ఆయన ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటూ ఉండగా ఒక ఇస్లాం విరోధి అమాంతం ఆయనపై లంఘించి, ఆయన (స) ఖడ్గాన్ని స్వాధీనం చేసుకుని, "ముహమ్మద్ (స)! నా బారి నుండి నిన్ను రక్షించే వాడెవడో చెప్పు" అని కవ్విస్తూ అడిగాడు. ఉహుద్, హునైన్ రణరంగాల దృశ్యాన్ని మనం సీరత్ చరిత్ర పుటల్లో వీక్షిస్తాము. ... వేలాదిమంది సహచరుల మధ్యన ఉండి కూడా ఆయన (స) ఒక్కో సమయంలో ఒంటరిగా, నిస్సహాయునిగా మనకు దర్శనమిస్తారు – చెప్పవచ్చిందేమిటంటే, ఒకట్రొండు కాదు; అనేక సందర్భాలలో మానవ అంచనాల ప్రకారం ఆయన (స) శత్రువు బారి నుండి సజీవంగా బయటపడే అవకాశమే లేదు. కాని ప్రతిసారీ "فَاِنَّكَ بِاَعْيُنِنَا" (నిశ్చయంగా నీవు మా దృష్టిలో ఉన్నావు) అని దేవుడిచ్చిన భరోసా ఒక్క అంగుళ మయినా తన చోటి నుండి బెసకలేదు. وَاللّٰهُ يَعْصِمُكَ مِنَ النَّاسِ (అల్లాహ్ నిన్ను ప్రజల బారి నుండి సురక్షితంగా ఉంచుతాడు) అన్న హామీ చెక్కు చెదరకుండా వెన్నంటి ఉండింది.

(క) అది అల్లాహ్ తరఫున తన గురించి ఇలా ప్రకటించుకుంది :

وَاِنَّا لَهٗ لَحٰفِظُوْنَ ⑨ (الحجر : ٩)

"స్వయంగా మేమే దానిని (కురాన్‌ను) రక్షిస్తాము." *(అల్ హిజ్ర్ : 9)*

ఈ ప్రకటన లేదా భవిష్యవాణి తరతరాలుగా కాలచరిత్రలో నిగ్గుతేలుతూ తిరుగులేని వాస్తవంగా నిరూపించుకుంటూ వస్తోంది. ఈ యదార్థాన్ని నిజాయితీ కల ఒక ఇస్లాం వ్యతిరేకి సయితం నిరాకరించలేదు. కుర్‌ఆన్ ఏ వాక్యాలలో, ఏ రూపంలో అలనాడు మహనీయ ముహమ్మద్ (స) ద్వారా అందజేయబడిందో, నేటికీ సరిగ్గా అవే వాక్యాలలో పొల్లుపోకుండా సురక్షితంగా ఉంది. కాగా; గడిచిన దైవ గ్రంథాలలో ఏ ఒక్కటి కూడా ఈ విధంగా – సురక్షితంగా – లేదు. ఆ మేరకు ఆ గ్రంథాలు దావా చేసుకునే స్థితిలో కూడా లేవు.

(చ) అగ్ని పూజారులైన పారసీకుల చేతిలో రోమను క్రైస్తవులు ఘోర పరాజయం పొందిన సందర్భంగా కూడా తిరుగులేని విధంగా అది చేసిన ఈ ప్రకటన అందరినీ అబ్బురపరుస్తుంది :

غُلِبَتِ الرُّوْمُ ② فِيْٓ اَدْنَى الْاَرْضِ وَهُمْ

"రోమన్ ప్రజలు పొరుగు భూభాగంలో పరాజితులయ్యారు. తమ ఈ పరాజ

مِّنۡۢ بَعۡدِ غَلَبِهِمۡ سَيَغۡلِبُوۡنَ ۝ فِىۡ بِضۡعِ سِنِيۡنَ ۝ (الروم : ۲تا۴)

యం తరువాత కొన్ని సంవత్సరాలలోనే వారు విజేతలవుతారు."

*(అర్ రూమ్ : 2 – 4)*

ఏడేండ్లు గడిచాయో లేదో గ్రంథవహులైన రోమనులు అగ్ని పూజారులైన ఈరాన్ పారసీకులపై విజయ కేతనం ఎగురవేశారు. ఈ విధంగా దివ్య కుర్‌ఆన్ ఇచ్చిన ఈ సమాచారం ఒక చారిత్రక సత్యంగా నిలిచిపోయింది.

(ట) అది యూదుల గురించి, వారి సత్య విరోధానికి పర్యవసానం గురించి చెబుతూ ఇలా అన్నది :

لَيَبۡعَثَنَّ عَلَيۡهِمۡ اِلٰى يَوۡمِ الۡقِيٰمَةِ مَنۡ يَّسُوۡمُهُمۡ سُوۡٓءَ الۡعَذَابِ (الاعراف:۱۶۷)

ప్రళయదినం వచ్చే వరకూ నేను తప్పకుండా ఇస్రాయీలు సంతతివారిని తీవ్ర యాతనకు గురిచేసే ప్రజల అదుపులో ఉండేలా చేస్తూ ఉంటాను."

*(అల్ ఆరాఫ్ : 167)*

యుగయుగాలుగా ఈ జాతికి ఎదురయిన పరాభవాలు, పరాధీనత, వినాశాలకు చరిత్రే సాక్షి! ఒక్కోసారి ఆషూరీలు వారిని నలిపివేయగా, ఒక్కోసారి బాబిలోనియా రాజు బఖ్తె నసర్ ద్వారా వారు ఊచకోతకు గురయ్యారు. ఒక్కోసారి రోమను చక్రవర్తి టైటస్ వారి సంస్కృతిని ధ్వంసం చేస్తే, ఒక్కోసారి వారు ముస్లింల చేతిలో ఓటమిపాలై రాజ్య బహిష్కార శిక్షను అనుభవించారు. చివర్లో హిట్లర్ వారిపై విరుచుకుపడ్డాడు. ప్రస్తుతం పలస్తీనియన్లపై వారు కాలుదువ్వుతున్న వైనం ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో భవిష్యత్కాలమే చెబుతుంది. గతకాలం, వర్తమాన కాలం వరకూ వారికి ఎదురయిన చేదు అనుభవాలన్నీ వారి స్వయంకృతా(పరాధా)ల ఫలితమే.

ఈ కొన్ని ముఖ్య భవిష్యవాణులే గాకుండా కురాన్‌లో మరికొన్ని భవిష్యవాణులు కూడా ఉన్నాయి. అవి కూడా ఒక్కొక్కటిగా నిజం అయినాయి. ఈ భవిష్యవాణులు చేసేవాడు అగోచర విషయాల జ్ఞానం కలవాడన్న దానికి ఇది తిరుగులేని సాక్ష్యం. అన్యథా అవన్నీ – యథాతథంగా – నిజం కావటమనేది సంభవం కాదు. ప్రపంచంలో జ్యోతిష్కులు, సోదె చెప్పేవారు కూడా భవిష్యవాణి చెబుతుంటారు. కాని నూటికి నూరుపాళ్ళు నిజమయ్యాయని చెప్పడానికి ఒక్కగా నొక్క జ్యోతిష్కుడు కూడా దొరకడు. వారు చెప్పిన వాటిలో ఒకటి నిజమైతే నాలుగు తప్పుగా తేలుతాయి. ఎందుకంటే వారు చెప్పే జోస్యం అంచనాలపై, కొన్ని పరిమిత గణాంకాలపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి తేలిందేమంటే భవిష్యత్తు గురించి మహా తెలివైన మనిషి సంధించే

ఊహాస్త్రాలు కూడా ఎల్లప్పుడూ నిజం కాలేవు. కాగా; కుర్‌ఆన్ చెప్పిన భవిష్యవాణి ఈ సాధారణ పరిస్థితికి భిన్నమని రుజువయింది. ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా దాని 'జోస్యాలన్నీ' నిజమయ్యాయి. అందుకే ఇవి మానవ అంచనాలపై, కాకిలెక్కలపై ఆధారపడినవి కావన్న దానికి ప్రబలతార్కాణం. పైగా ఇవి అగోచరాలతో ముడిపడివున్న నిశ్చిత జ్ఞానంపై ఆధారపడినవి. వాటిలో మానవ ప్రమేయం ఏమీ లేదు. ఈ విధమయిన అగోచర జ్ఞానం విశ్వేశ్వరుడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ లేదు. వేరేమాటల్లో చెప్పాలంటే ఈ గ్రంథరాజంలో ఉన్న భవిష్యవాణులు మానవ రచనకు సంబంధించినవి కావు. అవి కచ్చితంగా దైవప్రోక్తమే.

## ఐదవ సాక్ష్యాధారం

దివ్య కుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి ఐదవ సాక్ష్యాధారం గడిచిన కాలంలోని దైవప్రవక్తల యదార్ధ గాథలను అది వివరించిన తీరే. ఆ ప్రవక్తల వృత్తాంతాలను అది కళ్ళకు కట్టినట్లే చిత్రీకరించింది. మరి చూడబోతే ఈ ప్రవక్తల జీవిత చరిత్ర గురించి ముహమ్మద్ (స)కు గానీ, ఆయన పుట్టిన ప్రాంత ప్రజలకు గానీ తెలీదు. అందుకే కుర్‌ఆన్‌లో కొంతమంది ప్రవక్తల గాథలను, అలనాటి జాతుల పరిణామాలను వివరించిన తరువాత చివర్లో ఇలా అనబడుతూ ఉంటుంది – "ప్రవక్తా! ఇంతకు పూర్వం నీవుగానీ, నీ జాతివారుగానీ వాటిని ఎరుగరు." (హూద్:49) ''مَا كُنتَ تَعْلَمُهَا أَنتَ وَلَا قَوْمُكَ مِن قَبْلِ هَٰذَا'' గమనార్హమయిన మరో విషయమేమిటంటే దివ్య కురాన్ ఈ ప్రవక్తల గాథలను తన సందేశ పరమార్థాల దృష్ట్యా ఎక్కడెక్కడ పునరావృతం చేసినా అత్యధికంగా 'ఇస్రాయీల్ సంతతి'కి చెందిన ప్రవక్తల గాథలనే ప్రస్తావించింది. ఆ ప్రవక్తలు 'ఇస్మాయీల్ సంతతి' (అంటే అరబ్బుజాతి) కి చెందినవారు కానేకారు. ఒకవేళ ఆ ప్రవక్తలు తమ సంతతికి చెందినవారై ఉంటే జాత్యాభిమానం చేత వారు తమ చరిత్ర గ్రంథాలలో ఆ గాథలను తప్పక నమోదు చేసుకునేవారు. ఆ ప్రవక్తల ఘనకార్యాలకు, వారి సంస్కృతీ నాగరికతల్లో స్థానం కల్పించేవారు. వారి గురించిన చర్చ వారి సభలు, సమావేశాల్లో నిరంతరం జరుగుతూ ఉండేది. అప్పుడు సహజంగానే ఆయన (స) కు, ఆయన వంశీయులైన (బనీ ఇస్మాయీల్) వారికి పూర్వకాలపు ప్రవక్తల గాథలపై అమితాసక్తి ఉండేది. కాని పరిస్థితి తద్భిన్నం. మహాప్రవక్త (స)కు గానీ, ఇస్మాయీల్ సంతతి వారైన అరబ్బులకుగానీ గత కాలపు ఇస్రాయీలీ ప్రవక్తల గురించి తెలిసింది బహు తక్కువ. (ఒకవేళ కాస్తో కూస్తో తెలిసినా యూదుల, క్రైస్తవుల ద్వారానే తెలియాలి). ఇలాంటి పరిస్థితిలో

కుర్‌ఆన్ ఆ ప్రవక్తల యదార్ధ గాధలను ఎంతో సహజంగా, మరెంతో మనోజ్ఞంగా వివరించింది. ఆ ప్రవక్తల గాధల సమాహారమైన తౌరాతు సయితం కురాన్ వివరించిన తీరును ఖండించే సాహసం చేయలేకపోయింది. ఒకవేళ ఎక్కడయినా అది ఈ సాహసం చేసినా తన సాహసంలో సఫలీకృతం కాలేకపోయింది. పైగా 'అడిగి అనిపించు కున్నట్లయింది' దాని పరిస్థితి. ఎందుకంటే ప్రవక్తల యదార్ధ గాధలను కుర్‌ఆన్ ఎక్కడ ప్రస్తావించినా ప్రవక్తల స్థాయిని దృష్టియందుంచుకుని విషయం చెప్పింది. అందులో సహజత్వం ఉట్టిపడింది. అది వివరించిన ప్రవక్తల వృత్తాంతాలు తౌరాతు గ్రంథంలోని వృత్తాంతాలతో ఎక్కడ విభేదించినా దానికి ప్రధాన కారణం మానవమాత్రుల ప్రక్షిప్తాలే. తన అవలంబీకుల చేతుల్లో తౌరాతు మార్పులు చేర్పులకు లోనయింది. కాబట్టి దైవప్రవక్తా పదవిని గురించి తెలిసిన వ్యక్తి, చరిత్ర అధ్యయనం గురించి కనీస అవగాహన ఉన్న వ్యక్తి, సద్విమర్శను జీర్ణించుకున్న వ్యక్తి ఎవరయినాసరే ఆ వివరణల (గాధల) మధ్య ఉన్న వైవిధ్యాన్ని నిశిత దృష్టితో గమనిస్తే తౌరాతు ప్రకటనలకు వాస్తవాలతో పొంతన లేదన్న విషయాన్ని ఇట్టే పసిగట్టగలడు; కుర్‌ఆన్ వివరించిన గాధలే సత్యబద్ధమన్న నిర్ధారణకు రాగలడు.

ఈ విధంగా కుర్‌ఆన్ వెనుకటి ప్రవక్తల జీవిత గాధలను అత్యంత ప్రామాణికంగా వివరించటం – పనిలో పనిగా తౌరాతులో ఉన్న వైపరీత్యాలను, దోషాలను సవరించే విధంగా వివరించటం – దేన్ని సూచిస్తోంది? ఈ వివరణలు మహాజ్ఞాని, మహా వివేకి అయిన దేవుని తరఫు నుండి ఇవ్వబడినవని, కురాన్ అవశ్యంగా దైవగ్రంథమేనని సూచించడం లేదా?

## ఆరవ సాక్ష్యాధారం

ఈ విషయంలో ఆరవ సాక్ష్యాధారం కుర్‌ఆన్‌లో ప్రకటించబడిన అనేక శాస్త్రీయ, వైజ్ఞానిక యదార్థాలే. కుర్‌ఆన్ అవతరించే కాలంలో ప్రపంచానికి వాటి గురించి తెలీదు. మరీ ముఖ్యంగా అనాగరికులైన అరబ్బులకు అస్సలు తెలీదు. సైన్సు, ఫిలాసఫీకి సంబంధించిన ఉన్నత సదనాలలో కూడా ఆ విషయాలు చర్చకు వచ్చేవి కావు. కుర్‌ఆన్ అవతరించిన మీదట కొన్ని శతాబ్దాలు గడచిపోయాయి. ఆ తరువాత శాస్త్రీయ, వైజ్ఞానిక పరిశోధనల్లో కుర్‌ఆన్ ప్రకటించిన ఒక్కొక్క విషయం నిజమని రూఢీ అవసాగింది. ఉదాహరణకు:

(అ) ఈ విశ్వమండల సృష్టి గురించి కుర్‌ఆన్ ఇలా అంటోంది :

اَنَّ السَّمٰوٰتِ وَالْاَرْضَ كَانَتَا رَتْقًا فَفَتَقْنٰهُمَا ؕ (الانبياء:٣٠)

"నిశ్చయంగా ఆకాశాలు, భూమి పరస్పరం కలిసి ఉండేవి. తరువాత మేము వాటిని వేరు చేశాము."

*(అల్ అన్బియా : 30)*

'సమస్త భూమ్యాకాశాలు' అంటే కుర్‌ఆన్ భాషలో సమస్త జగతి అని భావం. ఈ సూక్తిలో స్పష్టంగా చెప్పబడిన విషయమేమిటంటే, ఈ జగతి ప్రస్తుతమున్న రూపంలో ఉనికిలోకి రాక మునుపు అదంతా ఒకే పదార్థంగా – ప్రత్యేక వస్తువుగా అంతరిక్షంలో వ్యాపించి ఉండేది. ఆ తరువాత మహావివేకి అయిన సృష్టికర్త దానిని వివిధ భాగాలుగా విభజించాడు. వాటికి వివిధ రూపాలను ఇచ్చాడు. ఇంతకీ ఆ పదార్థం ఏది? అదెలా ఉండేది? దాని వివరణ కూడా కురాన్‌లోని వేరొక వచనంలో ఉంది :

اِنَّ السَّمٰوٰتِ وَالْاَرْضَ كَانَتَا رَتْقًا فَفَتَقْنٰهُمَا ۔

"తరువాత కేవలం పొగగా ఉన్న ఆకాశం వైపునకు ఆయన తన ధ్యానాన్ని మరల్చాడు."

*(హా మీమ్ అస్ సజ్‌దహ్ : 12)*

అంటే ఇది కూడా ఒక విధమయిన పొగ లేక గ్యాస్ మాదిరిగా ఉండేది.

(ఆ) జీవరాశుల గురించి అది చెబుతూ ప్రతి ప్రాణీ 'నీరు' అనీ, అది ద్రవ పదార్థం ద్వారా సృష్టించబడిందని సెలవిచ్చింది.

وَجَعَلْنَا مِنَ الْمَآءِ كُلَّ شَیْءٍ حَیٍّ ؕ (الانبياء:٣٠)

"మేము (అంటే దేవుడు) ప్రాణం ఉన్న ప్రతి దానినీ నీళ్లతో సృష్టించాము."

*(అల్ అన్బియా – 30)*

(ఇ) ప్రాణం ఉన్న వాటి గురించి, ప్రాణం లేని వాటి గురించి ఆయన మరో సంగతి కూడా సెలవిచ్చాడు :

وَمِنْ كُلِّ شَیْءٍ خَلَقْنَا زَوْجَیْنِ (الذاريات:٤٩)

"ప్రతి వస్తువునూ మేము జంటలుగా సృష్టించాము." *(అజ్ జారియాత్ : 49)*

అంటే, ఈ విశ్వంలో ఉన్న ప్రతి ప్రాణికీ అల్లాహ్ జంటను చేశాడు. ఒకరి అవసరాన్ని ఇంకొకరు తీర్చేదిగా, ఒకరికి మరొకటి పరిపూర్ణతను ఒసగేదిగా నిర్మించాడు. ఆ విధంగా అవి కలసి పరస్పరం సహకరించుకుని, ఈ ప్రపంచ

పరమార్థాలను, అది కోరే సహజ అవసరాలను నెరవేర్చాలన్నది దీని ప్రధానోద్దేశం. వివిధ వస్తువుల మధ్య వ్యాఘాతం ఏర్పడి, తత్ఫలితంగా ఈ విశ్వ కర్మాగారం అతలాకుతలమై ప్రశాంత జీవనం స్థంభించిపోకుండా ఉండాలన్నది దీని ఉద్దేశం.

(ఈ) సూర్యచంద్రుల శాశ్వత స్థితిని ఖరారు చేసిన తీరును గురించి ఆయన ఇలా సెలవిచ్చాడు :

وَالشَّمْسُ تَجْرِيْ لِمُسْتَقَرٍّ لَّهَا ۚ ذٰلِكَ تَقْدِيْرُ الْعَزِيْزِ الْعَلِيْمِ ۝٣٨ وَالْقَمَرَ قَدَّرْنٰهُ مَنَازِلَ...... وَكُلٌّ فِيْ فَلَكٍ يَّسْبَحُوْنَ ۝٤٠

(یٰسٓ:۳۹،۴۰)

“ఇక సూర్యుడు – దాని నిజస్థానం దిశగా పయనిస్తోంది. ఇది మహా శక్తిమంతుడూ, గొప్ప జ్ఞాని అయిన దేవుడు నిర్దేశించిన నియమావళి. ఇకపోతే చంద్రుడు – దాని కొరకు మేము దశలను నిర్దేశించాము .... అన్నీ వేర్వేరు కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి.” *(యాసీన్ – 39, 40)*

ఈ విషయాలన్నీ నేడు నిరూపితమైన యదార్థాలే. ఈ విశ్వం ఆదిలో ఒక గ్యాసు నిధి రూపంలో ఉండేదని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయి. జీవనానికి మూలం నీరు అని, సృష్టితాలలో ‘జంట శాసనం’ అమలులో ఉందని కూడా పరిశోధనల్లో తేలింది. సూర్యచంద్రులు తమ నిర్ధారిత కక్ష్యలను అతిక్రమించవని కూడా నిరూపితమయింది – కాని కురాన్ ఈ యదార్థాలను ఘంటాపథంగా ప్రకటించిన కాలంలో విజ్ఞానులు, పరిశోధకులు ఈ యదార్థాలను గురించి ఊహించనయినా లేదు. 14 శతాబ్దుల క్రితం కురానులో ఈ యదార్థాల ప్రస్తావన ఎందుకొచ్చినట్టు? అరేబియాకు చెందిన ఒక నిరక్షరాసి నోట ఇలాంటి బ్రహ్మాండమయిన విషయాలు ఎలా వెలువడ్డాయి? అన్న ప్రశ్న ఈ సందర్భంగా ఉదయిస్తుంది. దీనికి ఒకే ఒక్క సమాధానం ఉంది. కుర్‌ఆన్ సూచించిన ఆ యదార్థాలు మానవమాత్రుని మస్తిష్కం నుండి జాలువారినవి కావు. యావత్ప్రపంచాన్ని సృష్టించిన వాడు స్వయంగా ఈ యదార్థ విషయాలను తన జగతిలో పొందుపరిచాడు.

## ఏడవ సాక్ష్యాధారం

ఈ యదార్థానికి సంబంధించిన ఏడవ ఆధారం కుర్‌ఆన్ యొక్క అనితర సాధ్యమయిన బోధనా శైలి; అసాధారణమయిన దాని తేటదనం, ఎదుటి వారిని ప్రభావితం చేసే దాని పలుకుల్లోని శక్తి. అవి నిరుపమానమైనవి.

కురాన్ కూడా మనుషులు మాట్లాడే భాషలోనే ఉన్నప్పటికీ, అరబీ భాషా సాహిత్యంలో ఉండే సూత్రావళే ఈ గ్రంథ వాక్యాలలోనూ ఉన్నప్పటికీ దాని పదబంధం, బోధనా తీరు అరబీ సాహితీ నిధిలో ఎక్కడా కనిపించదు. దాని విలక్షణా శైలి సాటిలేనిది. ఈ విషయాన్ని నిర్ధారించుకునేందుకు కుర్‌ఆన్ అభిమానుల వ్యాఖ్యలో, ఇస్లాం ప్రేమికుల అభిప్రాయాలో కాకుండా దాని బద్ధవిరోధులు ఇచ్చిన సాక్ష్యాన్ని వినండి. ప్రఖ్యాత కురైషు నాయకుడు వలీద్ బిన్ ముగీరా ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సన్నిధికి వచ్చాడు. ఆనవాయితీ ప్రకారం ఆయన (స) అతనికి కూడా కుర్‌ఆన్ చదివి వినిపించారు. దైవవాక్కు ప్రభావం వల్ల అతని హృదయ కాఠిన్యం కరిగి ప్రవహిస్తున్నట్లనిపించింది. అతను మారుమాట్లాడకుండా తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు. ఈ సంగతి తెలుసుకున్న అబూజహల్ కలవరం చెందాడు. తిన్నగా అతని దగ్గరకు వచ్చి, 'బాబాయి! ముహమ్మద్ (స) గురించి (మీరేం ఆలోచిస్తున్నారో) చెప్పండి. మీ మాటలు విన్న మీ జాతి జనులు, మీరతని వాదనలోని సత్యాన్ని స్వీకరించలేదన్న విషయం తెలుసుకుని సంతోషించాలి. చెప్పండి' అన్నాడు. దానికి వలీద్, "ఏం చెప్పమంటావ్!? దైవం సాక్షిగా చెబుతున్నా. కవిత్వమయినా, కీర్తనలయినా, పద్యాలయినా, జిన్నుల కవనమయినా – అరబీ సాహిత్యంలోని ఒక్కొక్క తరహా గురించి నేను మీ అందరికన్నా బాగా ఎరుగుదును. దైవం సాక్షి! ఆ వ్యక్తి సమర్పిస్తున్న వాక్కు వీటిలో ఏ ఒక్క దానినీ పోలినది కాదు. దైవం సాక్షి! ఆ వాక్కులో ఓ విచిత్రమయిన మాధుర్యం ఉంది. ఒక ప్రత్యేకమయిన సౌందర్యం ఉంది. దాని కొమ్మలు రెమ్మలు పండ్లతో నిండి ఉన్నాయి. దాని వ్రేళ్లు చాలా సుదృఢంగా ఉన్నాయి. నిశ్చయంగా ఆ పలుకు అన్నిటికన్నా ఉన్నతమయినది. ఇతర వాక్కేదీ దానిపై ప్రాబల్యం వహించజాలదు. అది దాని క్రిందికి వచ్చిన ప్రతిదానినీ తునాతునకలు చేసివేస్తుందనడంలో సందేహం లేదు" అని నిర్ద్వంద్వంగా చెప్పాడు. (హాకిమ్, బైహకీ)

కురైషులలోని మరో ఎన్నదగ్గ ఆలోచనాపరుడు ఉతబా బిన్ రబీఅ. అతనొకసారి ప్రవక్త మహనీయుల (స) దగ్గరకు వచ్చాడు. ఆయన వినిపించే సందేశాన్ని ఓసారి విశ్లేషించి, దాని నుండి ఆయన (స)ను నిరోధించాలన్నది అతని రాకలోని ఉద్దేశం. ఆయన (స) అతని ముందు హా మీమ్ అస్ సజ్దా అధ్యాయం పారాయణం చేశారు. ఈ పారాయణంలో فَإِنْ أَعْرَضُوا فَقُلْ أَنذَرْتُكُمْ (ఇప్పుడు ఒకవేళ వారు విముఖులైతే, వారితో ఇలా అను) అనే వాక్యం దగ్గరికొచ్చేసరికి, అతను ఆయన (స) పెదాలపై చేయిపెడుతూ, రక్త సంబంధాన్ని ప్రస్తావిస్తూ, "దేవుని కోసం ఇక ఆపేయ్యి"

అని అభ్యర్థించి, ఇంటి ముఖం పట్టాడు. అబూజహల్ అతని ఇంటికి వెళ్ళి సమావేశ సారాంశం గురించి వాకబు చేసినప్పుడు, ఉతబా ఇలా అన్నాడు : "దైవం సాక్షి! అతను వినిపించిన వాక్కు మంత్ర విద్యగానీ, కవిత్వంగానీ, జ్యోతిష్యం గానీ కాదు." (బైహకీ)

వినేవాని ఆంతర్యంలో చొచ్చుకుపోయేదే, వినిపించేవాని ఉద్దేశం వినేవాని హృదయానికి సంతృప్తిని ఇచ్చేదే కమ్మనిమాట! శక్తిమంతమయిన పలుకు! .... ఈ వాస్తవాన్ని దృష్టియందుంచుకుని విశ్లేషించినప్పుడు యావత్తు మానవజాతి చరిత్రలో ఈ విధంగా హృదయాంతరాళాలకు తృప్తినీ, నిమ్మళాన్ని ఇవ్వటంలో కుర్‌ఆన్‌తో సాటి రాగలిగినదేదీ లేదు. దాని వాక్కులో ఉన్న శక్తిని, హృదయాలను జయించే గుణాన్ని సంఘటనల వెలుగులోనే చూడండి –

ఇస్లాం సందేశాన్ని నిరోధించడానికి కురైషు సర్దారులు తమ జాతి జనులకు చేసిన సూచనలలో ఒకటి ఇది :

لَا تَسْمَعُوْا لِهٰذَا الْقُرْاٰنِ وَالْغَوْا فِيْهِ لَعَلَّكُمْ تَغْلِبُوْنَ ۝ (حٰم سجدة:٢٦)

"ఈ కుర్‌ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడేటప్పుడు వినబడకుండా విఘ్నం కలిగించండి. బహుశా ఇలాగైనా మీరు ప్రాబల్యం వహించవచ్చు."

*(హా మీమ్ అస్ సజ్దహ్ – 26).*

ముష్రిక్కుల ఈ తరుణోపాయం, వారు తమ జనులకు చేసిన సూచన దేనికి సంకేతమో అర్థమవుతూనే ఉంది. తమ జాతి జనులు గనక నిరంతరం – నిశ్శబ్దంగా – ఈ సందేశాన్ని వింటూవుంటే వారు తమంతట తాముగా దాని పరం కాకతప్పదన్న సత్యాన్ని వారు ఒప్పుకున్నట్లే.

మక్కాలో ఇస్లాం స్వీకరించిన వారిపై హింసా దౌర్జన్యాలు పెచ్చురిల్లినప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) కూడా – ఒక దశలో – మక్కా నుండి వలసపోవాలని నిశ్చయించుకున్నారు. తన నివాస గృహం నుండి బయలుదేరారు కూడా. దారిలో ఇబ్నె దగన్నా అనే ఒక వ్యక్తి తారసపడి, ఆయనకు తన తరఫున రక్షణ కల్పిస్తానని హామీ ఇచ్చి, అబూబకర్‌ను వెనక్కి రప్పించాడు. ఈ 'అభయం' గురించి మక్కా వారికి తెలిసినపుడు, వారు ఇబ్నె దగన్నా దగ్గరకు వచ్చి, అబూబకర్ బిగ్గరగా కురాన్ పారాయణం చేయకుండా, మా స్త్రీలు పిల్లలకు కురాన్ వినిపించకుండా ఉండేటట్లయితేనే మేము ఆయనను ఇక్కడ ఉండనిస్తామని తెగేసి చెప్పారు. (ఇబ్నె హిష్షామ్ : మొదటి సంపుటం)

కురాన్ పట్ల ద్వేషం పెంచుకున్నవారిలో, ఇస్లాం పట్ల విరోధభావం కలవారిలో అబూజహల్, అఖ్‌నస్ బిన్ షురైక్‌ను మించిన వారెవరుంటారు? కాని ఎంత ద్వేషం, మరెంత వ్యతిరేకత ఉన్నప్పటికీ ఒకసారి కుర్‌ఆన్ విన్నమీదట అసాధారణమయిన దాని తియ్యదనానికి, రమణీయమయిన దాని వాక్పటిమకు వారు ముగ్ధులు కాకుండా ఉండలేకపోయారు. దానిని మరువలేకపోయారు. పగటి పూట కుర్‌ఆన్ పట్ల ప్రజాబాహుళ్యంలో విద్వేషాన్ని చిలికించినప్పటికీ రాత్రివేళల్లో ప్రవక్త మహనీయుల నోట కుర్‌ఆన్ మధురాతి మధుర పారాయణం విన్నప్పుడు నడుస్తున్న వారల్లా నిలుచుండిపోయేవారు. వారి అడుగులు ముందుకు కదిలేవి కావు. గుట్టుచప్పుడు కాకుండా చాలాసేపటి వరకు కుర్‌ఆన్ విని వెళ్ళేవారు. (ఇబ్నె హిష్షామ్ : మొదటి సంపుటం)

మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒకసారి కాబా గృహ ప్రాంగణంలో అన్ నజ్మ్ సూరా పారాయణం చేశారు. ఆ సమయంలో అక్కడున్న వారిలో విశ్వాసులు, అవిశ్వాసులు కూడా ఉన్నారు. ఆయన (స) తన పారాయణంలో భాగంగా 'సజ్దా వాక్యం' వరకు చేరుకోగానే దైవాజ్ఞానుసారం ఆయన (స) సాష్టాంగ ప్రణామం చేశారు. ఆయన ఆ విధంగా దైవాదేశాన్ని శిరసావహించటం గమనించి (కేవలం ఒక్క అబూ లహబ్ మినహా) అక్కడున్న వారంతా ప్రణమిల్లారు. (బుఖారీ)

కాస్త ఆలోచించండి! ముస్లింలు సాష్టాంగ ప్రణామం చేశారంటే షరీఅత్ ఆదేశం వారిని ఆ విధంగా 'సజ్దా' చేసేందుకు పురమాయించిందని అనుకోవచ్చు. కాని సత్యతిరస్కారుల తలలు నేలకు ఎందుకు ఆనినట్టు? అది దైవ వాక్కులోని అపారమయిన వశీకరణా శక్తే. అబ్బురపరిచే దాని మాధుర్యాన్ని వారు తనివితీరా గ్రోలే ప్రయత్నంలో తాదాత్మ్యానికి లోనయ్యారు. తమను తాము మరచిపోయారు. తామేం చేస్తున్నారో కూడా మరచిపోయారు.

తుఫైల్ బిన్ అమ్ర్ దోసి తన తెగకు నాయకుడు. ఆ కాలపు ఎన్నదగ్గ కవులలో ఒకడు. అతనొకసారి మక్కా వచ్చాడు. కురైషులలోని కొంతమంది అతని వద్దకు వచ్చి ముహమ్మద్ (స) గురించి సావధానపర్చారు. "చూడండి! ఆ వ్యక్తి దగ్గరకు మాత్రం వెళ్ళకండి. అతను చెప్పే మాటలు వినకండి. ఎందుకంటే అతని మాటల్లో మంత్ర శక్తి ఉంది. వాటిని విన్నవారు తమ ఇంద్రియాలపై నియంత్రణ కోల్పోతారు" అని సలహా ఇచ్చారు. కాని తుఫైల్ వారి సలహాను పట్టించుకోలేదు. ఇంతకీ అదేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం అతనిని ముహమ్మద్ (స) సన్నిధికి చేర్చింది. ఆయన (స) అతనికి కుర్‌ఆన్ చదివి వినిపించారు. అది విని తుఫైల్ అప్రయత్నంగా, 'దైవం

సాక్షి! ఇంతకన్నా ఉత్తమవాక్కును నేనెన్నడూ వినలేద'ంటూ విశ్వాస (ఈమాన్) ప్రకటన చేశాడు.

ఇస్లాం స్వీకరించక పూర్వం ఇస్లాం ప్రవక్త (స) పట్ల బద్ధ విరోధిగా ఉన్న వారిలో ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఒకరు. ఒక రోజాయన ఆగ్రహావేశంతో ఊగిపోతూ, ఖడ్గం చేబూని, ఈ రోజు తాడోపేడో తేలిపోవాలంటూ బయలుదేరారు. కాని దారిలో – తన సోదరి ఇంట – కుర్‌ఆన్‌లోని 'తాహా' అధ్యాయం విన్నారాయన. అంతే. ఇస్లాం పట్ల, ఇస్లాం ప్రవక్త పట్ల ఉన్న శత్రుత్వం కాస్తా విశ్వాసం (ఈమాన్)గా పరిణమించింది. (ఇబ్నె హిష్షామ్ : మొదటి సంపుటం)

జుబైర్ బిన్ ముత్‌యిమ్ దారిలో నడుస్తున్నారు. మగ్రిబ్ నమాజులో మహాప్రవక్త (స) తూర్ అధ్యాయ పారాయణం చేయటం విని అక్కడే ఆగిపోయారు. ఆ అధ్యాయంలోని వాక్యాలు బాణంలా ఆయన గుండెల్లో గుచ్చుకున్నాయి. ఎట్టకేలకు ఆయన ఇస్లాం ఒడిలో చేరిపోయారు.

దివ్య కుర్‌ఆన్‌లోని మహోన్నతమయిన వాక్పటిమ దృష్ట్యా అదేదో కవితా సంపుటమో, సాహిత్య గ్రంథమో కాదు. అది నీతీనడవడికలతో, ఆదేశాలు ఉపదేశాలతో నిండి ఉన్న గ్రంథం. వాగ్ధాటి, వాక్చాతుర్యం ప్రదర్శించే ప్రపంచమయితే సాహితీ ప్రపంచం, కవితా సమ్మేళనమే! ప్రపంచంలో గొప్ప కవులుగా, సాహితీపరులుగా, మహా వక్తలుగా విశ్వవిఖ్యాతిగాంచిన వారంతా తమ కవనం ద్వారా, రచనా ప్రక్రియ ద్వారా, గంగా ప్రవాహం లాంటి పరవళ్ళు తొక్కే ఉపన్యాసాల ద్వారా ఖ్యాతి గడించినవారే. దైవభక్తినీ, నైతికరీతినీ ప్రబోధించే వారు సాహితీ వినీలాకాశాలలో ఉజ్వల తారలుగా ప్రకాశించినట్లు సాధారణంగా కనిపించరు. ఎందుకంటే వీటిల్లో రసాస్వాదన ఉండదు. రమణీయత ఉండదు. వీటిలో చాలా విషయాలు అతిసాధారణంగానే ఉంటాయి. అయినప్పటికీ కుర్‌ఆన్ తన పదబంధాల ద్వారా, భావ ప్రకటనా మధురిమ ద్వారా చదువరులను, శ్రోతలను ఉర్రూతలూగించింది. తాదాత్మ్యానికి లోనుచేసింది. తన ధార్మిక నిర్దేశాలను, షరీఅత్ ఆదేశాలను విపులీకరిస్తూ కూడా భక్తీ పారవశ్యాలతో ఓలలాడేలా చేసింది. గత కాలపు గాధలను, సంఘటనలను చిత్రీకరిస్తున్నప్పుడు ఫ్లాష్‌బాక్ దృశ్యాలతో, క్లైమాక్స్ సీనులతో నరాలు తెగిపోయే ఉత్కంఠను సృష్టించింది. అదే గనక మానవ విరచితం అయివుంటే ఇలాంటి అమోఘమయిన స్థితిని సృష్టించటం సాధ్యం కాదని మానవ బుద్ధి అంగీకరిస్తుంది. అందుకే ఇది ముహమ్మద్ (స) రచనగానీ, మరే ఇతర మానవమాత్రుని రచనగానీ కానేకాదు. వాక్పటిమలో, 'పరిపూర్ణత' కల సృష్టికర్త వాక్కు ఇది.

# ఎనిమిదవ సాక్ష్యాధారం

దివ్య కురాన్ దైవ గ్రంథమనడానికి ఎనిమిదవ సాక్ష్యాధారం దాని ప్రబోధనలే. ఆ ప్రబోధనలను తరచిచూసినప్పుడు మనకు అర్థమయ్యేదేమిటంటే ఒక వైపు ధ్యేయంలో సంతులనం, సమతౌల్యం తొణికిసలాడుతూ ఉంటే, మరోవైపున అది మానవత కోసం అత్యంత సమగ్రమయిన మార్గదర్శక నియమావళిగా కానవస్తుంది. అందులో దైవానికి సంబంధించిన హక్కులు, ధార్మిక విశ్వాసాలు, సూత్రాలతో ముడిపడిన విషయాలు కూడా ఉన్నాయి. మానవ నీతీ నడవడికల, మర్యాదల తప్పీళ్లు కూడా ఉన్నాయి. నిజదైవాన్ని ఆరాధించే సమగ్ర సూచనలతో పాటు, దేవుని హక్కులకు సంబంధించిన ఆదేశిక సూత్రాలు కూడా కూలంకషంగా చర్చించబడ్డాయి. వ్యక్తి శిక్షణకు ఉద్దేశించిన ఉపదేశాలతో పాటు సమాజ నిర్మాణానికి ఉద్దేశించిన మూలసూత్రాలు కూడా విశదీకరించబడ్డాయి. కుటుంబ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ ఆదేశాలతో పాటు యుద్ధరంగ నియమాలు, సంధీ ఒడంబడికల సూత్రాలు కూడా విడమరచి చెప్పబడ్డాయి. ఈ ఉపదేశాలు, శిక్షణలలో సామూహిక ఆదేశాల విషయానికివస్తే, అవి ప్రపంచంలోని ఇతర వ్యవస్థలన్నిటికంటే పూర్తిగా వేరైనవి. అవి ప్రతి జాతికీ, ప్రతి కాలానికీ, ప్రతి రాజ్యానికి సమానంగా వర్తిస్తాయి. సర్వకాల సర్వావస్థలకు అతికినట్లే సరిపోతాయి. భవిష్యత్కాలంలో కూడా ఎక్కడ వాటిని అన్వయించుకునే ప్రయత్నం జరిగినా అవి చక్కగా సమరసం చెందుతాయి. అంతేకాదు, ఈ ఉపదేశాలు తమ సామంజస్యతకు, రుజువులకు, అవసరమయిన క్రియాత్మక సత్ఫలితాలకు సంబంధించిన బలమయిన సాక్ష్యాధారాలను కూడా కలిగి ఉన్నాయి. వాటి ఆధారంగా ఎప్పుడు మానవ జీవన నిర్మాణం చేయబడినా సంతోషదాయక మయిన ఫలితాలే వచ్చాయి ... ఆలోచించండి! అనుపమమయిన ఈ ప్రబోధనలు మహనీయ ముహమ్మద్ (స) వారి మేధలో పుట్టినవేనా? ఈ విషయం గురించి ఆలోచించే సమయంలో రెండు కఠోర వాస్తవాలను దృష్టియందుంచుకోవాలి.

ఒకటి : ధార్మిక, నైతిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై కురాన్ సింహావలోకనం చేసిన తీరు సాధారణ స్థాయికి చెందినది కాదు. అంతటి ఉన్నతస్థాయి విశ్లేషణ, దూరదృష్టి జీవితాంతం కఠోర సాధన చేసినప్పటికీ ఒకరిద్దరు వ్యక్తులకు తప్ప అబ్బదు. రెండు : ఇక కుర్‌ఆన్‌ను లోకానికి పరిచయం చేసిన 'ఆ వ్యక్తి' జీవిత స్థితిగతులపై ఓసారి దృష్టిని సారించండి. అతను అరబ్బులాంటి వెనుకబడిన ప్రాంతంలో జన్మించాడు. అతని లేబ్రాయమంతా అనాథగానే గడచిపోయింది. నవ యువకుడిగా ఉన్నప్పుడు కటిక ఎడారిలో గొర్రెల కాపరిగా కానవస్తాడు. యువకుడుగా ఉన్నప్పుడు

వర్తకంతోనే అతని జీవితం గడిచింది. అతను చదువు రానివాడు (ఉమ్మీ). అతనికి విద్యా శిక్షణల గాలి కూడా సోకలేదు. ప్రఖ్యాత శాస్త్రవేత్తల, సాహితీపరుల పేర్లు కూడా కనీసం అతను వినలేదు. మక్కావాసులు అతనిని ఒక నెమ్మదస్తునిగా, నిజాయితీపరునిగా, శాంతికాముకునిగా, సచ్ఛీలునిగా, మర్యాదస్తునిగా మాత్రమే ఎరుగుదురు. కాని నలభై ఏండ్లు నిండే వరకు అతనిని ఎన్నడూ 'జ్ఞానాన్ని', వివేకాన్ని ప్రబోధించే వ్యక్తిగా చూడలేదు. అతను తాత్విక చర్చాగోష్ఠులలో పాల్గొన్నట్లుగానీ, నైతికతను బోధించినట్లుగానీ, జీవితపు సామూహిక రంగాలపై, శాసనాలపై తర్జనభర్జన చేసినట్లుగానీ ఎవరూ కనుగొనలేదు. అతను ఏ నాడయినా విశ్వేశ్వరుని ఉనికిపై, దేవుని ఏకత్వంపై, దైవదౌత్యంపై, పరలోకంలోని శిక్షా బహుమానాలపై, స్వర్గనరకాలపై, దైవ గ్రంథాలపై, గతకాలపు ప్రవక్తల సందేశాలపై చర్చకు తెరలేపినట్లు, దానిపై పెదవి విప్పి పలికినట్లు ఏ ఒక్కరూ వీక్షించలేదు. కాని తన నలభై ఏండ్ల ఈ అతి నిరాడంబర నేపథ్యం తరువాత ఆ వ్యక్తి అకస్మాత్తుగా ప్రపంచానికి అనుపమమయిన ప్రబోధనలతో కూడుకున్న 'ఆ మాట' వినిపించటం మొదలెట్టాడు. మిట్టమిధ్యాహ్నపు సూర్యుని వెలుతురు లాంటి ఈ రెండు వాస్తవాలను ముందుంచుకుని ఆలోచించే ఏ వ్యక్తి అయినా 'ఈ ప్రబోధనలు' ముహమ్మదు (స) వారి మస్తిష్కంలో జనించాయంటే అంగీకరించడు. ఈ ఉపదేశాలు కచ్చితంగా దైవోపదేశాలేనని, అవి కేవలం దివ్యవాణి (వహీ) ఫలితమేనని తీర్పు ఇస్తాడు.

## తొమ్మిదవ సాక్ష్యాధారం

కుర్ఆన్ ప్రకటించిన దానికి తొమ్మిదవ రుజువు కుర్ఆన్ అవలంబనవల్ల ప్రపంచానికి చేకూరిన సత్ఫలితాలే. దైవప్రవక్త హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) సిసలయిన ప్రవక్తల ఆనవాలు గురించి చెబుతూ "మీరు వారి ఫలముల ద్వారా వారిని గుర్తుపట్టుదురు" అని అన్నారు. ఈ మాటే స్వయంగా కుర్ఆన్ మరోవిధంగా చెప్పింది : "కలిమయె తయ్యిబా (అంటే కుర్ఆన్ సందేశం) ఉపమానం ఒక మేలు జాతి వృక్షం వంటిది. దాని వ్రేళ్లు నేలలో బాగా పాతుకుపోయి ఉన్నాయి. దాని శాఖలు నింగికెగసి ఉన్నాయి. అది ఎల్లవేళలా తన ప్రభువు అనుజ్ఞతో మేలైన పండ్లు ఫలాలనిస్తూ ఉంటుంది (ఇబ్రాహీమ్ : 24, 25). అంటే ఒక గ్రంథం దైవగ్రంథం కావటానికి సైద్ధాంతికంగా, క్రియాత్మకంగా అది మానవుణ్ణి ఎంతటి సచ్ఛీలునిగా, సద్వర్తనునిగా, సఫలీకృతునిగా మలుస్తుందన్నదే సిసలయిన తార్కాణం. ఎవరయినా ఒక ప్రవక్త, ఒక గ్రంథం యొక్క సత్యనిబద్ధతను తెలుసుకోవటానికి ఇదే

అసలు ప్రమాణ నికషం. ఈ వ్యవహారంలో మతాల చరిత్రలో ఈ ప్రమాణతా నికషంపై కురాన్‌కన్నా ఎక్కువగా నికార్సుగా నిగ్గుతేలిన గ్రంథం మరేదీ లేదు. ఈ గ్రంథం ద్వారా ఉనికిలోకి వచ్చిన విప్లవం మహత్పూర్వకమైనది. దానికన్నా బ్రహ్మాండమయిన, పరిపూర్ణమయిన, దైవభీతితో కూడిన విప్లవం మరొకటి లేదు. 12 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నివసించే యుద్ధకాముకులు, తలబిరుసు మనుషులు, అజ్ఞానులు, మొరటోళ్ళు అయిన అరబ్బులను ఈ గ్రంథం ప్రపంచంలోనే అందరికన్నా ఎక్కువ మానవతా మూర్తులుగా, క్రమశిక్షణగలవారుగా, మృదు స్వభావులుగా, మంచిని ప్రేమించేవారుగా తీర్చిదిద్దింది. దాని ప్రబోధనల ఆధారంగా మలచబడిన మనుషులు మానవశ్రేయోభిలాషులుగా నిలిచారు. అది నిర్మించిన సమాజం ఆసాంతం న్యాయానికి, పరోపకార భావనకు ప్రతిరూపం అయింది. అది స్థాపించిన రాజ్యం ఈ భువిపై నిజ భావంలో 'దివిసీమ'గా వర్థిల్లింది. కుర్ఆన్ ప్రసాదించిన ఈ 'ఫలాల'ను చూసిన ఏ వ్యక్తి అయినా, కుర్ఆన్ చేసిన ప్రకటన బూటకమని ఎలా అనగలడు? చెడు (నాసిరకం) చెట్టు నుండి మేలైన పండ్లు ఉత్పత్తి అవవు. అసత్య కొమ్మల నుండి సత్యమనే పుష్పాల పరిమళం గుభాళించదు, అలాంటప్పుడు ఆద్యంతం మిథ్య, మోసంతో కూడుకున్న గ్రంథం ద్వారా ప్రపంచంలో సచ్ఛీలత, నిజాయితీ తత్పరతల వసంతం ఎలా వెల్లివిరుస్తుంది?

## పదవ సాక్ష్యాధారం

దాని పదవ సాక్ష్యాధారం మరింత దృఢమైనది. అది విమర్శకుల నోళ్ళు మూయించింది. వ్యతిరేకులను ఆత్మ రక్షణలో పడవేసింది. దిక్కుతోచక దిక్కులు చూసే నిస్సహాయ పరిస్థితిని సృష్టించింది. దివ్య కుర్ఆన్ చూపే ఒక్కొక్క సాక్ష్యాధారాన్ని వ్యతిరేకులు, విమర్శకులు బేఖాతరు చేసినపుడు, దానిని అవతరింపజేసిన వాని తరఫు నుండి ఓ సవాలు విసరబడింది. అదేమంటే –

وَاِنْ كُنْتُمْ فِيْ رَيْبٍ مِّمَّا نَزَّلْنَا عَلٰى عَبْدِنَا فَاْتُوْا بِسُوْرَةٍ مِّنْ مِّثْلِهٖ وَادْعُوْا شُهَدَآءَكُمْ مِّنْ دُوْنِ اللّٰهِ اِنْ كُنْتُمْ

"మేము మా దాసునిపై అవతరింప జేసిన గ్రంథం గురించి, అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్లయితే దాని వంటి ఒక్క సూరానయినా మీరు రచించి తీసుకురండి. మీ సహచరులందరినీ పిలుచుకోండి. ఒక్క అల్లాహ్ తప్ప

صٰدِقِيْنَ۝۲۳ (البقرة:۲۳)

మరెవరి సహాయాన్నయినా పొందండి. మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసి చూపించండి." *(అల్ బఖర : 23)*

అంటే మీరు గనక ఖుర్ఆన్ దైవవాక్కు కాదని, మీరు ఊహించేదే సరైనదని అనుకుంటూ ఉన్నట్లయితే, మీ వాదనకు ముగింపుగా ఒక సవాలు మీ ముందు ఉంచబడుతోంది. ఖుర్ఆన్ లాంటి పదబంధాలు, భావార్థాలు గల ఒక గ్రంథాన్ని మీరు రచించి తీసుకురండి. పోనీ అది సాధ్యం కాదనుకుంటే, ఈ ఖుర్ఆన్‌లోని అధ్యాయా ల్లాంటిది ఒక్కగానొక్క అధ్యాయమయినా వ్రాసి తీసుకురండి. ఈ పని ఒకే వ్యక్తి చేయాలన్న ఆంక్ష కూడా మీపై లేదు. ఈ వ్యవహారంలో మీకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడుతోంది. మీరందరూ కలసి ఈ పని చేసుకోవచ్చు. మీకు నచ్చిన వారిని ఇందు నిమిత్తం మీ సహాయకులుగా పిలుచుకోవచ్చు. మీరు గనక ఈ విధంగా ఈ సవాలుకు జవాబు ఇవ్వగలిగారంటే ఖుర్ఆన్ ఒక మానవమాత్రుని రచన అన్న సంగతి రుజువైపోతుంది. తాను దైవవాక్కు అని దావా చేయటం అది మానుకుంటుంది. మీరు సౌమ్యంగా ఆలోచించాల్సిన విషయమిది! ఒక్కగానొక్క వ్యక్తి, అదీ చదువురాని ఒక (ఉమ్మీ) వ్యక్తి, జీవితంలో ఎన్నడూ కవితా కుసుమాలు వినిపించని వ్యక్తి (ముహమ్మద్ – స) పూర్తి ఖుర్ఆన్‌ను రచించ గలిగినప్పుడు గొప్ప గొప్ప కవిపుంగవులు, సాహిత్యవేత్తలు ఉన్న మీ పెద్ద సమూహం ఇలాంటి ఒక కృతిని రూపొందించటంలో కష్టమేముంటుంది? మీరు సునాయాసంగా ఈ సవాలును స్వీకరించి ఆ వ్యక్తికి దీటైన జవాబు ఇవ్వగలరు కదా! తమ వాక్చాతుర్యంపై, తమ భాష, నుడికారపు సొంపులపై గర్వపడుతూ, అరబ్బేతరులను 'అజమీలు' (మూగవారు) గా ఎద్దేవా చేసే అరబ్బులకు ఈ సవాలు విసరబడింది. కాని ఖుర్ఆన్ ఈ సవాలు చేసినపుడు యావత్తు అరేబియా అవాక్కయిపోయింది. మూగవోయింది. ఖురాన్ గ్రంథాన్ని మానవ రచనగా నిరూపించాలని వారు ఎంతగా ఉవ్విళ్ళూరారో వేరుగా చెప్పనవసరం లేదు. ఆ కోరికను నెరవేర్చుకునేందుకు వారికి ఏ అవకాశం దొరికినా కళ్లకద్దుకుని తమ లక్ష్యంలో కృతకృత్యులయ్యేవారే – వారి అధికారం చేజారిపోయింది. యుద్ధ ఖైదీలుగా పట్టుబడి పరాభవానికి గురయ్యారు. కాబా గృహం నుండి తమ పూర్వీకుల ఆరాధ్య దైవాలను వేరొకచోటికి తరలించే 'చెడ్డరోజు'ను చూడాల్సిన పరిస్థితి వచ్చింది. నెత్తుటి మడుగుల్లో ముద్దగా మారవలసి వచ్చింది. అయితే ఈ ఘోర పరిణామాల నుండి రక్షించుకోవడానికి వారి ముందు ఒకే ఒక్క సులభ ప్రతిపాదన ఉంచబడింది. కాని వారు దానిని స్వీకరించలేదు. పదే పదే వారికి ఒక సవాలు చేయబడింది. మక్కాలోనే కాదు, మదీనాలో కూడా వారికి ఈ సవాలు చేయబడింది. కాని వారు దానిని

స్వీకరించలేకపోయారు. స్వీకరించే శక్తి ఉండి కూడా వారలా చేయలేదంటే మనిషి బుద్ధి వివేకాలు దీనిని నమ్ముతాయా?

ఈ ఛాలెంజే నేటికీ ఉంది. ప్రపంచంలోని ఇతర దైవ గ్రంథాల మాదిరిగా దివ్య కురాన్ భాష నిర్జీవం కాలేదు. పైగా అది కొత్త పాత ఉరవడులతో సుసంపన్నమై సజీవంగా ఉంది. ఆ భాష మాట్లాడే వారిలో ప్రఖ్యాత సాహితీపరులు, విద్వాంసులు ఉన్నారు. వారిలో కరడుగట్టిన ఇస్లాం విరోధులు కూడా లేకపోలేదు. వారు గనక తలచుకుంటే ఈ సవాలును స్వీకరించగలరు. కాని 14 శతాబ్దాల మౌనం పెదవి విప్పి పలికించలేకపోతోంది.

ఇక్కడ గుర్తుంచుకోవలసిన ఒక విషయం ఏమిటంటే, ప్రపంచంలోని వివిధ మూలలలో ముస్లింలు వ్యాపించడం వల్లనూ, వారితో పాటే లక్షలాది కోట్లాది కుర్‌ఆన్ ప్రతులు ఆయా ప్రదేశాలకు చేరటం వల్లనూ ఈ 'ఛాలెంజీ' హిజ్రీ మొదటి శకం నుండే ప్రాచుర్యంలోనికి వచ్చింది. ఒకవేళ ఈ ఛాలెంజ్ గనక ఎప్పుడయినా, ఎక్కడయినా స్వీకరించబడివుంటే సహజంగానే అది ప్రసిద్ధిచెంది ఉండేది. ఎందుకంటే ఇస్లాం వ్యతిరేకులకు, కురాన్ వ్యతిరేకులకు అది 'తిరుగులేని విజయం' గనక! దానిని వారు తమ కొరకు గొప్ప ఆయుధంగా చేసుకుని ఉండేవారు. వారు ఈ వార్తను అత్యుత్సాహంతో – ప్రపంచమంతటా – వ్యాపింపజేసి ఉండేవారు. తత్ఫలితంగా ముస్లిమేతరులు కుర్‌ఆన్‌కు వ్యతిరేకంగా 'స్పష్టమయిన ప్రమాణం' పొంది ఉండేవారు. అంతేకాదు, దీని పర్యవసానంగా ముస్లిం సముదాయంలో కూడా ధర్మభ్రష్టత (ఇర్తిదాద్) మహమ్మారి విజృంభించి ఉండేది. అయితే చరిత్రలో ఇటువంటి సంఘటనకు చోటు లభించలేదన్న వాస్తవాన్ని ముస్లిములు, ముస్లిమేతరులు కూడా ఒప్పుకుంటారు.

## పదకొండవ సాక్ష్యాధారం

దివ్య కుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి ఆఖరి సాక్ష్యాధారం దానిని కళ్లారా చూసిన వాని సాక్ష్యమే. ఈ కుర్‌ఆన్‌ను సమర్పించిన వారు మహనీయ ముహమ్మద్ (స). ఆయన దీనిని తన తరఫు నుండి కాకుండా అల్లాహ్ తరఫు నుండి సమర్పించారు. నేను మీకు వినిపించే ఈ వాక్కు నాపైన సకల లోకాల ప్రభువైన అల్లాహ్ తరఫున అవతరించినది. ఆయన తన దూతలలో అగ్రుడైన దూత (జిబ్రీలె అమీన్)ను నా దగ్గరకు పంపిస్తాడు. ఆ దూత నాకు ఈ వాక్కును వినిపిస్తాడని ముహమ్మద్ (స) చెప్పారు. ఒకట్రొండుసార్లు కాదు, ఎన్నోసార్లు చెప్పారు. ఆయన (స) చెప్పిన ఈ మాట ఎలా నమ్మశక్యం అన్న ప్రశ్న ఈ సందర్భంగా జనించవచ్చు. దీనికి సమాధానం ఏమిటంటే, ముహమ్మద్ (స) సచ్ఛీలత, సత్యసంధత మక్కా వారి మధ్య సదా

నిర్వివాదాంశంగా ఉండేది. తమ వారనే కాదు, పరాయి వారు కూడా ఈ విషయాన్ని ధ్రువపరుస్తారు. ఆయనకు వ్యతిరేకంగా అరబ్బులు అనరాని మాటలన్నీ అన్నారు. తాము చేయగలిగిందంతా చేసేశారు. కాని ఆయన ఒక సత్యసంధుడు, నిజాయితీపరుడనే విషయాన్ని మాత్రం ఎన్నడూ నిరాకరించలేదు. ముహమ్మద్ (స) దైవప్రవక్తగా ప్రకటించక పూర్వం సామాన్య జనులు, పుర ప్రముఖులు కూడా ఆయనకు 'సాదిక్', 'అమీన్' అనే బిరుదులు ఇచ్చారు. దైవదౌత్యాన్ని ప్రకటించిన మీదట వారు ప్రత్యేకంగా ప్రవక్త (స) వారి ఈ ఒక్క విషయాన్ని ధ్రువపరచలేదు గాని, ఇతరత్రా వ్యవహారాలన్నింటిలోనూ ఆయన (స) నిజాయితీ తత్పరతను వారు ఏనాడూ కాదనలేదు. అబూ సుఫ్యాన్ లాంటి బద్ధవిరోధి సయితం రోము చక్రవర్తి తన దర్బారులో తనను – "దైవప్రవక్తగా ప్రకటించుకోకపూర్వం ఆ వ్యక్తిపై మీ వాళ్ళు ఎప్పుడయినా అసత్య ఆరోపణ మోపి ఉన్నారా?" అని నిలదీసి అడిగినప్పుడు – బద్ధ విరోధం ఉన్నప్పటికీ – 'అవును' అని చెప్పే ఆస్కారం అబూ సుఫ్యాన్ వద్ద లేకపోయింది. "పోనీ ఆ వ్యక్తి వాగ్దాన భంగానికి పాల్పడతాడా?" అని రోము చక్రవర్తి ఆరా తీసినపుడు, 'లేదు' అని సమాధానమివ్వటం తప్ప మరో మార్గాంతరం లేకపోయింది. ఈ సందర్భంగా అబూ సుఫ్యాన్ ఇలా అన్నాడు : 'ఇప్పటివరకైతే ఆయన అలా చేయలేదు. అయితే ఇప్పుడు అతనికి – మాకూ మధ్య ఒక ఒడంబడిక (హుదైబియా ఒప్పందం) జరిగి ఉంది. దీని విషయంలో ఆయన వైఖరి ఎలా ఉంటుందనేది వేచిచూడాలి.' (బుఖారీ)

అలాగే ఇస్లాం బద్ధశత్రువులలో అగ్రగణ్యుడైన అబూ జహల్ ఒకసారి దైవప్రవక్త (సఅసం)తో సంభాషిస్తూ "మీరు అబద్ధీకులని మేమనటం లేదు. కాకపోతే మీరు మాకు వినిపిస్తున్న విషయాలను మాత్రం అబద్ధమనే అనుకుంటున్నాము" (హాకిమ్) అన్నాడు. బద్ర్ యుద్ధ సందర్భంగా అబూ జహల్ స్నేహితుడు అఖ్నస్ బిన్ షురైఖ్ ఏకాంతంలో, "నిజం చెప్పు. నీవు ముహమ్మద్‌ను సత్యవంతునిగా భావిస్తున్నావా? అసత్యవాదిగా తలపోస్తున్నావా?" అని అడిగినప్పుడు, "దైవం సాక్షి! ముహమ్మద్ (స) ఒక సత్యవంతుడు. జీవితంలో ఎన్నడూ అబద్ధం చెప్పడం ఎరుగడు" (ఇబ్నె జరీర్) అన్నాడు. ఈ యదార్థాలను ముందుంచుకుని, కురాన్ దైవగ్రంథం అని ముహమ్మద్ (స) ఇచ్చిన సాక్ష్యాన్ని సత్యంగా అంగీకరించటం అవసరమా? కాదా? అన్నది మీరే నిర్ణయించండి. జన్మతః సచ్ఛీలునిగా, సత్యసంధునిగా ఉన్న ఒక వ్యక్తి, జీవితంలో ఎన్నడూ, ఎవరితో కూడా ఒక చిన్న అబద్ధం కూడా చెప్పని వ్యక్తి, దేవుని పేరు మీద ఉన్నట్టుండి ఇంతపెద్ద అబద్ధం చెప్పగలడా? అంతా వినేవాడు, అన్నీ ఎరిగినవాడు అయిన దేవుని పేరు మీద, ఇహపరలోకాల తిరుగులేని అధినేత అయిన దైవం పేరుమీద ఒకసారి, రెండుసార్లు కాదు, నిరంతరం 23 సంవత్సరాలపాటు

'అబద్ధం' చెప్పగలడా? తనకు ప్రాణ శత్రువులుగా ఉన్నవారిపై కూడా అబద్ధాన్ని కల్పించటం ఎరుగని వ్యక్తి సాక్షాత్తూ దేవునికే అసత్యాన్ని ఆపాదించగలడా? మానవ వ్యవహారంలో ఒక్కసారి కూడా అబద్ధం చెప్పనివాడు, దేవుని వ్యవహారంలో అసత్యం పలుకుతాడా!? మనశ్శాస్త్ర అధ్యయనంగానీ, అనుభవాల సాక్ష్యంగానీ, బుద్ధివివేకాల విశ్లేషణగానీ – ఏదయినా సరే, ఈ విచిత్ర విషయాన్ని సమర్థిస్తాయా? లేదు. ముమ్మాటికీ అలా జరగనేరదు. అందుకే దివ్య కుర్ఆన్ దైవగ్రంథమని మహనీయ ముహమ్మద్ (స) ఇచ్చిన సాక్ష్యం తిరుగులేనిది. ఈ సాక్ష్యం తరువాత సుజనుడయిన ఏ మనిషికీ మరో సాక్ష్యాధారం అవసరమే లేదు.

దివ్య కురాన్ దైవప్రోక్తమని చెప్పే పలు సాక్ష్యాధారాలు మీ ముందుకు వచ్చాయి. ఈ రుజువులను అధ్యయనం చేసిన తరువాత అవగతమయ్యేదేమిటంటే, ఏదయినా ఒక గ్రంథం దైవ గ్రంథం అవడానికి కావలసిన ప్రామాణిక ఆధారాలన్నీ వీటిలో వచ్చేశాయి. సకారాత్మక, నకారాత్మక కోణాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చేశాయి. ఈ ఆధారాలన్నింటినీ సింహావలోకనం చేసిన తరువాత న్యాయం, సత్యం కోరే తీర్పేమిటో కూడా సుస్పష్టమే – కురాన్ కూడా సృష్టికర్త, పాలకుడు అయిన అల్లాహ్ తరఫున మానవాళి మార్గదర్శకత్వం కొరకు ప్రసాదించబడిన మహదనుగ్రహమే. అది దైవవాక్కు కావటంలో లేశమయినా సందేహానికి తావులేదు.

## కుర్ఆన్‌కి - ఇతర దైవ గ్రంథాలకి మధ్య గల సంబంధం

దైవమార్గదర్శకత్వం గురించి మానవుని బుద్ధే చెప్పేస్తుంది – అది మానవునికి అన్నిటికన్నా ముఖ్యమయిన అవసరమని! అది అందటం అనివార్యం. అది వివిధ కాలాల్లో మానవతకు అందుతూ ఉండేదని చరిత్ర కూడా సాక్ష్యమిస్తోంది. అయితే ఇప్పుడీ ముఖ్యమయిన అంశంపై జనించే అనేక మౌలిక ప్రశ్నలకు సమాధానం లభించటం చాలా అవసరం. ఉదాహరణకు : అసలీ పరంపర ఎలా మొదలయింది? ఎలా కొనసాగింది? అది నిరాఘాటంగా కొనసాగవలసిన అవసరం ఎందుకు ఏర్పడింది? అది సదా ఒకేవిధంగా ఉండేదా? లేదా దాని తరహా మారుతూ ఉండేదా? ఇప్పటి వరకూ వచ్చిన మార్గదర్శక ఉపదేశాలేవి? – ఈ ప్రశ్నలకు సంతృప్తికరమయిన సమాధానం వేరెవరి ద్వారానో కాకుండా కేవలం అల్లాహ్ తరఫు నుండే లభించగలదు. దానికి క్రియాత్మక రూపం ఏమిటంటే మనం ఆయన అవతరింపజేసిన గ్రంథాల వైపునకు మరలాలి. ఈ ఉద్దేశం కొరకు మనం కురాన్ అధ్యయనం చేస్తాము. అది దైవగ్రంథం అనడానికి అవసరమయిన అన్ని రకాల సహేతుకమయిన ఆధారాలను గురించి మనం చదివాము, విన్నాము. వాటన్నింటి

సారాంశం యిది :

ఆది మానవుడు ఈ పుడమిపై కాలిడిన నాటి నుండే ఈ ప్రపంచంలో దేవుని మార్గదర్శకత్వం అవతరించటం మొదలయింది. ఇంతకీ ఆ మార్గదర్శకత్వం ఏమిటంటే, విశ్వప్రభువు మానవులైన మిమ్మల్ని ఈ ప్రపంచంలో తన ఖలీఫాగా, ప్రతినిధిగా చేసి ప్రభవింపజేశాడు. కాబట్టి మీరు మీ ఆచరణలో, ఈ ప్రపంచాన్ని ఉపయోగించు కోవటంలో స్వేచ్ఛాజీవులు. మీరు కోరుకున్న వైఖరిని మీరు అవలంబించగలరు గాని మీ సృష్టికర్త అభిమతానికి, ఆయన సూచించిన విధానానికి అనుగుణమయిన వైఖరి మాత్రమే 'సరైనది' అన్న విషయం ఈ సందర్భంగా మరువకూడదు. అంటే మీకిక్కడ స్వేచ్ఛ ఉన్న విషయం నిజమేగాని మితిమీరిన స్వేచ్ఛ లేదు. అలాగే మిమ్మల్ని మీరు దేవుని దాసునిగా తప్ప వేరొకరి దాసునిగా ఊహించరాదు. ఒకవైపున మిమ్మల్ని మీరు కేవలం ఒక దాసునిగా నమ్ముతూ, మరో వైపున అల్లాహ్‌ను మాత్రమే మీ పాలకునిగా, ఆరాధ్య దైవంగా విశ్వసించాలి. ఆయన తప్ప వేరొకరి విధేయతకు తలొగ్గరాదు. ఆయన తప్ప వేరొకరిని మీ ఆరాధనలకు, ప్రసన్నతకు హక్కుదారులుగా భావించరాదు. ఆయన హక్కులను మీరు అంగీకరించటం అంటే అర్థం; మిమ్మల్ని మీరు ఆయన ఇష్టాయిష్టాలకు అప్పగించుకోవాలి. జీవన విధానానికి సంబంధించి ఆయన మీకిచ్చిన ఆదేశాలకు కట్టుబడి ఉంటూ, ఆయనకు సమ్మతమయిన విధానాన్నే అవలంబించాలి. ఈ ప్రపంచం వాస్తవానికి ఒక పరీక్షాలయం. మీకిక్కడ ఒకింత 'స్వేచ్ఛ' ఇవ్వటంలోని ఉద్దేశం; ఈ స్వేచ్ఛను మీరు ఆయన అభీష్టానికి అనుగుణంగా వినియోగిస్తారా? లేదా? ఆయన విధేయతకు కట్టుబడి ఉండటానికి ఉపయోగిస్తారా? లేదా? అని పరీక్షించటమే. మీరు ఏదో ఒకనాడు ఈ జీవితాన్ని చాలించి 'మరో ప్రపంచం'లో ప్రవేశించవలసి ఉంది. అక్కడ ఆయన మీ ప్రాపంచిక వైఖరిని, ఆచరణలను పరిశీలించి తాను పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారెవరో, పరీక్ష తప్పిన వారెవరో నిర్ణయిస్తాడు. ఈ ప్రాపంచిక జీవితంలో సరైన, సవ్యమయిన వైఖరిని అవలంబించిన వ్యక్తికి 'మరో ప్రపంచం'లో కూడా సుఖసౌఖ్యాలు లభిస్తాయి. నెమ్మది భాగ్యం ప్రాప్తమవుతుంది. అక్కడ కూడా అతనికి నెమ్మది నెలవు లభిస్తుంది. అతని ఆనందం నిలుస్తుంది. అనురాగం పండుతుంది. దానిపేరే స్వర్గం. కాని ఈ వైఖరిని అవలంబించటంలో విఫలమయిన వ్యక్తికి ఈ ప్రపంచంలో నెమ్మది లభించదు. అతని జీవితమంతా అశాంతి అలజడులతో, చికాకుతో, ఒడుదుడుకులతో నిండి ఉంటుంది. 'అక్కడ'కు చేరుకున్నప్పుడు అతనిని శాశ్వతంగా దుఃఖావేదనలతో, మానసిక వ్యధతో కూడిన భయంకరమయిన 'గుండం'లో పడవేయటం జరుగుతుంది. దాని పేరే నరకం.

ఈ మార్గదర్శక నియమావళితోనే మనిషి తన జీవితాన్ని ప్రారంభించాడు. కాని ఒక సుదీర్ఘ కాలం గడిచాక ఈ 'మార్గదర్శకత్వం' పట్ల నిర్లక్ష్యం వహించే ధోరణులు పెచ్చరిల్లాయి. ఈ ధోరణి పరాకాష్ఠకు చేరుకున్నప్పుడు మానవత దైవమార్గదర్శకత్వాన్ని దాదాపు మరచిపోయి, పెడత్రోవపట్టింది. సహజంగానే దేవుని కారుణ్య కడలి ఉప్పొంగింది. ఈ మార్గవిహీన పోకడలను చక్కదిద్దడానికి, ఆరిపోయిన ఈ 'సన్మార్గజ్యోతి'ని మళ్ళీ వెలిగించే ఏర్పాటు చేశాడు ఆ కారుణ్య ప్రభువు. కారుచీకట్లలో దారీతెన్నూ కానరాక తచ్చాడుతున్న మానవతను కాంతిరేఖల్లోకి తీసుకురావడానికి, భూమండలంలోని ఖండ ఖండాలలో విస్తరించివున్న ఆదం సంతతిని – కుడి ఎడమల అపమార్గాల నుండి తీసి – రాచబాటపై నడిపించటానికి దేవుడు అవసరాల కనుగుణంగా అన్ని ప్రాంతాల వారికోసం 'మార్గదర్శక నిబంధన'లను పంపించాడు. కాని ప్రతి మార్గదర్శక నియమావళి పట్ల గతంలో జరిగినదే జరిగింది. వాటిని అవలంబించే జనులు వాటిని తమ వీపు వెనుక పడవేశారు. ఆ ప్రబోధనలపట్ల అలసత్వం ప్రదర్శించారు. ఆ పాఠాలను మరచిపోయారు. మరికొందరు ఆ ఆజ్ఞలను తమ స్వార్థ ప్రయోజనాల కనుగుణంగా మార్చేశారు. అందుచేత ఈ సన్మార్గ భాగ్యానికి దూరమయి మార్గభ్రష్టత, మార్గవిహీనతల ఆఖరి అంచులకు చేరుకున్న తన దాసులను మళ్ళీ రుజుమార్గంపైకి తీసుకురావటానికి మరోసారి – మళ్ళీ మళ్ళీ – మార్గదర్శకత్వపు ఏర్పాటు చేయాల్సివచ్చింది. ఈ పరంపర తరం తరం – నిరంతరం – ముందుకు సాగింది. ఎట్టకేలకు కుర్‌ఆన్ 'సన్మార్గ నిబంధన' అవతరించింది. అది దైవకారుణ్య పరంపరలో చిట్టచివరి ఘట్టం. మౌలికంగా దేవుని తరఫున పంపబడిన మార్గదర్శక నిబంధనలన్నీ ఒక్కటే. వాటిలో వైవిధ్యం, వ్యత్యాసమనేది ఏదయినా ఉంటే అది తప్పీళ్ళు, పాక్షిక సాపేక్షిక అంశాలకు సంబంధించిన వ్యత్యాసమే. మౌలిక నియమనిబంధనలలో లక్ష్యాలలో ఎలాంటి తేడాపాడాలు లేవు. సూత్రప్రాయంగా అది నిజ ఆరాధ్య దైవం వద్దనుండి వెలువడిన ఒకే సందేశం! ఒకే ఉత్తర్వు! అది ఆయా కాలాల ప్రజలకు సందర్భోచితంగా అందుతూ ఉండేది.

దైవమార్గదర్శకత్వానికి సంబంధించి ఈ వివరణలు ముందుకు వచ్చేసిన తరువాత ఒక గొప్ప వాస్తవం మన ముందుకు వస్తుంది అదేమిటంటే; దేవుని తరఫున ఈ ప్రపంచంలో వచ్చిన మార్గదర్శక గ్రంథాలలో ఏ ఒక్కటి కూడా మరో దానికి ప్రతిద్వందిగా ఉండలేదు. దివ్య కుర్‌ఆన్ కూడా వాటిలో ఒకటి కాబట్టి దాని తరహా లేక స్థాయి కూడా భిన్నమైనది కాదు. నిశ్చయంగా అది కూడా ఇతర దైవిక

గ్రంథాల కోవకు చెందినదే. వాటితో సమన్వయం చెందేదే. అది ఇతర దైవగ్రంథాలకు పోటీగా రాలేదు, వాటిని ధ్రువపరచేదిగానే వచ్చింది. ఇతర దైవ గ్రంథాలలో ఉన్న మౌలిక విషయాలే కుర్‌ఆన్‌లోనూ ఉన్నాయి. కాబట్టి ఇతర దైవగ్రంథాలతో దాని సంబంధం సామరస్యపూర్వకమైనదే గాని విభేదంతో కూడుకున్నది కాదు. పోటీ అంతకన్నా కాదు. అందుకే అది ఈ యదార్థాన్ని పూర్తిగా విపులీకరించింది కూడా. ఉదాహరణకు అది ఇలా అంటుంది –

شَرَعَ لَكُمْ مِّنَ الدِّيْنِ مَا وَصّٰى بِهٖ نُوْحًا وَّالَّذِيْٓ اَوْحَيْنَآ اِلَيْكَ وَمَا وَصَّيْنَا بِهٖٓ اِبْرٰهِيْمَ وَمُوْسٰى وَعِيْسٰٓى اَنْ اَقِيْمُوا الدِّيْنَ وَلَا تَتَفَرَّقُوْا فِيْهِ ط (شورىٰ:١٣)

"ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు. దానినే (ఓ ముహమ్మద్! – స) ఇప్పుడు నీ వైపునకు మేము 'వహీ' ద్వారా పంపాము, దానినే మేము ఇబ్రాహీమ్‌కు, మూసాకు, ఈసాకు బోధించాము; ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దాని గురించి విభేదాలకు లోను కాకండి అనీ తాకీదు చేస్తూ."

*(అష్ షూరా : 13)*

అది ఈ గొప్ప యదార్థాన్ని కేవలం తన సాధారణ సంబోధితులకు జ్ఞాపకం చేయటంతో సరిపుచ్చుకోకుండా, తనను తీసుకువచ్చిన సందేశహరుని (స) కి సయితం ఈ విషయం గురించి నొక్కి వక్కాణించింది. వెనుకటి ప్రవక్తలనేకమంది గురించి ప్రస్తావించిన మీదట ఈ విధంగా ఉపదేశించింది :

أُولٰٓئِكَ الَّذِيْنَ هَدَى اللّٰهُ فَبِهُدٰىهُمُ اقْتَدِهْ ط (الانعام:٩٠)

"ప్రవక్తా! వారే అల్లాహ్ తరఫు నుండి మార్గదర్శకత్వం పొందినవారు. వారి మార్గాన్నే నీవు (కూడా) అనుసరించు."

*(అల్ అన్ ఆమ్ : 90)*

అసలు విషయం ఏమిటంటే, దివ్య కుర్‌ఆన్ తన మార్గదర్శకత్వాన్ని వెనుకటి మార్గదర్శకత్వాల, వెనుకటి దైవగ్రంథాల నూతన ఎడిషన్‌గా ఖరారు చేసింది. ఇది ముమ్మాటికీ నిజం. నాకూ – వాటికీ మధ్య ఎలాంటి వేర్పాటు లేదని అది చెప్పింది. కాకపోతే నేడు ప్రపంచంలో దైవగ్రంథాలుగా చెప్పబడుతున్న వాటిలో గల మౌలిక

ఉపదేశాలు – కుర్‌ఆన్ ఉపదేశాలకు చాలా భిన్నంగా ఉన్నాయన్నది వేరే విషయం. అందలి అంశాలను గురించి చదివినప్పుడు అసలివి దైవగ్రంథాలే కావు. ఒకవేళ దైవగ్రంథాలే అయివుంటే వాటి ప్రబోధనలు ఆ గ్రంథావలంబీకుల అలసత్వానికి, నిర్లక్ష్యానికి, ప్రక్షిప్తాలకు ఆహుతి అయి ఉంటాయి. అన్యధా అల్లాహ్ తరఫున అవతరించిన సన్మార్గ సంవిధానం కుర్‌ఆన్ మౌలిక ఆశయాలతో సమరసం చెందకుండా ఉండటమేమిటి? అన్న సంశయం కలుగుతుంది.

## కుర్‌ఆన్ వైశిష్ట్యం

కాని ఇంత జరిగినా సరే, కుర్‌ఆన్ ఇతర మార్గదర్శక గ్రంథాలకు ప్రత్యర్థిగానీ, శత్రువుగానీ కాదు. పైగా అది వాటితో మైత్రీబంధం కలిగి ఉంది. ఆ పాత గ్రంథాలలో ఉన్న మౌలిక ఉపదేశాలే కుర్‌ఆన్‌లోనూ ఉన్నాయి. అది వాటికి ప్రతిగా కొన్ని విశిష్ఠ చిహ్నాలను కలిగి ఉంది. ఈ కారణంగా కూడా అది ఇతర మార్గదర్శక గ్రంథాలకన్నా ప్రత్యేకతను సంతరించుకుంది. ఆ ప్రత్యేకతలను గురించి స్వయంగా అదీ చెప్పుకుంది. దానిని తీసుకువచ్చిన ప్రవక్త కూడా చెప్పుకున్నాడు. అదేమంటే;

(1) ఈ కురాన్ అవతరణ ఏదో ఒక ప్రత్యేక జాతి కొరకో, లేదా ప్రత్యేక ప్రాంతం కొరకో జరగలేదు. అది సమస్త జగతి కొరకు అవతరించింది. సమస్త మానవాళిని అది సంబోధించింది. అది ఇలా అంటోంది –

تَبٰرَكَ الَّذِيْ نَزَّلَ الْفُرْقَانَ عَلٰى عَبْدِهٖ لِيَكُوْنَ لِلْعٰلَمِيْنَ نَذِيْرًا ۝١ (الفرقان:١)

"ఎనలేని శుభాలవాడు ఈ గీటురాయిని తన దాసునిపై అవతరింపజేశాడు – అది సకల విశ్వవాసులకు హెచ్చరిక చేసేదిగా ఉండేటందుకు."

*(అల్ ఫుర్ఖాన్ : 1)*

అలాగే అది పదే పదే ఈ విధంగా చెప్పింది – అల్లాహ్ తనను తీసుకువచ్చిన ప్రవక్త (ముహమ్మద్ – స)ను సమస్త మానవుల కోసం ప్రవక్తగా చేసి పంపాడని (సబా: 28). ఆరాఫ్ సూరాలోని 158వ వచనం ద్వారా కూడా ఈ విషయం నొక్కి వక్కాణించబడింది.

ఈ 'స్థానం' (ప్రత్యేకత) ఇంతకుముందు వచ్చిన ఏ గ్రంథానికీ ప్రాప్తం కాలేదు. "నాకు పూర్వం వచ్చిన ప్రతి ప్రవక్తా ప్రత్యేకంగా తన జాతి వారి కోసమే ప్రవక్తగా చేసి పంపబడ్డారు" (బుఖారీ) అని మహనీయ ముహమ్మద్ (స) స్వయంగా వివరిం

చారు. వేరే మాటల్లో చెప్పాలంటే కుర్‌ఆన్‌కు పూర్వం ఉన్న ప్రతి దైవగ్రంథం కేవలం ఒకానొక ప్రత్యేక వర్గం వారి కొరకే అవతరించబడింది.

(2) దివ్య కుర్‌ఆన్ అన్ని విధాలా ఒక సంపూర్ణ మార్గదర్శక సంవిధానం. అదొక జీవన విధానం! ఓ శాసనాంగం! ఓ సైద్ధాంతిక క్రియాత్మక వ్యవస్థ! అందులో మానవుని ఆర్థిక, ఆచరణాత్మక, వ్యక్తిగత, సామూహిక, జాతీయ అంతర్జాతీయ, అంతర్బాహ్యాల – జీవితపు ఒక్కొక్క విభాగానికి సంబంధించిన నిర్దేశిక నియమాలు న్నాయి. ఈ విశిష్టత మరే ఇతర గ్రంథానికీ లభ్యం కాలేదు. అందుకే విశ్వప్రభువు తన పూర్వగ్రంథాలలో ఏ ఒక్కదానినీ – ఏ రకంగా కూడా – పరిపూర్ణమైనదిగా ఖరారు చేయలేదు. ఒక్క దివ్య కురాన్ అవతరణపైనే ఆయన ఈ విధంగా ప్రకటించాడు:

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ نِعْمَتِيْ ---(المائده:٣)

"ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్ర హాన్ని పూర్తి చేశాను."

*(అల్ మాయిద – 3)*

ఈ సూక్తిలోని పరమార్థం సుబోధకమే. మానవాళి కోసం ఆది నుండీ కొనసాగుతూ వస్తున్న ఈ మార్గదర్శక పరంపర తన మౌలిక ఉపదేశాల రీత్యా సదా ఒక్కటే అయినప్పటికీ (తప్సీళ్ళ విషయంలో మాత్రం) అవసరం మేరకు స్వల్ప మార్పులుండేవి. సంస్కృతీ నాగరికతలతో పాటు ఇది కూడా క్రమ వికాసమొందుతూ వచ్చింది – ఇప్పుడది అన్ని కోణాల నుండి పరిపూర్ణతను సంతరించుకుంది.

(3) కుర్‌ఆన్ ప్రబోధనల స్వభావం విశ్వజనీనమయింది. మానవాళిని ఉద్దేశిం చినది. దానిపై ఏదో ఒక ప్రత్యేక కాలపు, ప్రత్యేక అవసరాల ప్రభావంగానీ, లేదా ఏదో ఒక ప్రత్యేక జాతి ప్రత్యేక పరిస్థితుల ముద్రగానీ లేదు. అది ఏదో ఒక జాతినో లేక వర్గాన్నో దృష్టిలో పెట్టుకోకుండా కేవలం 'మానవుణ్ణి' దృష్టిలో ఉంచుకుంటుంది. మానవ నైజాన్ని ముందుపెట్టుకుంటుంది. అందుకే అది అన్ని కాలాల, అన్ని జాతుల, అన్ని వంశాల, అన్ని ప్రాంతాల ప్రజలతో సులభంగా సమరసం చెందుతుంది. కాగా; ఇతర గ్రంథాల పరిస్థితి తద్భిన్నం. వాటిపై ఏదో ఒక ప్రత్యేక జాతి జనుల అవసరాలు, స్థితిగతుల ఛాయ పడుతున్నట్లు ప్రతి ఒక్కరూ కానగలుగుతారు. అందుకే ఆ గ్రంథాలు ఆయా జాతుల వారిని మినహాయిస్తే ఇతరులతో సమన్వయం చెందవు. వారి ధార్మిక అవసరాలను తీర్చలేవు.

దివ్య కుర్‌ఆన్‌లోని ఈ గుణమే విశిష్ఠమైనది. దీని ఆధారంగానే తాను తీసుకువచ్చిన ధర్మాన్ని (దీన్‌ను) అది 'ప్రకృతి ధర్మం' అని చెప్పింది. فِطْرَتَ اللّٰهِ الَّتِیْ فَطَرَ النَّاسَ عَلَیْهَا (روم، ۳۰) (అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి) (అర్ రూమ్ : 30) లోకవాసుల ముందు అది నిర్దిష్టంగా ఇలా ప్రకటించింది :

اِنَّ هٰذَا الْقُرْاٰنَ یَهْدِیْ لِلَّتِیْ هِیَ اَقْوَمُ
(بنی اسرائیل:۹)

"యదార్థం ఏమిటంటే ఈ కుర్‌ఆన్ సరియైన, సవ్యమైన మార్గాన్ని చూపుతోంది." *(బనీ ఇస్రాయీల్ – 9)*

(4) ఇది దేవుని అంతిమ గ్రంథం. దీని తరువాత మార్గదర్శక అవతరణా పరంపర పరిసమాప్తం అయిపోయింది. ఇకమీదట మరే గ్రంథంగానీ, మరే ప్రవక్తగానీ పంపబడటం జరగదు. అందుకే కుర్‌ఆన్ గ్రంథాన్ని తీసుకువచ్చిన ప్రవక్త (స) ఈ సందర్భంగా ఇలా స్పష్టం చేశారు :

اِنَّ الرِّسَالَةَ وَالنُّبُوَّةَ قَدِ انْقَطَعَتْ فَلَا رَسُوْلَ بَعْدِیْ وَلَا نَبِیَّ:
(ترمذی، باب ذهاب النبوة)

"దైవదౌత్యం, ప్రవక్తల పరంపర పరిసమాప్తం అయ్యాయన్న విషయంలో సందేహానికి ఆస్కారమే లేదు. నా తదనంతరం మరే సందేశహరుడుగానీ, ప్రవక్తగానీ రాబోరు." *(తిర్మిజీ, బాబు జహాబున్నబువ్వతి)*

కాగా; స్వయంగా కురాన్ తనను తీసుకువచ్చిన వాని గురించి అల్లాహ్ తీర్పు ఏమిటో ప్రకటించింది :

وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِیّٖنَ ط
(الاحزاب:۴۰)

"కాని ఆయన (ముహమ్మద్ –స) అల్లాహ్ ప్రవక్త. దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు." *(అల్ అహ్‌జాబ్ : 40)*

కుర్‌ఆన్ గురించి, కుర్‌ఆన్‌ను లోకానికి పరిచయం చేసిన మహనీయుని గురించి తప్ప మరే గ్రంథం గురించిగానీ, మరే ప్రవక్త గురించి గానీ ఈ విధమయిన డిక్లరేషన్ జరగలేదు.

(5) ఈ దైవగ్రంథం వెనుకటి దైవిక గ్రంథాలన్నింటినీ రద్దుపరచింది. ఈ గ్రంథం తరువాత దైవసన్నిధిలో మరే యితర గ్రంథం కూడా ఆమోదయోగ్యం

కాదు. ఇక ఇప్పుడు జీవితపు సరియైన వైఖరి, సాఫల్య విధానం కేవలం ఈ గ్రంథం ద్వారానే ప్రాప్తమవుతుంది. అంతమాత్రాన ఇతర ఆకాశ గ్రంథాలన్నింటినీ, అవి దైవగ్రంథాలు కావని త్రోసిపుచ్చటం దీని భావం ఎంతమాత్రం కాదు. ఏ నిజప్రభువు, విశ్వేశ్వరుడు ఈ గ్రంథాలను అవతరింపజేశాడో స్వయంగా ఆయన తీర్పు ఇది; ఆ గ్రంథాలను ఇక మీదట జీవన సంవిధానంగా చేసుకోరాదని, కేవలం తన అంతిమ గ్రంథమయిన కుర్‌ఆన్‌కు మాత్రమే ఈ 'స్థాయి' ఉందని ప్రకటించాడు. దేవుని ఈ తీర్పు దృష్ట్యా అరబ్బులు – అరబ్బేతరులు, నల్లవారు–తెల్లవారు, ప్రాచ్యులు–పాశ్చాత్యులు అందరూ కుర్‌ఆన్ గ్రంథాన్ని అనుసరించటం అవశ్యం. ఎందుకంటే ఈ గ్రంథానుసరణే ఇక నుండి 'అల్లాహ్ దాస్యం'గా ఖరారవుతుంది. అల్లాహ్ యొక్క ఈ తీర్పుకు ఈ సూక్తులే ఆధారం.

إِنَّ الدِّينَ عِندَ اللَّهِ الْإِسْلَامُ (آل عمران:١٩)

"నిశ్చయంగా (ఇప్పుడు) అల్లాహ్ దృష్టిలో (సమ్మతమయిన) జీవన విధానం ఇస్లామ్ మాత్రమే."

*(ఆలి ఇమ్రాన్:19)*

وَمَن يَبْتَغِ غَيْرَ الْإِسْلَامِ دِينًا فَلَن يُقْبَلَ مِنْهُ (آل عمران:٨٥)

"ఎవడయినా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్‌ను) కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే ఆ మార్గం ఎంత మాత్రం ఆమోదించబడదు."

*(ఆలి ఇమ్రాన్ – 85)*

ఈ సూక్తులలో విలోమ, అనులోమ కోణాల నుండి ఏ 'ఇస్లాం ధర్మం' గురించి సూటిగా ప్రకటించటం జరిగిందో అది కురానీ ధర్మానికి ప్రసిద్ధ నామమేనని వేరుగా చెప్పనవసరం లేదు. కాబట్టి ఇస్లాం తప్ప వేరొక జీవన విధానం దైవసన్నిధిలో ఆమోదయోగ్యం కాదని అనటం వాస్తవానికి 'ఇప్పుడు కుర్‌ఆన్ మినహా మరో గ్రంథం అల్లాహ్ సన్నిధిలో స్వీకారయోగ్యంగా మిగల్లేదు' అని చెప్పటమే. యూదులు, క్రైస్తవులలో కుర్‌ఆన్‌ను విశ్వసించని వారిని అది నిష్కర్షగా అవిశ్వాసానికి ఒడిగట్టినవారుగా, అల్లాహ్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసినవారుగా, శిక్షార్హులుగా ప్రకటించటాన్నిబట్టి కూడా ఈ విషయానికి మరింత సమర్థన లభిస్తోంది. (బయ్యినహ్ : 1; నిసా : 150, 151)

(6) మోక్షం, సాఫల్యం కొరకు దివ్య కుర్‌ఆన్‌ను విశ్వసించి, దానిని అనుసరించా

లన్నది షరతు. ఏ వ్యక్తి కూడా దీనిని కాదని పరలోకంలో వినాశం నుండి తప్పించుకోలేడు. వేరొక గ్రంథం దేన్నయినా అనుసరించిన మానవుడు (అతనికి గనక కుర్‌ఆన్ సందేశం అంది ఉండేమాట్లైతే) మోక్షానికి అర్హుడు కాజాలడు. అందుకే రెండవ ఆయత్‌లో وَمَنْ يَبْتَغِ غَيْرَ الْإِسْلَامِ دِينًا فَلَنْ يُقْبَلَ مِنْهُ అన్న ఆయత్ తరువాత వచ్చిన వాక్యంలో దాని పర్యవసానం కూడా తెలియజేయటం జరిగింది –

وَهُوَ فِي الْآخِرَةِ مِنَ الْخَاسِرِينَ ﴿٨٥﴾
(آل عمران:۸۵)

"అతను పరలోకంలో విఫలుడౌతాడు. నష్టపోతాడు." (ఆలి ఇమ్రాన్ – 85)

(7) ప్రస్తుతం ప్రక్షిప్తాల నుండి సురక్షితంగా ఉన్న గ్రంథరాజం ఇదొక్కటే. ఇందులో ఎలాంటి హెచ్చుతగ్గులు లేవు. మార్పు దారి చేసుకోలేదు. ఏ భాషలో, ఏ ఏ పదజాలంతో, ఏ ఏ అంశాలతో, ఏ క్రమంలో అల్లాహ్ తరఫు నుండి అది అవతరించిందో సరిగ్గా అదే స్థితిలో ఉంది. దేవుని ప్రత్యేక ఏర్పాటు మూలంగానే ఇది సాధ్యమయిందనేది ముమ్మాటికీ నిజం. ఆ విషయం గురించి పరమ ప్రభువు స్వయంగా తన గ్రంథంలో ప్రకటించాడు –

إِنَّا نَحْنُ نَزَّلْنَا الذِّكْرَ وَإِنَّا لَهُ لَحَافِظُونَ ○ (حجر)

"నిశ్చయంగా ఈ జ్ఞాపికను (కుర్‌ఆన్‌ను) మేము అవతరింపజేశాము. మేమే స్వయంగా దానిని రక్షిస్తాము." *(అల్ హిజ్ర్ : 9)*

ఇతర దైవిక గ్రంథాల పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. వాటి 'రక్షణ'కు సంబంధించి అల్లాహ్ తన తరఫున ఎలాంటి ప్రకటన చేయలేదు. నేడు చారిత్రక పరిశోధనా గీటురాయిపై అవి సురక్షితంగా ఉన్నట్లు రుజువుకానూ లేదు. కడకు ఆ గ్రంథాలలో దేనినయినా అవలంబించే వ్యక్తులు కూడా దాని భాష, దాని పదజాలం, అందలి అంశం సరిగ్గా అవతరించినప్పటి స్థితిలో – భద్రంగా – ఉన్నాయని గ్యారంటీ ఇవ్వలేరు. దివ్య కుర్‌ఆన్ సయితం ఆ గ్రంథావలంబీకుల గురించి చెబుతూ వారి నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. తౌరాతు, ఇంజీలు గ్రంథాల ప్రక్షిప్తాల గురించి అది ప్రస్తావిస్తూ యూదులు, క్రైస్తవులు వాటిలోని కొన్ని భాగాలను మార్చేశారని నిర్ద్వంద్వంగా ప్రకటించింది (يُحَرِّفُونَ الْكَلِمَ عَنْ مَوَاضِعِهِ ‹مائده›) కొన్ని విషయాలను విస్మరించారని కూడా చెప్పింది (وَنَسُوا حَظًّا مِمَّا ذُكِّرُوا بِهِ - مائده)

దివ్య కురాన్‌లోని ఈ 'ప్రత్యేకత' లోగల మరో ముఖ్య కోణం ఏమిటంటే అది అవతరించిన భాష (అరబీ) ఇప్పటికీ ఒక సజీవ భాషగా వెలుగొందుతోంది. నేడు ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అనేక రాజ్యాలలో నివసించే కోట్లాదిమంది ప్రజలు ఈ భాషను మాట్లాడుతారు. దీనిని అర్థం చేసుకునేవారు కూడా ప్రపంచంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఒకవిధంగా చెప్పాలంటే ఇదొక శాస్త్రీయ భాష! ప్రజల భాష! అంతర్జాతీయ స్థాయి భాష! దీనికి ప్రతిగా ఇతర దైవగ్రంథాలు అవతరించిన భాషలలో ఏ ఒక్కటీ ప్రాచుర్యంలో లేవు. మరోవిధంగా చెప్పాలంటే అవి సజీవంగా లేవు. ఏదయినా ఒక గ్రంథం సురక్షితంగా ఉండాలంటే – అది అవతరించిన భాష ప్రజాబాహుళ్యంలో చెలామణీలో ఉండటం చాలా అవసరం.

(8) దేవుని మౌలిక ఉపదేశం, ఆయన అసలు జీవన ధర్మం (విధానం) సదా ఏమై ఉండేది? ఈ విషయాన్ని నిర్ధారించే హక్కు – బేషరతుగా – కుర్‌ఆన్‌కు మాత్రమే ఉంది. ఎందుకంటే ఇతర దైవగ్రంథమేదీ నేడు ప్రపంచంలో యథారూపంలో లేదు. అందుచేత స్వచ్ఛమయిన, సమ్మిళితం కాకుండా ఉన్న దైవోపదేశం ఎక్కడా లభించదు. కుర్‌ఆన్‌లోని ప్రత్యేకత ఏమిటంటే, ఇతర దైవగ్రంథాల నిజప్రబోధనల ఆచూకీ ఆ గ్రంథ పుటలలో కాకుండా కురాన్ పుటలలోనే లభ్యమవుతుంది. ఇతర గ్రంథాలు ప్రక్షిప్తాలకు లోనవటం మూలంగా అవి కచ్చితమయిన సమాచారం ఇవ్వగలిగే స్థితిలో లేవు. ఈ నేపథ్యంలో కురాన్‌లో ఇలా అనబడింది :

وَاَنْزَلْنَآ اِلَيْكَ الْكِتٰبَ بِالْحَقِّ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ مِنَ الْكِتٰبِ وَمُهَيْمِنًا عَلَيْهِ
..(المائدة:٤٨)

"(ఓ ముహమ్మద్ –స) మేము నీ వైపునకు ఈ గ్రంథాన్ని సత్యంతో పాటే అవతరింపజేశాము. అది తనకు పూర్వం ఉన్న గ్రంథాల (భవిష్యవాణి)తో సమరసం చెందేదిగా, వాటిని పరిరక్షించేదిగా, పర్యవేక్షించేదిగా ఉంది."
*(అల్ మాయిద : 48)*

మూలంలో 'ముహైమిన్' అని వచ్చింది. ముహైమిన్ అంటే రక్షించేది, పర్యవేక్షించేది అని భావం. దివ్య కుర్‌ఆన్ పూర్వం ఉన్న గ్రంథాలను పరిరక్షించేది, వాటిని కనిపెట్టుకుని ఉండేదన్నమాట! అంటే 'అసలు సందేశం' పై కప్పబడిన మిశ్రమాల బొంతలను, ప్రక్షిప్తాల ముసుగులను అది తొలగిస్తుంది. ఆ విధంగా వాటి సిసలయిన ప్రబోధనలేమిటో ఇదమిత్థంగా చెబుతుంది. ఈ దైవోపదేశంలో చెప్పబడిన అసలు విషయం ఏమిటంటే, ఫలానా గ్రంథంలోని మూలాంశం ఏమిటన్నది ఎవరయినా తెలుసుకోదలిస్తే, వారు ఆ గ్రంథ పుటలను తిరగవేసే బదులు సరాసరి

కుర్‌ఆన్‌ను చూడవచ్చు. ఎందుకంటే ఆయా గ్రంథాల నిజమయిన ప్రబోధనలు కూడా ఇందులోనే లభ్యమవుతాయి. వ్యవహారం ఇంతటితో ఆగదు; కుర్‌ఆన్‌ను అనుసరించినప్పుడే ఆ పూర్వ గ్రంథాలను అనుసరించినట్లవుతుంది.

(9) దివ్య కుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి కావలసిన సాక్ష్యాధారాలు క్రియాత్మకంగా అనునిత్యం అనుక్షణం కళకళలాడుతున్నట్లున్నాయి. అది గతంలోని కొన్ని సంఘటనల, ఉల్లేఖనాలపై ఆధారపడాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే కురాన్ దైవగ్రంథమనే దానికి తనకు తానే రుజువుగా ఉన్నది. అది తన అంతర్గత గుణాల రీత్యా, తన బాహ్యాఫలితాల దృష్ట్యా – అన్ని కోణాల నుండి – 'ఒక అద్భుతం'. నిశిత దృష్టికల ప్రతి వ్యక్తికీ గోచరించే అద్భుతం! సత్యప్రేమికుడైన ఏ వ్యక్తిఅయినా తన మనోనేత్రాన్ని తెరచి వీక్షించినపుడు దీని క్రియాత్మక శుభాలు కానరాకుండా ఉండవు. 'దైవం సాక్షి! ఇది మానవ ప్రోక్తం కాదు' అన్న మాట అతని చెవులలో ప్రతిధ్వనించక పోవటం అనేది జరుగదు (వెనుకటి పంక్తులలో జరిగిన చర్చ ద్వారా కూడా ఈ విషయం రూఢీ అయింది).

ఈ నిజ స్వరూపం ద్వారా నిరూపితమయ్యేదేమిటంటే కుర్‌ఆన్ ఎక్కడ ఉన్నా, ఎక్కడ సమర్పించబడినా, ఎక్కడ అది పారాయణం చేయబడినా – అక్కడ దాని వాస్తవిక వైభవం ఉట్టిపడుతూ ఉంటుంది. వేరేమాటల్లో చెప్పాలంటే ఈ ఉద్గ్రంథం ఉనికి, దాని సందేశం సజీవమైనదే కాదు, అది దైవవాక్కు అనడానికి సజీవ సాక్ష్యం కూడా! అది సురక్షితమైనది, శాశ్వతమైనదనడానికి ప్రబల తార్కాణం కూడా!! కాగా; ఇతర దైవగ్రంథాల పరిస్థితి దీనికి భిన్నమైనది. ఎందుకంటే వాటి సత్య నిబద్ధతకు సంబంధించిన సాక్ష్యాధారం స్వయంగా వాటిలోనే లభించదు. గత చరిత్రలో మాత్రమే దాని ఆధారాలు లభ్యమవుతాయి. వాటిని చూడటానికి చాలా దూరం తిరిగి వెళ్ళాల్సి వస్తుంది. 'తౌరాతు' దైవగ్రంథం అని నిరూపితం అవ్వాలంటే, దానిని తీసుకువచ్చిన వ్యక్తి 'చేతికర్ర', 'ప్రకాశమానమయిన చెయ్యి' లాంటి తత్కాల అద్భుతాల ఆవిష్కరణలు ఆధారంగా ఉండాలి. అలా జరిగినప్పుడే ఆ వ్యక్తిని దైవప్రవక్తగా ఒప్పుకోవటం జరిగింది. ఇక ఇంజీలు విషయానికివస్తే; మృతులను బ్రతికించి నిలబెట్టే, కుష్ఠు రోగులను నయం చేసే, గ్రుడ్డివారికి కంటిచూపును ప్రసాదించే రెండువేల సంవత్సరాల క్రితం నాటి సంఘటనలు ఏసుక్రీస్తు (ఈసా–అ)ను దైవ సందేశహరునిగా నిరూపించాలి. అప్పటివరకూ ఇంజీలు సత్యబద్ధమైనదేనా? కాదా? అన్నది చర్చనీయాంశంగానే ఉండిపోతుంది. ఈ గ్రంథాల సత్యబద్ధతకు సంబంధించిన 'నిరూపణ' ఆ మహిమలను కళ్లారా వీక్షించిన అలనాటి జనులకైతే ప్రత్యక్ష సాక్ష్యాధారమే. కాని ఆ తరువాతి కాలం వారికి అది 'పరోక్ష ఆధారం'గానే మిగిలిపోయింది. ఈ మహిమలను గురించి

విన్న (లేక చదివిన) వ్యక్తి వాటిని గురించి పరిశోధిస్తాడు, ఆ ఉల్లేఖనాలను తన గీటురాయిపై పరికించి చూస్తాడు. ఆ విషయం ప్రామాణికమైనదని నమ్మకం కుదిరినప్పుడే అవి దైవగ్రంథాలన్న నమ్మకం అతనికి కలుగుతుంది. కాని కుర్‌ఆన్ వ్యవహారం అలాంటిది కాదు. అది దైవగ్రంథం అని నమ్మబలకడానికి దానిని తీసుకువచ్చిన వ్యక్తి (ప్రవక్త) తాను నిజంగా దైవప్రవక్తనే అనేందుకు తత్కాల మహిమలు, చమత్కారాలు ప్రదర్శించలేదు. కుర్‌ఆన్ తనకుతానే నిరూపణగా, తిరుగులేని సాక్ష్యాధారంగా వచ్చింది. అది ప్రతి కాలంలో, ప్రతి వ్యక్తి ఎదుట ఒక సజీవ సత్యంగా ఉంది. మనుజ జాతికి చెందిన ఒక్కొక్క వ్యక్తికి అది సైద్ధాంతిక సందేశం అందిస్తూ ఉంది. ఈ విషయాన్నే ప్రవక్త మహనీయులు (స) ఈ విధంగా విశదీకరించారు :

“జనులు విశ్వసించగలందులకు ప్రతి ప్రవక్తకు కొన్ని సూచనలు, మహిమలు ప్రసాదించబడ్డాయి. నాకు ఇవ్వబడిన (అత్యంత ముఖ్యమయిన) అద్భుతం దైవవాక్కు (దివ్య కురాన్). దానిని అల్లాహ్ నాకు ‘వహీ’ రూపంలో ప్రసాదించాడు.” (బుఖారీ–కురాన్ మహిమల ప్రకరణం)

مَا مِنَ الْأَنْبِيَاءِ نَبِيٌّ إِلَّا أُعْطِيَ مِنَ الْآيَاتِ مَا مِثْلُهُ آمَنَ عَلَيْهِ الْبَشَرُ وَإِنَّمَا كَانَ الَّذِي أُوتِيتُ وَحْيًا أَوْحَى اللَّهُ إِلَيَّ - (بخاری. کتاب فضائل القرآن)

ఈ ప్రవచనంలో ప్రవక్త మహనీయులు (స) దివ్య కుర్‌ఆన్‌నే తన ‘సర్వతోముఖమయిన అద్భుతం’గా ఖరారు చేశారు. మరి చూడబోతే ఆయన (స)కు కూడా ‘తత్కాల అద్భుతాలు’ అనేకం వొసగబడ్డాయి. అయినప్పటికీ ఆయన (స) దృష్టిలో కుర్‌ఆన్ మాత్రమే ‘సిసలయిన అద్భుతం’గా, అతి గొప్ప మహాత్మ్యంగా ఉండేది. దాని సమక్షంలో ఇతరత్రా అద్భుతాలకు ఆయన అసలు ప్రాధాన్యమే ఇవ్వలేదు. స్వయంగా కుర్‌ఆన్ కూడా ఈ యదార్థాన్ని ఎత్తిచూపింది. ఏవయినా మహిమలను, సూచనలను ప్రదర్శించమని మక్కాలోని కురైషులు ఆయన్ని మాటిమాటికీ కోరినప్పుడు కుర్‌ఆన్‌లో ఈ విధంగా సమాధానం ఇవ్వబడింది :

(ఓ ప్రవక్తా!) మేము నీపై అవతరింపజేసిన గ్రంథం వారి ముందు చదివి వినిపించబడటం (సూచనలు కావాలని కోరే) వారికి సరిపోదా?

*(అల్ అన్‌కబూత్–51)*

أَوَلَمْ يَكْفِهِمْ أَنَّا أَنْزَلْنَا عَلَيْكَ الْكِتٰبَ يُتْلٰى عَلَيْهِمْ ط ... (العنكبوت:٥١)

ఇతర గ్రంథాలకు ప్రతిగా దివ్య కుర్‌ఆన్‌కు ప్రాప్తమై ఉన్న విశిష్ఠ సుగుణాలు, ప్రత్యేక మహత్మ్యాలివి. లోతుగా ఆలోచిస్తే ఈ సుగుణాలలో సహజమయిన సంబంధం కానవస్తుంది. ఇవన్నీ నిజానికి ఒకే గొప్ప యదార్థం వాంఛించే వివిధ అంశాలు. సమస్త మానవాళికి మార్గదర్శకంగా వచ్చిన గ్రంథం, అంతిమ నిర్దేశిక నియమావళిగా ఉన్న గ్రంథం సర్వవిధాలా పరిపూర్ణతను సంతరించుకుని అలరారవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉంది. అది నియమబద్ధమైనదిగా ఉండాలి. మానవ నైజం వాంఛించే, మానవ సమాజం కాంక్షించే వాటికి అనుగుణంగా ఉండాలి. అది ప్రవేశపెట్టబడిన మీదట వెనుకటి దైవిక గ్రంథాల అనుసరణ రద్దు కావాలి. పరలోక సాఫల్యం కొరకు దీనిని కచ్చితంగా అనుసరించటం తప్ప మార్గాంతరం లేదని ప్రకటించబడాలి. ఈ భూమండలంపై మానవుడు మనుగడ సాగించినంత కాలం చెక్కుచెదరకుండా, పొల్లుపోకుండా సురక్షితంగా ఉండాలి.

## కుర్‌ఆన్ అధ్యయనం : బాధ్యతలు

పైన జరిగిన చర్చ కుర్‌ఆన్ అవతరణను ప్రపంచంలోని అన్నిటికన్నా ఎక్కువ ప్రాముఖ్యంగల సంఘటనగా, కుర్‌ఆన్ సందేశాన్ని మానవత అన్నిటికన్నా ముఖ్యమైన విషయంగా చేసిందనటంలో అతిశయోక్తి లేదు. కుర్‌ఆన్ పట్ల నిర్లక్ష్యం తగదని అది ఒక్కొక్క వ్యక్తిని కోరుతోంది. దాని అధ్యయనాన్ని అన్నిటికన్నా ముఖ్యమయిన విషయంగా, ప్రప్రథమ కర్తవ్యంగా పరిగణించమని కూడా అది కోరుతోంది.

ముస్లిములైనవారు, కుర్‌ఆన్ స్థాయిని అంగీకరించిన వారిపై ఉన్న బాధ్యత ఏమిటంటే, వారు దీని ఆదేశాలను, ఉపదేశాలను అవగాహన చేసుకోవాలి. వాటిపై సదా తమ దృష్టిని నిలిపి ఉంచాలి. మనస్ఫూర్తిగా వాటిని శిరసావహించి, తదనుగుణంగా అమలుపరచాలి.

ఇక ముస్లింలు కానివారు, కురాన్‌ను నమ్మేవారి కోవలోకి రానివారు – వారు చిత్తశుద్ధితో ఈ గ్రంథానికి గల స్థాయి గురించి శోధించాలి. ఒక వ్యక్తి ముస్లిం కానంత మాత్రాన కుర్‌ఆన్‌తో ఎలాంటి సంబంధం పెట్టుకోరాదని ఎక్కడా లేదు. కుర్‌ఆన్ గనక తన పొజిషన్‌ను వివరిస్తూ అదొక సాధారణ గ్రంథం అని చెప్పుకుని ఉంటే దానిని అధ్యయనం చేయవలసిన బాధ్యత ముస్లిమేతర సోదరులపై ఉండేది కాదేమో! కాని సమస్త జగతి కోసం అవతరించిన దైవగ్రంథం అని, తన రాకతో ఇతర దైవగ్రంథాలన్నీ రద్దు చేయబడ్డాయని, ఇప్పుడు ప్రపంచంలో దైవారాధన, దైవవిధేయత, పరలోక సాఫల్యం కేవలం దీనిమీదే ఆధారపడి ఉందని అది ప్రకటించినప్పుడు వ్యవహారం చాలా గంభీరంగా మారిపోయింది. కుర్‌ఆన్ పట్ల

చూసీచూడనట్లుగా, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరించటం ఏ వ్యక్తికీ ఇప్పుడు సమంజసం కాదు. ఇలా చేసిన వారు తమకు ప్రాప్తం కావలసిన గొప్ప ప్రయోజనాన్ని వదులుకుని తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లే. వారు తమ అంతిమ పరిణామం పట్ల అలసత్వం ప్రదర్శించినట్లే. ఎందుకంటే వారు ఏ జీవన యాత్రలో నిమగ్నులై ఉన్నారో దానికి సంబంధించిన కఠోర వాస్తవాలను అది ఎరుకపరుస్తోంది. ఖుర్ఆన్ మార్గదర్శనాన్ని వారు స్వీకరించినప్పుడే అది వారిని విజయ తీరాలకు చేరుస్తుంది.

కాని వారు ఈ గోడును వినడానికి, దీని వాస్తవికతను తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండరు. ఖుర్ఆన్ చాటుకునేది వారి దృష్టిలో కేవలం ఒక దావాయే కావచ్చు. ప్రతి దావా వాస్తవం కానవసరం లేదు. కాని ప్రతి దావా వాస్తవ విరుద్ధం కూడా కానవసరం లేదు కదా! కనుక ఒక ప్రకటన గంభీరంగా చేయబడినప్పుడు అది బూటకం అని విశ్వసనీయ వర్గాల పరిశోధన ద్వారా సమాచారం అందనంతవరకూ వారు దానిని సత్యమని అనకపోయినా కనీసం అసత్యమని మాత్రం అనలేరు.

ఖుర్ఆన్ తన సత్యబద్ధత గురించి చేసుకున్న ప్రకటన మటుకు మిట్ట మధ్యాహ్నపు వెలుతురులా గంభీరమైనది. ఎందుకంటే ఖుర్ఆన్ గురించి వెనుకటి పుటల్లో వచ్చిన సాక్ష్యాధారాలు, సహేతుక చర్చలు ఒకవేళ ఎవరి దృష్టికయినా రాకున్నప్పటికీ ప్రపంచంలోని కోట్లాదిమంది ప్రజలు ఖుర్ఆన్ చేసే ఈ ప్రకటన ముందు తలొగ్గుతూ పోతున్నారన్న సంగతిని గమనించాలి. ఎవరు దాని సత్యనిబద్ధతను అంగీకరించినా – వ్యక్తి జీవితంలోనూ, సమాజంలోనూ, రాజ్యంలోనూ, జీవితపు అన్ని విభాగాలలోనూ మంచి పరిఢవిల్లడం, దైవభక్తిపరాయణతా వసంతం వెల్లివిరియటం వారు వీక్షించటంలేదా? ఇవైతే పై పై విషయాలు. వీటిని తెలుసుకోవటానికి పెద్దగా ప్రయాసపడనవసరం లేదు. కాబట్టి ఖుర్ఆన్ దైవగ్రంథమని చేసుకున్న ప్రకటనను ఎవరయినా గమనార్హమయిన విషయంగా భావించకపోతే అదెంతో అసమంజసం, మంకుతనం అనిపించుకుంటుంది. చెప్పవచ్చిందేమిటంటే ఖుర్ఆన్ చేసిన ఈ ప్రకటన (దావా) చాలా గంభీరమైనది, ఆలోచించదగినది కాబట్టి న్యాయం వాంఛించేదేమి టంటే, ఖురాన్ చేసుకున్న ఈ దావాకు సంబంధించి ప్రతి ముస్లిమేతర వ్యక్తి ఆరంభంలో దాని 'స్థాయి'ని దృష్టిలో ఉంచుకోవాలి. తరువాత దాని ప్రామాణికతను పరిశీలించాలి. పరికించాలి. వాస్తవాన్ని తెలుసుకునేందుకు శాయశక్తులా కృషిచేయాలి. ఎందుకంటే ఈ ప్రకటన గనక నిజమని తేలితే (అదెలాగూ నిజమని తేలుతుంది) ఖుర్ఆన్ అతనిపాలిట మహదానుగ్రహం అవుతుంది. విజ్ఞుడైన ఏ వ్యక్తి కూడా ఇలాంటి వరప్రసాదాన్ని ఉపేక్షించలేడు.

# అవతరణ, క్రోడీకరణ

## అవతరణ చరిత్ర

మహనీయ ముహమ్మద్ (స)కు కురాన్ అవతరణ రమజాన్ మాసంలో మొదలయింది. ఈ విషయాన్ని అది స్వయంగా విశదీకరించింది –

شَهْرُ رَمَضَانَ الَّذِيْٓ اُنْزِلَ فِيْهِ الْقُرْاٰنُ
---(البقرة:١٨٥)

"కురాన్ అవతరణ (మొదలయిన) నెల రమజాన్ నెల." (అల్ బఖర : 185)

సూర్యమానం ప్రకారం ఇది క్రీ.శ. 610 ఆగస్టు నెల. ప్రప్రథమంగా ఈ వహీ (దివ్యవాణి) అవతరించినప్పుడు ఆయన (స) మక్కా పొలిమేరల్లో ఉన్న ఒక పర్వత గుహ – హిరా గుహ – లో ధ్యానంలో ఉన్నారు. దివ్య వాణి పరంపరలోని ఈ వెనుకటి ఘట్టం అల్ అలక్ సూరాలోని అయిదు సూక్తులతో కూడుకుని ఉంది:

اِقْرَاْ بِاسْمِ رَبِّكَ الَّذِيْ خَلَقَ ۝١ خَلَقَ الْاِنْسَانَ مِنْ عَلَقٍ ۝٢ اِقْرَاْ وَرَبُّكَ الْاَكْرَمُ ۝٣ الَّذِيْ عَلَّمَ بِالْقَلَمِ ۝٤ عَلَّمَ الْاِنْسَانَ مَا لَمْ يَعْلَمْ ۝٥ (العلق)

"(ప్రవక్తా!) పఠించు – సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు, నీ ప్రభువు పరమ దయాళువు. ఆయన కలం ద్వారా జ్ఞానం నేర్పాడు, మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి బోధించాడు."
*(అల్ అలఖ్ : 1–5)*

ఆ సమయంలో ఆయన వయస్సు సూర్యమానం ప్రకారం 39 సంవత్సరాల మూడున్నర మాసాలు. చాంద్రమానం ప్రకారం నలభై ఏండ్ల ఆరున్నర మాసాలు. దివ్య వాణి (వహీ) అనే ఈ శుభప్రదమయిన పరంపర రమారమి 23 ఏండ్ల సుదీర్ఘ కాలం వరకు కొనసాగింది. తౌబా సూరాలోని చివరి రెండు వాక్యాలతో ఈ దివ్యవాణి సమాప్తం అయింది.◆

---

◆ *మరో ఉల్లేఖనం ప్రకారం ఆఖరి దివ్యవాణి నిసా సూరాలోని చివరి సూక్తి. వేరొక ఉల్లేఖనం ప్రకారం అల్ బఖర సూరాలోని వడ్డీ నిషేధాజ్ఞల సూక్తి (278) చివరి సూక్తి.*

క్రీ.శ. 633లో ఆయన పరమపదించక కొన్ని రోజుల ముందు ఈ సూక్తులు అవతరించాయి. ఈ కాల వ్యవధిలో సగం కంటే ఎక్కువ సమయం – అంటే పన్నెండున్నర సంవత్సరాలకంటే ఎక్కువ కాలం – మక్కాలోనే గడచిపోయింది. మిగిలిన పదేండ్లు మదీనాలో గడిచాయి. మక్కాలో ఉండగా అవతరించిన సూరాల (అధ్యాయాల) సంఖ్య 90. అంటే పరిమాణం రీత్యా కుర్‌ఆన్‌లో మూడింట రెండొంతుల భాగం మక్కాలోనిదే. మదీనాలో అవతరించిన అధ్యాయాల సంఖ్య 24. ఇది మూడింట ఒక వంతు కురాన్. ఈ విధంగా కురాన్‌లోని మొత్తం సూరాలు (అధ్యాయాలు) 114. ఈ సూరాలలోని మొత్తం సూక్తుల సంఖ్య 6236. మొత్తం వచనాలు 77,933. మొత్తం అక్షరాల సంఖ్య 3,32,015.

## అవతరణాస్థితి

పూర్తి కుర్‌ఆన్ 23 ఏండ్ల సుదీర్ఘ కాలంలో అవతరించింది. అది అల్లాహ్ తరఫు నుండి ఒకే సమయంలో పూర్తిగా ముహమ్మద్ ప్రవక్త (స)కు అప్పగించబడలేదు. అది సాధారణ రచనల వంటిదీ కాదు. శాస్త్రీయ, సాంకేతిక విషయాలను విపులీకరించే పుస్తకం వంటిది కూడా కాదు. అందుకే దాని నిజస్థితిని గురించి ఆయన స్వయంగా ఇలా సెలవిచ్చాడు :

وَقَالَ الَّذِيْنَ كَفَرُوْا لَوْلَا نُزِّلَ عَلَيْهِ الْقُرْاٰنُ جُمْلَةً وَّاحِدَةً ۚ كَذٰلِكَ ۚ لِنُثَبِّتَ بِهٖ فُؤَادَكَ وَرَتَّلْنٰهُ تَرْتِيْلًا ﴿٣٢﴾ (الفرقان)

"ఈ వ్యక్తిపై పూర్తి కుర్‌ఆన్ ఒకేసారి ఎందుకు అవతరింపబడలేదు?" అని అవిశ్వాసులు అంటారు. అవును, అలా ఎందుకు చేయబడిందంటే, మేము దానిని నీ మనస్సులో నాటుకునేలా చేయాలని. (ఈ ఉద్దేశ్యంతోనే) మేము దానిని (కొద్దికొద్దిగా) ఒక ప్రత్యేకమైన క్రమంతో వేర్వేరు భాగాలుగా వినిపించాము." (అల్ ఫుర్ఖాన్ : 32)

అంటే దివ్య కుర్‌ఆన్ పూర్తిగా ఒకేసారి కాకుండా కొద్దికొద్దిగా అవతరింపజేయబడింది. ఒక్కోసారి కేవలం కొన్ని సూక్తులు మాత్రమే అవతరిస్తే, ఒక్కోసారి పూర్తి సూరా (ఒక అధ్యాయం) ఒకేసారి అవతరించింది. రెండు దివ్యవాణుల మధ్య ఒక్కోసారి చాలా తక్కువ వ్యవధి ఉంటే ఒక్కోసారి వారాల తరబడి, నెలల తరబడి 'వహీ' అవతరించేది కాదు. ఇలా ఎందుకంటే దివ్య కురాన్ కేవలం సైద్ధాంతిక

గ్రంథం మాత్రమే కాదు, అదొక మార్గదర్శిని కూడా. దాని అవతరణ ఒకానొక సందేశంతో జరిగింది. అది క్రియాత్మక సందేశమే కాదు, క్రమ వికాస సందేశం కూడాను. అదొక బిందువు నుండి ఆరంభమై ఇంతై అంతై, వివిధ పరిస్థితులను, దశలను అధిగమిస్తూ, అనేక మలుపులు తిరుగుతూ విజయ గమ్యానికి చేరుకుంది. అలాంటి సందేశం వాంఛించేదేమిటంటే కుర్‌ఆన్ ఒకేసారి కాకుండా కొద్దికొద్దిగానే అవతరించాలి.

ఈ విషయాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవటానికి ఆ 'సందేశం' ఎటువంటిదో సంక్షిప్తంగానయినాసరే నెమరువేసుకోవాలి. దాని క్రియాత్మక స్వరూపాన్ని కూడా దృష్టియందుంచుకోవాలి.

కురాన్‌ను తీసుకువచ్చిన వ్యక్తి (సల్లల్లాహు అలైహి వ సల్లం) తాను ప్రవక్తనని ప్రకటించుకుని అద్వితీయుడైన దేవుని దాస్యం మాత్రమే చేయాలని చెప్పగానే బహుదైవోపాసన జరిగే అరబ్బు సమాజంలో ప్రకంపనం పుట్టింది. ఆ విషయాన్ని మక్కావారు తిరస్కరించటం, వ్యతిరేకించడంతోనే ఆగకుండా ఆయనపై ఆగ్రహోదగ్రులయ్యారు. చాలాకొద్దిమంది మాత్రమే ఆ సందేశ ప్రకటనపై ప్రశాంత మనసుతో ఆలోచించారు. తత్ఫలితంగా ఆ సత్యామృతాన్ని ఆస్వాదించే భాగ్యం వారికి ప్రాప్తించింది. కాని సాధారణ ప్రతిస్పందన మాత్రం వ్యతిరేకతతో, నిరసనలతో కూడుకున్నదే. అయితే ఈ వ్యతిరేకత అనూహ్యం కాదు. ఈ ప్రతికూలతకు కుర్‌ఆన్ సందేశ ప్రదాత భయపడి మౌనం వహించే ప్రసక్తే లేదు. అందుకే నలువైపులా నిరసన జ్వాలలు మిన్నంటుతున్నప్పటికీ ఆ 'సందేశ ప్రదాత' తన కర్తవ్యపాలనలో ఏమాత్రం కొరత చేయకుండా ముందుకు సాగిపోయారు. వినడానికి, ఆలోచించడానికి సిద్ధంగా లేనివారికి విషయాన్ని వినిపించి, నచ్చజెప్పడానికి శాయశక్తులా కృషిచేయసాగారు. దీని ఫలితంగా జనులలో ఒక్కొక్కరు ఇస్లాం పరిధిలోకి రాసాగారు. అయితే ఈ పరిధి ఎంతవేగంగా విస్తరించసాగిందో అంతే వేగంగా వ్యతిరేకత కూడా ప్రబలిపోయింది. ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. అవి తొందరగానే దౌర్జన్యాలుగా రూపాంతరం చెందాయి. అమానుషాలు పెచ్చరిల్లాయి. చివరకు పరిస్థితి ఎంత భయానకంగా తయారయిందంటే ఎవరయినా ముస్లింగా మారాడంటే తెలిసీ కష్టాలు కడగండ్లను ఆహ్వానించినట్లే అయింది. ఇస్లాంను వ్యతిరేకించిన వారి దగ్గర అర్థబలం ఉంది. కండబలం ఉంది. అంగబలం ఉంది. అధికారం ఉంది. వారికి ప్రతిగా సత్యామృతాన్ని ఆస్వాదించిన శుభాత్ములు బహుకొద్దిమంది మాత్రమే. ఒకవిధంగా చెప్పాలంటే అది బలవంతులకు – బలహీనులకు మధ్య ఉత్పన్నమయిన సైద్ధాంతిక ఘర్షణ! అలాంటి గడ్డు పరిస్థితులలో దైవప్రవక్త (స)పై, ప్రవక్త ప్రియ సహచరులపై

విరుచుకుపడే విపత్తుల గురించి ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరమే లేదు. బహిరంగంగా దేవుడొక్కడేనని చెప్పటానికి, నమాజ్ చేసుకోవడానికి కూడా మక్కా నగరంలో అనుమతి ఉండేది కాదు. ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూనే సందేశ పరిచయ కార్యక్రమం ముందుకు సాగింది. పది పన్నెండేళ్ల కాలం గడిచేసరికి అదొక కీలకమయిన దశకు చేరుకుంది. దానికి మరింత గడువు ఇవ్వటం ఎంత మాత్రం భావ్యంకాదని, ముహమ్మద్ (స)ను హతమార్చితే ఈ 'పీడ' విరగడవుతుందని ఖురైషు తెగలవారంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. 'పీడన' పరాకాష్ఠకు చేరుకున్నప్పుడు మక్కాను వీడి మదీనా వైపునకు ప్రస్థానం (హిజ్రత్) చేయమని దేవుడు తనప్రవక్త (స)కు, విశ్వాసులకు సూచించాడు.

మక్కా తరువాత యావత్తు అరేబియాలో ఇస్లాం సందేశం చేరిన స్థానం మదీనా మాత్రమే. అప్పటికే మదీనాలో చెప్పుకోదగ్గ సంఖ్యలో వ్యక్తులు ఇస్లాం స్వీకరించి ఉన్నారు. అందుచేత దైవప్రవక్త (స), ఆయన ప్రియ సహచరులు తమ ఇల్లూ వాకిలిని, ఆస్తిపాస్తులను వదలి మదీనాకు వలసవెళ్ళారు. అప్పటి నుండి మదీనాయే దైవ సందేశానికి కేంద్ర బిందువుగా మారింది. అక్కడి పరిస్థితులు మక్కా మాదిరిగా ప్రతికూలంగా, తీవ్రంగా లేవు. అక్కడ ముస్లింలకు ఒకింత స్వేచ్ఛ లభించింది. తమ జీవన వ్యవహారాలను చక్కదిద్దుకునే తెరిపి కూడా లభించింది. వేరే మాటల్లో చెప్పాలంటే వారు కోరుకున్న సత్సమాజ రూపకల్పన జరిగింది. వారు ఆశించిన ఒక శ్రేయోరాజ్యం ఉనికిలోకి వచ్చింది. దాంతోపాటే సందేశ కార్యకలాపాల పరిధి కూడా విస్తృతమయింది. మక్కాలో వారు కేవలం బహుదైవారాధకులకు మాత్రమే సత్యధర్మ పరిచయం చేసేవారు. కాని మదీనాలో బహుదైవారాధకులతో పాటు గ్రంథవహులు (యూదులు) కూడా దాని పరిధిలోనికి వచ్చేశారు. ఎందుకంటే మదీనాలో గ్రంథం కల ప్రజలు కూడా చాలా ఎక్కువ సంఖ్యలో నివసించేవారు. ఇస్లాం ప్రపంచ స్థాయి సందేశం కావటం వల్ల వారి వరకు కూడా దానిని చేరవేయాల్సిన బాధ్యత ప్రవక్తపై, ప్రవక్త అనుయాయులపై ఉండేది.

ఆరంభ కాలంలో ఇక్కడ కూడా ఊహించినట్లుగానే మిశ్రమ ప్రతిస్పందన వచ్చింది. కొందరు దానిని స్వీకరించగా మరికొందరు తిరస్కరించారు. కొందరు వ్యతిరేకులుగా మారగా, మరికొందరు అండగా, ఆదరువుగా నిలబడ్డారు. కొందరు విశ్వాస (ఈమాన్) మాధుర్యాన్ని ఆస్వాదించగా, చాలామంది త్రోసిపుచ్చారు. వ్యతిరేకులుగా మారారు. యూదులైతే 99 శాతం మంది ఆఖరి వరకూ వ్యతిరేకించారు.

అయితే మక్కాతో పోల్చుకున్నప్పుడు ఇస్లాంను వ్యతిరేకించినవారు తక్కువే. అందువల్ల గతంలో ముస్లింలపై జరిగినన్ని దురాగతాలు, అత్యాచారాలు ఇక్కడ జరగలేదనే చెప్పాలి. ఇక్కడ క్రమక్రమంగా ముస్లింలకు రాజకీయ, సామాజిక ప్రాచుర్యం లభించసాగింది. అందుకే వ్యతిరేక వర్గాలు బాహాటంగా కయ్యానికి కాలుదువ్వకుండా రహస్యంగా సమాలోచనలు చేసి, పన్నాగాలు పన్నే స్ట్రాటజీని మాత్రమే అవలంబించాయి. ఈ స్ట్రాటజీని అనుసరించి ముస్లిం సమాజంలో వంచకులు, కపటులు కూడా ఇస్లాం పేరు మీద జొరబడ్డారు.

ఈ విధంగా మక్కాలో సత్య సందేశానికి వ్యతిరేకంగా ఒక సంగఠన ఉంటే, ఇక్కడ రెండు సంగఠనలు పుట్టుకొచ్చాయి. ఒక సంగఠనలోని వ్యక్తులు బహిరంగ శత్రువులు – అంటే వారు ముష్రిక్కులు, అవిశ్వాసులు. రెండవ సంగఠనలోని వారు ఇంటి దొంగలు. తోడుగా ఉంటూనే అవకాశం దొరికినప్పుడు వెన్నుపోటు పొడిచే వంచనా శిల్ప నిష్ణాతులు, కపటులు (మునాఫిక్‌లు). ఈ ద్వంద్వ స్వభావులు సందేశమార్గంలో శిరోవేదనగా తయారయ్యారు. ఎందుకంటే వారు ఇస్లాం సౌధాన్ని కూల్చివేసేందుకు స్వయంగా దాని నీడలోనే ఆశ్రయం పొందినవారు. అటు మక్కావారు కూడా ముస్లింలు హిజ్రత్ తరువాత పోతేపోనీ అంటూ తృప్తిగా నిట్టూర్పు విడవలేదు. పైగా వారు తమ వాంఛలకు, ఉపాయాలకు, ప్రయత్నాలకు భిన్నంగా సత్య సందేశం దినదిన ప్రవర్ధమానం కావటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. సాయుధ చర్యల ద్వారా ఆ సందేశాన్ని నామరూపాల్లేకుండా చేయాలన్నది వారి లక్ష్యం. మదీనాలోని యూదులు, కపటులు వాళ్ళతో రహస్య సంప్రతింపులు మొదలెట్టారు. వారిని ఉసిగొల్పసాగారు. అందువల్ల మదీనాకు ముస్లింలు వలస వచ్చి రెండు సంవత్సరాలయినా గడవక ముందే సకల సన్నాహాలతో వారిపై కవ్వింపు చర్యలకు దిగారు కురైషులు.

ఇలాంటి పరిస్థితులలో దైవప్రవక్త (స) గానీ, ముస్లింలుగానీ మదీనాలో ప్రశాంతంగా ఉండటం సాధ్యం కాదు. ఒక వైపు కురైషులు అకస్మాత్తుగా మెరుపుదాడులు, దోపిడీలకు ఒడిగడుతూ ఉంటే, మరోవైపు నుండి కపటులు తూట్లు పొడిచే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంకోవైపు యూదులు సైద్ధాంతిక ఉపద్రవాలు సృష్టిస్తూ, రాజకీయ కుట్రలు పన్నసాగారు. ఈ విధంగా ప్రవక్త సందేశం ఒక వైపున వ్రేళ్ళూనుకుని ఒక శక్తిగా రూపొందుతున్నప్పటికీ, మరోవైపున వ్యతిరేక పవనాలు కూడా ఉధృతం కాసాగాయి. ఎట్టకేలకు సత్యాసత్యాల, ధర్మాధర్మాల నిర్ణయం జరిగే తరుణం ఆసన్నమవుతుంది. కీలకపోరు సత్య సందేశం పక్షాన స్పష్టమయిన తీర్పు ఇస్తుంది.

వ్యతిరేక శక్తులు లొంగిపోయే తరుణం ఆసన్నమవుతుంది. ఆఖరికి అసలు శత్రువులైన మక్కావాసులు కూడా సంధికి సుముఖత చూపటం జరిగింది. కాని గుండెల్లో మండుతున్న అగ్నిజ్వాల అదనుచూసి దావానలంలా వ్యాపించేది. సంధి షరతులను ఉల్లంఘించి ముస్లింల పయన బృందాలపై, వివిధ ముస్లిం తెగలు నివసించే జనావాసాలపై దాడులు చేసేవారు కురైషులు. తత్కారణంగా దైవప్రవక్త (స) వేలాదిమంది సహచరులతో మక్కా వైపునకు బయలుదేరారు. శత్రువులకు వారిని నిలువరించే ధైర్యం, శక్తి లేకపోయింది. అందువల్ల బాణ వర్షం కురవకుండానే, రక్తం ప్రవహించకుండానే ప్రవక్త మహనీయులు (స) మక్కాలో విజేతగా ప్రవేశించారు. కుర్‌ఆన్ సందేశానికి ప్రప్రథమ కేంద్రస్థానమైన కాబా ప్రతిష్ఠాలయంలో బహుదైవోపాసనా ఆనవాళ్ళన్నింటినీ – ఒక్కొక్కటిగా – తొలగించి పరిశుద్ధపరిచారు. స్పష్టమయిన ఈ విజయం తరువాత ఇస్లాం అరేబియా అంతటా ఒక ఉధృత ప్రవాహంలా పరవళ్ళు తొక్కుతుంది. ప్రజలు తండోపతండాలుగా ఇస్లాంలో ప్రవేశించారు. ఆ విధంగా అరేబియా రాజ్యంలో ఇస్లాం ఓ తిరుగులేని శక్తిగా ఎదిగింది. ముస్లిం సమాజం తన ఎదుగుదలకు సంబంధించిన సకల సహజ దశలన్నింటినీ అధిగమిస్తూ సర్వవిధాలా ఓ పరిపూర్ణమయిన సమాజంగా రూపాంతరం చెందుతుంది. ఆ సమాజంలోని ప్రతి వ్యక్తికీ దేవుడు సమ్మతించి ఆమోదించిన జీవన విధానం ప్రకారం, ముహమ్మద్ (స) ద్వారా అందజేయబడిన శాసనాంగం ప్రకారం జీవితం గడిపే స్వేచ్ఛ లభిస్తుంది. అందులో బయటి శక్తుల ప్రమేయానికీ, అడ్డంకులకు ఎలాంటి తావులేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధంగా ఈ సందేశ ప్రధానమైన కృషి పరిపక్వ స్థితికి చేరుకుంటుంది.

ఇదీ ఈ సందేశ యాత్ర క్రమ వికాసానికి సంబంధించిన సంక్షిప్త చరిత్ర – ఈ విధమయిన సందేశంతో పాటు వచ్చిన కురాన్ ఒకేసారి పూర్తిగా అవతరించటం సంభవం కాదు. ఈ సందేశం మొదలైనప్పుడే దీని అవతరణ మొదలవ్వాలి. ఈ సందేశం పూర్తయ్యేనాటికి దీని అవతరణ కూడా పూర్తవ్వాలి. ఇదే సహజ పరిణామం. ఇదే దైవానికి ఆమోదయోగ్యమయిన విధానం. ఈలోగా, దీని వివిధ భాగాలు – తగినంత విరామంతో – ఓ క్రమ పద్ధతి ప్రకారం అవతరిస్తూ ఉండేవి. ఈ సందేశం యొక్క స్థితిగతుల అవసరాల దృష్ట్యా ఎప్పుడు ఏ ఆదేశం, మరే ఉపదేశం అవతరించాలో అదే అవతరించేది – అంటే తొలికాలంలో కేవలం మౌలిక విషయాలను సమర్పించవలసిన ఆవశ్యకత ఉండేది. అవి సత్యబద్ధమైనవనడానికి అవసరమయిన

ఆధారాలు, నిదర్శనాలు ఇవ్వాలి. వాటిని విశ్వసించటం లేక విశ్వసించకపోవటం వల్ల సంభవించే పరిణామాలను స్పష్టం చేయాలి. అదే సమయంలో దివ్యవాణి అవతరణ కూడా మరీ వేగంగా జరగకూడదు – ఎందుకంటే ఈ సందేశం గురించి లోతుగా ఆలోచించేందుకు ప్రజలకు తగినంత సమయం ఇవ్వాలి. ఆ తరువాత 'విశ్వసించండి' అన్న సూచనలో కాస్తంత తీవ్రత తీసుకురావాలి. అంతరాత్మను కుదిపివేసే, మస్తిష్కాన్ని ఆలోచింపజేసే నిదర్శనాలు, సూచనలు నిరంతరం ప్రయోగించాలి. అదే సమయంలో విశ్వసించి ముస్లింలు అయిన వారికి ధర్మసూత్రాలు విశదీకరించడంతో పాటు విశ్వాసపరంగా వారిలో పరిపక్వత వచ్చేలా చేయాలి. సత్యంపై స్థిరంగా ఉండాలని, దైవమార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలు, తమపై జరిగే దౌర్జన్యాలపై ఓర్పు వహించమని బోధపరచాలి. దీనికిగాను లభించే ఉత్తమ ప్రతిఫలాన్ని జ్ఞాపకం చేసి వారిని ఓదార్చాలి. మరి హిజ్రత్ చేయాల్సిన తరుణం ఆసన్నమయినప్పుడు ఇల్లూ వాకిలి, ఆస్తిపాస్తులను, బంధుమిత్రులను – అన్నిటినీ వదలి దైవమార్గంలో ప్రస్థానం చేసే త్యాగానికి సిద్ధంగా ఉండేలా వారిని మానసికంగా సంసిద్ధుల్ని చేయాలి.

మదీనాకు చేరుకున్న తరువాత – (1) ఒక వైపున విశ్వాసుల కొరకు సవివరంగా ధర్మాదేశాల అవతరణ మొదలవ్వాలి. జీవితపు వివిధ విభాగాలకు సంబంధించిన షరీఅత్ నియమ నిబంధనలు వారికి ఇవ్వాలి. (2) రెండవ వైపున కపటుల మెడలు వంచాలి. వారి కుతంత్రాలను ఖండించాలి. రుజువర్తనులవ్వమని వారిని హెచ్చరిస్తూ, వారి ఉపద్రవాల పట్ల అప్రమత్తంగా ఉండండి అని ముస్లింలకు సూచనలివ్వాలి. (3) మూడవ వైపున యూదులు, క్రైస్తవులు, ముష్రిక్కులకు, ఇంకా సమాజంలోని అన్ని వర్గాల వారికి సత్యధర్మాన్ని పరిచయం చేసే కార్యక్రమం నిరాఘాటంగా కొనసాగాలి. ఒక్క మదీనాయే కాదు, మదీనా పరిసర ప్రాంతాలలో, సమస్త అరేబియా భూభాగంలో నివసించే ముస్లిమేతరులకు ఇస్లాంను అందజేయాలి. శాంతియుత పరిస్థితులు నెలకొన్న మీదట అరబ్బేతర ప్రాంతాల ముస్లిమేతరులకు సయితం ఇస్లాం సందేశం చేరవేయాలి. చివరి దశలో మిథ్యావాదుల మెడలు వంచి రాజ్యంలో రాజకీయ సుస్థిరతను సాధించిన మీదట ముస్లిములకు శాసన సంబంధమయిన ఆదేశాలను, నిషేధాజ్ఞలను జారీచేసే సూక్తులను శీఘ్రంగా అవతరింపజెయ్యాలి. అటు సత్యసందేశ పరిచయ కార్యక్రమం తుదిఘట్టానికి చేరుకుంటూ ఉండగా ఇటు ఈ ఆజ్ఞలను కూడా పూర్తిచేసి దివ్య ఖుర్‌ఆన్ అవతరణను పరిసమాప్తం చేయాలి.

దివ్య ఖుర్‌ఆన్‌ను లోతుగా అధ్యయనం చేసిన ఏ వ్యక్తి అయినా – దీని

అవతరణ సరిగ్గా ఇదే క్రమంలో జరిగిందన్న విషయాన్ని గ్రహిస్తాడు. అందుకే హదీసులో ఇలా అనబడింది –

إِنَّ اللهَ تَابَعَ عَلَى رَسُولِهِ
صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ
قَبْلَ وَفَاتِهِ حَتَّى تَوَفَّاهُ
أَكْثَرَ مَا كَانَ الْوَحْيُ - (بخاری کتاب فضائل القرآن)

"అల్లాహ్ తన సందేశహరుని మరణ గడియ సమీపించినప్పుడు వడివడిగా వహీ (దివ్యవాణి) పంపసాగాడు. చివరకు ఆయన పరమపదించిన చివరి రోజులలో దివ్యవాణి (వహీ) అవతరణ మరింత వేగవంతం అయింది." (బుఖారీ – కితాబు ఫజాయెలుల్ కురాన్)

దివ్య కుర్‌ఆన్ అవతరణా క్రమం, దాని పరమార్థాలకు సంబంధించిన ఒక వివరణ ఈ హదీసులో ఇవ్వబడింది. ప్రవక్త (స) పరమపదించే సమయం ఆసన్నమయిందంటే, సందేశం పరిపూర్ణం కావచ్చిందన్న దానికి అది సంకేతం అన్నమాట! ఇస్లాం రాజ్యానికి సుస్థిరత చేకూరిందన్నమాట! షరీఅతుకు సంబంధించిన అనేక ఆజ్ఞలు – సవివరమయిన ఆదేశాలు – అవతరించవలసిన అసలు సమయం సందర్భం కూడా అదే. ఎందుకంటే అప్పటికి ఇస్లామీయ వ్యవస్థ అక్కడ బలపడింది. ప్రజలు ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా షరీఅత్ ఆదేశాలపై అమలుజరిపే వాతావరణం నెలకొన్నది. అందుకే అంతకు మునుపు ఈ ఆదేశాలు దైవేచ్ఛ ప్రకారమే నిలిచి ఉన్నాయి. తగు సమయం కోసం నిరీక్షణలో ఉన్నాయి. ఆ సమయం ఆసన్న మవగానే తొందర తొందరగా అవతరించసాగాయి – దైవప్రవక్త (స)పై దివ్యవాణి పరంపర ఉధృతమయింది.

## కుర్‌ఆన్ క్రోడీకరణ

కుర్‌ఆన్ ఏ వరుసక్రమంలో అవతరించిందో అదే వరుస క్రమంలో దాని క్రోడీకరణ జరగలేదు. అందలి కొన్ని అధ్యాయాలు (సూరాలు) పూర్తిగా ఒకే సమయంలో అవతరించటం వల్ల వాటిలోని వచనాల క్రోడీకరణా క్రమం కూడా సహజంగానే వాటి అవతరణా క్రమం ప్రకారమే ఉంది. కాని అనేక అధ్యాయాల వ్యవహారం తద్భిన్నంగా ఉంది. ఒకే సమయంలో అవతరించే బదులు వాటిలోని వివిధ భాగాలు వివిధ సందర్భాలలో అవతరించేవి. ఒక అధ్యాయం (సూరా) లోని ఒక భాగం నేడు అవతరిస్తే, రెండవ భాగం కొన్ని నెలల తరువాత, మూడవ భాగం

కొన్నేండ్ల తరువాత అవతరించేది. తొలి కాలపు వచనాలు మక్కీ వచనాలైతే, చివరి కాలపు వచనాలు మదనీ సూక్తులు. సూరాలోని ఏ భాగాలైతే నేడు మనకు దాని చివర్లో కనిపిస్తున్నాయో అవి అవతరణ రీత్యా మొదట్లో ఉన్న వచనాలకన్నా ముందు అవతరించాయి. ఒకే సమయంలో అనేక సూరాలు అవతరిస్తూ ఉన్నాయి. ఇప్పుడు అవతరించిన కొన్ని వచనాలు ఒకానొక సూరాలో పొందుపరచబడుతున్నాయి. కొన్ని నిముషాల తరువాత ఇతర సూక్తులు అవతరిస్తున్నాయి – అవి వేరొక సూరాలో అంతర్భాగంగా కూర్చబడుతున్నాయి. ఈ విధంగా ఏకకాలంలో అనేక అధ్యాయాలు తమ పరిపూర్ణతకు చేరుకుంటున్నట్లు కనిపిస్తోంది. చాలా కాలం తరువాత అవతరించటం మొదలయిన ఒక అధ్యాయం అప్పుడే పూర్తయింది. కాని ఎన్నో మాసాల క్రితం అవతరించటం మొదలయిన వేరొక సూరా తన పరిపూర్ణ దశకు చేరుకోవడానికి మరిన్ని మాసాలు లేక మరిన్ని సంవత్సరాలు నిరీక్షించవలసిన పరిస్థితి! అందుకే మహనీయ ఉస్మాన్ (రజి) గారి పలుకులు ఈ సందర్భంగా గమనించదగినవి

"ప్రవక్త మహనీయుల (స) వారిపై ఒకే కాలంలో ఎన్నో సూరాలు అవతరించేవి. ఒక విషయం అవతరించినప్పుడు ఆయన (స) తన లేఖకుల్లో ఎవరినయినా పిలిచి 'ఈ వచనాలను ఫలానా అధ్యాయం (సూరా)లో కూర్చండి' అని సూచించేవారు." (తిర్మిజీ)

كان رسول الله صلى الله عليه وسلم
ينزل عليه السور ذوات العدد
فكان إذا تنزل عليه شيء دعا
بعض من كان يكتب فقال ضعوا
هؤلاء الآيات في السورة التي يذكر
فيها كذا وكذا » (ترمذی)

ఒక్కొక్క సూరాలోని అంతర్గత కూర్పు, క్రోడీకరణ ఎలాంటిదో వాటన్నింటి బాహ్య కూర్పు పరిస్థితి కూడా అలాంటిదే. కుర్ఆన్ క్రోడీకరణకు ఉపక్రమించినప్పుడు – ముందుగా అవతరించిన సూరాను ముందు వరుసలో పెట్టి, దాని తరువాత అవతరించిన సూరాను తరువాత నమోదు చేసే పద్ధతి పాటించబడలేదు. ఈ మాదిరిగా కుర్ఆన్ ఆసాంతం అవతరణా క్రమం ప్రకారం క్రోడీకరించబడలేదు. ఇలా ఎందుకు జరగలేదు? అన్న ప్రశ్నకు సమాధానం ముమ్ముందు రాబోతుంది. అయితే మీరు గనక ఆలోచిస్తే సూరాలను వాటి అవతరణా క్రమం ప్రకారం క్రోడీకరించే ఆస్కారం కూడా ఏదీ లేదన్న సంగతి మీకు అర్థమవుతుంది. ఎందుకంటే అవి అవతరించిన పద్ధతిని బట్టి (వాటి వివరాలు ఇంతకు ముందే వచ్చాయి), వరుసక్రమం రీత్యా ఏ

సూరా ముందుండాలి? ఏ సూరా తరువాత ఉండాలి? అని నిర్ణయించటం సాధ్యం కాదు. ఒక సూరా తనలోని కొన్ని భాగాల దృష్ట్యా వేరొక సూరాకన్నా ముందుగా ఉందనిపిస్తే, మరికొన్ని అంశాల రీత్యా దానికన్నా ఆఖర్లో ఉందనిపిస్తుంది. అలాగే మక్కాలో అవతరించిన సూరాలను ఒకే వరుసలో ఉంచి, మదీనాలో అవతరించిన సూరాలను ఒక వరుసలో కూర్చటం జరిగిందా అంటే ఆ విధంగా కూడా లేదు. అంటే సూరాల క్రోడీకరణా క్రమంలో అవతరణా క్రమాన్ని పరిగణనలోకి తీసుకోనట్లే మక్కీ, మదనీలను కూడా పరిగణనలోకి తీసుకోలేదు. వీటన్నింటినీ అలావుంచితే, వాటిని వేరొక – వినూత్న – పద్ధతిలో కూర్చటం జరిగిందని అనటం భావ్యంగా ఉంటుంది. ఇందలి యుక్తి, పరమార్థం ఏమిటి? : ఇంతకుముందు వచ్చిన అవతరణా తీరు గురించిన చర్చను మీ దృష్టిలో ఉంచుకున్నట్లయితే ఈ యదార్థం మీకు చాలా సులభంగా బోధపడుతుంది. ఈ కుర్‌ఆన్ ఇతరత్రా గ్రంథాల వంటిది కాదు – ఏదయినా ఒక విషయాన్ని తీసుకుని, దానికి సంబంధించిన కోణాలన్నింటినీ విశ్లేషించటానికి. దీని స్థాయి ఒక మార్గదర్శకుడు ఇచ్చే సూచనల వంటిది! ఒక సందేశ ప్రదాత (ధర్మబోధకుడు) చేసే ఉపన్యాసాల వంటిది!! (రానున్న పుటలలో ఈ విషయం కూలంకషంగా చర్చించబడనుంది). సత్యసందేశం ప్రారంభమై, అది క్రమ వికాసం చెందిన విధంగానే కుర్‌ఆన్ అవతరిస్తూపోయింది. ఇస్లాం సందేశం పరిపూర్ణం గావించబడేనాటికి దీని అవతరణ కూడా పరిసమాప్తం అయింది. అందువల్ల ఈ దివ్యవాణి పరంపర అంతా క్రోడీకరించబడుతున్న సమయంలో సందేశ అవసరాల దృష్ట్యా అవలంబించిన విధానాన్ని అనుసరించటం సమంజసం కాదు. నిశ్చయంగా ఈ దివ్య సూచనలను, సందేశాలను ఇప్పుడొక శాశ్వత గ్రంథ రూపం ఇవ్వడానికి వేరొక పద్ధతిని – వేరొక క్రమాన్ని – అనుసరించాల్సిన ఆవశ్యకత ఉంది. (1) ఈ ధర్మాన్ని విశ్వసించిన వారి దృష్ట్యా, (2) అప్పటివరకూ ఇంకా విశ్వసించని వారి దృష్ట్యా లేదా రానున్న కాలంలో పుట్టబోయే వారి అవసరాల దృష్ట్యా కూడా ఇలా చేయటం అనివార్యం అయింది.

(1) విశ్వసించిన జనుల దృష్ట్యా ఇలా ఎందుకు చేయవలసి వచ్చిందంటే –

తొలుత వారికసలు ఇస్లాం గురించి ఏమీ తెలీదు. ఇస్లాం సందేశ ప్రదాత (స) వారిపై మొదటి నుంచీ పనిచేయాల్సి వచ్చింది. అందువల్ల ఆదేశాలు, ఉపదేశాల విషయంలో వారి అంతర్బాహ్యా స్థితిగతులు ఎలా ఉండేవన్నది మాత్రమే చూడటం జరిగేది. వారికి ఏ సమయంలో, ఏ ఉపదేశం చేయాల్సిన అవసరం ఉందో గమనించటం జరిగేది. కాని సందేశం పూర్తయ్యేనాటికి వారి స్థితి ఒక్కసారిగా మారిపోయింది. అప్పటికి వారు కుర్‌ఆన్‌ను హృదయపూర్వకంగా నమ్మినడుచుకో

సాగారు. విశ్వసించి 'ఉమ్మతె ముస్లిమా' (ముస్లిం సముదాయం) అయ్యారు. దైవప్రవక్త (స) తదనంతరం సత్యధర్మ ధ్వజవాహకులుగా ఉత్తరదాయిత్వాన్ని నిర్వర్తించవలసిన 'ఉమ్మతె ముస్లిమా' ఇది. దైవప్రవక్త (స) అరేబియా గడ్డపై సైద్ధాంతికంగా, క్రియాత్మకంగా పూర్తిచేసి ఇచ్చిన మిషన్‌ను ప్రపంచంలో ముందుకు తీసుకుపోవలసిన శ్రేష్ఠ సముదాయమది!! పరిస్థితుల స్వరూపంలోని ఈ మార్పు దృష్ట్యా ఇప్పుడు కుర్‌ఆన్ వారికి అవతరణా క్రమంలో కాకుండా మరో వినూత్న క్రమంలో కూర్పు కావలసిన ఆవశ్యకత ఉంది. ఆ కొత్త కూర్పు (క్రోడీకరణ) ధార్మిక వాస్తవాలను విడమరచి చెప్పటంలో, షరీఅత్ ఆదేశాలను విశదీకరించటంలో, ఇస్లాం ధర్మం సారాంశాన్ని బోధపరచటంలో వారికి సహాయకారిగా ఉండాలి.

(2) ఇకపోతే, ఏదయినా కారణంచేత విశ్వసించనివారు – లేదా ఇప్పటి వరకూ ఈ సందేశం విననివారు లేదా ఈ పుడమిపై ఇంకా కాలిడనివారు – రానున్న కాలంలో ఈ సందేశం వైపునకు ఆహ్వానించబడేవారు. వీరి అవసరాల, స్థితిగతుల దృష్ట్యా కూడా నూతన తరహాలో కుర్‌ఆన్ క్రోడీకరణ జరగవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉండింది. ఎందుకంటే ఏ వాక్కు అయినా అందాలు జాలువారే రీతిలో, నుడికారపు వొంపుసొంపులతో ముస్తాబు కానంతవరకూ దాని లక్ష్యం నెరవేరదన్నది తిరుగులేని వాస్తవం. అది ప్రజల హృదయాంతరాళాల్లోకి చొచ్చుకుపోవాలంటే దానిలోని వివిధ అంశాలను పొందికగా అమర్చాలి. విషయం సుబోధకం అయ్యే తీరులో దాని భాగాలను కూర్చాలి. విషయం సుబోధకం కానంతవరకూ ప్రజాబాహుళ్యంలో దానికి ప్రాచుర్యం లభించదు. దివ్య కుర్‌ఆన్ ప్రళయదినం వరకూ దేవునిచే సమ్మతించబడిన ఏకైక మార్గదర్శక గ్రంథం కావటం వల్లనూ, ప్రతి వ్యక్తీ, ప్రతి జాతీ దానిని దైవగ్రంథంగా అంగీకరించవలసిన ఆవశ్యకత ఉండటం వల్లనూ, సాధారణ జనులు, ఆలోచనాపరులు ఈ గ్రంథంలోని భావార్థాలను, కళాత్మక విలువలను తనివితీరా ఆస్వాదించి, తాదాత్మ్యం చెందాలంటే దానికి తగిన ఉరవడి చాలా అవసరం. ఒకవేళ ఈ గ్రంథం అవతరించిన క్రమంలోనే క్రోడీకరించబడి ఉంటే పాఠకులు ఎంతగా ఇబ్బంది పడాల్సివచ్చేదో ఆలోచించండి! ఒకవేళ ఈ గ్రంథమే గనక తనలోని అంశాలను సొగసైన శైలిలో, పారమార్థిక సమన్వయంతో, రమణీయమయిన పదబంధాలతో, మనోజ్ఞమయిన తీరులో వివరించకపోతే ప్రజలకు సత్యం ఎలా బోధపడుతుంది?

ఈ కారణాల దృష్ట్యా కుర్‌ఆన్‌ను గనక అవతరణా క్రమం ప్రకారమే క్రోడీకరించివుంటే, అది ముహమ్మద్ (స)కు అందిన దివ్యవాణికి సంబంధించిన 'రోజువారీ డైజెస్ట్'లా రూపొందేదే. నేడు అది అవతరణా తేదీల పట్ల ఆసక్తి చూపే

వారికి బాగా ఉపయోగపడేదే. కాని మార్గదర్శకత్వం కొరకు తహతహలాడే వారికి అది నిలువెల్లా మార్గదర్శినిగా ఉండేది కాదు. అందులోని ఎన్నో మనోజ్ఞమయిన యదార్థాలు కనుమరుగైపోయి ఉండేవి.

## క్రోడీకరణ చరిత్ర

రండి, కురాన్ క్రోడీకరణ ఎప్పుడు జరిగిందో, ఎవరెవరి ద్వారా జరిగిందో తెలుసుకుందాం. ఈ లక్ష్యం కొరకు చూడవలసిన సాధనాలు ఇవి :

ఒకటి : కుర్ఆన్ స్వయంగా చెప్పుకున్న విషయం. రెండు : చరిత్ర ఇచ్చే సాక్ష్యం.

(1) దీని గురించి కుర్ఆన్‌లో చెప్పబడిన విషయంలోని పదజాలం ఇలా ఉంది –

إِنَّ عَلَيْنَا جَمْعَهُۥ وَقُرْءَانَهُۥ ﴿١٧﴾ فَإِذَا قَرَأْنَٰهُ فَٱتَّبِعْ قُرْءَانَهُۥ ﴿١٨﴾ (القيامة)

“(ముహమ్మద్–స)! నిశ్చయంగా దీనిని కూర్చే, చదివి వినిపించే బాధ్యత మాది. కనుక మేము దీనిని చదివి వినిపించినప్పుడు నీవు ఆ పారాయణాన్ని శ్రద్ధగా అనుసరించు.”

*(అల్ కియామహ్ – 17, 18)*

‘మేము చదివి వినిపించినప్పుడు ...’ అంటే మా దూత (జిబ్రీల్ –అ) నీకు చదివి వినిపించినప్పుడు అని భావం. దీనిద్వారా కుర్ఆన్ క్రోడీకరణ విషయమై ప్రతి ఒక్క కోణం సర్వవిధాలా ప్రకాశమానం అయిపోతుంది. ఉదాహరణకు :

(1) కురాన్ ‘కూర్పు’లో స్వయంగా ప్రవక్త సంకల్పానికి, చర్యకు, స్వేచ్ఛాధికారానికి, పర్యాలోచనకు ఎలాంటి ప్రమేయం లేదు. పైగా ఈ కార్యమంతా అల్లాహ్ నిర్వర్తించినదే. ఈ వ్యవహారంలో ప్రవక్త (స) చేయవలసిందల్లా ఒక్కటే – సందేశదూత జిబ్రీల్ (అ) పఠిస్తున్నది శ్రద్ధగా ఆలకించటం, కచ్చితంగా దానిని అనుసరించటం!

(2) కురాన్ కూర్పు భావంలో వరుసక్రమం, క్రోడీకరణ కూడా ఇమిడి ఉంది. అంటే, ఈ సూక్తి ద్వారా రూఢీఅయ్యే మరో విషయం ఏమిటంటే, దీని ‘క్రోడీకరణ’ కూడా దైవికంగా జరిగినదే. ఎందుకంటే సందేశవాహకుడైన జిబ్రీల్ (అ) అంతిమ దైవప్రవక్త (స)కు కుర్ఆన్ చదివి వినిపించినప్పుడు దాని వచనాలను,

అధ్యాయాలను ఏదో ఒక వరుస క్రమంలోనే వినిపించారన్నది సుస్పష్టం. కాబట్టి فَاتَّبِعْ قُرْاٰنَهٗ (నీవు ఆ పఠనాన్ని శ్రద్ధగా అనుసరించు). అంటే భావం జిబ్రీల్ నీకు చదివి వినిపించినదే నీవు చదువు అని ఎంతమాత్రం కాదు; ఈ సూక్తుల, అధ్యాయాల (సూరాల) అనుక్రమణిలో పాటించబడిన నియమానికి కూడా నీవు కట్టుబడి ఉండు. అదే వరుసక్రమంలో నీవు కుర్ఆన్ పారాయణం చేస్తూ ఉండు అని భావం. అందుచేత ఈ సూక్తిలో ప్రస్తావించబడిన 'కుర్ఆన్ కూర్పు'ను అల్లాహ్ తన బాధ్యతగా తీసుకున్నాడు. అది కేవలం కుర్ఆన్ పదాల, సూక్తుల, అధ్యాయాల కూర్పు ఒక్కటే కాదు, ఆ కూర్పులో వరుసక్రమం, క్రోడీకరణ కూడా అవశ్యంగా ఇమిడి ఉంది.

(3) దైవికమయిన ఈ క్రోడీకరణ, కూర్పు ప్రవక్త మహనీయుల (స) వారి సమక్షంలో జరిగింది. చెల్లాచెదురుగా, క్రమరాహిత్యంగా అవతరించిన కుర్ఆన్‌ని ప్రవక్త (స) పరమపదించిన తరువాత – దైవ వాగ్దానం ప్రకారం – పూర్తి చేయడం జరగలేదు. ఒకవేళ అలా జరిగేటట్లయితే, 'మేము దీనిని చదివి, వినిపిస్తున్నప్పుడు, నీవు ఆ పారాయణాన్ని శ్రద్ధగా అనుసరించు' అని చెప్పటంలో అర్థమే లేదు.

వీటన్నింటితో పాటు మరో విషయం కూడా – బౌద్ధికంగా – ఒక తిరుగులేని యదార్థంగా ఉంది. అదేమిటంటే; ప్రవక్త మహనీయులు (స) తన దైవదౌత్యపు ఆఖరి క్షణాలలో కుర్ఆన్‌ను ఏ స్థితిలో, ఏ వరుస క్రమంలో ఉమ్మత్‌కు అప్పగించారో అది సరిగ్గా దేవుడు ప్రసాదించిన స్థితిలోనే ఉంది. ప్రళయదినం వరకూ మానవ జీవితానికి మార్గదర్శకంగా ఉండాల్సిన గ్రంథం దైవప్రవక్త (స) ద్వారా అనుయాయులకు అందుతున్నప్పుడు అది సరిగ్గా అలా ఉండి తీరాలని మన బుద్ధి కూడా చెబుతుంది. దైవప్రవక్త (స) ఈ విధంగా ఆదేశించబడటం కూడా గమనార్హమే –

يَاۤاَيُّهَا الرَّسُوْلُ بَلِّغْ مَاۤ اُنْزِلَ اِلَيْكَ مِنْ رَّبِّكَ ؕ وَاِنْ لَّمْ تَفْعَلْ فَمَا بَلَّغْتَ رِسَالَتَهٗ ؕ ..(المائدة:٦٧)

"ప్రవక్తా! నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి; ఒకవేళ నీవు ఆ విధంగా చెయ్యకపోతే ఒక ప్రవక్తగా నీవు నీ ధర్మాన్ని నిర్వహించనట్లే."

*(అల్ మాయిద : 67)*

కచ్చితంగా అలాగే జరిగిందన్నదానికి ఇది ప్రబల సాక్ష్యం. ఎందుకంటే కేవలం కురాన్ పదాలు, వచనాలు మాత్రమే అల్లాహ్ తరఫు నుండి లేవు. దాని

క్రమబద్ధీకరణ, క్రోడీకరణ కూడా ఆయన తరఫుననే ఉంది. వెనుకటి పంక్తులలో ప్రస్తావించబడిన వచనాల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అయింది. కాబట్టి ఈ క్రమబద్ధత, క్రోడీకరణ కూడా అవశ్యంగా مَآ أُنْزِلَ إِلَيْكَ مِنْ رَّبِّكَ (నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరించిన) అందులో అంతర్లీనమై ఉంది. ఆ తరువాత 'ప్రజలకు అందజెయ్యి' అన్న ప్రభువాజ్ఞను శిరసావహించటం దైవప్రవక్త (స)కు కేవలం పదాలతో, సూక్తులతో సాధ్యం కాదు. తనకు కురాన్ అందిన క్రమంలో ప్రజలకు అందజేసినపుడే ఒక ప్రవక్తగా ఆయన తన ధర్మాన్ని యథాతథంగా నిర్వర్తించినట్లవుతుంది.

(2) చారిత్రక ఉల్లేఖనాల ద్వారా కూడా ఈ విషయానికి వివరణ లభిస్తుంది. తిర్మిజీలోని ఒక ఉల్లేఖనం, హజ్రత్ ఉస్మాన్ (రజి) కథనం కూడా ఇంతకు ముందు ప్రస్తావనకు వచ్చింది. దాని ననుసరించి ప్రవక్త (స) తనపై దివ్యవాణి అవతరించినప్పు డల్లా – తన లేఖకులను అప్పటికప్పుడే పిలిచి ఆ సూక్తులను ఫలానా అధ్యాయంలో, ఫలానా చోట పొందుపరచమని ఆజ్ఞాపించేవారు. ఈ నేపథ్యంలో క్రింది వివరాలను కూడా చూడండి :

"ఎందుకంటే దైవదూత జిబ్రీల్ (అ) రమజాన్ నెలలో ప్రతి రాత్రీ వచ్చి దైవప్రవక్త (స)ను కలుసుకునేవారు. ఈ సందర్భంగా దైవప్రవక్త (స) ఆయనకు కురాన్ పఠించి వినిపించేవారు." (బుఖారీ – ఫజాయెలుల్ కురాన్)

لِأَنَّ جِبْرَئِيلَ كَانَ يَلْقَاهُ فِي كُلِّ لَيْلَةٍ فِي شَهْرِ رَمَضَانَ حَتَّى يَنْسَلِخَ يَعْرِضُ عَلَيْهِ رَسُولُ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ الْقُرْآنَ

(بخاری فضائل القرآن)

"దైవదూత జిబ్రీల్ ఏటేటా రమజాన్‌లో దైవప్రవక్త (స)కు ఒకసారి కురాన్ చదివి వినిపించేవారు. దైవప్రవక్త (స) పరమపదించిన సంవత్సర మైతే రెండుసార్లు వినిపించారు." (బుఖారీ – కితాబు ఫజాయెలుల్ కుర్‌ఆన్)

كَانَ يَعْرِضُ عَلَى النَّبِيِّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ الْقُرْآنَ كُلَّ عَامٍ مَرَّةً فَعُرِضَ عَلَيْهِ مَرَّتَيْنِ فِي الْعَامِ الَّذِي قُبِضَ

(بخاری، کتاب فضائل القرآن)

ఈ ఉల్లేఖనాల ద్వారా రూఢీఅయ్యేదేమిటంటే, కుర్‌ఆన్ అవతరణ విషయంలో

దైవదూత జిబ్రీల్ (అ) పని కేవలం కురాన్ వాణిని అందజెయ్యటంతోనే పూర్తవలేదు. పైగా ఆయన ప్రతి సంవత్సరం రమజాన్ మాసంలో – అప్పటి వరకు అవతరించిన కుర్‌ఆన్ భాగాలను – ఒకేసారి చదివి వినిపించే బాధ్యత కూడా ఆయనపై దైవం తరపున మోపబడింది. అలాగే ప్రవక్త మహనీయుల (స) చేత అప్పగించబడే పాఠం కూడా ఆయన వినేవారు. ప్రవక్త (స) జీవిత కాలంలోని చివరి రమజాన్ వచ్చినప్పుడు పూర్తి కురాన్ (అప్పటికి దాని అవతరణ దాదాపు పూర్తికావచ్చింది) ఒకసారి కాకుండా రెండుసార్లు చదివి వినిపించే, ప్రవక్త (స) నుండి రెండుసార్లు పాఠం వినే బాధ్యత కూడా జిబ్రీల్‌పై మోపబడింది. కాస్త ఆలోచించండి! ఆఖరి రమజాన్‌లో ఒకవైపు నుండి దైవదూత, మరో వైపు నుండి దైవప్రవక్త (స) రెండేసిసార్లు ఒండొకరికి కుర్‌ఆన్ ఒప్పజెప్పినప్పుడు అందులో క్రమబద్ధీకరణ ఉండకపోవటం అనేది సంభవమేనా? ఒకవేళ ఎవరయినా అలా ఆలోచిస్తే అది తప్పు. అది కచ్చితంగా నిర్ధారిత వరుస క్రమంలోనే చదివి వినిపించటం జరిగింది. అల్లాహ్ సన్నిధిలో ఆది నుండే నిర్ధారితమై ఉన్న వరుస క్రమం అది. "هُوَ قُرْآنٌ مَّجِيدٌ فِي لَوْحٍ مَّحْفُوظٍ" (ఆ కుర్‌ఆన్ మహత్తరమైనది, ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉన్నది) (అల్ బురూజ్ – 21, 22) అన్న సూక్తుల ప్రకారం సురక్షితంగా ఉన్నది. ఈ వరుస క్రమం ప్రకారమే దైవప్రవక్త (స) తన అనుచర సమాజానికి దీనిని అందజేయటం ఎంతో సహజం. ఈ వరుస క్రమంలోనే అది ఆనాటి నుండి ఈనాటి వరకూ పఠించబడుతోంది. ఇదొక చారిత్రక విషయం. నేడు ముస్లిం సముదాయం కుర్‌ఆన్ పారాయణం చేస్తున్న వరుస క్రమాన్ని శోధించటం మొదలెడితే – అది శతాబ్దులు వెనక్కిపోయి – ప్రవక్త (స) తన సహచరులకు నేర్పిన క్రమంతో కలుస్తుంది. ఆ ప్రియ సహచరులు (రజి) తమ తరువాతి తరానికి దానిని అదేవిధంగా నేర్పారు. వారు తమ భావితరాల వారికి అలాగే నేర్పారు. ఆ అప్పగింత (అమానతు) ఇలాగే తరం తరం – నిరంతరం – కొనసాగుతూ వస్తోంది.

చెప్పవచ్చేదేమిటంటే కుర్‌ఆన్ క్రోడీకరణా క్రమం దైవికమైనది. అందులో ఏం జరిగినా అల్లాహ్ తరపుననే జరిగింది. కడకు దైవప్రవక్త (స)కు కూడా ఇందులో ఎలాంటి ప్రమేయం లేదు.

కాకపోతే ఈ కూర్పు విషయంలో కొన్ని పాక్షికమైన ఏర్పాట్లు దైవప్రవక్త (స) తరువాతి కాలంలో – ఖిలాఫత్ యుగంలో – చేయబడ్డాయి. కుర్‌ఆన్ క్రోడీకరణగానీ, దాని వ్రాతగానీ ఆ వరుస క్రమంలో ప్రజలను కంఠస్థం చేయించటంగానీ – ఇదంతా దైవప్రవక్త (స) హయాంలోనే జరిగిపోయింది. ఇందులో సందేహానికి లేశమయినా తావులేదు. కుర్‌ఆన్ సంస్మర్తల (హుఫ్ఫాజ్‌ల) మనోఫలకాలపై సరిగ్గా అదే వరుస

క్రమంలో అది చెరగని ముద్రవేసుకుంది. అయితే కుర్‌ఆన్ లిఖించబడిన వస్తువులు, పత్రాలు విడివిడిగా ఉండేవి. వేర్వేరు భాగాలుగా ఉండేవి. మహాప్రవక్త (స) పరమపదించిన మీదట – మొదటి సంవత్సరంలోనే – యమామాలో ముస్లిములు బనూ హునైఫా తెగవారితో యుద్ధం చేయాల్సివచ్చింది. ఆ యుద్ధంలో ఎంతోమంది కుర్‌ఆన్ సంస్మర్తలు అమరగతినొందారు. ఆ సందర్భంగా హజ్రత్ ఉమర్ (రజి) చింతాగ్రస్తులయ్యారు. (కుర్‌ఆన్‌ను రక్షిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసిన సంగతి నిజమే అయినప్పటికీ, దైవ వాగ్దానం పూర్తవటంలో విశ్వాసులుగా తాము కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించవలసిన ఆవశ్యకత ఉంది. అందుకే) తాము పూర్తి కుర్‌ఆన్‌ను సురక్షితంగా ఉంచే బాహ్యపరమయిన బందోబస్తును – ముందు జాగ్రత్తగా – చేసుకోవాలి. ఈ ఆలోచన రాగానే హజ్రత్ ఉమర్ (రజి) ప్రప్రథమ ఖలీఫా, దైవప్రవక్త (స) ప్రాణమిత్రులు అయిన హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళి పరిస్థితుల ఈ స్వరూపాన్ని విడమరచి చెప్పారు. వివిధ వస్తువులపై లిఖించబడివున్న కురాన్ భాగాలను ఒకే సమాహారంగా కూర్చాలని ప్రతిపాదించారు. మొదట్లో ఈ ప్రతిపాదనకు కార్యరూపం ఇవ్వడానికి ప్రథమ ఖలీఫా (రజి) తటపటాయించారు. దైవప్రవక్త (స) ఖుద్దుగా కుర్‌ఆన్‌ను ఒకే సమాహారంగా కూర్పు చేయనప్పుడు, ఆయన తన అనుచరులకు కేవలం కుర్‌ఆన్ కంఠస్థం చేయించడంతోనే సరిపెట్టుకున్నప్పుడు నేను మాత్రం ఆ పని ఎందుకు చేయాలి? అన్నది ఆయన ఉద్దేశం.

ఇది దైవప్రవక్త (స) పట్ల గల ప్రేమాతిశయంతో, ఆయన అడుగుజాడలలో నడిచే దీక్షతో వ్యక్తపరచిన అభిప్రాయమే. అన్యథా ఈ ప్రతిపాదనను కొట్టివేయడం ఆయన ఉద్దేశం కానేకాదు. అందుకే హజ్రత్ ఉమర్ (రజి) దీని పరమార్థాలను, ధార్మిక ప్రయోజనాలను గురించి ఖలీఫాకు పదే పదే నొక్కి వక్కాణించటంతో ఖలీఫా కూడా పునరాలోచనలో పడ్డారు. దీని ఆవశ్యకతను గుర్తించి కార్యాచరణకు ఉపక్రమించారు. ప్రవక్త (స) గారి సహచర్యంలో ఉండి, ప్రవక్త (స) లేఖకులుగా పనిచేసిన హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి)ని పిలిపించి, కుర్‌ఆన్‌ను ఒకే సంపుటంలో వచ్చేలా లిఖించమని ఆదేశించారు. కొంతమంది అగ్రశ్రేణి సహాబా (రజి) సహాయసహకారాలతో హజ్రత్ జైద్ (రజి) ఈ పనిని మొదలెట్టారు. హజ్రత్ ఉమర్ (రజి) మస్జిదెనబవీ దగ్గర నిలబడి, "ఎవరు ఎన్ని సూరాలు లిఖించి భద్రపరిచారో వారంతా వాటిని తీసుకురండి" అని ప్రకటించారు. ప్రతి వ్యక్తీ తన దగ్గర ఉన్న వ్రాతప్రతులను తీసుకువచ్చారు. హజ్రత్ జైద్ (రజి)తో పాటు ఈ కమిటీలో ఉన్న సహాబా అంతా కుర్‌ఆన్ సంస్మర్తలే. అదీగాక దైవప్రవక్త (స) చెప్పి వ్రాయించిన

ప్రతులు కూడా వారివద్ద భద్రంగా ఉన్నాయి. కాని వారు 'ముందు జాగ్రత్త' విషయంలో ఆఖరి అంచుల వరకూ వెళ్ళి ఇతర సాక్ష్యాలను కూడా సమకూర్చుకోవటం అవసరమని భావించారు. ఎవరయినా ఏదయినా సూరా వ్రాసిన పత్రాన్ని తీసుకునివస్తే అది దైవప్రవక్త (స) సమక్షంలోనే లిఖించబడిందో లేదో అడిగి తెలుసుకునేవారు. ఆ విషయానికి ఇద్దరు సాక్షులను కూడా తెమ్మనేవారు. సాక్ష్యాల దశను అధిగమించిన తరువాత తాము కంఠస్థం చేసిన ప్రకారం, తమవద్ద ఉన్న అసలు ప్రతి ప్రకారం అది ఉందో లేదో పోల్చి చూసుకునేవారు. ఆ తరువాతే దానిని లిఖించేవారు. ఈ విధంగా పూర్తి కుర్‌ఆన్ వ్రాయబడిన తరువాత ఆ ప్రతి ప్రథమ ఖలీఫా, విశ్వాసుల నేత అయిన హజ్రత్ అబూబకర్ (రజి) వద్ద భద్రపరచబడింది. ఆయన (రజి) మరణించిన తరువాత ఆ ప్రతి ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) వద్ద ఉండేది. ఉమర్ (రజి) మరణించిన తరువాత – ఆయన తన వారసుని ఎంపిక చేయకపోవటం వలన – ఆయన పుత్రిక, దైవప్రవక్త సతీమణి అయిన హజ్రత్ హఫ్సా (ర.అన్హా) వద్ద భద్రపరచబడింది. కుర్‌ఆన్ యొక్క ఈ ప్రతి ఒక విధంగా చెప్పాలంటే 'అధికారిక ప్రతి.' అందువల్ల దీని స్థాయి సామాన్య ప్రజలవద్ద ఉన్న ఇతర అసంఖ్యాకమయిన కుర్‌ఆన్ ప్రతుల కంటే ఎక్కువ ప్రమాణబద్ధమైనది.

ఈ విధంగా ఒక సుదీర్ఘ కాలం వరకు పూర్తి కుర్‌ఆన్ – ఒకే సంపుటంగా – సమీకరించబడి ఖిలాఫత్ కేంద్రస్థానంలో ఉంచబడింది. కాగా; సాధారణ ప్రజలు తమ జ్ఞాపకశక్తిపై, వ్యక్తిగతంగా తాము వ్రాసుకున్న ప్రతులపై ఆధారపడి ఉండేవారు. కడకు తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) హయాం (హిజ్రీ శకం 23) వచ్చింది. ఇస్లాం అరేబియా ఎల్లలు దాటి ఇటు తూర్పున ఈరాన్, అటు పశ్చిమాన ఈజిప్టు వరకూ విస్తరించింది. ఇస్లాం అనుయాయుల సంఖ్య లక్షల సంఖ్యను దాటి కోట్లకు చేరింది. అరబ్బేతరులు (అజమీలు) తండోపతండాలుగా ఇస్లాం పరిధిలో చేరసాగారు. కాని వారికి అరబీ భాష రాదు. అందువల్ల వారు కుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు తప్పులు దొర్లేవి. ఆఖరికి సిరియా, ఇరాక్ ప్రజలు కూడా ఈ దోషాలకు అతీతంగా ఉండలేకపోయారు. ఆర్మేనియా, ఆజర్‌బాయ్‌జాన్ యుద్ధం సందర్భంగా – ఈ రెండు చోట్ల కూడా జనులు గుమిగూడినప్పుడు హజ్రత్ హుజైఫా (రజి) ఆందోళన చెందారు. ఎందుకంటే కురాన్ పఠనా శైలిలోనూ, ఉచ్చారణలోనూ వారి మధ్య తీవ్రమయిన విభేదం కనిపించింది. యుద్ధం నుండి తిరిగి వచ్చాక ఆయన హజ్రత్ ఉస్మాన్ (రజి) కు ఈ పరిస్థితిని క్షుణ్ణంగా వివరించారు. ఈ ఉపద్రవ ద్వారాన్ని మూసివేసే చర్య గైకొనటం అనివార్యమని సూచించారు హుజైఫా (రజి). ఎందుకంటే ఈ విభేదం రాను రాను తీవ్రతరం కావచ్చు. గత కాలంలో ప్రజలు దైవిక గ్రంథాలలో ప్రక్షిప్తాలకు

పొల్పడినట్లుగానే, ముస్లింలు కూడా కుర్‌ఆన్ విషయంలో విభేదాలకు లోనయ్యే ప్రమాదం పొంచి ఉన్నట్లు కనిపించింది.

తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) అత్యంత ముఖ్యమయిన ఈ ధార్మిక సేవా కార్యక్రమాన్ని త్వరితగతిన చేపట్టాలని భావించారు. కుర్‌ఆన్ ఒరిజినల్ కృతిని కురైషీల పఠనాశైలి ప్రకారం సంగ్రహించి ఇస్లామీయ రాష్ట్రాలకు దానిని పంపించాలని నిర్ణయించారు ఖలీఫా. ఖిరాత్ (పఠనం) విషయంలో ప్రజల మధ్య పొడసూపే విభేదాలను నిరోధించాలన్నది దీని ఉద్దేశం. ఇందు నిమిత్తం ఆయన హజ్రత్ హఫ్సా (ర.అన్హా) దగ్గర భద్రపరచబడిన పెట్టెను తెప్పించారు. అందులో హజ్రత్ అబూబకర్ (రజి) హయాంలో వ్రాయించిన మూల ప్రతి ఉంది. దీనికి తుదిరూపం ఇవ్వడానికి హజ్రత్ జైద్ (రజి) సారథ్యంలో ఒక కమిటీని రూపొందించారు. ఆ కమిటీలో ముగ్గురు అగ్రశ్రేణి సహాబా అయిన అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి), సయీద్ బిన్ ఆస్ (రజి), అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్ (రజి) సభ్యులు. ఈ మహత్కార్యానికి అవసరమయిన సూచనలిచ్చారు. ఈ కమిటీ సారథ్యంలో అనేక ప్రతులు తయారయిన పిదప ఆయన (రజి) ఒక్కొక్క ప్రతిని ఈజిప్టు, కూఫా, బస్రా, సిరియా, యమన్, బహ్రెయిన్ రాష్ట్రాల గవర్నర్ల వద్దకు పంపించారు. "ఈ ప్రతి ప్రామాణికమయిన పాఠ్యాన్ని అనుసరించి లిఖించబడింది. కాబట్టి ఈ ప్రతిననుసరించి కురాన్ పారాయణం చేయబడాలని ప్రజలకు సూచించండి" అని ఉత్తర్వు జారీచేశారు. ఒక నకలు ప్రతిని మదీనాలో తన దగ్గర ఉంచుకున్నారు. దాని పేరు 'ఇమామ్'. ఆయన దారుణ హత్యకు గురైన సమయంలో అదే ప్రతిని పారాయణం చేస్తూ ఉన్నారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) కాలంలో నకలు చేయించబడిన ఈ ప్రతులు ఇప్పటికీ మక్కా, మదీనా, డెమాస్కస్, ఫారస్ (మొరాకో)లలో ఉన్నాయి.

కుర్‌ఆన్ కూర్పుకు సంబంధించి దైవప్రవక్త (స) తదనంతర కాలంలో పూర్తయిన రెండు ముఖ్య కార్యాలివి. అయితే కుర్‌ఆన్ కూర్పు, క్రోడీకరణ దైవికమనే మౌలిక విషయంపై దీని ప్రభావం ఎంతమాత్రం పడలేదు. వాస్తవానికి ఈ పనులు కూడా దైవ వాగ్దాన పరిపూర్తిలో – ఒకవిధంగా – అంతర్భాగం వంటివే. కురాన్ పరిరక్షణా స్ఫూర్తితో చేయబడిన పనులివి. హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి) చేతుల మీదుగా జరిగిన మహత్కార్యాలు ఇవి. ఇది సౌభాగ్యవంతులైన ఆ మనుషులపై వారి ప్రభువు చేసిన మహోపకారం అనాలి.

# సురక్షిత గ్రంథం

దివ్య కుర్‌ఆన్ విశిష్ఠ గుణాలలో ఒకటేమిటంటే అది యధాతథంగా – సురక్షితంగా – ఉంది. ఈ విషయంపై వెనుకటి పుటల్లో స్థూలంగా దృష్టి సారించటం జరిగింది కూడా. అయితే ఇది మామూలు ప్రాధాన్యత గల విషయం కాదు. చాలా గొప్ప విషయం! దూరదృష్టితో కూడిన ఫలితాలను వెలువరించే విషయం! ఈ ప్రాధాన్యత దృష్ట్యా ఈ విషయాన్ని కాస్తంత వివరంగా విశ్లేషించటం అవసరం.

## 'సురక్షితం' అంటే భావం

ఈ సందర్భంగా 'సురక్షితం' అంటే అసలేమిటో ముందుగా తెలుసుకోవాలి. అంటే ఏదయినా ఒక దైవగ్రంథం ఉన్నదున్నట్టుగా మిగిలి ఉండటం అంటే భావం ఏమిటి? అనేది. (1) నిఘంటువు, (2) సాధారణ బుద్ధీ వివేకాలు, (3) దివ్యవాణి (అవతరణా) లక్ష్యం – ఈ మూడింటి ద్వారా ఈ ప్రశ్నకు సమాధానం రాబట్టాలి. వాటి ద్వారా ఈ ప్రశ్నకు లభించే సమాధానం యిది :

ఏదయినా ఒక దైవగ్రంథం సురక్షితంగా మిగిలి ఉండటం అంటే భావం ఇది–

(అ) దాని పదాలు, వచనాలు దైవసన్నిధి నుండి అవతరించినప్పుడు ఎలా ఉండేవో ఇప్పుడూ అలాగే ఉండాలి.

(ఆ) దాని పదాల మధ్య గల అవినాభావ సంబంధం, వరుస క్రమం, వాటి ఆధారంగా జరిగిన వాక్యాల నిర్మాణం – ఆ గ్రంథాన్ని తీసుకువచ్చిన ప్రవక్త అల్లాహ్ పక్షాన అందజేసినప్పుడు ఎలా ఉండేవో ఇప్పుడూ అలాగే ఉండాలి.

(ఇ) వాటిలో ఏ ఒక్క దైవవచనం కూడా తప్పిపోకుండా ఉండాలి. లేదా వృధా కాకుండా ఉండాలి. లేదా దానిని తొలగించి, ఆ స్థానంలో మరో వాక్యాన్ని చేర్చటం లాంటిది జరగరాదు. లేదా వేరొక భాషానువాదం తెచ్చి మూలంలో జొప్పించి ఉండరాదు.

(ఈ) ఆ వాక్యాలలో తమ తరఫున ఎవరూ ఏదేని ఒక పదం అదనంగా చేర్చి ఉండకూడదు – ఆఖరికి దాన్ని తీసుకువచ్చిన ప్రవక్త సయితం తన తరఫున ఒక చిన్న పదం కూడా చేర్చి ఉండకూడదు.

ఈ విషయాలలో ఏ ఒక్కటి కలగలసినా ఇక ఆ గ్రంథం 'సురక్షితం'గా మిగిలి ఉండదు. అట్టి పరిస్థితిలో ఆ గ్రంథాన్ని అవతరింపజేసిన వాని అభిమతం

ఎప్పటికీ నెరవేరగలదన్న గ్యారంటీ ఏమీ ఉండదు. ఏదయినా ఒక అధ్యాయంలో పదాల హెచ్చుతగ్గుల సంగతి అలావుంచి, వరుసక్రమంలో మార్పు జరిగినాసరే అర్థంలో విపరీతమైన మార్పువచ్చేస్తుంది.

## సురక్షితంగా ఉండటం అనివార్యం

ఏ విధంగానయితే ఎవరయినా ఒక వ్యక్తి తనను దైవప్రవక్తగా ప్రకటించు కున్నప్పుడు అతను తన ప్రకటనలో సత్యవంతుడా? కాదా? అతని సత్య నిబద్ధతకు రుజువు ఏమిటి? లాంటి ప్రశ్నలు అన్నిటికన్నా ముందు ఉత్పన్నమైనట్లే, ఒక సత్యప్రవక్త తరఫున సమర్పించబడే గ్రంథం గురించి కూడా ఇలాంటి ప్రశ్నలు జనిస్తాయి – (1) ఇంతకీ ఈ గ్రంథం అతనిపై అవతరించినదేనా!? (2) ఒకవేళ ఈ గ్రంథం అదే అయినట్లయితే అది సర్వవిధాలా సురక్షితంగా ఉన్నదా? లేదా? ఎందుకంటే ఒక వ్యక్తి నిజంగా దైవప్రవక్తే అయి ఉండవచ్చు; కాని అతను అల్లాహ్ తరఫున సమర్పించే గ్రంథం యథాస్థితిలో లేకపోవచ్చు! ఈ దైవగ్రంథం పేరుతో ఈ రోజు మరేదయినా పుస్తకం సమర్పించబడి ఉండవచ్చు! లేదా ఆ ప్రవక్త సమర్పించిన గ్రంథం పేరుకు దైవగ్రంథమై ఉండొచ్చు; కాని దైవప్రవక్త తన అనుయాయులకు అందజేసిన ఆ గ్రంథంలో హెచ్చుతగ్గులు జరిగి ఉండవచ్చు! లేదా దాని పదాలు, అంశాలు తారుమారై ఉండవచ్చు! లేదా అసలు గ్రంథం (మూలగ్రంథం) ఒక భాషలో అవతరించగా, ఇప్పుడు కేవలం వేరొక భాషలో అనువాదం మాత్రమే మిగిలి ఉండవచ్చు–ఈ విధమయిన సమస్య ఏ ఒక్కటి ఎదురయినా అట్టి పరిస్థితిలో ఆ గ్రంథాన్ని 'సురక్షిత గ్రంథం' అని అనలేము. ఏ గ్రంథమైతే 'సురక్షితం'గా ఉండజాలదో దాని ఉద్దేశం, లక్ష్యం కూడా ఒక దైవగ్రంథంగా నెరవేరదు. ప్రక్షిప్తాలకు, మార్పులు చేర్పులకు పూర్వం దానికి ఏ ఔన్నత్యం, స్థానం ఉండేదో అది కూడా ఇప్పుడు మిగిలి ఉండదు. దానిని అనుసరించి తీరాలన్న నిబంధనలో కూడా సడలింపు వచ్చేస్తుంది, బలహీనపడిపోతుంది.

అందుకే ఏ దైవగ్రంథం విషయంలోనయినా ఆ గ్రంథం యథాస్థితిలో మిగిలి ఉన్నదా? లేదా? అన్న ప్రశ్న మానవ మస్తిష్కంలో జనించాల్సిందే. ఆ తరువాత దీనికి సంబంధించిన పరిశోధన చేయాల్సిందే – ముఖ్యంగా కుర్‌ఆన్ విషయంలోనయితే ఈ ప్రశ్న ఉత్పన్నమవటం, దాని గురించి పరిశోధన చేయటం అనివార్యం. ఎందుకంటే ఇతర దైవిక గ్రంథాలకు ప్రతిగా అదొక విలక్షణమయిన, విశిష్టస్థానం కలిగి ఉందన్న దావా చేసుకునే గ్రంథమాయె. అంటే అది ఇతర గ్రంథాల వంటిది కాదు, అది పాత గ్రంథాలన్నింటినీ రద్దుపరచిన గ్రంథం. దాని తరువాత మరే గ్రంథమూ

అవతరించదు. అది సమస్త జగతి కొరకు విధిగా అనుసరించదగినది. ప్రళయదినం వరకూ దేవుని తరఫున సమ్మతించి ఆమోదించబడిన మార్గదర్శక సంవిధానమది – అది చేసుకునే ఈ దావా దృష్ట్యా దాని 'సురక్షిత స్థితి'కి సంబంధించిన వ్యవహారం కేవలం సైద్ధాంతికమయిన, శాస్త్రీయమయిన వ్యవహారంగా ఉండలేదు; పైగా అది మానవ జీవితపు అత్యంత ముఖ్యమయిన క్రియాత్మక విషయంగా మారిపోతుంది. అతని ప్రాపంచిక సాఫల్యం, పారలౌకిక మోక్షం – రెండునూ దానితో పెనవేసుకు పోతాయి. దాని ఈ విశిష్టస్థాయి వాంఛించేదేమిటంటే; ఈ పుడమిపై మానవ మనుగడ సాగినంతకాలం అది కూడా సంపూర్ణంగా – సురక్షితంగా – విరాజిల్లాలి. దాని సురక్షిత స్థితి దాని సత్యతకు ఒక అనివార్య రుజువు అవాలి. ఇన్ని అంశాలు ముడిపడి ఉన్నప్పుడు, కుర్‌ఆన్ పూర్తిస్థాయిలో సురక్షితంగా ఉన్నదా? అన్న ప్రశ్న జనించకపోవడానికి తగు కారణమేదీ కనిపించదు. కుర్‌ఆన్ పేరుతో ఈనాడు ప్రపంచంలో ఉన్న గ్రంథం తన భాష, తన పదజాలం, తన విషయం, తన క్రమబద్ధీకరణ, తన పారాయణం రీత్యా – ఇలా సర్వవిధాలా మహనీయ ముహమ్మద్ (స)పై అవతరించిన దైవగ్రంథం మాదిరిగానే ఉందా? అన్న ప్రశ్న కూడా ఉత్పన్నం కాకుండా ఉండదు.

## కుర్‌ఆన్ పరిరక్షణకై తీసుకోబడిన క్రియాత్మక జాగ్రత్తలు

ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకునే ముందు కుర్‌ఆన్‌ను అందజేసిన వారు (స) దానిని సురక్షితం గావించటానికి తీసుకున్న జాగ్రత్తలేవి? అన్న విషయం తెలుసుకోవటం సమంజసం, అవసరం. హదీసులలో ఈ కట్టుదిట్టమయిన ఏర్పాట్ల ద్వారా మనకు లభించే వివరాలివి :

(1) దైవదౌత్య దర్బారులో దివ్యవాణి (వహీ)ని లిఖించే లేఖకులు నియమితులై ఉండేవారు. వారు ప్రవక్త ప్రియ సహచరులలో నుండి ప్రత్యేకంగా ఎంపిక చేసుకోబడినవారు. మక్కాలో ఉండగా హ్రజత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి), హ్రజత్ అలీ (రజి) ఈ విధిని నిర్వర్తించేవారు. మదీనా వచ్చిన తరువాత వీరితోపాటు హ్రజత్ జుబైర్ బిన్ అవామ్ (రజి), ఉబై బిన్ కఅబ్ (రజి), హన్జల బిన్ రబీ (రజి), జైద్ బిన్ సాబిత్ (రజి), ఉబై బిన్ ఫాతిమా (రజి), అబ్దుల్లాహ్ బిన్ అర్కమ్ (రజి), షర్జీల్ బిన్ హుస్న (రజి), అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి), అమీర్ ముఆవియా (రజి), ఖాలిద్ బిన్ సయీద (రజి), అబ్బాస్ బిన్ సయీద్ తదితరులు మొత్తం 24 మంది లేఖకులు ఉండేవారు. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం మొత్తం 42 మంది లేఖకులు

ఈ బాధ్యతను నిర్వర్తించేవారు. వారిని కుర్‌ఆన్ سَفَرَةٍ كِرَامٍ بَرَرَةٍ (గౌరవనీయులు, సజ్జనులైన లేఖకులు)గా అభివర్ణించింది. ఎప్పుడు దివ్య వాణి (వహీ) అవతరించినా దైవప్రవక్త (స) వెంటనే ఎవరయినా ఒక లేఖకుణ్ణి పిలిచి, "ఈ వచనాలను ఫలానా అధ్యాయంలో ఫలానా వచనం తరువాత వ్రాసుకోండి" అని చెప్పేవారు. లేఖకుడు కొత్తగా అవతరించిన ఈ వచనాలను లిఖించిన తరువాత, దైవప్రవక్త (స) వాటిని అతని చేత చదివించేవారు. వ్రాతలో ఏదయినా తప్పు జరిగితే అప్పటికప్పుడే దానిని దిద్దించేవారు. వహీ లేఖకులలో అగ్రగణ్యులైన హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) స్వయంగా ఈ విషయం చెప్పారు :

"فَإِذَا فَرَغْتُ قَالَ اِقْرَأْهُ فَاقْرَأُهُ فَإِنْ كَانَ فِيهِ سَقَطٌ أَقَامَهُ"

దరిమిలా దాని ప్రాచుర్యం గురించి ఆనతి ప్రదానం చేయబడేది. దివ్యవాణిని లిఖించిన వ్యక్తి తన పనిపూర్తిచేసుకుని బయటికి రాగానే అక్కడున్న సాధారణ ముస్లిములకు ఈ నూతన వచనాలను చదివి వినిపించేవాడు. వ్రాయటం వచ్చినవారు స్వయంగా వాటిని వ్రాసుకునేవారు. మిగిలినవారు వాటిని కంఠపాఠం చేసుకునేవారు. ఈ విధంగా ఒక వైపున కుర్‌ఆన్‌ను లిఖించే ఏర్పాటు 'అధికారికం'గా జరిగితే, మరోవైపున చాలామంది సహాబా వ్యక్తిగత స్థాయిలో వ్రాసుకునేవారు. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి), హజ్రత్ ఉబై బిన్ కఅబ్ (రజి), హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి), హజ్రత్ అబూ జైద్ (రజి) మొదలగువారు పూర్తి కురానును క్రోడీకరణ రూపంలో వ్రాసుకున్నారు (బుఖారీ, కితాబు ఫజాయెలుల్ కురాన్).

లేఖనం (వ్రాత) కోసం శుద్ధిచేసిన సన్నని చర్మాన్ని, మాంసంపైన ఉండే పలుచని పొరను, ఖర్జూరపు కమ్మలను, తెల్లనిరాయి యొక్క పలుచటి పలకలను, ఒంటె తొడలలోని వెడల్పాటి ఎముకలను ఉపయోగించటం జరిగేది.

(2) దైవప్రవక్త (స) నోట ఏ మాట వెలువడినా, ఆయన ఏ హితోక్తి పలికినా అది ధర్మం (దీన్)కు సంబంధించినదే అయి ఉంటుంది గనక ఆయన ప్రవచనాలు దైవవాక్కుతో కలగాపులగం అయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే ఆయన (స) తన సహచరులకు لَا تَكْتُبُوا عَنِّي شَيْئًا إِلَّا الْقُرْآنَ (కురాన్ తప్ప నా నోట వెలువడిన మాటలను వ్రాసుకోకండి) అని ఆదేశించారు. (తిర్మిజీ)

(3) ఒకవైపు అల్లాహ్ తరఫు నుండి అవతరించిన ప్రతి వచనం వీలయినంత తొందరగా లిఖించే ఏర్పాటు జరిగితే, మరోవైపు దైవప్రవక్త (స) స్వయంగా దానిని

కంఠస్థం చేసుకునేవారు. తన ప్రియ సహచరుల (రజి)కు కంఠస్థం చేయించేవారు. పదే పదే ఆ వచనాన్ని చదివించి వింటూ ఉండేవారు. తాను సయితం సహచరులకు పారాయణం చేసి వినిపించేవారు. ఎక్కడా ఒక అక్షరంగానీ, పొల్లుగాని తప్పిపోకుండా ఉండాలన్నది దీని ఉద్దేశం. ఆ సమయంలో అక్కడ లేని సహచరులకు తరువాత నేర్పించేవారు, జ్ఞాపకం చేయించేవారు. అంతేకాదు, సామూహికంగా కురాన్ చదివి వినిపించే సమావేశాలు కూడా జరిగేవి. మక్కాలోని హజ్రత్ అర్కమ్ మఖ్‌జూమీ (రజి) నివాస గృహాన్ని ఆయన 'కుర్‌ఆన్ పాఠశాల'గా నిర్ధారించారు. ఆయన (స) సాటి ముస్లిములతో కలిసి అక్కడకు వెళ్ళి సామూహికంగా కుర్‌ఆన్ పఠనం చేయించేవారు (ఈ చారిత్రక, శుభప్రదమయిన నిలయం మక్కాలో ఇప్పటికీ ఉంది).

మదీనాకు వలస వచ్చాక అక్కడ కురాన్ పఠించే, నేర్పించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వారు ఇస్లామీయ చరిత్రలో 'అస్‌హాబె సుఫ్ఫా' (అరుగువాళ్ళు) గా సుప్రసిద్ధులయ్యారు. ఇంతకీ వీరెవరంటే, హిజ్రత్ సందర్భంగా మక్కాలో తమ ఇల్లూ వాకిలిని, సర్వస్వాన్నీ విడిచి వచ్చేసిన పేద ప్రజలు. మదీనాలో వారికి నివాస గృహాలు లేకపోవటంచేత మస్జిదె నబవీలోని అరుగుపైనే గడిపేవారు. వారి సంఖ్య దాదాపు 80 వరకూ ఉండేది. వారు తమ జీవితాన్ని ఇస్లాం ధర్మం కొరకు పూర్తిగా అంకితం చేశారు. వారి ధార్మిక విధులు, బాధ్యతలలో ఒకటేమంటే; మదీనా వెలుపలి నుండి ఏ తెగవారైనా ఇస్లాం స్వీకరిస్తే వారికి ధార్మిక శిక్షణ ఇచ్చేవారు. కుర్‌ఆన్ నేర్పేవారు. ఎప్పుడు దివ్యవాణి (వహీ) అవతరించినా దైవప్రవక్త (స) ఈ సహాబీలకు దానిని కంఠస్థం చేయించేవారు. వారు బాగా కంఠస్థం చేసుకున్న మీదట మదీనా వీధులలో విస్తరించి ప్రజలకు వినిపించేవారు. ఈ ప్రణాళికా బద్ధమయిన ఏర్పాట్ల ద్వారా జరిగిన గొప్ప మేలు ఏమిటంటే, కుర్‌ఆన్‌ను అందజేసిన ప్రవక్త (స) ఎలాగూ 'హాఫిజె కుర్‌ఆన్' అవటంతోపాటు, ఆయన ప్రియ సహచరులలో కూడా చాలామంది హృదయ ఫలకాలపై కుర్‌ఆన్ భద్రమై ఉండేది. వారు కూడా కురాన్ హుఫ్ఫాజ్ (కురాన్ సంస్మర్తలు) అయ్యారు. ఇతర సహాబా కంటే అస్‌హాబె సుఫ్ఫాకు అధికంగా ప్రవక్త సహచర్య భాగ్యం ప్రాప్తించింది. ఇక మిగిలిన సహాబా కూడా వారు హుఫ్ఫాజ్‌లు కాకపోయినా ప్రతి ఒక్కరూ కురాన్‌లో ఎంతో కొంత భాగం కంఠస్థం చేసుకున్నవారే. ఎందుకంటే ఒక వ్యక్తి దైవప్రవక్త సహచరునిగా ఉండి, కుర్‌ఆన్‌లో కొంత భాగమయినా హిఫ్జ్ (సంస్మరణ) చేసుకోకుండా ఉండటం అనేది అసంభవం. అది విశ్వాసంతోనూ, ఇస్లాం ధర్మంతోనూ ఏమాత్రం పొసగని విషయం.

ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే; అరబ్బులు జ్ఞాపక శక్తిలో సాటిలేనివారు. వారి జ్ఞాపక శక్తికి సంబంధించిన విచిత్రమయిన సంఘటనలు చరిత్ర పుస్తకాలలో చదువుతాము. వారు సుదీర్ఘమయిన పద్యాలను, కీర్తనలను ఒకట్రొండుసార్లు వింటే చాలు, వారికి కంఠపాఠం అయిపోయేది. గుర్రాల, ఒంటెల వంశ పరంపరను, వాటి పేర్లతో సహా చెప్పటం వారికి ఉగ్గుతో పెట్టిన విద్య. అటువంటి ఒక జాతికి ఖుర్ఆన్‌ను రక్షించే (హిఫ్జ్ చేసే, భద్రపరిచే) బాధ్యతను అప్పగించటం కూడా దైవికంగా జరిగిన మహత్తర ఏర్పాట్లలో ఒకటిగా చెప్పవచ్చు.

## ఖుర్ఆన్ సురక్షిత గ్రంథం అనడానికి ప్రబల నిదర్శనాలు

ప్రాథమిక విషయాలు తెలుసుకున్న మీదట రండి, ఇప్పుడు మనం ఒక విషయాన్ని తరచి చూద్దాం – ప్రస్తుతం ప్రపంచమంతటా ప్రాచుర్యంలో ఉన్న ఖురాన్ గ్రంథం యధాతథంగా ముహమ్మద్ (స)పై అవతరించిన ఖురాన్ గ్రంథమేనా? ఆయన (స) తన అనుచర సమాజానికి అందజేసిన ఆ గ్రంథం తు.చ. తప్పకుండా అలాగే – సురక్షితంగా – ఉందా?

ఈ లక్ష్యం కొరకు మీరు గనక ఈ అంశంతో ముడిపడివున్న వాస్తవాలపై దృష్టిని సారిస్తే రెండు రకాల విషయాలు మీ దృష్టికి వస్తాయి. (1) ఒక రకం విషయాలు బౌద్ధిక (లేక సహేతుక) నిదర్శనాల వంటివి. కాబట్టి అవి ఖురాన్ గ్రంథం సురక్షితమైనదనే దానికి ముస్లింలకు, ముస్లిమేతరులకు కూడా రుజువుగా ఉంటాయి. (2) రెండవ రకం నిదర్శనాలు స్వయంగా ఖుర్ఆన్ ప్రకటనల నుండి సంగ్రహించబడినవి. కాబట్టి ఇవి కేవలం ముస్లింలకు ప్రమాణంగా ఖరారవుతాయి.

## (I) బౌద్ధిక నిదర్శనాలు

ముందు బౌద్ధికమయిన నిదర్శనాలను తీసుకోండి. పూర్తిగా శాస్త్రీయ, చారిత్రక, హేతుబద్ధమయిన పరిశోధనల వెలుగులో ఖుర్ఆన్ సురక్షిత గ్రంథంగా రూఢీ అవుతుందో లేదో చూడండి.

ఏదయినా మార్గదర్శక నియమావళిని లేదా శాసన స్మృతిని లేదా ఏదయినా గ్రంథాన్ని సురక్షితంగా ఉంచే రూపాలు రెండే రెండు. (1) హిఫ్జ్ (కంఠస్థం చేసుకోవటం), (2) లేఖనం (వ్రాసుకోవటం). కనుక ఖుర్ఆన్ గ్రంథం సురక్షిత స్థితిని తెలుసుకునేందుకు, అది సంతృప్తికరమైన విధంగా కంఠస్థం చేసి అప్పగించబడుతున్నదా? ఒకవేళ అలా లేకుంటే అది బాధ్యతాయుతంగా లిఖించబడిందా? లేదా? కంఠస్థం చేసుకునే,

వ్రాసుకునే ఆ ప్రక్రియ ఇప్పటి వరకూ నిరాఘాటంగా సాగుతూ వచ్చిందా? లేదా? అన్నది కూడా చూడాలి.

(1) దివ్య కుర్‌ఆన్ విషయంలో దాని పరిరక్షణకు సంబంధించిన మొదటి రూపం గురించి తెలుసుకునేందుకు క్రింది చారిత్రక వాస్తవాలపై దృష్టిని సారించండి–

(అ) మహనీయ ముహమ్మద్ (స) ఈ లోకం నుండి ప్రస్థానం చేసేనాటికి ఆయన అనుయాయులు, కుర్‌ఆన్‌ను నమ్మి నడుచుకునేవారు భారీ సంఖ్యలో ఉన్నారు. వారి సంఖ్య వేలు కాదు, లక్షల్లో ఉంది.

(ఆ) కుర్‌ఆన్ పారాయణం, కంఠస్థం చేసుకోవటం, కురాన్‌ను ఇతరులకు నేర్పడం గురించి ఆయన (స) తన సహచరులను నిరంతరం ప్రేరేపించేవారు, ప్రోత్సహించేవారు. దీనికి సంబంధించిన వివరాలతో హదీసు గ్రంథాలు నిండి ఉన్నాయి. ఉదాహరణకు : "కుర్‌ఆన్ చదవండి. ఎందుకంటే ప్రళయదినాన అది తనను పఠించే వారి కొరకు సిఫారసు చేసేదిగా వస్తుంది." (ముస్లిం–కితాబు ఫజాయెలుల్ కుర్‌ఆన్). "మీలో కురానును నేర్చుకునేవాడు, నేర్పేవాడే అందరికన్నా ఉత్తముడు" (బుఖారీ – కితాబు ఫజాయెలుల్ కుర్‌ఆన్). "కుర్‌ఆన్ స్మరణ పునశ్చరణ చేసుకుంటూ ఉండండి" (బుఖారీ–కితాబు ఫజాయెలుల్ కుర్‌ఆన్). ఇదేవిధంగా స్వయంగా కుర్‌ఆన్‌లోనూ ఇలాంటి సూచనలు, ప్రేరకాలు చాలా ఉన్నాయి.

మరోవైపు కురాన్‌లో హెచ్చరికలు కూడా ఉన్నాయి. యూదులు, క్రైస్తవులు తమ గ్రంథాలలో చేసిన మార్పులు చేర్పులకు, వారు కొన్ని భాగాలు మరచిపోయినందుకు గాను ఆ హెచ్చరికలలో శిక్షార్హులుగా ఖరారు చేయబడ్డారు. ఒక విధంగా ఆ జాతుల అలసత్వ పర్యవసానాన్ని వివరించి, 'తస్మాత్ జాగ్రత్త! ఒకవేళ మీరు కూడా కుర్‌ఆన్‌లోని ఏదయినా భాగాన్ని విస్మరిస్తే లేదా అందలి వచనాలలో మార్పులు చేర్పుల చెలగాటమాడితే దేవుని న్యాయశాసనం మీ పట్ల కూడా అలాగే వ్యవహరిస్తుంది సుమా!' అని అది ముస్లిములను సావధానపరిచింది. అంతేకాదు, యూదులు క్రైస్తవులకు ఈ ప్రపంచంలో జరిగిన శాస్తి తక్కువే, తీర్పుదినాన ఇంకా చాలా జరగాల్సి ఉంది అని సంకేతప్రాయంగా తెలియజేసింది. అందుకే అంతిమ దైవప్రవక్త (స) తన అనుచర సమాజానికి గట్టిగా హెచ్చరించేవారు. ఆయన (స) ఇలా

అనేవారు : “కుర్‌ఆన్‌ను పఠించి, దానిని మరచిపోయినవాడు ప్రళయదినాన కుష్ఠురోగిగా లేస్తాడు.” (అబూదావూద్).

(ఇ) దైవప్రవక్త కాలంలో ప్రాపంచిక పారలౌకిక గౌరవోన్నతులకు, విజయాలకు సిసలయిన విజ్ఞాన ప్రమాణం కుర్‌ఆన్ అయి ఉండేది. ఎవరికి కుర్‌ఆన్ జ్ఞానం ఎంత ఎక్కువగా ఉండేదో వారు అంతే ఉన్నత స్థాయి జ్ఞానిగా భావించ బడేవారు. చిన్న చిన్న వ్యవహారాలు మొదలుకుని పెద్ద పెద్ద కార్యాల నిర్వహణ వరకు బాధ్యతలను అప్పగిస్తున్నప్పుడు ఆయా వ్యక్తుల్లో ఉన్న కుర్‌ఆన్ పరిజ్ఞానం, కుర్‌ఆన్ అవగాహన ఏ పాటిది? అన్న విషయం చూడబడేది. ఎందుకంటే కుర్‌ఆనే రాజ్యానికి, సమాజానికి మూల శాసనంగా ఉండేది. అందుకే సహజంగా ఏ పదవి కోసం వ్యక్తుల ఎంపిక చేయాలన్నా ఈ ‘శాసనం’ గురించి ఎవరికి ఎక్కువగా తెలుసు? అనేది పరిగణనలోకి తీసుకోబడేది. అందుకే – హజ్రత్ అబూబకర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఒక సందర్భంగా ఒక పెద్ద సైనిక దళాన్ని రూపొందించారు. ఆ దళానికి అధిపతిగా అందరికన్నా పిన్న వయస్కుడైన ఒక వ్యక్తిని నియమించారు. అతని ఈ ఎంపికకు ప్రధాన కారణమేమిటని పరిశీలిస్తే, ఆ వ్యక్తికి మిగతా వారందరికన్నా ఎక్కువ భాగం కురాన్ జ్ఞాపకం ఉందని తెలిసింది. (తిర్మిజీ)

ధార్మిక ఔన్నత్యానికి గల ప్రాధాన్యత ఎటువంటిదో అంచనావేయడానికి ఒక్కగా నొక్క సంఘటనను ఇక్కడ ఉదాహరిస్తే సరిపోతుంది. ఉహుద్ యుద్ధంలో అమరగతులైన ముస్లింల అంత్యక్రియలు జరుపుతున్నప్పుడు మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం వల్ల రెండేసి శవాలను ఒక గోరీలో ఖననం చేయాలని ఆదేశించటం జరిగింది. అయితే ఈ సందర్భంగా దైవప్రవక్త (స) “ أَيُّهُمْ أَكْثَرُ أَخْذًا لِلْقُرْآنِ ”(వీరిలో ఎక్కువ కుర్‌ఆన్ పరిజ్ఞానం కలవారెవరు?) అని దర్యాప్తు చేసేవారు. ఫలానా వ్యక్తి అని తెలియజేయబడినప్పుడు ఆ మృతుని సమాధి ‘ఖిబ్లా’ వైపు ముందు వరుసలో ఉండేటట్లు చేసేవారు. (బుఖారీ : కితాబుల్ జనాయెజ్)

(ఈ) ప్రవక్త సహచరులలో ధార్మిక జిజ్ఞాస, భక్తి, ప్రేమ, కఠోర సాధన చేయాలన్న తపన పరాకాష్ఠకు చేరుకుని ఉండేది. వారికి తమ ప్రవక్త (స)తో తమ గ్రంథంతో అమితమయిన ప్రేమానుబంధం ఉండేది. దివ్య కురాన్ పారాయణం వారి ప్రియాతిప్రియమయిన వ్యాపకాలలో ఒకటి. అది వారి ఆత్మకు ఇష్టకరమయిన మధుర భక్ష్యంగా ఉండేది. వారిలో ఏ వ్యక్తి కూడా కురాన్‌ను

పారాయణం చేయని దినం ఉండేది కాదు. కురాన్ పారాయణం చేసిన మీదటే వారి అంతరాళం ఆనందాతిశయంతో పులకించేది. వారి ఆత్మ నెమ్మదించేది. ఉదాహరణకు : హజ్రత్ ఉస్మాన్ (రజి), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి), హజ్రత్ తమీమ్ దారీ (రజి) తదితరుల జీవిత విశేషాలను అధ్యయనం చేయండి. దైవదౌత్య కాలంలో మహాప్రవక్త (స) కురాన్‌ను తక్కువ పారాయణం చేసినందుకు ఫలానా సహచరుణ్ణి మందలించినట్లు మనం ఒక్క సంఘటనను కూడా కనుగొనలేము. 'కురాన్ పఠనం విషయంలో అతిశయిల్లకండి, మధ్యేమార్గం పాటించండి' అని ఆయన (స) తన సహచరులకు ఉపదేశించిన సంఘటనలు మాత్రం నుబువ్వత్ చరిత్రలో కోకొల్లలు. ఉదాహరణకు : హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) ప్రతి రాత్రి పూర్తి కుర్‌ఆన్ పారాయణం చేస్తున్నారని ఆయన (స) కు తెలిసినపుడు, "ఒక నెల రోజుల్లో పూర్తి కురాన్ ఒకసారి పఠించ"మని సూచించారు. 'నాకు అంతకన్నా ఎక్కువ శక్తి ఉంది' అని ఆ సహాబీ విన్నవించుకోగా, "అలాగైతే ఏడు రాత్రుల్లో కుర్‌ఆన్ సమాప్తం చెయ్యి. అంతకన్నా తక్కువ సమయంలో వద్దు" అని ఉపదేశించటం జరిగింది (బుఖారీ : కితాబు ఫజాయెలుల్ కురాన్). అలాగే హజ్రత్ కైస్ బిన్ సాసా (రజి) అనే సహచరుడు వచ్చి, 'కుర్‌ఆన్ పారాయణం ఎన్నాళ్ళలో పూర్తి చేయను?' అని ప్రశ్నించగా, "పదిహేను రోజులలో" అని ఆయన (స) బదులిచ్చారు. 'అయ్యా దైవప్రవక్తా! నేను అంతకన్నా తక్కువ రోజులలో సులభంగా కుర్‌ఆన్ పఠనం పూర్తి చేయగలన'ని అభ్యర్థించుకోగా, "సరే, అలాగయితే వారం రోజుల్లో పూర్తి చెయ్యి" అని ఆయన (స) సలహా ఇచ్చారు. 'అంతకన్నా తక్కువ వ్యవధిలో పూర్తి చేయగల శక్తి నాలో ఉంది' అని ఆ సహచరుడు విన్నవించుకుంటే, "చాలు. అంతకన్నా తక్కువ సమయంలో వద్దు" అని ఆయన (స) నిర్దిష్టంగా చెప్పారు. (కన్జుల్ ఉమ్మాల్)

(ఎ) దివ్య కుర్‌ఆన్ అంతా 23 సంవత్సరాల సుదీర్ఘ వ్యవధిలో – కొద్దికొద్దిగా – అవతరించింది. తత్ఫలితంగా ప్రవక్త సహచరులకు కుర్‌ఆన్ కంఠస్థం చేసుకోవడానికి అనేక సంవత్సరాల అవకాశం లభించింది. నిజానికి కురాన్ పూర్తిగా కంఠస్థం (హిఫ్జ్) చేసుకోవడానికి రెండున్నరేండ్లు చాలునని అనుభవపూర్వకంగా తెలుస్తోంది. వేలాది లక్షలాది మంది కుర్‌ఆన్ సంస్మర్తలు మూడేండ్లలోపే కుర్‌ఆన్‌ని హిఫ్జ్ చేసుకున్నారు.

(క) 'లైఫ్ ఆఫ్ ముహమ్మద్' రచయిత సర్ విలియం మ్యూర్ మాటల్లోనే చెప్పాలంటే ప్రవక్త ప్రియసహచరుల జ్ఞాపకశక్తి సాటిలేనిది, 'అత్యున్నత స్థాయి'కి చెందినది. జ్ఞాపకశక్తి విషయంలో సాటిలేని అరబ్బు జాతికి చెందినవారు ఈ సహాబా.

తిరుగులేని ఈ చారిత్రక వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని, వీటి ఫలితాలు ఏమై ఉంటాయో సహేతుకంగా ఆలోచించండి! దైవప్రవక్త (స) వారి లక్షలాది సహచరులలో కుర్‌ఆన్‌లో ఏ కొంత భాగమయినా కంఠస్థం కాకుండా ఉన్న వారెవరయినా ఉంటారా? పూర్తి కురాన్ తు.చ. తప్పకుండా కంఠస్థం చేసి అప్పగించేవారు ఉండకుండా ఉంటారా? లేదు. ముమ్మాటికీ అలా జరగనేరదు. ఎందుకంటే ఇలాంటి గొప్ప భావాలు, భావనలు గల జాతిలో భక్తి పారవశ్యంతో తాదాత్మ్యం చెందే జనులలో ఇలా జరగనేరదు. పరిస్థితుల ఈ స్వరూపాన్ని విశ్లేషించి చూసినపుడు ఎలాంటి సంకోచం లేకుండా బుద్ధి మనకు ఇచ్చే తీర్పు ఏమిటంటే, ప్రవక్త ప్రియసహచరులలో కుర్‌ఆన్‌ను పూర్తిగా కంఠస్థం చేసుకున్న వారు భారీ సంఖ్యలోనే ఉండి ఉంటారు. నిశ్చయంగా ఉన్నారని చరిత్ర కూడా చెబుతోంది. మదీనా వెలుపల ఏ అరబ్బు తెగవారైనా ఇస్లాం స్వీకరించినపుడు, వారికి కుర్‌ఆన్ నేర్పేందుకు ప్రవక్త మహనీయులు (స) 'హాఫిజె కురాన్' అయిన సహచరులను అక్కడికి పంపేవారని కూడా చరిత్ర సాక్ష్యమిస్తోంది. అలా కుర్‌ఆన్ బోధించటానికి వెళ్ళే హుఫ్ఫాజ్‌ల సంఖ్య ఒక్కోసారి చాలా ఎక్కువగా ఉండేదని కూడా మనకు తెలుస్తోంది. ఉదాహరణకు : అబూబరా అనే ఒక వ్యక్తి నజద్ నుండి మదీనాకు వచ్చి, తన ప్రదేశంలోని ముస్లింలకు కుర్‌ఆన్ నేర్పేటందుకు అధ్యాపకులను పంపమని ప్రవక్త (స)కు విజ్ఞప్తి చేశాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఈ పనికోసం 70 మంది కుర్‌ఆన్ స్మర్తలను నియమించి పంపారు (జాదుల్ మఆద్). మీరే ఆలోచించండి! ఒక్కో ప్రాంతానికి పంపబడే కుర్‌ఆన్ సంస్మర్తల సంఖ్య డెబ్బయ్యేసి ఉన్నప్పుడు మొత్తం హుఫ్ఫాజ్‌ల సంఖ్య ఎంతై ఉంటుంది? ప్రవక్త మహనీయులు (స) పరమపదించిన తరువాత యమామాలో జరిగిన ఒక యుద్ధంలో పన్నెండు లేక పధ్నాలుగు వందల మంది ముస్లింలు వీరమరణం చెందారు. ఆ అమరగతులలో ఏడువందల మంది కురాన్ హుఫ్ఫాజ్‌లున్నారు (మజ్మవుజ్జవాయెద్ – బుఖారీ పాదసూచిక సౌజన్యంతో; రెండవ సంపుటం).

ప్రవక్త సహచరుల (రజి) కాలంలో మాదిరిగానే తరువాతి కాలాల్లో కూడా ముస్లిములలో కుర్‌ఆన్‌ను కంఠస్థం చేసుకునే ఆసక్తి, అభిరుచి ఉండేది. ముస్లిం జనాభా పెరిగినట్లే కురాన్ కంఠస్థం చేసుకునే వారి సంఖ్య కూడా పెరగసాగింది. ఏ కాలంలో కూడా 'హాఫిజె కురాన్'లు లేరు అన్న మాటే రాలేదు. దీనికి చరిత్రే సాక్షి.

నేటికీ ముస్లింలు ధార్మికంగా అధోగతిలో ఉండి, భావదారిద్ర్యం నెలకొన్న రోజుల్లో కూడా కురాన్‌ను కంఠస్థం చేసుకున్న వారి కొరతలేదు. ముస్లింలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్న ఏ ఊరికి, ఏ వాడకు వెళ్ళి చూసినా అక్కడ ఒకరిద్దరు హాఫిజె కురాన్‌లు మీకు తప్పకుండా కనిపిస్తారు.

(2) ఇప్పుడు కురాన్ పరిరక్షణకు సంబంధించిన రెండవ రూపాన్ని అవలోకన చేద్దాం. ముందుగా 'కితాబత్' (వ్రాత)ను తీసుకోండి. ఈ సందర్భంగా క్రింది వాస్తవాలపై దృష్టిని సారించటం అవసరం.

(అ) కురాన్ అవతరించిన కాలంలో అరేబియాలో లేఖనా ప్రక్రియ బహు పరిమితం. ఆనాడు అలాంటి సౌకర్యాలు కూడా తక్కువగానే ఉండేవి. అయితే చదవటం, వ్రాయటం అక్కడ బొత్తిగా లేదనేది మాత్రం నిజం కాదు. అరేబియా చరిత్రను అధ్యయనం చేస్తే ఎవరూ కాదనలేని రుజువులు లభిస్తాయి. అంటే అలనాడు అరేబియాలో ముఖ్యంగా మక్కాలో చదవటం, వ్రాయటం వచ్చిన వారు ఎన్నదగ్గ సంఖ్యలో ఉండేవారు. అక్కడి ప్రజలు ఆనాడు జరిగే సంధులు, ఒడంబడికలను వ్రాతపూర్వకంగా చేసుకుని వాటిని దస్తావేజుల రూపంలో భద్రపరిచేవారు. వచనాలను, పద్యాలను, కీర్తనలను వ్రాసుకునేవారు. ఉదాహరణకు : (1) మక్కాలోని కురైషులంతా కలసి దైవప్రవక్త (స)ను, ఆయన కుటుంబీకులైన బనూ హాషిమ్‌ను, ముస్లిములందరినీ సంఘ బహిష్కరణ చేసినప్పుడు ఆ బహిష్కరణా నిబంధనలను లిఖించి, ఆ ఫర్మానాను కాబా లోపల వ్రేలాడదీశారు (ఇబ్నె హిష్షామ్– మొదటి సంపుటం). (2) అలాగే అరేబియాలోని సుప్రసిద్ధ ప్రబంధాలైన 'అల్ ముఅల్లకాతుస్సబ్అ" గురించి తెలియని అరబీ సాహితీపరులు ఉండరు. వాటిని 'ముఅల్లకాత్' అనటానికి ప్రధాన కారణమేమిటంటే వాటిని లిఖించి కాబా గృహానికి వ్రేలాడదీయటం జరిగింది (తారీఖ్ అల్ అదబుల్ అరబీ). (3) బద్ర్ యుద్ధ సందర్భంగా 70 మంది కురైషులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడినప్పుడు, వారి విడుదలకు పెట్టబడిన ఒక షరతు ప్రకారం ఒక్కో ఖైదీ పదిమంది బాలలకు బాగా చదవటం, వ్రాయటం నేర్పాలి (తబఖాతె ఇబ్నె సాద్). ఇలాంటి సంఘటనలు ఒకట్రెండు కాదు, చాలా ఉన్నాయి. వాటినిబట్టి మక్కాలో చదివే, వ్రాసే రివాజు ఉండేది. ఆనాటి అరబీ సాహిత్యావలోకనం చేస్తే లేఖనా ప్రక్రియ ప్రాచుర్యంలో ఉండేదని, పేరుమోసిన ఎంతోమంది లేఖకులు ఈ రంగంలో తమ విధులు నిర్వర్తించేవారని అవగతమవుతుంది. దివ్య కుర్ఆన్‌లో స్వయంగా

ఖలమ్, కితాబ్, కితాబత్, కాతిబ్, ఇమ్లా (డిక్టేషన్), ఇక్తెతాబ్ (వ్రాసుకోవటం), సుతూర్ (లిఖించబడిన పంక్తులు), సఫరహ్ (వ్రాసేవారు), సహీఫా (లిఖించబడిన పుటలు), లౌహ్ (పలక), కిర్తాస్ (కాగితం) వంటి పదాల ద్వారా విదితమయ్యేదేమిటంటే, దివ్య కురాన్ అవతరించే కాలంలో అరబ్బులు చదివే, వ్రాసే 'విద్య'ను బాగా ఒంటబట్టించుకుని ఉండేవారు.

(ఆ) లేఖనా కళను దైవప్రసాదితమయిన ఓ గొప్ప వరంగా, మహదానుగ్రహంగా ఖరారు చేసింది దివ్య కుర్‌ఆన్. అది తన తొట్టతొలి వహీ (దివ్యవాణి)లో – అది కేవలం అయిదు చిన్న చిన్న సూక్తులతో కూడుకున్నదే అయినప్పటికీ – 'కలము' ను గొప్ప అనుగ్రహంగా పేర్కొంది. 'కలము ద్వారా జ్ఞానబోధ చేయటం' గురించి అది ప్రస్తావించటం విశేషం.

(عَلَّمَ بِالْقَلَمِ عَلَّمَ الْإِنْسَانَ مَا لَمْ يَعْلَمْ)

(ఇ) జీవితంలో ఇచ్చిపుచ్చుకోవడాల వ్యవహారం జరుగుతున్నప్పుడు వాటిలో కొన్నింటిని లిఖితపూర్వకంగా జరపటం ఎంతో అవసరమని కురాన్ నొక్కి వక్కాణించింది. ఉదాహరణకు :

إِذَا تَدَايَنْتُمْ بِدَيْنٍ إِلَىٰ أَجَلٍ مُسَمًّى فَاكْتُبُوهُ ۚ وَلْيَكْتُبْ بَيْنَكُمْ كَاتِبٌ بِالْعَدْلِ ۚ وَلَا يَأْبَ كَاتِبٌ أَنْ يَكْتُبَ كَمَا عَلَّمَهُ اللَّهُ فَلْيَكْتُبْ ... وَلَا تَسْأَمُوا أَنْ تَكْتُبُوهُ صَغِيرًا أَوْ كَبِيرًا إِلَىٰ أَجَلِهِ ۚ ...

(البقرة: ٢٨٢)

"మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు, ఆ వ్యవహారాన్ని వ్రాసి పదిలపరచండి. ఇరుపక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి వ్రాయాలి. అల్లాహ్ ఎవడికయితే అక్షరజ్ఞానం ప్రసాదించాడో, అతడు వ్రాయడానికి నిరాకరించకూడదు. అతడు వ్రాయాలి .... వ్యవహారం చిన్నదయినా, పెద్దదయినా దానిని గడువు నిర్ణయంతో దస్తావేజు రూపంలో వ్రాయించటానికి అశ్రద్ధ చూపకూడదు."

*(అల్ బకర : 282)*

ఈ మూడు వాస్తవాల వెలుగులో దివ్య కుర్‌ఆన్ సంపూర్ణంగా లిఖించబడకుండా ఉండటమన్నది అసంభవం. ప్రియ సహచరులకు చదవటం, వ్రాయటం వచ్చి

ఉన్నప్పుడు, తొలినాటి నుండే దివ్య కుర్‌ఆన్ ఈ లేఖనా కళను గొప్ప దైవానుగ్రహంగా ఖరారు చేసినప్పుడు, లావాదేవీల వ్యవహారం వ్రాతపూర్వకంగా జరగాలని విడమరచి చెప్పినప్పుడు దైవప్రవక్త (స) గానీ, ఆయన ప్రియసహచరులు (ర.అ) గానీ కుర్‌ఆన్‌ను వ్రాసుకోకుండా (గ్రంథస్థం చేయకుండా) ఉంటారని ఎలా ఊహించగలరు? మరి చూడబోతే వారి దృష్టిలో కుర్‌ఆన్ అన్నిటికంటే విలువైన వస్తువు. మానవజాతి ఇహపరాల సాఫల్యమంతా దానిపైనే ఆధారపడి ఉంది. ఏదయినా ఒక వాక్కును సురక్షితంగా ఉంచాలంటే దానిని వ్రాతపూర్వకంగా భద్రపరచాలన్న విషయం వారికి తెలియనిదీ కాదు.

మానవబుద్ధి, అంచనాలు వాంఛించే ఈ విషయం ముందుకు వచ్చిన పిమ్మట, ఇప్పుడు చరిత్ర చెప్పే భాషలో సంఘటనల సాక్ష్యాన్ని కూడా వినండి –

(అ) కుర్‌ఆన్‌లోని ఎంత భాగం అవతరించినా ప్రవక్త మహనీయులు (స) దానిని గ్రంథస్థం చేయించేవారు. ఈ పనికోసం లేఖకులు నియమితులై ఉండేవారు. దివ్యవాణి (వహీ) అవతరించినప్పుడు ఆయన (స) తన లేఖకులలో ఎవరినయినా పిలిచి "దీనిని వ్రాసుకో" (తిర్మిజీ–కితాబుత్తఫ్సీర్) అని చెప్పేవారు. ప్రత్యేక లేఖకులైన హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) మరిన్ని వివరాలు తెలుపుతూ ఇలా అన్నారు : ఆయన (స) సూచనానుసారం నేను వ్రాయటం పూర్తయ్యాక, ఆయన నాచేత చదివించేవారు. అందులో ఏమయినా తప్పు ఉంటే సవరణ చేయించేవారు. (మజ్మవుజ్జవాయెద్ : మొదటి సంపుటం, పేజీ – 60)

(ఆ) దివ్య కుర్‌ఆన్‌లో కురైషు అవిశ్వాసులు చెప్పే దానినిబట్టి కూడా ఈ విషయం రూఢీ అవుతోంది.(وَقَالُوا أَسَاطِيرُ الْأَوَّلِينَ اكْتَتَبَهَا فَهِيَ تُمْلَىٰ عَلَيْهِ بُكْرَةً وَأَصِيلًا) (వారిలా అంటారు : ఇవి పూర్వకాలం నాటి వారు వ్రాసిన విషయాలు. వాటికి ఇతను నకలు వ్రాయిస్తున్నాడు. ఉదయం, సాయంత్రం (కొంతమంది తరఫున) అవి ఇతనికి వినిపించబడతాయి). (ఫుర్కాన్ – 5)

(ఇ) దైవప్రవక్త (స) తన సహచరులకు, "నా నోట (విన్న) కురాన్‌ను తప్ప మరో విషయాన్ని వ్రాసుకోకండి" అని సూచించారు. (దారిమీ–మన్‌లమ్ యర్ కితాబతహు అల్ హదీస్).

(ఈ) హిజ్రత్‌కు చాలా కాలం క్రితం జరిగిన సంఘటన – అప్పటికి హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఇస్లాం స్వీకరించలేదు. ఆయన తన సోదరి ఇంటికి వెళ్ళినప్పుడు హజ్రత్ ఖబ్బాబ్ (రజి) ఆమెకు, ఆమె భర్త హజ్రత్ సయీద్ బిన్

జైద్ (రజి)కు 'తాహా' సూరా చదివిస్తున్నారు. ఉమర్ రాక సవ్వడి విని హ॥జత్ ఖబ్బాబ్ (రజి) ఒక ప్రక్కకు తప్పుకున్నారు. తాహా సూరా వ్రాసి ఉన్న ఆ సహీఫా (ప్రతి)ని ఉమర్ సోదరి తన తొడ క్రింద దాచేసింది, "ఏది, ఇందాక మీకు చదివి వినిపించబడుతున్న ఆ సహీఫాను నాకు చూపించండి" అన్నారు ఉమర్ (రజి). సమాధానంగా ఆమె, 'పరిశుద్ధత నొందిన స్థితిలో మాత్రమే దీనిని తాకాలి' అని నిర్ద్వంద్వంగా చెప్పింది. ఈ మాట విన్న ఉమర్ స్నానం చేసివచ్చారు. అప్పుడామె ఆ సహీఫాను ఆయన చేతికి ఇచ్చారు. హ॥జత్ ఉమర్ (రజి) దానిని చదివారు. (సీరత్ ఇబ్నె హిష్షామ్ : మొదటి సంపుటం, పేజీ–367)

(ఎ) 'మేము దైవప్రవక్త (స) దగ్గర కూర్చుని కుర్‌ఆన్ నకలు చేసేవారం' అని ఆయన సహచరులు (ర.అ) చెప్పారు. 'మేము దైవప్రవక్త (స) చుట్టూచేరి (కురాన్) లిఖిస్తూ ఉండగా ...' అని హ॥జత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ వివరించారు (దారిమీ–బాబు మన్ రక్స్ ఫీ కితాబతహుల్ ఇల్మ్, పేజీ–49). హ॥జత్ అలీ (రజి) ఒక సందర్భంలో ఒక ప్రశ్నకు బదులిస్తూ, 'మా వద్ద దైవగ్రంథం, మరియు ఈ సహీఫాలో ఉన్నది తప్ప మరేదీ వ్రాసినది లేదు' అని స్పష్టపరిచారు (బుఖారీ).

'మేము దైవప్రవక్త (స) సన్నిధిలో కూర్చుని (చర్మం) తదితర ముక్కలపై (ఆయన సూచించిన విధంగా) కురాన్ సంకలనం చేసేవారం' అని హ॥జత్ జైద్ బిన్ సాబిత్ (రజి) తెలియజేశారు. (బుఖారీ:ఫజాయెలుల్ కురాన్).

ఈ సంఘటనలు, వాస్తవాలు నిర్ధారించి చెప్పేదేమిటంటే దివ్య కుర్‌ఆన్‌ను లిఖించే ఏర్పాటు రెండింతలుగా జరిగింది. (1) అధికారికంగా, (2) ప్రజల తరఫున. ఒకవైపు దైవప్రవక్త (స) వారి ప్రత్యేక పర్యవేక్షణలో ఈ లేఖనాప్రక్రియ కొనసాగుతూ ఉండగా, మరోవైపున సాధారణ ముస్లింలలో వ్రాయటం వచ్చినవారు వ్రాసుకోమని సూచించటం జరిగింది. ఈ సూచనను కచ్చితంగా పాటించటం జరిగింది. ఆఖరికి మక్కాలో ముస్లింలు అల్పసంఖ్యలో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్న గడ్డు రోజుల్లో కూడా కుర్‌ఆన్‌ను వ్రాసుకునేవారు (ఇంతకు ముందు ప్రస్తావనకు వచ్చిన హ॥జత్ ఉమర్ –రజి– గారి సంఘటన ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది). మదీనా యుగం గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. అక్కడ ముస్లింలు సంఖ్యాపరంగా అధికంగా ఉన్నారు. ఒనరుల దృష్ట్యా కూడా పుంజుకున్నారు. ప్రియ సహచరులు దైవప్రవక్త (స) చుట్టూచేరి తమ కొరకు కుర్‌ఆన్ ప్రతులను తయారుచేసుకునేవారని

వెనుకటి పుటల్లో చదివారు. ఈ విధంగా ఎందరో సహచరులు ప్రవక్త (స) జీవిత కాలంలోనే పూర్తి కురానును – దాని అంతిమ క్రోడీకరణ ప్రకారం – వ్రాసుకున్నారు. హజ్రత్ అబూదర్దా (రజి), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి), హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి), హజ్రత్ అబూ జైద్ (రజి) గార్ల గురించైతే హజ్రత్ అనస్ (రజి) చాలా స్పష్టంగా చెప్పారు – ఆ మహనీయులు ప్రవక్త జీవిత కాలంలోనే పూర్తి కుర్‌ఆన్‌ను కూర్పు చేసుకున్నారని. (బుఖారీ–ఫజాయెలుల్ కుర్‌ఆన్). ఈ మహా భాగ్యానికి నోచుకున్న సహాబా ఎంతమంది ఉంటారు? మహాప్రవక్త (స) పరమపదించిన మీదట యమామలో జరిగిన ఒక్క యుద్ధంలోనే కుర్‌ఆన్‌కు కూర్పు ఇచ్చిన 70 మంది సహాబీలు అమరగతి నొందడాన్నిబట్టి ఈ విషయం గురించి అంచనా వేయవచ్చు. (మిర్కాత – బుఖారీ వివరణ సౌజన్యంతో, ఫజాయెలుల్ కుర్‌ఆన్).

మొత్తానికి దివ్య కుర్‌ఆన్ మహాప్రవక్త (స) హయాంలోనే పూర్తిగా లిఖించబడింది. ఇందులో సందేహానికి ఆస్కారమే లేదు. ప్రవక్త (స) పరమపదించే నాటికి దాని ప్రతులు అనేకం వ్యాప్తిచెందాయి. అప్పటికి ముస్లిం సమాజం కుర్‌ఆన్ వ్రాతప్రతులు లేకుండా లేదు. మహాప్రవక్త (స) తన అంతిమ హజ్జ్ ప్రసంగంలో "ప్రజలారా! జ్ఞానం (కుర్‌ఆన్) లేపుకోబడే కాలం దాపురించక ముందే దానిని ఆర్జించండి" అని వక్కాణించినపుడు, ఒక పల్లెటూరి బైతు లేచి, "మా వద్ద 'మసాహిఫ్' (లిఖించబడిన కుర్‌ఆన్ ప్రతులు) ఉండగా జ్ఞానం ఎలా లేపుకోబడుతుంది"? అన్నాడు. (ముస్నద్ అహ్మద్ : 5వ సంపుటం – పేజీ:266). ఒక పల్లెటూరి వ్యక్తి ఈ ప్రశ్న వేయటాన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే ప్రవక్త (స) జీవిత కాలంలోనే కుర్‌ఆన్ ప్రతులు సర్వసామాన్యం అయిపోయాయి. చివర్లో మరో యదార్థంపై కూడా దృష్టిని సారించండి –

దివ్య కుర్‌ఆన్ అనేకచోట్ల తనను కితాబ్ (గ్రంథం)గా పేర్కొంది. ఉదాహరణకు ذٰلِكَ الْكِتٰبُ لَا رَيْبَ فِيْهِ (ఇది దైవగ్రంథం. ఇందులో ఎంతమాత్రం సందేహం లేదు). అలాగే 'సుహుఫ్' అని కూడా చెప్పుకుంది. ఉదాహరణకు رَسُوْلٌ مِّنَ اللّٰهِ يَتْلُوْا صُحُفًا مُّطَهَّرَةً (سورة بيّنة) (అంటే – అల్లాహ్ తరఫు నుండి ఒక ప్రవక్త వచ్చి సత్యమైన, సవ్యమైన రచనలు గల పరిశుద్ధమైన సహీఫాలను చదివి వినిపించటం) (బయ్యినహ్ – 3). ఆ తరువాత అది తన గురించి ఏమని చెప్పిందంటే; 'దీనిని పరిశుద్ధులు తప్ప ఎవరూ తాకలేరు' (لَا يَمَسُّهٗۤ اِلَّا الْمُطَهَّرُوْنَ) (అల్ వాకియహ్ : 78). ఇంకా "ఇవి గౌరవనీయులు, సద్వర్తనులు అయిన లేఖకుల చేతులలో ఉంటాయి." (بِاَيْدِيْ سَفَرَةٍ كِرَامٍ بَرَرَةٍ)(سورة عبس) (అబస

– 15, 16).

ఈ ఉపదేశాలు స్పష్టంగా చాటిచెప్పేదేమిటంటే, దివ్య కుర్‌ఆన్ మూల సరోవరం నుండే లిఖితపూర్వక స్థాయి కలిగి ఉంది. అది ఎక్కడ ఉన్నా లిఖితపూర్వక గ్రంథంగా వర్ధిల్లటం అనివార్యం. దైవప్రవక్త (స) గానీ, ఆయన ప్రియసహచరులు (ర.అ) గానీ కుర్‌ఆన్‌ను లిఖించటానికి చేసిన ఏర్పాట్లు కేవలం ధార్మిక అభిరుచి, ఆసక్తి మూలంగా మాత్రమే కాదు, అది కుర్‌ఆన్ వాంఛించిన విషయం కూడా. దానికే గనక వ్రాతపూర్వక వస్త్రధారణ జరగకపోతే, పూర్తి స్థాయిలో దాని ఉనికికి సార్ధకత చేకూరేది కాదు.

కుర్‌ఆన్ వ్రాతకు సంబంధించిన వివరాలు మీ ముందు వచ్చేశాయి. వీటిని తరచి చూసిన తరువాత, ప్రవక్త (స) హయాంలో కుర్‌ఆన్‌ను రక్షించే వ్రాతపూర్వక ఏర్పాట్లు కట్టుదిట్టంగా జరిగాయని, ఈ ప్రక్రియ బాగా వృద్ధి చెందిందని, పరిపూర్ణమయిందన్న సంగతిని అంగీకరించడమే కాదు, దానిని గట్టిగా నమ్మవలసి ఉంటుంది.

ఇకపోతే తరువాతి కాలాల ప్రశ్న, అసలీ ప్రశ్న లేవనెత్తటం అనవసరం. మార్గదర్శక ఖలీఫాలు ఈ 'అప్పగింత'ను పరిరక్షించటంలో, పరివ్యాప్తం చేయటంలో తీసుకున్న జాగ్రత్తల గురించి మీరు 'కుర్‌ఆన్ క్రోడీకరణ' అధ్యాయంలో చదివారు – తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) గారు దైవప్రవక్త (స) ప్రత్యేక లేఖకులైన హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) సారధ్యంలో కురాన్ ప్రతుల నకళ్ళు తయారుచేయించి, తన రాజ్యపరిధిలో ఉన్న వివిధ ప్రాంతాలకు పంపించారు. ఆ ప్రతులను కచ్చితంగా అనుసరించాలని ఉత్తర్వు జారీచేయటం కూడా విదితమే. ఆ తరువాతి కాలంలో ఇస్లాం శీఘ్రగతిన విస్తరించింది. ఆ రాజ్యపరిధిలో లేఖనా కళలో ప్రవీణులైన వారి సంఖ్య వేలల్లో లక్షల్లో ఉండేది. మార్గదర్శక ఖలీఫాల కాలంలోనే ఇస్లామీయ రాజ్యం అరేబియా భూభాగం ఎల్లలు దాటి ఇరాక్, సిరియా, ఈరాన్, ఈజిప్టు తదితర ప్రాంతాలకు విస్తరించింది. ఈ ప్రాంతాలన్నింటా కురాను మాత్రమే సంవిధానంగా, శాసనాంగంగా ఉండేది. పరిస్థితుల ఈ స్వరూపం చాటిచెప్పే దానిని విన్నప్పుడు నిజాయితీగల వారెవరూ వినీవిననట్లుగా, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరించలేరు. అల్లామా ఇబ్నె హజమ్ ప్రకారం ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) కాలంలో ముస్లింల వద్ద లక్షకు పైచిలుకు కురాన్ ప్రతులుండేవి (కితాబుల్ ఫస్ల్ : 2వ సంపుటం; పేజీ–78). పరలోక సాఫల్యానికి, ఇహలోక రాజ్య వ్యవస్థకు మూలాధారం అయిన ఈ గ్రంథం ఏ ముస్లిం జనావాసంలోనయినా లేకుండా ఎలా ఉంటుంది? ముఖ్యంగా

ఆ మహా సామ్రాజ్యంలోని వివిధ పట్టణాల న్యాయాధీశుల, న్యాయశాస్త్ర కోవిదుల వద్ద మాత్రం ఆ గ్రంథ ప్రతి తప్పకుండా ఉండి తీరాలి! ఎందుకంటే ఆ న్యాయమూర్తులు తమ విధులను ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా నిర్వర్తించడానికి ఈ గ్రంథ ప్రతులపై ఆద్యంతం ఆధారపడటం అవశ్యం. అందుకే మార్గదర్శక ఖలీఫాలు తమ రాజ్య గవర్నర్లకు, న్యాయాధీశులకు పంపే సూచనలు కూడా వ్రాతపూర్వకంగానే ఉండేవి. మరలాంటప్పుడు, యావత్తు సమాజానికి సిసలయిన మార్గదర్శక నియమావళి, యావత్ రాజ్యానికి శాసనాంగం స్థాయి కలిగివున్న గ్రంథం వ్రాతపూర్వకంగా ఉండాలన్న విషయాన్ని ఆ ధర్మపాలకులు గుర్తెరగకుండా ఉంటారా!?

ఈ చర్చ ద్వారా మిట్టమధ్యాహ్నపు సూర్యుని వెలుతురులా ప్రకాశమానమయ్యే యదార్థం ఏమిటంటే దివ్య కుర్‌ఆన్ పరిరక్షణ రెండు విధాలుగా జరిగింది. ఎంతో పకడ్బందీగా జరిగింది. సంతృప్తికరమైన విధంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. బహు విస్తృత స్థాయిలో అది యథాతథంగా కంఠస్థం కూడా చేయబడింది, వ్రాతపూర్వకంగా కూడా భద్రపరచటం జరిగింది. దైవప్రవక్త (స) హయాం తరువాత ఈ పరంపర స్థిరంగా ఉండటమే కాదు, అత్యంత వేగంగా పురోగమించింది కూడా. ఈ విధంగా దేవుని ఈ గ్రంథం పరంపరానుగతంగా నకలు అవుతూ అది దేవుని తరఫున ఆయన ప్రవక్త (స)కు ప్రసాదించబడినట్లుగానే ఉంది. సత్యాన్ని ఒప్పుకోవటం తెలిసిన ఏ వ్యక్తి అయినా ప్రపంచంలో ఆది నుండి నేటి వరకు ఈ ఒక్క గ్రంథం తప్ప మరే గ్రంథం విషయంలో కూడా దాని పరిరక్షణకై ఇన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరగలేదన్న విషయాన్ని అంగీకరించకుండా ఉండలేదు.

## (అ) కుర్‌ఆనీ నిదర్శనాలు

దివ్య కుర్‌ఆన్‌లోని కొన్ని వచనాల ద్వారా కూడా అది కలకాలం సురక్షితంగా ఉండే గ్రంథం అన్న విషయం రుజువు అవుతోంది :

(1) ఒకచోట మహనీయ ముహమ్మద్ (స) వారిని సంబోధిస్తూ ఇలా సెలవీయబడింది :

سَنُقۡرِئُكَ فَلَا تَنۡسٰٓى ۙ‏ ﴿٦﴾ (الاعلى)

“మేము నిన్ను (ఈ కుర్‌ఆన్‌ను) చదివిస్తాము (అది నీకు ఎలా కంఠస్థం అయిపోతుందంటే) ఆ తరువాత నీవు ఎన్నటికీ దానిని మరచిపోవు.”

*(అల్ ఆలా : 6)*

ఈ దైవోపదేశం ఏ నేపథ్యంలో అవతరించిందనేది గమనార్హం. మహనీయ ముహమ్మద్ (స) దైవదౌత్య బాధ్యతను నిర్వర్తించే విషయంలో చింతాగ్రస్తులై ఉండేవారు. దేవుని వద్ద నుండి తనకు అందే సందేశం యథాతథంగా – హెచ్చుతగ్గులు లేకుండా – దైవదాసులకు అందజేయగలుగుతానో లేదోనని ఆందోళన చెందేవారు. తన స్మృతిపథంలో నుండి ఏదయినా వాక్యం జ్ఞాపకం ఉండకుండా పోతుందేమో! ఒకవేళ అదే గనక జరిగితే ఒక ప్రవక్తగా తాను తన విధిని నిర్వర్తించటంలో లోటు చేసిన వాడనవుతానేమోనని ఆయన భయపడేవారు. అల్లాహ్ ఆయనను ఓదారుస్తూ, (ప్రవక్తా!) నీవు ఆందోళన చెంది వేగిరపడవలసిన అవసరం లేదు. నీవు నిదానంగా వ్యవహరించు. ఇది మా సందేశం! మా బోధన! మేము దీనిని ఉన్నదున్నట్టుగా నీ వరకు చేర్చినట్లే, నీకు బాగా జ్ఞాపకం అయ్యేలా చేసే బాధ్యత కూడా మేమే వహిస్తాము. ఒక్క వాక్యం కాదు కదా, ఒక్క పదం కూడా నీ స్మృతిపథంలో నుండి చెరగిపోదు అని అల్లాహ్ అభయమిచ్చాడు.

ఇదే అభయం మరో సందర్భంలో మరోవిధంగా ఇవ్వబడింది. ఇదిగో, ఈ విధంగా సెలవీయబడింది:

لَا تُحَرِّكْ بِهٖ لِسَانَكَ لِتَعْجَلَ بِهٖ ۝١٦ اِنَّ عَلَيْنَا جَمْعَهٗ وَقُرْاٰنَهٗ ۝١٧ (القيامة)

"ఓ ప్రవక్తా! ఈ వహీని (సందేశాన్ని) త్వరత్వరగా జ్ఞాపకం చేసుకోవటానికి నీ నాలుకను ఆడించకు; దీనిని జ్ఞాపకం చేయించటం, చదివించటం మా బాధ్యత."

*(అల్ కియామహ్ : 16, 17)*

దైవప్రవక్త (స) జ్ఞాపక పరిధి నుండి ఒక అక్షరం కూడా తప్పిపోదని ఈ సూక్తుల ద్వారా హామీ లభించింది. దీనికి సంబంధించి అల్లాహ్ వాగ్దానం చేయటం ఒక్కటే కాదు, ఆ బాధ్యత సయితం తాను తీసుకున్నాడు. మహోన్నతుడగు అల్లాహ్ ఏదేని విషయమై బాధ్యత తీసుకున్నాడంటే దాని భావం ఏమిటో విశ్వసించిన వారికి బాగా తెలుసు. సూర్యుడు పశ్చిమ దిక్కున ఉదయించటం సంభవం కావచ్చునేమోగాని అల్లాహ్ తానిచ్చిన మాటను నిలబెట్టుకోక పోవటమనేది మాత్రం సంభవం కాదు. "ఈ కుర్‌ఆన్‌ను కూర్చటం, దానిని చదివి వినిపించటం మా బాధ్యత" అని ఆయన అన్నాడంటే; దైవప్రవక్త (స) మనోఫలకంపై కుర్‌ఆన్ పూర్తిగా చెరగని ముద్రవేసుకుందన్నమాటే! అంటే ఆయనకు కుర్‌ఆన్ ఏ రూపంలో ప్రసాదించబడిందో

సరిగ్గా అదేవిధంగా – ఒక్క అక్షరమయినా పొల్లుపోకుండా ఆయన మదిలో సుభద్రమైనట్లే!

(2) దివ్య కుర్‌ఆన్ లక్షణాన్ని దానిని అవతరింపజేసినవాడు స్వయంగా ఇలా వివరించాడు :

وَاِنَّهٗ لَكِتٰبٌ عَزِيْزٌ ﴿٤١﴾ لَّا يَاْتِيْهِ الْبَاطِلُ
مِنْۢ بَيْنِ يَدَيْهِ وَلَا مِنْ خَلْفِهٖ ؕ (حٰمٓ سجدة)

"యదార్థమేమిటంటే, ఇది ఒక శక్తిమంతమైన గ్రంథం. అసత్యం దాని మీదకు ముందు నుండీ రాజాలదు, వెనుక నుండీ రాజాలదు."

*(హా మీమ్ అస్ సజ్దహ్ : 41, 42)*

'అజీజ్' అంటే తిరుగులేనిది, దానికి వ్యతిరేకంగా ఏ శక్తీ నిలవజాలదు అని అర్థం. అందువల్ల కుర్‌ఆన్ 'కితాబె అజీజ్' అనబడటంలోని మర్మం ఏమిటంటే దాని అస్థిత్వానికి, మనుగడకు ఎప్పుడూ ఎలాంటి కీడు వాటిల్లదు. దాని పవిత్రతను ఎప్పుడూ ఏ వస్తువూ ప్రభావితం చేయజాలదు. దాని స్వభావం, దాని స్థాయి మార్పులకు చేర్పులకు అందనంత ఉచ్ఛస్థితిలో ఉంది. అందుకే దీని 'శక్తిమంతమైన' స్థితిని విశదీకరిస్తూ ఇలా అనటం జరిగింది : అసత్యం (మిథ్య) అందులోనికి జొరబడే మార్గం పొందజాలదు. ఏదేని గ్రంథంలో అసత్యం జొరబడిందంటే; అందులో ఏదయినా మానవ ప్రోక్తం కలగలిసిందన్నమాట! లేదా దాని వాక్యాలు, అంశాలు తారుమారు చేయబడ్డాయన్నమాట! లేదా అందలి భాగమేదయినా పోగొట్టబడిందన్నమాట! ఈ మూడింటిలో ఏ ఒక్కటి జరిగినా ఇక ఆ గ్రంథం అవతరించిన నిజ స్థితిలో మిగిలి ఉండదు. అది పరిపూర్ణమైన గ్రంథం లేక స్వచ్ఛమైన సత్య గ్రంథం అనే మాట దానికి వర్తించదు. అందుచేత దివ్య కురాన్‌లో అసత్యం దారి చేసుకోజాలదంటే దాని భావం; ఈ గ్రంథంలో ఎన్నటికీ హెచ్చుతగ్గులు జరగటంగానీ, దాని వాక్యాలు తారుమారు అవటంగానీ, దాని నిజస్థితిలో ఏ విధమయిన మార్పు రావటం గానీ సంభవం కానేకాదు.

దివ్య కుర్‌ఆన్ విషయంలో తిరుగులేని వాడైన దేవుడు చేసిన వాగ్దానమిది. ఈ వాగ్దానంలో శాసింపు ధోరణి ఉట్టిపడుతోంది. ఈ వాగ్దానం (లేదా ఆదేశం) సందర్భంగా అల్లాహ్ ప్రత్యేకంగా తన ప్రవక్త (స)ను దృష్టిలో పెట్టుకోలేదు. కాలపరిమితి కూడా పెట్టలేదు. విషయం సూత్రప్రాయంగా మాత్రమే చెప్పాడు. కనుక ఆయన జారీచేసిన ప్రకటనలో ఇమిడివున్న అసలు విషయం ఏమిటంటే దివ్య కుర్‌ఆన్‌లో ఎన్నడూ ఎలాంటి కల్తీ జరగదు. అందలి భాగమేదీ వృధాఅయి పోవటంగానీ,

పోగొట్టబడటం గానీ జరగదు. దాని వాక్యాలు వెనుకా ముందు అవటం కూడా జరుగదు. వెనుకటి రెండు సూక్తులలో ఈ వాగ్దానం దైవప్రవక్త (స) నుద్దేశించి చేయబడింది :

(3) వేరొకచోట ఇలా సెలవీయబడింది –

إِنَّا نَحْنُ نَزَّلْنَا الذِّكْرَ وَإِنَّا لَهُ لَحَافِظُونَ ۝٩ (الحجر)

“ఇకపోతే ఈ జ్ఞాపిక (ఈ కురాన్), దానిని మేము అవతరింపజేశాము. స్వయంగా మేమే దానిని రక్షిస్తాము.”

*(అల్ హిజ్ర్ – 9)*

ఈ దైవ వచనాలను విడమరచి చెప్పాల్సిన అవసరమే లేదు. విషయం సుస్పష్టమే. ఈ విషయంలోని ఒక్కొక్క కోణం అద్దంలా చాలా క్లియర్‌గా ఉంది. ఈ గ్రంథాన్ని అవతరింపజేసిన సార్వభౌముడు దీనిని అన్ని రకాల మార్పుల నుండి, హెచ్చుతగ్గుల నుండి కలకాలం సురక్షితంగా ఉంచాడని అర్థమవుతూనే ఉంది. ఇది ఆయన వాగ్దానం, తిరుగులేని నిర్ణయం. దీని తరువాత ఈ విషయానికి సంబంధించిన భయాలన్నీ పటాపంచలైపోతాయి. దీనిద్వారా వెనుకటి దైవగ్రంథాలకు పట్టిన గతి కుర్‌ఆన్‌కు పట్టబోదన్న అభయం కూడా లభిస్తుంది.

(4) ఆఖర్లో అన్వయింపుతో కూడిన ఒక నిదర్శనాన్ని కూడా చూడండి. కుర్‌ఆన్ తనలోని ఏ విశిష్ఠతలను, ఏ ప్రత్యేక గుణాలను గురించి చెప్పుకుందో అవి స్వయంగా వాంఛించేదేమిటి? లోకేశ్వరుడైన అల్లాహ్ తరఫున మార్గదర్శినిగా వచ్చిన గ్రంథం, వెనుకటి దైవ గ్రంథాలన్నింటినీ రద్దయినవిగా ఖరారుచేసిన గ్రంథం, సాఫల్యానికి, ముక్తికీ మూల సరోవరంగా ఖరారు చేయబడిన గ్రంథం – ఎన్నడయినా ప్రక్షిప్తాలకు లోనవుతుందంటే, అందులో మార్పు జరుగుతుందంటే బుద్ధివివేకాలు అంగీకరిస్తాయా? లేదు. ముమ్మాటికీ లేదు. ఎందుకంటే ఈ మాట దీని స్థాయితో, దీని అవతరణా ఉద్దేశంతో ఎంతమాత్రం సమన్వయం చెందదు. ఈ విధంగా ఆలోచించటం అంటే మానవుల సృష్టికర్త అన్యాయం చేశాడని నిందించటమే – ఆయన ఒక వైపు ఈ గ్రంథాన్ని ఏకైక మార్గదర్శక సంవిధానంగా, మానవాళి క్షమాభిక్షకు దానిని అనుసరించటం వినా మార్గాంతరం లేదని అంటూనే మరోవైపు దానిని సురక్షితంగా ఉంచే బాధ్యత నుండి ఆయన తప్పించుకున్నాడని ఆయనపై అభియోగం మోపటమే!

# బోధనా శైలి

## విలక్షణమైన బోధనా శైలి

దివ్య కుర్‌ఆన్ ఒక అత్యున్నతమయిన, స్వచ్ఛమయిన వాక్కు. మానవ వాక్ నిధిలో ఎక్కడా అటువంటి ఉపమానం లభించదు. అంతేకాదు, దాని బోధనాశైలి కూడా విలక్షణమైనది, అనితర సాధ్యమైనదీను. వేరే ఇతర గ్రంథాల్లో ఎక్కడా అలాంటి శైలి లభించదు. ఒక వ్యక్తి దాని కారకాలను, ప్రధాన ఉద్దేశ్యాలను తెలుసుకోనంత వరకూ కుర్‌ఆన్ కళాత్మక విలువల వరకూ అతని దృష్టి చేరకపోవటం అటుంచి కనీసం దాని భావార్థాలు కూడా అతనికి సుబోధకం అవవు. అందుకే కుర్‌ఆన్‌తో అనుబంధం పెంచుకునేందుకు దాని బోధనా తీరును ఒంటబట్టించుకోవటం అవసరం. కనీసం ప్రాథమిక స్థాయిలోనయినా దానిని ఆకళింపు చేసుకోవటం అవసరం.

సాధారణ పుస్తకాల, రచనల బోధనా తీరు ఎలా ఉంటుందంటే; వాటిలో నిర్ధారిత చర్చనీయాంశంపై విషయ పరిజ్ఞానం, భావాలు, నిదర్శనాలు ఒక వరుస క్రమంలో నిరంతరం వస్తుంటాయి. దాని ప్రధానాంశం (కేంద్ర ఇతివృత్తం) నిర్ణయించబడుతుంది. ఆ తరువాత దానికి సంబంధించిన వివిధ కోణాలపై, అంశాలపై సవిరంగా చర్చ జరుగుతుంది. ఒక అంశంపై చర్చ పూర్తి కానంతవరకూ రెండవ అంశం ప్రస్తావనకు రాదు. ఒక అధ్యాయం పూర్తి కానంత వరకూ రెండవ అధ్యాయం మొదలవదు. వివిధ అంశాలపై సమీక్ష జరుగుతున్నప్పుడు వచ్చే దాని పాక్షిక, సాపేక్షిక విషయాలలో కూడా ఒక క్రమబద్ధత ఉంటుంది. కాగా, కురాన్‌లో వాస్తవానికి అన్నీ ఉన్నాయి – పూర్తి కురాన్‌లో ఒక సమగ్రమయిన సబ్జెక్ట్ ఉంది. ప్రతి సూరాలో ఒక ప్రధానాంశం ఉంది. ప్రతి అంశంతో ముడిపడిన అనుబంధ అంశాలు, పాక్షిక సాపేక్షిక అంశాలూ ఉన్నాయి. మరి వాటన్నింటిపై వేర్వేరుగా చర్చ కూడా కొనసాగుతుంది – ఆ చర్చల మధ్య గట్టి అవినాభావ సంబంధం కూడా ఉంది. అయినప్పటికీ అవన్నీ పైకి చిందరవందరగా, కలగాపులగంగా కానవస్తాయి. మౌలిక విశ్వాసాలు, నైతికోపదేశాలు, షరీఅత్ ఆదేశాలు, సందేశ ప్రధానమయిన హితోక్తులు, ఓదార్పు వచనాలు, హెచ్చరికలు, మందలింపులు, శిక్షలు, శుభవార్తలు, బహుమానాలు, చారిత్రక సాక్ష్యాలు, బుద్ధివివేకాలు, మానవ నైజం వాంఛించే విషయాలు, జగతిలోని నిదర్శనాలు – ఇలా అన్నీ ఒకదాని తరువాత ఒకటిగా వస్తుంటాయి. ఒకే అంశం

అనేకచోట్ల అనేక పద్ధతుల్లో పునరావృతం అవుతూ ఉంటుంది. ఒకదాని తరువాత రెండవది, రెండవదాని తరువాత మూడవది అకస్మాత్తుగా మొదలైనట్లు అనిపిస్తుంటుంది. సంబోధన కూడా ఉన్నట్టుండి కొత్త మలుపు తిరుగుతుంటుంది. సంబోధితుడు చూస్తుండగానే ఓ మెరుపు మెరిసి మాయమైపోతుంటాడు. చర్చ కొనసాగించేవాడు అకస్మాత్తుగా నిష్క్రమిస్తాడు. అక్కడ లేనివాడు సంబోధకుని రూపంలో ప్రత్యక్షమవుతుంటాడు. జరిగే చర్చ కూడా ప్రఖ్యాత పద్ధతిలో కాకుండా విభిన్న పద్ధతులలో ముందుకు సాగుతుంటుంది. విశ్వాసాల ప్రస్తావన వస్తే అది తాత్విక పద్ధతిలో ఉండదు. నైతికోపదేశాలుంటే అవి నీతిశాస్త్రాన్ని అనుసరించి ఉండవు. ఒక విషయాన్ని ఖండించటమయినా, ధ్రువపరచటమయినా వాదోపవాదాల ద్వారానో, తర్జన భర్జన తీరులోనో జరగదు. సంస్కృతీ నాగరికతలపై, రాజకీయాలపై, ఆర్థిక వ్యవహారాలపై, సామాజిక కట్టుబాట్లపై చర్చాగోష్ఠి జరిగినా శాస్త్రీయ పద్ధతిలో సంభాషణ సాగదు. శాసనాలపై, న్యాయవ్యవస్థపై ప్రస్తావన వచ్చినా అది న్యాయశాస్త్ర పద్ధతికి భిన్నంగా ఉంటుంది. చారిత్రక సంఘటనలు వివరిస్తున్నప్పుడు అవి చరిత్రకారులు అవలంబించే విధానానికి భిన్నంగా ఉంటాయి. చూడబోతే ఇది ఒక పద్ధతితో కూడిన పరస్పర సంబంధం కల వాక్కు కాదని, చెల్లాచెదురుగా పడివున్న వాక్యాల రాశి అని అనిపిస్తుంది. కాని వాస్తవం దీనికి భిన్నమైనది. ఆ వాక్యాల మధ్య అపురూపమైన, పటిష్టమయిన అనుబంధం ఉంది. విజ్ఞత వివేచనలతో కూడుకున్న పదబంధం ఉంది. అయితే ఆ అనుబంధాన్ని, పదబంధాన్ని ఆకళింపు చేసుకోవటానికి సాధారణ పుస్తకాల గురించి మస్తిష్కంలో ఉండే స్వరూపాన్ని తీసివేయాలి. ఓ నూతన దృక్పథంతో కురాన్ అధ్యయనం చేయాలి. ఈ నూతన దృక్పథం కృత్రిమంగా అవలంబించటం సాధ్యం కాదు. కుర్‌ఆన్ బోధనా శైలిలోని విలక్షణతను, దాని పరమార్థాలను, స్వాభావిక కారకాలను తెలుసున్నప్పుడే పాఠకునికి ఈ దృక్పథం, ఈ విద్య అబ్బుతుంది.

## విలక్షణా శైలికి గల కారణాలు

దివ్య కురాన్ బోధనా శైలి సాధారణ గ్రంథాల కంటే విభిన్నంగా ఉండటానికి గల ముఖ్య కారణాలివి :

(1) దివ్య కురాన్ వ్యాసాల సమాహారం కాదు, అది ఉపన్యాసాల మణిహారం. అందువల్ల అందులో పుస్తకాల, వ్యాసరచనల ఉరవడి కనిపించదు. స్వాభావికంగా దాని బోధనా శైలి ఉపన్యాసాల మాదిరిగానే ఉంటుంది.

(2) ఈ ఉపన్యాసాలు కూడా ఒక ఉపన్యాసకుని ప్రసంగం మాదిరిగానో,

ఒక ప్రొఫెసర్ ఇచ్చే లెక్చర్ మాదిరిగానో కాకుండా ఒక సందేశ ప్రదాత ఇచ్చే ప్రసంగంలా ఉంటాయి. మానవ సమూహాల మధ్యన నిలబడి వారిని అపమార్గాల నుండి ఆపి, సన్మార్గానికి తెచ్చే సందేశ ప్రదాత బోధించే పలుకుల మాదిరిగా ఉంటాయి కురాన్ ప్రబోధనలు. అందుకే దాని ఉపన్యాస తీరు ఉపన్యాసమిచ్చే విధంగానో, పాఠం చెప్పేవిధంగానో కాకుండా నిలువెల్లా ధర్మబోధనగా, సందేశాత్మ కంగా ఉంటుంది.

(3) ఏ 'సందేశం' కోసం ఈ ఉపన్యాసాలివ్వబడ్డాయో అవి 23 ఏండ్ల సుదీర్ఘ కాలంలో – వివిధ దశలను అధిగమిస్తూ, వివిధ మలుపులు తిరుగుతూ, వివిధ మజిలీలను దాటుకుంటూ తమ పరిపూర్ణ బిందువుకు చేరుకున్నాయి. ఈ ఉపన్యాసాలు కేవలం కొన్ని మాసాలలో నిరంతరం ఏకధాటిగా ఇవ్వబడినవి కావు. ఒకే పరిస్థితిలో, ఒకే రకమయిన జనుల ముందు ఇవ్వబడిన ప్రసంగాలు కూడా కావవి. వాటి నిజస్థితి దీనికి పూర్తిగా భిన్నమైనది.

ఈ మూడు విషయాలు వాంఛించే వాటిపై బాగా యోచన చేయండి. సందేశ ప్రధానమైన సంబోధన (ఉపన్యాసం) వాంఛించేది రచనలు, వ్యాసాలు, పాఠాలు, ప్రసంగాలు, హితవులు వాంఛించే వాటికన్నా భిన్నమైనది. ఒక సందేశప్రదాత (దాయి), రచయిత తీరునో, ప్రొఫెసర్ శైలినో అవలంబిస్తే అతని పలుకుల్లో తియ్యదనం, కమ్మదనం ఉండవు. పైగా అవి చప్పగా, కర్ణకఠోరంగా ఉంటాయి. అలాగే అతను గనక కేవలం ఒక వక్తగా వ్యవహరిస్తే అతని సందేశం ద్వారా విప్లవాత్మక లక్ష్యాలు సిద్ధించవు. నిశ్చయంగా రచయిత లేక ప్రొఫెసర్ వాక్కు శాస్త్రీయంగా, సహేతుకంగానే ఉంటాయి. సందేశ ప్రదాత చెప్పేది కూడా హేతుబద్ధంగానే ఉంటుంది. అయితే రచయిత, ప్రొఫెసర్ వాదన కేవలం సైద్ధాంతికమైనదై ఉంటుంది. కాగా; ఉపన్యాసకుని సంభాషణ మౌలికంగా స్వాభావికమైనది, మానసికమైనదై ఉంటుంది. ముఖ్యంగా ధర్మబోధకుడు అయిన వక్త చెప్పేది కచ్చితంగా ఇలాగే ఉంటుంది. ఇలాంటి ఉపన్యాసకుని పని కేవలం ఒక రచయిత మాదిరిగా తన భావాలు భావనలను ఆధారాలు నిదర్శనాలతో ముస్తాబుచేసి, అందాలు జాలువారే తీరులో మార్పిడి చేయడం మాత్రమే అయి ఉండదు. లేదా ఒక ప్రొఫెసర్ మాదిరిగా ఏదయినా ఒక శాస్త్రీయ సిద్ధాంతాన్ని కొంతమంది విద్యార్థుల, మేధావుల మస్తిష్కాల్లో జొప్పించటం కూడా ఒక సందేశ ప్రదాతకు శోభించదు. దీనికి భిన్నంగా ఒక సందేశ ప్రదాత పని ఎంతో ఉన్నతమైనది, క్లిష్టమైనది కూడా. ఒకవైపు అతని ఎదుట విభిన్న ఆలోచనలు గల వారుంటారు. శక్తియుక్తుల రీత్యా అనేక రకాల వారుంటారు. పట్టణవాసులు, పల్లెవాసులు, విద్యావంతులు, నిరక్షరాస్యులు, మంచిని ప్రేమించే శుభాత్ములు, వక్ర

మనస్కులు, దైవదౌత్యాన్ని నమ్మేవారు, నిరాకరించేవారు, ఏకేశ్వరోపాసకులు, బహుదైవోపాసకులు – ఇలా రకరకాల జనులను అతను 'రాచబాట' వైపునకు పిలువవలసి ఉంటుంది.

మరోవైపు అతను ఆ సందేశానికి ప్రభావితులై, విశ్వసించిన వారి జీవితాలను తీర్చిదిద్దవలసి ఉంటుంది. వారి మనస్తత్వాన్ని, తెలివితేటలను, వారి స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని ఎంతో నేర్పుతో, మరెంతో యుక్తితో వారికి ధర్మాదేశాలు బోధించాలి. వారికి శిక్షణ ఇవ్వాలి. అడుగడుగునా వారిలో జనించే సందేహాల నివృత్తిచేస్తూ ఉండాలి. సన్మార్గం వైపునకు పిలవటమంటే భావం కేవలం తన మాటను బుద్ధి లేక తర్కమనే త్రాసులో తూకం వేసి జనులకు వడ్డించటం కాదు. దానిని హృదయాంతరాళాల్లో పాతుకుపోయేలా చేయడానికి శాయశక్తులా యత్నించటం కూడా ఒక సందేశ ప్రదాత బాధ్యతే. ఈ పని చేయడానికి ముందు తరతరాలుగా, యుగయుగాలుగా వారి మస్తిష్కాల్లో నాటుకుని ఉన్న మిథ్యావాదాలను పెకలించివేయాలి. తప్పుడు భావాలే అయినప్పటికీ ఎంతో సున్నితమైన ఆ భావోద్రేకాల ఉచ్చు నుండి వారిని బయటికి తీసి, స్వతంత్రుల్ని చేయాలి. ఈ మహత్కార్యం కోసం ప్రత్యేకమయిన మనోమస్తిష్కాలతో పాటు, ప్రత్యేకమయిన భాష కూడా అవసరమే. అంతర్గత జ్యోతి, ఆధారాల జోరు మాత్రమే సరిపోదు; వాక్చాతుర్యం కూడా ఉండాలి. సందేశ ప్రదాత మాటల మాంత్రికుడు కూడా అయి ఉండాలి. అతని నిశిత దృష్టి సంబోధితుని ఆలోచనలను, ధోరణులను, మనస్తత్వాన్ని పరికించి పసిగట్టనంత వరకు సందేశ ప్రదాత మాటల్లో 'అయస్కాంత శక్తి' జనించదు.

ఇంకా – సందేశప్రదాత సంబోధితుల ముందు కొన్నిసార్లు హేతుబద్ధమయిన విషయాలు, కొన్నిసార్లు ఉపదేశాలు, కొన్నిసార్లు ప్రోత్సహించటం, కొన్నిసార్లు హెచ్చరించటం, కొన్నిసార్లు క్రోధం సృష్టించటం, కొన్నిసార్లు వాత్సల్యభరితంగా వ్యవహరించటం, కొన్నిసార్లు ఆగ్రహాన్ని వెళ్ళగ్రక్కటం లాంటివి చేయనంతవరకు ఈ ఆశయం నెరవేరదు. ఈ ఉద్దేశంతో అతను తన ప్రసంగ శైలిని మార్చటం కూడా అవసరం. అలాగే – సందేశాన్ని స్వీకరించిన వారి మానసిక, క్రియాత్మక శిక్షణ నిమిత్తం, వారికి ధర్మోపదేశాలు చేసే నిమిత్తం ధర్మశాస్త్రాలను, శాసనాంగాల ప్రతులను వారి చేతికిచ్చి వేయటంతో కర్తవ్యం నెరవేరదు. పైగా ఎంతో నేర్పుతో, దూరదృష్టితో వారి జీవితాలను సందేశం (దావత్) వాంఛించే మూసలో పోసి, అంచెలవారీగా తర్ఫీదు ఇవ్వాలి. వారి అంతరంగాలను పరిశుద్ధపరచాలి. ఒక సందేశప్రదాత ఆజ్ఞల

సైద్ధాంతిక అవధులను దాటి అక్కడి వాతావరణం వాంఛించే దానిని, పరిస్థితుల సామంజస్యతను, జనుల మానసిక స్థితిని, వారి అంతరంగాలలోని స్వీకార గుణాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటి ప్రకారం ముందుకు సాగనంతవరకూ అతను ఆశయప్రాప్తిలో కృతకృత్యుడు కాలేడు.

దివ్య కుర్‌ఆన్ సందేశ ప్రధానమయిన ప్రసంగాల సమాహారం. ఈ ప్రసంగాలలో అసలు ఉపన్యాసకునిగా అల్లాహ్ ఉంటాడు. ఆదం సంతతికి చెందిన వారంతా అతని సంబోధితులే. సందేశవాహకుడు అయిన దూత (జిబ్రీల్-అ), వహీ (దివ్యవాణి)ని అందుకున్న వ్యక్తి (మహనీయ ముహమ్మద్ - స) ప్రతినిధుల స్థాయి కలిగి ఉంటారు. సకల లోకాల ప్రభువు తన భూలోకవాసులను ఉద్దేశించి చేసే ప్రసంగాలే కుర్‌ఆన్. అందుచేత దాని వివరణా శైలిలో ఇంతకు ముందు ప్రస్తావించిన విషయాలన్నీ ఉంటాయి. సందర్భోచితంగా అందులో వేడిమితో పాటు చల్లదనం కూడా ఉంటుంది. శౌర్యంతోపాటు సౌమ్యం, మృదుత్వం కూడా ఉట్టిపడుతూ ఉంటుంది. హెచ్చరికలతోపాటు శుభవార్తలూ ఉంటాయి. ఆధారాలు నిదర్శనాలతో పాటు శాసనాలు కూడా ఉంటాయి. మృదుభాష్యంతో పాటు ఆగ్రహావేశంతో కూడిన గర్జన కూడా ఉంటుంది. మరి ఈ విషయాలనుబట్టి సంబోధనా తీరు కూడా మారుతూ ఉంటుంది. ఉదాహరణకు : ఇప్పటి వరకూ అక్కడున్న సంబోధితుడు ఉన్నట్టుండి మటుమాయమై పోతాడు. అంటే సందేశప్రదాత ఆ సంబోధితుని అజాగ్రత్తకు, దుస్సాహసానికి ఆగ్రహించి అతని వైపు నుండి తన దృష్టిని మరల్చుకుంటాడు. ఇప్పుడా వ్యక్తి ఆయనతో ముచ్చటించే భాగ్యానికి నోచుకోకుండా పోయాడు. లేదా సంభాషించే వాడైన అల్లాహ్ కూడా కొన్నిచోట్ల కనుమరుగై పోతుంటాడు. తన స్థానంలో తన సందేశవాహకుడైన దూతనో, తన సందేశహరుణ్ణో మాట్లాడే వారుగా ఉంచుతాడు. ఎందుకంటే కొన్ని విషయాలు పరోక్షంగా చెప్పటంలోనే అందం ఉంది. మరకొన్ని విషయాలను సందేశప్రదాత ప్రత్యక్షంగా చెబితేనే బావుంటుంది.

దివ్య కుర్‌ఆన్‌లో పలు సందర్భాలలో ఒక వాదన పూర్తవగానే - అకస్మాత్తుగా - మరో వాదనకు తెరలేస్తుంది. మొదటి వాదనతో బాహ్యంలో దానికెలాంటి సంబంధం ఉండదు. ఒకవైపు దేవుని ఏకత్వం (తౌహీద్)పై చర్చ జరుగుతూనే ఉంటుంది. అంతలోనే పరలోకం గురించి, కర్మల పర్యవసానం గురించిన ప్రస్తావన వచ్చేస్తూ ఉంటుంది. కుర్‌ఆన్ మరియు దైవప్రవక్త సత్య నిబద్ధతపై ఆధారాలు సమర్పిస్తూ ఉండగానే సత్యతిరస్కారుల ప్రాపంచిక వ్యామోహంపై సమీక్ష

మొదలైపోతుంది. అరబ్బు ముష్రిక్కుల మంకుతనం గురించి ప్రస్తావిస్తూ ఉండగానే మధ్యలో గ్రంథవహుల మొండితనంపై చర్చ మొదలవుతూ ఉంటుంది. కుర్‌ఆన్‌ను కేవలం ఒక రచనగా, ఒక సాధారణ పుస్తకంగా తలపోస్తే అసలు ఇదేమిటో అర్థం కాదు. కాని ఒక సందేశప్రదాత స్థానంలో నిలబడి చూస్తే ఈ దైవప్రోక్తంతో సంబంధమున్న నేపథ్యమంతా కానవస్తుంది. అందులోని ఒక్కొక్క అంశం, ఒక్కొక్క పాక్షిక సాపేక్షిక అంశం బోధపడుతుంది.

## విషయాల పునరుక్తి

దివ్య కుర్‌ఆన్‌లో విషయాలు, వాదోపవాదాలు పదే పదే పునరావృతం అవుతుంటాయి. ఎన్నో ఆదేశాలు, ఉపదేశాలు, హెచ్చరికలు, శుభవార్తలు, మందలింపులు, హితబోధలు, ఆధారాలు, నిదర్శనాలు, చారిత్రక సంఘటనలు మాటిమాటికీ ప్రస్తావనకు వస్తుంటాయి. అది తన గురించి స్వయంగా చెప్పుకున్నట్లు–

كِتٰبًا مُّتَشَابِهًا مَّثَانِيَ (سورۃالزمر)

"ఇది ఒకే పోలిక కలిగివున్న భాగాలు కల గ్రంథం. ఇందులో విషయాలు మాటిమాటికీ పునరుక్తం చేయబడినాయి." *(అజ్ జుమర్ : 23)*

చూడబోతే ఇది వాంఛనీయమైన విషయంగా కనిపించదు. తెలియని ఒక మనిషి అభిరుచికి ఈ విషయాల పునరుక్తి విఘాతంగా పరిణమిస్తుంది. కాని దివ్య కుర్‌ఆన్ అవతరణా విధానం, అవతరణా ఉద్దేశం – రెండూను వాంఛించిన దాని ప్రకారం విషయాల పునరుక్తి అనివార్యమయింది –

(1) అవతరణా విధానం : దివ్య కురాన్ ఒక క్రియాత్మక, క్రమవికాస సందేశంగా అవతరిస్తున్నప్పుడు – ఆ దశలో అప్పటివరకూ అవతరించివున్న సూచనలు, ఉపదేశాలు మాత్రమే పదే పదే పునశ్చరణ చేయాల్సిన ఆవశ్యకత ఉండేది. ఆ దశను దాటి ఇతరత్రా విషయాలను ప్రస్తావించటం అప్పట్లో భావ్యం కాదు.

(2) అవతరణా ఉద్దేశం : ఏ సందేశమయినా దానిని అవలంబించే వారి మనోభూమిలో దాని మౌలిక విషయాలు గట్టిగా నాటుకున్నప్పుడే ఆ సందేశం విజయవంతమవుతుంది. అంతేకాదు, ఆ విషయాలు క్రియాత్మకంగా వారి జీవితాలలో సృజించే ప్రత్యేక నడవడిని కూడా పర్యవేక్షిస్తూ ఉండాలి. అన్యథా ఆ 'సందేశం' చేరవలసిన గమ్యానికి చేరుకోదు. అందుకే కుర్‌ఆన్ సందేశం తన ఆశయాల సాధనకై

వాంఛించినదేమిటంటే, దాని మౌలిక ప్రబోధనలను తొలి నాటి నుండి ఆఖరి సమయం వరకూ – ఏ దశలో కూడా – విస్మరించకూడదు. సందేశ పరిచయ కార్యక్రమంలోని ప్రతి ఘట్టంలో వాటి పునరుక్తి మాటిమాటికీ జరుగుతూ ఉండాలి. వాటిని మరువబోకండి, నిత్య జీవితంలో వాటికి కట్టుబడి ఉండండి అని నిరంతరం బోధపరుస్తూ ఉండాలి. అందుకే మీరొక విషయం గమనిస్తారు – దివ్య కుర్‌ఆన్‌లో ఇతర విషయాలు ఒక దశవరకే పునరావృతమవుతాయి. కాని దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకం, పునరుత్థానదినం, శిక్షా బహుమానాలు, ఆరాధన – విధేయత, సదాచరణ, భక్తి, భీతి (తఖ్వా), సహనం, కృతజ్ఞతా భావం, దైవంపై భరోసా, దేవుని వైపు మరలటం, నమాజ్, దైవమార్గంలో ఖర్చు, త్యాగం, బంధువుల హక్కు వంటి అంశాల ప్రస్తావనతో కురాన్ పుటలు నిండి ఉండటం మీ దృష్టికి వస్తుంది; మానవ శరీరంలో నరాలు విస్తరించివున్నట్లే ఈ ప్రబోధనలు ఇందులో అన్ని మూలల నుండి విస్తరించి ఉన్నాయి. ఎందుకు? ఎందుకంటే ఇవి ధర్మంలోని ప్రాథమిక అంశాలు. ప్రాథమ్యాలు. అవి ఎంత పటిష్ఠంగా ఉంటే ధర్మం అనే సౌధం కూడా అంతే పటిష్ఠంగా ఉంటుంది.

అయితే 'పునరుక్తి' అనే పదాన్ని చూసి ఒకేమాట పదే పదే ఒకే విధంగా, ఒకే పదజాలంతో, ఒకే భావంతో, ఒకే ఉద్దేశంతో పునరావృతం అవుతుందని భావిస్తే పొరపాటే. అలా జరగలేదు. దివ్య కుర్‌ఆన్‌లోని ఒకే ఆజ్ఞ, ఒకే గాథ, ఒకే నిదర్శనం పదేసి, ఇరవయ్యేసి చోట్ల ప్రస్తావించబడినప్పటికీ .... అది కేవలం పునరుక్తిగా ఎక్కడా లేదు. ఎందుకంటే ప్రతిచోటా ఆ విషయంలోని కొత్త కోణాలు ఆవిష్కరించబడుతుంటాయి. ఉదాహరణకు : ఒకే వృత్తాంతాన్ని అనేకసార్లు సంక్షిప్తంగా లేక సవివరంగా చెబుతున్నప్పుడు వివరణా తీరులో కొత్తదనం ఉంటుంది. పదజాలంలో మార్పు ఉంటుంది. ఆ 'వృత్తాంతం'లోని వివిధ భాగాలలో కొన్నిచోట్ల కొన్నింటిని, మరికొన్ని చోట్ల మరి కొన్నింటిని తొలగించటం కూడా అందులోని ఒక ప్రత్యేకతే. ఒకే వృత్తాంతాన్ని ఒకే విధమయిన పదజాలంతో, ఒకే తీరులో వింటే మనిషి విసుగెత్తిపోతాడు. కాని కుర్‌ఆన్ సృష్టించిన ఈ వైవిధ్యం వల్ల, నూతన పంథా మూలంగా ఒక పాఠకుడు లేక ఒక శ్రోత ఎన్నడూ విసుగు చెందడు. కొంగ్రొత్త నిదర్శనాలతో, కొంగ్రొత్త పదాలతో విషయాన్ని పునరావృతం చేయటం వల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే; దైవోపదేశంలోని కొన్ని కొత్త కోణాలు ప్రస్ఫుటం అవుతాయి. వాటిని విన్నప్పుడు, వాటిపై యోచన చేసినప్పుడల్లా ఓ సరికొత్త ప్రభావం, చింతన కలుగుతుంటుంది. ఈ విధంగా ఈ గాథల, సంఘటనల పునరుక్తి పునరుక్తే

అయినప్పటికీ పునరుక్తిగా ఉండదు. ఆజ్ఞల పునరుక్తి, నిదర్శనాల పునరుక్తి, పరిణామాల పునరుక్తి, ఇతర విషయాల పునరుక్తి కూడా ఇంతే. ఒకే విషయాన్ని నూరేసి రంగులతో రంగరించటం మాత్రమే జరగలేదు; నూరేసి పరమార్థాలతో, తరుణోపాయా లతో, సందేశాత్మక ప్రయోజనాలతో దానిని ముస్తాబు చేయటం కూడా జరిగింది.

కురాన్‌లో పదే పదే పునరావృతమయిన విషయాలలోని పరమార్థాల ప్రాధాన్యతను విశ్లేషించిన వ్యక్తి ఈ 'పునరుక్తి'ని కుర్‌ఆన్ కళాత్మక పంథాగా గుర్తిస్తాడు. తన సందేశ ప్రధానమైన పయనంలో తనూ ఇదే శైలిని పుణికిపుచ్చుకుంటాడు.

# కుర్ఆన్ - కుర్ఆన్ భాగాలు

## కుర్ఆన్ నామకరణం

'కురాన్' అనే పదం అరబీ భాషకు చెందిన మూలపదం. నిఘంటువు ప్రకారం 'అక్షరాలను, వచనాలను అర్ధవంతమైన వరుసక్రమంలో కూర్చి నోటితో పలకటం' అని దీని అసలు అర్థం. దీనిని అందరికీ అర్థమయ్యేలా 'చదవటం' అంటారు. అరబీ భాషలోని సర్వసాధారణ నియమం ప్రకారం 'చదవబడేది' అనే భావం కూడా వస్తుంది. ఈ రకంగా చదవబడే ప్రతి గ్రంథాన్ని, ప్రతి పత్రాన్ని - నిఘంటువు ప్రకారం 'కుర్ఆన్' అనవచ్చు. కాని అరబీ జాతీయం ప్రకారం ప్రతి గ్రంథం కొరకు కుర్ఆన్ అనే పదం ఉపయోగించబడదు. దేవుని తరఫున అవతరింపజేయబడిన గ్రంథాలకు మాత్రమే ఆ పదాన్ని ప్రత్యేకించటం జరిగింది. అంటే 'కుర్ఆన్' అనగానే అది అల్లాహ్ తరఫున అవతరించినది అనే భావన స్ఫురిస్తుంది.

దివ్య కుర్ఆన్‌లో ఈ పదం అనేకచోట్ల ఈ భావంలోనే చెప్పబడింది. ఉదాహరణకు :

وَلَوْ اَنَّ قُرْاٰنًا سُيِّرَتْ بِهِ الْجِبَالُ.. (سورة الرعد:٣١)

"పర్వతాలను నడిపించే 'కుర్ఆన్'ను దేనినయినా అవతరింపజేస్తే ఎలా ఉండేది?" *(అర్రాద్ : 31)*

ఇది కురాన్ అనే పదానికి సంబంధించిన సర్వసాధారణ భావం. తరువాత ఈ పదం మరింత విశిష్ఠతను సంతరించుకుంది. అదొక ప్రత్యేక పరిభాషగా రూపాంతరం చెందింది. అంటే అది మహాప్రవక్త ముహమ్మద్ (స) పై అవతరించిన గ్రంథం అన్న అర్థానికి పరిమితం అయింది. ఇతర దైవ గ్రంథాల కోసం ఈ పదం ప్రయోగించబడినప్పటికీ (ఉదాహరణకు : స్వయంగా కుర్ఆన్‌లోనే ఒకచోట తౌరాతు గ్రంథం కొరకు 'అల్ కుర్ఆన్' అనే పదం ప్రయోగించబడింది. చూడండి: అల్ హిజ్ర్ సూరా 91వ సూక్తి) ప్రస్తుతం 'కుర్ఆన్' అంటే అది సమస్త మానవాళికి మార్గదర్శకంగా అవతరించిన దేవుని అంతిమ గ్రంథమే.

దివ్య కురాన్‌ను 'అల్ కురాన్' అనటం, అల్లాహ్ తరఫున దానికి ఆ పేరు ప్రతిపాదించబడటంలోని యుక్తి ఏమిటో ఆయనకే బాగా ఎరుక. అయితే ఆ కారణాలు బహుశా ఈ క్రింద పేర్కొనబడినవి కావచ్చు.

(1) కుర్ఆన్ మానవ జీవితానికి సంబంధించిన సంపూర్ణ సంవిధానం.

ఎల్లవేళలా మానవునికి మార్గదర్శకత్వం వహించే సాధనం. అందుచేత దానిని అవలంబించే వారికి దానితో గల సంబంధం కూడా సర్వతోముఖమైనదే. ఈ సంబంధం వాంఛించేదేమిటంటే, అది కేవలం కాగితపు పుటలలో ముద్రించబడి ఉండటంకన్నా వారి మనోఫలకాలపై ముద్రితమై ఉండాలి. వారి నోళ్ళు దాని పారాయణంలో నిమగ్నమై ఉండాలి. అన్ని కాలాల్లో అది వేలాది కురాన్ స్మర్తల హృదయ ఫలకాలలో 'అప్పగింత'గా భద్రపరచబడి ఉండాలన్నది దేవుని అభిమతం అన్న సంగతి కూడా ఈ సందర్భంగా విస్మరించరానిదే. లక్షలాది మంది అధరాల మీదుగా కురాన్ తేనియలు జాలువారుతూ ఉండాలి. అందుకే ఈ గ్రంథం పేరే 'కుర్‌ఆన్' అని పెట్టబడింది – అంటే అత్యధికంగా పఠించబడే గ్రంథం! పఠించబడుతూ ఉండే గ్రంథం!!

(2) దేవుని మార్గదర్శకత్వ పరంపర హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) కాలం నుండి మొదలై దివ్య కుర్‌ఆన్‌తో పరిపూర్ణతకు చేరింది. ఇందులో ఇప్పటి వరకూ అవతరించిన మార్గదర్శక గ్రంథాల, సహీఫాల మౌలిక ప్రబోధనల సారం ఇమిడి ఉంది. సురక్షితంగా కూడా ఉంది. కడకు పూర్వకాలపు ఏదేని గ్రంథం గురించి వాటి అసలు సందేశం ఏమిటని నేడు మనం తెలుసుకోగోరితే, ఆ గ్రంథం ద్వారా మన లక్ష్యం పూర్తిగా సిద్ధించదు. ఒకవేళ ఆ లక్ష్యం సిద్ధించగలదంటే ఈ కుర్‌ఆన్ ద్వారానే. ఈ విధంగా ఈ కుర్‌ఆన్ చెప్పటానికైతే కేవలం ఒక గ్రంథమే. కాని యదార్థానికి ఇది పూర్తి దైవదౌత్య పంరపర మరియు దైవగ్రంథాల సమాహారం. అందుకే దీని పేరు 'కుర్‌ఆన్' అని ప్రతిపాదించటం జరిగింది. అసలు నిఘంటువు ప్రకారం 'సమగ్రం', 'ఒకేచోట చేర్చటం' అని దీనికి అర్థం.

దివ్య కురాన్‌కు మరికొన్ని పేర్లు కూడా ఉన్నాయి. వాటిని అది తన కొరకు అత్యధికంగా ఉపయోగించుకుంది. ఉదాహరణకు : కితాబ్ (గ్రంథం), ఫుర్ఖాన్ (గీటురాయి), జిక్ర్ (స్మరణ), జిక్రా(జ్ఞాపిక), నూర్ (జ్యోతి), హుదా (మార్గదర్శిని) మొదలగునవి.

## సూరా (అధ్యాయం)

కురాన్ ఆసాంతం ఒకే విషయం లేక ఒకే వాదన లాంటిది కాదు. పైగా అది 114 భాగాలుగా విభజితమై ఉంది. ఒకవిధంగా చెప్పాలంటే అవి ఒక గ్రంథంలోని వివిధ అధ్యాయాల వంటివి. కురాన్‌లోని ఈ భాగాలను అల్లాహ్ 'సూరాలు'గా వ్యవహరించాడు.

ప్రతి సూరాలో ఓ ప్రధానాంశం ఉంటుంది. అది పూర్తి కురాన్‌లోని సమగ్రమయిన చర్చనీయాంశంలో ఒక భాగమై ఉంటుంది. లేదా దానికి సంబంధించిన వ్యవహారాలలోని ఏదయినా ఒక వ్యవహారమై ఉంటుంది. సూరా యొక్క సంభాషణ అంతా ఆ ప్రధానాంశం చుట్టూనే పరిభ్రమిస్తూ ఉంటుంది. ఈ సంభాషణ తన లక్ష్యం, విషయం దృష్ట్యా సర్వవిధాలా సంపూర్ణంగా ఉంటుంది. వేరొక సూరా అవసరం దానికి ఉండదు. కాకపోతే ప్రతి సూరా దానికి ముందూ, వెనుక ఉన్న సూరాలతో సహజ సంబంధం కలిగి ఉంటుంది. ఈ విషయాలను లోతుగా చర్చించడానికి ఇక్కడ అవకాశం లేదు. స్వయంగా కుర్‌ఆన్ కూడా వాటిని విపులీకరించకుండా మన 'విజ్ఞత', 'చింతన'కే వదలిపెట్టింది.

'సూరా' అనే పదం 'సూర్' నుండి వెలువడింది. సూర్ అంటే 'నగర ప్రాకారం' అని అర్థం. కురాన్‌లోని ఈ భాగాలను (ఖండాలను) 'సూరా'గా ఎందుకు వ్యవహరించారన్న ఆలోచన మదిలో జనించక మానదు. అయితే ఈ విషయమై దైవం తరఫున గానీ, దైవప్రవక్త (స) తరఫున గానీ ఎలాంటి వివరణ ఇవ్వబడలేదు. అందువల్ల దీని కారణం కూడా అంచనా (కియాస్) ఆధారంగా కనుగొనబడుతుంది. ఆలోచించిన మీదట రెండు కారణాలు మన బుద్ధికి అందుతాయి –

(1) ఒకటి : కుర్‌ఆన్ ఖండాలలో ప్రతి ఖండం తనదంటూ ఒక శాశ్వత స్థాయిని కలిగి ఉంది. ఆ విషయం ఇప్పుడిప్పుడే చర్చకు వచ్చింది కూడా. అంటే కురాన్ ఖండాలను 'సూరా' గా అభివర్ణించి ఒకానొక యదార్థం వైపు సంజ్ఞ చేయటం జరిగింది – అదేమిటంటే, ఏ విధంగానయితే ఏదయినా ఒక నగరం తన ప్రాకారం లేక సరిహద్దుల ద్వారా తన ప్రత్యేకతను చాటుకుంటుందో, దేశంలోని ఇతర పట్టణాల నుండి, జనపదాల నుండి తనను వేరుపరచుకుంటుందో అదేవిధంగా కుర్‌ఆన్ కూడా ప్రతి ఖండం (అంటే ప్రతి సూరా) ద్వారా తన చర్చనీయాంశాన్ని వేరుపరచుకుంది. అందులో దాని ప్రత్యేక చర్చ ఉంటుంది. దానికి సంబంధించిన ముఖ్యాంశాలతో పాటు అనుబంధ అంశాలు అందులో అంతర్లీనమై ఉంటాయి. ఆ విధంగా అది ఒక ప్రత్యేక సూరాగా – ఇతర సూరాల నుండి వేర్పడి – ఉంటుంది. కాబట్టి మన బుద్ధివివేకాలు మనకు సూచించేదేమిటంటే ప్రతి సూరా తనదంటూ ఓ ప్రత్యేక ప్రతిపత్తిని కలిగి ఉండకపోతే పూర్తి కురానును 114 సూరాలుగా విభజించే బదులు ఒకే నిరంతర చర్చనీయాంశంగా ఉంచాల్సివచ్చేది!

(2) రెండవ కారణం : దివ్య కుర్‌ఆన్ సంపూర్ణ పరిరక్షణ. దీనికి సంబంధించిన వివరాలు వెనుకటి పంక్తులలో మన ముందుకు వచ్చాయి. కుర్‌ఆన్‌ను శాశ్వతంగా

సురక్షితం గావించాలన్నది దైవ నిర్ణయం గనక ఆయన దాని ఖండాలను, అధ్యాయాలను 'సూరాలు'గా అభివర్ణించి, తన నిర్ణయాన్ని ఓ ప్రత్యేక రీతిలో ప్రకటించాడు. అంటే ఈ విషయాన్ని చాటిచెప్పటానికి అవలంబించబడిన విధానమేమిటంటే, దివ్య కురాన్ సత్య వచనాల ఆధ్యాత్మిక 'జనావాసాల' కూడిక. దానిని అగోచర బందోబస్తు ద్వారా పటిష్ఠమయిన ప్రాకారాలతో దిగ్బంధం చేసి కాలపు కంబంధ హస్తాల, కరాళ దంష్ట్రాల బారి నుండి శాశ్వతంగా సురక్షితం గావించటం జరిగింది.

సూరాల పేర్లు కూడా దైవికంగా ఖరారైనవే. అంటే అవి అల్లాహ్ తరఫున లేదా అల్లాహ్ ప్రవక్త తరఫున పెట్టబడ్డాయి. కొన్ని సూరాలకు ఒకటికన్నా ఎక్కువ పేర్లే ఉన్నాయి. మరి ఈ దైవిక నామాలతో పాటు ముస్లిం సమాజంలోని ప్రసిద్ధ విద్వాంసులు సూరాలలోని ప్రధానాంశాలను వ్యక్తం చేయడానికి – తరువాతి కాలంలో – కొన్ని పేర్లు పెట్టుకున్నారు. అయితే ఈ పేర్లకు అసలు పేర్ల 'స్థాయి' లేదు. దైవప్రవక్త (స) ద్వారా ప్రకటించబడిన పేరే అసలు పేరు. ముఖ్యంగా సూరాల ప్రఖ్యాత పేర్లు కురాన్ ప్రతులలో పొందుపరచే ఆచారం శతాబ్దాల తరబడి కొనసాగుతూ ఉంది.

సూరాల పేర్లు ఏదో ఒక్క పంథాలో మాత్రమే పెట్టబడలేదు. వివిధ సూరాల పేర్ల కోసం వివిధ విధానాలు అవలంబించబడ్డాయి. అనేక సూరాల పేర్లు వాటి మొదటి వచనం ఆధారంగానే పెట్టబడ్డాయి. ఉదాహరణకు: తాహా సూరా, యాసీన్ సూరా, కాఫ్ సూరా మొదలగునవి. మరికొన్ని సూరాలకు నామకరణం చేయడానికి వాటిలోని ఏదయినా ఒక ప్రస్ఫుటమయిన పదాన్ని తీసుకోవటం జరిగింది. ఉదాహరణకు : బకరా సూరా, జుఖ్రుఫ్ సూరా, అన్ నమ్ల్ సూరా మొదలగునవి. ఇంకా కొన్ని సూరాల పేర్లు నిర్ధారించేటప్పుడు ఆ సూరాలోని ప్రధానాంశాన్ని తీసుకోవటం జరిగింది. ఉదాహరణకు : ఆలి ఇమ్రాన్ సూరా, నూర్ సూరా. కొన్ని సూరాల పేర్ల కోసం ఆ సూరాలలోని చర్చను దృష్టిలో పెట్టుకోవటం జరిగింది. ఉదాహరణకు : బరాత్ (అత్ తౌబా సూరా), ఇఖ్లాస్ సూరా మొదలగునవి. పేర్లు పెట్టే ఈ వివిధ పద్ధతులు అరబీ సాహిత్యాభిరుచికి అనుగుణంగానే జరిగాయి.

సూరాల (అధ్యాయాల) పరిమాణంలో పెద్ద అంతరం కనిపిస్తుంది. ఒక సూరా ఎంత సుదీర్ఘంగా ఉందంటే అది మొత్తం కురాన్‌లో 12వ వంతుగా భావించబడుతుంది. మరోవైపు మరో సూరా ఎంత క్లుప్తంగా ఉందంటే, అది రెండు మూడు వాక్యాలు, పదిహేను పదాల కన్నా ఎక్కువగా లేదు. అయితే ఒక సూరా చిన్నదైనంత మాత్రాన దాని సారాంశం కూడా చిన్నదేనని భావించటానికి వీల్లేదు.

పెద్ద సూరాలలో సత్య కిరణాలు ఓ విస్తృత పరిధిలో ప్రసరిస్తూ ఉంటే, చిన్న సూరాల భావార్ధం ఓ పరిమిత పరిధిలో సమీకరించబడింది. వాస్తవానికి ఈ సూరాల స్థాయి 'జవామె వుల్ కలిమ్' (సమగ్రమయిన వాక్కు) వంటిది. అవి సంక్షిప్తంగా ఉన్నప్పటికీ వాటిలోని విషయం మాత్రం సమగ్రతతో నిండినవి. అనేక ధార్మిక పరమార్థాల, ప్రయోజనాల దృష్ట్యా కురాన్‌లో కొన్ని చిన్న సూరాలు ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

(1) అన్నిటికన్నా ముఖ్యమయిన పరమార్ధం ధర్మం (దీన్) యొక్క సూత్రప్రాయమైన ప్రబోధనలు, మౌలిక సిద్ధాంతాలు సదా మనో మస్తిష్కాలలో నాటుకుని ఉండేలా చేయటం. ఇది చాలా పెద్ద ధార్మిక అవసరం అన్న సంగతి మరువరాదు. నిశ్చయంగా పెద్ద సూరాలలో దైవాదేశాలు, దైవోపదేశాలు చాలా వివరంగా ఉన్నాయి. అవి ఆధారాలు నిదర్శనాలతో సహా ఉన్నాయి. వాటిని జ్ఞాపకం ఉంచుకోగల వ్యక్తి ఈ విషయాలను తప్పక జ్ఞాపకముంచుకుంటాడు. కాని క్రియాత్మక మైదానంలో ఇలా జ్ఞాపకముంచుకోగల వారు బహు తక్కువ మంది ఉంటారు. అందువల్ల సామాన్య ముస్లిముల దృష్ట్యా చిన్నచిన్న సూరాల అవతరణ జరగాల్సిన అవసరం ఎంతయినా ఉండింది. వాటిలో ధార్మిక సూచనలు చాలా సంక్షిప్తంగా వివరించబడి ఉండాలి. ముస్లిం సమాజంలోని ఏ ఒక్క వ్యక్తి కూడా వాటిని కంఠస్థం చేసుకోవటంలో ఇబ్బంది పడరాదు. (కనీసం నమాజులలో పదే పదే) పఠించటానికి, దీన్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలనయినా నిత్యం నెమరువేసుకుంటూ ఉండటానికి ఈ చిన్న సూరాల ఆవశ్యకత ఎంతయినా ఉంది. అదలావుంచితే సుదీర్ఘమయిన సూరాలను కంఠస్థం చేసుకునే కొద్దిమంది కూడా వాటిలోని ఈ వివరాల పట్ల సంతృప్తి చెందినప్పటికీ వాటిని బాగా జ్ఞాపకం ఉంచుకోలేకపోతారు. వాటి భావార్ధాలపై పూర్తిగా పట్టు సాధించలేకపోతుంటారు. క్లుప్తమయిన వచనాల్లో విస్తృత భావార్ధం ఉండే సూరాలను కంఠస్థం చేసుకుని, వాటిని పదిలపరచుకోవాలని వారు మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఉంటారు. మొత్తానికి విదితమయిన ముఖ్య విషయం ఏమిటంటే, అందరికీ ఉపయోగపడేలా మౌలిక సూత్రాలను కేవలం కొన్ని వాక్యాలతో విశదీకరించే చిన్న చిన్న సూరాలు అనివార్యమయ్యాయి. ఆ సూరాలు అనునిత్యం ప్రజల నోళ్ళలో నానుతూ ఉండగలగాలి. తద్వారా ధర్మం (దీన్) యొక్క మూల సూత్రాలు వారి స్మృతిపథంలో మెదలుతూ ఉండాలి. ధర్మావలంబీకులకు ఈ అవసరం తాత్కాలికమయినది కాదు, శాశ్వతమైనది.

(2) రెండవ పరమార్ధం : దైవదౌత్యం మొదలయిన తొలి కాలంలో కుర్‌ఆనీ

సందేశం వైపు ప్రజల దృష్టిని మరల్చవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉండేది. ఎందుకంటే ఖుర్‌ఆన్ తన సందేశాన్ని వినిపించసాగినప్పుడు దానిని వినడానికి ప్రజలు సంసిద్ధంగా లేరు. అందువల్ల ఆ కాలంలో ఏ విషయం చెప్పబడినా అది ఒకవైపు అత్యుత్తమమైన రీతిలో ఉండాలి. అది అంతరాత్మను కుదిపివేసేదిగా ఉండాలి. మరోవైపు ఆ విషయం సూత్రప్రాయమైనదిగానూ, చాలా క్లుప్తంగానూ ఉండాలి. అలసత్వానికి, నిర్లక్ష్యానికి, విద్వేషానికి గురై ఉన్న హృదయ కవాటాలను అది తట్టగలగాలి. ప్రజలలోని అనాసక్తత, విముఖత తగ్గుముఖం పట్టి, వారు విషయాన్ని వినడానికి మానసికంగా సిద్ధం అవుతున్నప్పుడు సందేశపలుకుల్లో విస్తృతిని తీసుకురావాలి. అనాసక్తత కాస్తా ఆసక్తిగా, విముఖత కాస్తా రుజువర్తనగా మారుతుందని అనిపించినప్పుడు ధర్మం (దీన్) యొక్క తప్పొప్పులను వినిపించాలి. – అందుకే ఖురాన్‌లోని చిన్న చిన్న సూరాలు, మధ్యరకం సూరాలు, సుదీర్ఘమయిన సూరాలు ఈ అవసరాల, పరిస్థితుల కనుగుణంగానే అవతరించాయి. చిన్న సూరాలు చాలావరకు ఈ (ఆరంభ) దశలో అవతరించినవే. హృదయ కవాటాలు తెరచుకోవటం మొదలైనది కూడా ఈ సూరాల వల్లనే.

## ఆయత్

సూరాలోని ప్రత్యేక పరిమాణంతో కూడిన ఖండికలను – వాటి హద్దులను నిర్ధారించినది కూడా అల్లాహ్‌యే – వాటిని 'ఆయత్'గా పేర్కొనటం జరిగింది. సూరాల మాదిరిగానే ఆయత్‌ల పరిమాణంలో కూడా విపరీతమయిన అంతరం ఉంది. కొన్ని ఆయత్‌లు ఒకట్రొండు పదాలతో ముగిస్తే, మరికొన్ని ఆయత్‌లు పది పదిహేను పదాలతో, ఇంకొన్ని ఆయత్‌లు ఇరవైకన్నా ఎక్కువ పదాలతో కూడుకుని ఉంటాయి. ఒక ఆయత్ ద్వారా ఒక వాక్య నిర్మాణం పూర్తవ్వాలని కూడా లేదు. కొన్ని ఆయత్‌లు కలిస్తే గాని ఒక వాక్య నిర్మాణం పూర్తవదు. అదే సమయంలో మరికొన్ని ఆయత్‌లు ఎలా ఉంటాయంటే ఒకే ఆయత్‌లో అనేక వాక్యాలు ఇమిడి ఉంటాయి. దీనికి ప్రధాన కారణమేమిటంటే ఆయత్‌ల పరిమాణాన్ని నిర్ధారించే సమయంలో వాక్య నిర్మాణ పరిపూర్తిని గాకుండా అంత్యప్రాసకు ప్రాముఖ్యం ఇవ్వబడింది. దీనికి ప్రధాన కారణాలు రెండు. ఒకటి : అరబీ సాహిత్యంలో ప్రాసయుక్తంగా పలకడం అవశ్యంగా భావించబడేది. ప్రాస అంటే అరబ్బులు మరీ ఇష్టపడేవారు. రెండు : ఖుర్‌ఆన్‌ను కంఠస్థం (హిఫ్జ్) చేసుకోవటంలో ఈ విషయం దోహదకారిగా ఉండేది. కవితల మాదిరిగానే గద్యంలో కూడా ప్రాసయుక్తమున్న విషయాలు మానవ స్మృతిపథంలో సులభంగా ఇమిడిపోతాయి. చదివే, వ్రాసే ప్రతి వ్యక్తికీ, ఇది అనుభవైక విషయమే. అందుకే ఖుర్‌ఆన్ పరిరక్షణ కోసం, దాని అనుయాయుల అవసరాలను

తీర్చటం కోసం అది సమర్పించే పదజాలంలో ప్రాస అవసరం ఎంతయినా ఉండింది.

'ఆయత్' అంటే అసలు చిహ్నం, సూచన, సంజ్ఞ అని అర్థం. అంటే నిగూఢమైవున్న యదార్థం వైపునకు మార్గదర్శనం చేసేది. అరబీ నిఘంటువులో ఆయత్ అనబడుతుంది. 'ఆయత్' అనే ఈ పదం మౌలిక భావాన్ని గనక ముందుంచుకుని ఆలోచిస్తే కుర్‌ఆన్ ఆయతులను 'ఆయత్'గా వ్యవహరించడానికి గల కారణమేమిటో చాలావరకు అవగతమవుతుంది. ఉదాహరణకు –

కుర్‌ఆన్ ఆయత్‌లు విశిష్ఠ వాక్కు యొక్క ఖండాలవటంచేత అవి దైవవాక్కు అనడానికి ప్రబల 'నిదర్శనం', చిహ్నం. అందుకే వాటిని 'ఆయత్' గా పేర్కొనటం జరిగింది.

కుర్‌ఆన్ ఆయత్‌లు స్వయంగా 'మార్గదర్శకమైనవి.' అందుచేత కూడా వాటిని 'ఆయత్' అని అనటం జరిగింది.

కుర్‌ఆన్ ప్రబోధనలు, శిక్షణలు శాసించే ధోరణిలో, బలాత్కరించే తీరులో ఉండవు. పైగా అవి ఆలోచింపజేసేవిగా ఉంటాయి. ఆధారాలు నిదర్శనాలపై నెలకొని ఉంటాయి. దాని ఉత్తర్వులు, శాసనాలు సహేతుకమైన వాదనపై నిలబడి ఉంటాయి. అంటే కురాన్ కేవలం ఆదేశాలు, ఉపదేశాలకు నామాంతరమే కాదు; అది సాక్ష్యాధారాలకు, రుజువులకు మరో పేరు కూడా. ఈ కారణంగా కూడా దాని ఖండికలను 'ఆయత్'గా వ్యవహరించటం జరిగింది (దాని ఈ లక్షణం పాఠకుల నుండి కనుమరుగు కాకుండా ఉండాలని).

తమ అవతరణ దృష్ట్యా కురానీ ఆయత్‌లు రెండు రకాలు – మక్కీ, మదనీ! హిజ్రత్ (వలస) కు పూర్వం అవతరించిన ఆయత్‌లు మక్కీ ఆయత్‌లుగా పేర్కొనబడతాయి. ఆ ఆయతులు మక్కా నగరిలో అవతరించినా, వేరొకచోట అవతరించినా మక్కీ ఆయతులుగానే పిలువబడతాయి. హిజ్రత్ అనంతరం అవతరించిన ఆయతులు – అవి మదీనాలో అవతరించినా, మదీనా వెలుపల అవతరించినా – మదనీ ఆయత్‌లుగానే పిలువబడతాయి.

## పారాలు, రుకూలు

మొత్తం కురాన్‌ను ముప్ఫయి భాగాలుగా, ప్రతి భాగాన్ని మరిన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించుకోవటం జరిగింది. మొదటి రకం భాగాలను 'పారాలు' లేక 'జుజ్‌లు'గా వ్యవహరిస్తారు. రెండవ రకం భాగాలను 'రుకూలు'గా పేర్కొంటారు.

ఈ విభజన దైవికమైనది కాదు. ప్రవక్త (స) జీవిత కాలంలోగానీ, మార్గదర్శక ఖలీఫాల హయాంలోగానీ ఈ విభజన ప్రక్రియ ఉనికిలోనికి రాలేదు. తరువాత హజ్జాజ్ బిన్ యూసుఫ్ (హి‌జ్రీ 73–95) కాలంలో మాత్రమే ఈ పంపకం జరిగింది. రుకూల విభజనైతే ఇంకా ఆలస్యంగా జరిగింది. ఈ కారణంగానే ఈ విభజనకు షరీఅత్‌పరంగా ఎలాంటి ప్రాముఖ్యం లేదు. అందుకే దివ్య కుర్‌ఆన్‌లో ఫలానా పార, ఫలానా రుకూ అనే గుర్తు మ్యాటర్ మధ్యలో ఎక్కడా సూచించబడదు. పాదసూచికలోనో, ప్రక్కనున్న ఖాళీ స్థలంలోనో మాత్రమే ఈ సూచిక ఉంటుంది.

ఇలా విభజించటంలోని ప్రధాన ఉద్దేశం సామాన్య జనులకు కురాన్‌ను చదవటంలో, కంఠస్థం చేసుకోవటంలో సౌలభ్యం చేకూరాలన్నదే. ఈ విషయం ముమ్ముందు వివరంగా రానున్నది.

పారాల విభజన ఒక మాసంలోని 30 రోజులను దృష్టిలో ఉంచుకుని చేయటం జరిగింది. ఒక విశ్వాసి ధర్మం (దీన్)తో తనకు గల సంబంధాన్ని సజీవంగా ఉంచుకోవటానికి అతను అనుదినం కుర్‌ఆన్ పారాయణం చేస్తూ ఉండాలని భావించబడింది. అయితే సాధారణంగా జనులు రోజూ ఎంత భాగం కుర్‌ఆన్ పఠించాలి? ఒక నెల రోజులలో కుర్‌ఆన్ పఠనం ఒకసారి పూర్తి చేయటం మధ్యే మార్గంతో కూడుకున్నదన్న ఆలోచన కుర్‌ఆన్ సేవకులైన విద్వాంసులకు కలిగింది. అంటే ముస్లిములు ప్రతి రోజూ కుర్‌ఆన్‌లో 30వ వంతు పఠిస్తే నెలరోజుల్లో ఒకసారి పూర్తిగా పఠించినట్లవుతుంది. కాబట్టి కుర్‌ఆన్‌ను 30 సమాన భాగాలుగా (జుజ్‌లు లేక పారాలు)గా విభజిస్తే రోజువారీ భాగాన్ని కచ్చితంగా నిర్ధారించటంలో పాఠకులకు ఇబ్బంది ఎదురవదు. ఈ సందర్భంగా కుర్‌ఆన్ సేవకులు హదీసులను కూడా బహుశా పరిగణనలోకి తీసుకుని ఉంటారు. ఉదాహరణకు : వెనుకటి పుటలలో పొందుపరచబడిన సహీహ్ బుఖారీలోని హదీసు. దాని ప్రకారం దైవదూత జిబ్రీల్ (అ) రమజాన్ నెలలో ప్రతిరాత్రి వచ్చి దైవప్రవక్త (సఅసం)ను కలుసుకునేవారు. ఈ సందర్భంగా ఆయన దైవప్రవక్త (స)కు కుర్‌ఆన్ చదివి వినిపించేవారు. ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యే ఒక ముఖ్యాంశం ఏమిటంటే దివ్య కుర్‌ఆన్‌ను ఒక నెల రోజుల కాలంలో పూర్తి చేయటం అభిలషణీయం, సమంజసం. అలాగే బుఖారీలోనిదే మరో హదీసు – దీని ప్రకారం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కు ప్రవక్త మహనీయుల (స) తరఫున లభించిన సూచన గమనార్హం. "اِقْرَأِ الْقُرْآنَ فِي شَهْرٍ" (కురాన్‌ను పూర్తిగా ఒక నెల రోజులలో చదువు) అని ఆయన (స) సలహా ఇచ్చారు. ప్రవక్త (స) వారి ఈ ఉపదేశం ద్వారా కూడా

సామాన్య ముస్లింలు కుర్‌ఆన్ పారాయణం సందర్భంగా ఈ ఉపదేశాన్ని అమలు పరచటం వాంఛనీయం అనిపిస్తోంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కుర్‌ఆన్‌తో తనకున్న అసాధారణమయిన అనుబంధం, ఆసక్తిని, తనలో ఉన్న శక్తిని ప్రస్తావించి వారానికి ఒకసారి కుర్‌ఆన్ చదివే (పూర్తిచేసే) అనుమతి పొందారు, అది ప్రత్యేక విషయం. ప్రత్యేక అనుమతి. ఆయనగారు పట్టుబట్టినప్పుడు ప్రదానం చేయబడిన ఆనతి అది. అన్యథా ప్రారంభంలోనయితే ఒక నెలలో కుర్‌ఆన్ పఠనం పూర్తిచెయ్యి అని మాత్రమే ఆయనకు సయితం చెప్పబడింది.

ఈ హదీసుల వెలుగులో అవగతమయ్యే విషయం ఏమిటంటే ఒక నెల రోజులలో కురాన్‌ను పఠించాలన్నదే ప్రవక్త (స) వారి అభిమతం. అంటే ముప్ఫయి రోజులలో (రోజుకు ఒక పారా చొప్పున) పఠించాలన్నమాట!

ఈ సందర్భంగా గమనించవలసిన ఇంకొక విషయం ఏమిటంటే ఈ 30 పారాల విభజన పరిమాణం దృష్ట్యా జరిగినదే తప్ప, భావార్థం రీత్యా, విషయం రీత్యా జరిగినది ఎంతమాత్రం కాదు. కనుక ఈ విభజన వెనుక గల ఔచిత్యం ఏమిటి? అని స్వయంగా ప్రశ్నించుకుని, దానికి సమాధానం పొందేందుకు తర్జనభర్జనలు చేసుకోవడం, తమకు తోచిన భాష్యాలు చెప్పటం నిరర్థకం.

రుకూల నిర్ధారణ, విభజన వెనుక కూడా ఇలాంటి పరమార్థాలే ఉన్నాయి. అంటే ఆయత్‌ల మధ్యలో 'గుర్తులు' పెట్టి పారాయణం ముగింపులో లోపం, వెలితిలాంటివి ఏర్పడకుండా జాగ్రత్తపడటం దీని అసలు ఉద్దేశం. ఇలా 'గుర్తులు' పెట్టాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందంటే కుర్‌ఆన్ భావార్థాలు తెలియని వారికి కుర్‌ఆన్ పఠనం ఎక్కడ ముగించాలో తెలియక పొరపాట్లు చేసేవారు. వారు కుర్‌ఆన్‌ను చదవటం ఆపేసిన చోట విషయం అసంపూర్ణంగా, అర్థాంతరంగా ఉండేది. ఇది కుర్‌ఆన్ పట్ల అసంబద్ధవైఖరి, అవాంఛనీయ విషయం కూడా. ఈ అనుచిత వైఖరి నుండి జనులను నిరోధించే ఉపాయం ఒక్కటే – సూక్తుల మధ్య కొన్ని ప్రత్యేక 'గుర్తులు' పెట్టి, అక్కడితో ఒక విషయం పూర్తయిందని సూచించటం! ఆ గుర్తు ఉన్న చోట పఠనాన్ని ఆపితే ఎలాంటి దోషం ఉండదన్న నమ్మకం, తృప్తి పఠించేవారికి కలిగించటం!

ఈ రుకూల నిర్ధారణ సందర్భంగా పరిగణనలోకి తీసుకోబడిన మరో అంశం రుకూ పరిమాణం. ఒక్కో రుకూలో సాధారణంగా 8 నుండి 10 ఆయత్‌ల వరకూ ఉండేలా చూడటం జరిగింది. ఒకవేళ చిన్న ఆయత్‌లై ఉంటే 10 కన్నా ఎక్కువ

కూడా ఉంటాయి. ఈ విధంగా ఒక్కో పారా (జుజ్) 15 నుండి 20 రుకూలుగా విభజించబడింది. రుకూ పరిమాణం నమాజ్‌లోని ఒక రకఅత్‌లో పఠించగలిగేంత ఉండే విధంగా కూడా జాగ్రత్త వహించటం జరిగింది. ఈ చిన్న చిన్న ఖండికలను 'రుకూ'గా వ్యవహరించటంలోని మరో ఔచిత్యం బహుశా ఏమిటంటే నమాజ్‌లో ఖిరాత్ మరియు ఖియామ్‌ల తరువాతే 'రుకూ' చేయబడుతుంది. అంటే – నమాజులో ఫలానా సూక్తి నుండి ఫలానా సూక్తి వరకు ఒక రుకూ పఠించటం పూర్తయ్యాక మీరు గనక కోరుకుంటే 'రుకూ' లోకి వెళ్ళవచ్చని సంకేతప్రాయంగా తెలుపబడింది.

# ముఖ్యమైన పారిభాషిక పదాలు

ప్రతి మత గ్రంథం వలెనే దివ్య కురాన్‌కు కూడా ఓ ప్రత్యేక భాష, కొన్ని ప్రత్యేక పారిభాషిక పదాలు ఉన్నాయి. అవి దాని సందేశాన్ని, దాని బోధనలను అవగాహన చేసుకోవటంలో కీలక ప్రాముఖ్యం కలిగి ఉన్నాయి. ఏ వ్యక్తి అయినా ఈ పారిభాషిక పదాలను అవగతం చేసుకోనంత వరకూ కుర్‌ఆన్‌ను అసలు అర్థమే చేసుకోలేడు. అందుకే కుర్‌ఆన్‌ను పరిచయం చేస్తున్నప్పుడు కనీసం కీలకమయిన పారిభాషిక పదాలనయినా వివరించటం చాలా అవసరం.

## అల్లాహ్

దివ్య కుర్‌ఆన్‌లోని అన్నిటికన్నా ముఖ్యమయిన, మౌలికమయిన పారిభాషిక పదం 'అల్లాహ్'. కాబట్టి అన్నిటికంటే ముందు దీనిని అర్థం చేసుకోవటం మరీ అవసరం.

'అల్లాహ్' అనే పదం అసలు 'అల్–ఇలాహ్' గా ఉండేది. అది అత్యధికంగా వాడుకలో ఉంటూ స్వల్పమయిన మార్పుతో 'అల్లాహ్' అయింది. అల్–ఇలాహ్ లో కూడా అసలైన పదం 'ఇలాహ్'యే. దానికన్నా ముందు ఉన్న 'అల్' అనేభాగం అరబీ భాషలో పరిచయ వాచకం. నామ వాచకాన్ని చాటడానికి అది ప్రారంభంలో తగిలించబడుతుంది. ఉదాహరణకు ఇంగ్లీషులో 'The' (ది) లాంటిదే ఇదీను. దీన్ని సర్వనామం నుండి నామవాచకంగా మార్చడానికి వాడతారు – ఆ విధంగా 'అల్ ఇలాహ్' అంటే ఒక ప్రత్యేకమయిన, నిర్ణీతమయిన ఇలాహ్ అన్న భావం వస్తుంది. 'ఇలాహ్' అంటే ఆరాధ్య దైవం అని అర్థం. ఈ పదం "అలిఫ్–లామ్–హా" అనే మూడక్షరాల ధాతువుతో నిర్మాణమయింది. దీని నుండి వెలికి వచ్చే వివిధ భావార్థాలు ఇవి : (1) ఆశ్చర్యపడటం (2) ఒకరి శరణు పొంది లేదా ఒకరితో సంబంధం ఏర్పరచుకుని శాంతిని పొందటం, నెమ్మదించటం (3) ప్రేమాతిశయంతో ఒకరి వైపు ఎగబడటం (4) దాగిపోవటం (5) ఉన్నతికి చేరడం (6) ఆరాధించటం – ఈ వివిధ అర్థాలలో ఎక్కడా అపరిచయత్వంగానీ, సామరస్య రాహిత్యంగానీ లేదు. పైగా ఎంతో సహజసిద్ధమయిన పొందిక, దృఢ సంబంధం ఉందని ఆలోచించిన మీదట బోధపడుతుంది. 'ఇలాహ్' అనే పదాన్ని అరబ్బులు 'ఆరాధ్య దైవం' అనే అర్థంలో తీసుకున్నప్పుడు అందులో ఈ భావాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉండేది. అంటే వారి దృష్టిలో 'ఇలాహ్' అంటే అర్థం మానవాతీత గుణాలు ఉన్నవాడు, ఆయన

వాస్తవాన్ని, ఔన్నత్యాన్ని తెలుసుకోవటం మానవ బుద్ధీ వివేకాల వల్ల సాధ్యమవదు. ఆయన అస్థిత్వం గురించి, గుణవిశేషాల గురించి చింతన చేసేవారికి మిగిలేది ఆశ్చర్యం తప్ప మరొకటి కాదు. ఆయన ఇతరులకు శరణ్యమై ఉంటాడు. ప్రియాతి ప్రియమైనవాడు, బాగా కావలసినవాడై ఉంటాడు. అక్కరలు తీర్చేవాడు, సార్వభౌముడయి ఉంటాడు. వైభవంతో వెలుగొందేవాడై ఉంటాడు. ఒకరి బాహ్యాపరమయిన ఇంద్రియాలకు, గ్రాహ్యాశక్తికి అందనివాడయి ఉంటాడు – ఇన్ని విశిష్ఠ గుణాలతో అలరారుతూ ఉన్న కారణంగా ఆరాధనలు, ప్రార్థనలకు అర్హుడై ఉంటాడు. ఆయన ఆగ్రహానికి భయపడదగినవాడై ఉంటాడు.

అయితే ఇది పరిపూర్ణత గల 'ఇలాహ్'కు సరిపోయే భావం. కాని వారి (అరబ్బుల) వద్ద 'ఇలాహ్' ఒకరిద్దరు కాకుండా అసంఖ్యాకంగా ఉండేవారు. వారు ఒకరికన్నా ఎక్కువ ఆరాధ్య దైవాలకు తలొగ్గిన కారణంగా వారందరిలో ఈ గుణాలున్నాయని తలపోయటం సంభవమయ్యే పనికాదు. కాబట్టి వారు ఈ (ఇలాహ్) పదాన్ని పలికినప్పుడు ప్రతి సందర్భంలోనూ సరిగ్గా ఒకే భావం వారి మెదడులో ఉండేది కాదు. పైగా పేర్కొనబడిన గుణగణాలన్నీ ఉన్న అస్థిత్వానికి వారు దీనిని వర్తింపజేసి మాట్లాడినప్పుడు, వాటిలో కేవలం కొన్ని గుణాలు కలిగివున్న ఆరాధ్య దైవాలు కూడా వారి ఊహల్లో మెదిలేవి. ఈ విధంగా అరబ్బుల దృష్టిలో ప్రస్తావిత విశిష్ఠ గుణాలు పాక్షికంగా కలిగివున్నవారు, సంపూర్ణంగా కలిగివున్నవాడు కూడా 'ఇలాహ్'గా వర్థిల్లేవారు. ఈ కారణంగా వారంతా ఆరాధనలకు, దాస్యానికి యోగ్యులుగా భావించబడేవారు – అంటే ఒకవేళ వారిలో ఎవరయినా ఈ గుణగణాలన్నీ కలిగివుంటే వారు సంపూర్ణ ఆరాధ్య దైవాలు. అన్యథా వారికి సొంతమై ఉన్న గుణ విశేషాలనుబట్టి ద్వితీయశ్రేణికి, తృతీయశ్రేణికి చెందిన దేవుళ్ళు.

'ఇలాహ్' అనే పదం యొక్క ఈ భావాన్ని ముందుంచుకున్నప్పుడు 'అల్లాహ్' (అల్ – ఇలాహ్) అంటే అర్థం పైన ప్రస్తావనకు వచ్చిన గుణాలన్నీ తనలో అంతర్లీనం చేసుకున్నవారు లేదా వాటిలో కనీసం కొన్ని గుణాలయినా కలిగి ఉన్నవారు మాత్రమే. కాని వాస్తవం మాత్రం అలా లేదు. అరబ్బుల దృష్టిలో 'అల్లాహ్'కు అర్థం అంతేకాదు, అది దీనికన్నా ఉన్నతమైనది. ఈ గుణగణాలన్నింటితో పాటు మరికొన్ని విశిష్ఠ గుణాలతో వర్థిల్లే అస్థిత్వాన్ని మాత్రమే వారు 'అల్లాహ్'గా నమ్మేవారు. ఉదాహరణకు: ఆ దేవునిలో సృష్టించే, పరిపాలించే, పోషకత్వ బాధ్యతలు నిర్వర్తించే, సార్వభౌముడుగా ఉండే గుణాలన్నీ ఉండాలి. కాగా, వారు నమ్మినడుచుకునే ఇతర చిల్లర దేవుళ్ళలో ఈ గుణ విశేషాలు పూర్తిగా లేవన్న సంగతిని కూడా వారు అంగీకరించేవారు. అల్లాహ్ మరియు ఇతర దేవుళ్ళ గురించి వారి ఆంతర్యాల్లో నాటుకుని ఉన్న విశ్వాసాలు

కురాన్‌లో వివరంగా ప్రస్తావనకు వచ్చాయి. ప్రాచీన అరబీ సాహిత్యంలో కూడా ఈ వివరాలు లభ్యమవుతాయి.

ఈ చర్చ తరువాత అర్ధమవుతుంది - అరబ్బులు తమ వద్ద ఉన్న అసంఖ్యాకమయిన దేవుళ్ళలో కేవలం ఈ ఒక్క 'ఇలాహ్'నే 'అల్లాహ్' (అల్-ఇలాహ్) అని ఎందుకు అనేవారో. ఈ (ఇలాహ్) పదం కేవలం 'గుణం' మాత్రమే అయినప్పుడు, వారు పూజించే ప్రతి దైవం కొరకు దీనిని తేలిగ్గా ప్రయోగించగలిగినప్పుడు అది కేవలం ఈ ఒక్క అస్థిత్వం కొరకే ఎందుకు ప్రత్యేకించబడిందో, ఎందుకు దాని పేరుగా ఖరారయిందో బోధపడుతుంది. దైవం కాగల గుణాలన్నింటినీ తనలో ఇమిడ్చుకున్న అస్థిత్వం ఒకటేనన్నది వారి విశ్వాసమైనప్పుడు, ఇతర చిల్లర దేవుళ్ళు ఎవరిలోనూ 'ఆరాధ్య దైవత్వం' గుణం సమగ్రంగా లేదని కూడా వారికి తెలిసి ఉన్నప్పుడు, ఆ ఒక్క అద్వితీయ అస్థిత్వం మాత్రమే 'ఇలాహ్' అనే పద ప్రయోగానికి నోచుకోవాల్సింది. ఇది సహజ విషయం కూడా. ఈ పదం వినబడినప్పుడల్లా వారి ఆలోచనలు ఒక్కసారిగా తాము నిజదైవం (ఇలాహ్) అనుకునే అస్థిత్వం వైపునకు మరలాల్సింది. తత్ఫలితంగా వారు తమ చిల్లర దేవుళ్ళకు వేర్వేరుగా పేర్లు పెట్టుకున్నట్లుగా ఈ ప్రత్యేక దైవానికి వేరుగా పేరుపెట్టేవారు కాదు. పైగా అసలు గుణవాచకమయిన 'ఇలాహ్' కు ముందు 'అల్'ను చేర్చేవారు. ఆ విధంగా ఆయన దైవత్వం యొక్క ప్రత్యేకత, విలక్షణత, ఔన్నత్యం అభివ్యక్తమయ్యేది. ఇక్కడ గమనార్హమయిన విషయం ఏమిటంటే, 'ఇలాహ్' లేక 'ఆరాధ్య దైవం' అయ్యే అన్నిటికన్నా ఎక్కువ యోగ్యత ఈ అస్థిత్వానికి మాత్రమే ఉంది. అనుపమమయిన ఒక గ్రంథాన్ని 'అల్ - కితాబ్' అని, సాటిలేని మేటి శిక్షకుణ్ణి 'అల్ ముఅల్లిమ్' అని నామకరణం చేయటం వంటిదే ఇదీను. అరబ్బులలో పేర్లు పెట్టే ప్రసిద్ధ ఆచారమిది. దీని ప్రకారమే వారు తమ ఈ విశిష్ఠ దైవానికి - పరిపూర్ణుడైన దేవునికి - అల్ ఇలాహ్ అనే పేరుపెట్టుకున్నారు - ఆ తరువాత తమ భాషా నిబంధననుసరించి అందులో నుండి (ఇలాహ్ నుండి) 'అలిఫ్' (ఇ)ను తొలగించారు. ఎందుకంటే సులభంగా, అనర్గళంగా మాట్లాడేటందుకు పదాలలో ఇలాంటి అడ్డంకులు ఉండటాన్ని వారి సాహిత్యాభిరుచి ఒప్పుకునేది కాదు. ఆ విధంగా ఈ 'అల్ ఇలాహ్' కాస్తా 'అల్లాహ్' అయింది.

ఇదీ అరబ్బులలో వ్రేళ్ళూనికుని వున్న 'ఇలాహ్' - 'అల్లాహ్' పారిభాషికపదాల పూర్వరంగం. కుర్‌ఆన్ అవతరించినప్పుడు దాని తొలి సంబోధితులు అరబ్బులే గనక దాని భాష కూడా అరబీ భాష అయి ఉంది. అది ఏం చెప్పాలనుకున్నా అదే భాషలో, అక్కడ వాడుకలో ఉన్న పదాల్లోనే చెప్పాలి కాబట్టి అది ఈ విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్తను, పాలకుణ్ణి కూడా సహజంగా ఇదే పేరు - 'అల్లాహ్' - తో పిలిచింది.

అలాగే 'ఇలాహ్' పదాన్ని కూడా అది ఉపయోగించింది. అయితే ఆ రెండు పదాలను అరబ్బుల మస్తిష్కంలో ఉన్న భావంలో, అదే దృక్పథంలో మాత్రం తీసుకోలేదు. పైగా కొన్ని కీలక పదజాలాలను అది సంస్కరించి, మార్పులతో తీసుకుంది. అది చేసిన అన్నిటికన్నా ముఖ్యమయిన 'సంస్కరణ' ఏమిటంటే దైవత్వాని (ఉలూహియత్)కి సంబంధించిన లక్షణాలన్నింటినీ కేవలం ఒక్క అల్లాహ్‌కే ప్రత్యేకంగా ఖరారు చేసింది. వేరొక అస్థిత్వంలో – అది ఎంత గొప్పదయినా – ఆరాధ్య దైవం కాదగిన గుణం అందులో లేదని అది ప్రకటించింది. కాబట్టి 'ఇలాహ్' అని అన్నా, అల్–ఇలాహ్ అని చెప్పినా, అల్లాహ్ అని పలికినా అది కేవలం ఆ ఒక్క అస్థిత్వానికే వర్తిస్తుందని, ఆ ఒక్క అస్థిత్వం కొరకే ఈ పదాలను ప్రయోగించాలని అది స్పష్టం చేసింది. వేరొక అస్థిత్వం దేనికీ ఈ పదాలతో పిలవబడే అర్హత లేదని కూడా అది నిర్ద్వంద్వంగా చెప్పింది.

అది చేసిన రెండవ పెద్ద సంస్కరణ ఏమిటంటే, 'అల్లాహ్'కు అరబ్బులు ఏ ఏ గుణగణాలను ఆపాదించి వాటిని అత్యున్నతంగా భావించేవారో వాటిని లోపభూయిష్టమైన భావనగా ఖరారు చేయటం! 'దైవత్వం' గురించి పరిమితమయిన మీ బుద్ధి దేనిని అత్యున్నతంగా భావిస్తున్నదో అది అత్యున్నతం కానే కాదు, అందులో అల్పత్వం ఉంది, అగాధాలున్నాయి అని అది స్పష్టం చేసింది. 'అల్లాహ్' గుణగణాలు 'ఇలా' ఉంటాయి, ఆయన స్థానం 'ఇటువంటిది' అంటూ సోదాహరణంగా విపులీకరించింది.

'అల్లాహ్' అస్థిత్వం గురించి కురాన్ గుణించిన గుణగణాలు అసంఖ్యాకం. మచ్చుకు కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము. (1) ఆ అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దైవం లేదు. ఆయన అజరుడు, నిత్య సజీవుడు. సకల చరాచర సృష్టికి మూలాధారం (اللہ لا الٰہ الا ھو الحی القیوم، بقرہ) (అల్ బఖర – 255). ఒక్క ఆయన ఉనికి తప్ప ప్రతిదీ నశించేదే (كل شيء هالك الا وجهه، قصص) (అల్ ఖసస్–88). (2) చూపులు ఆయనను అందుకోలేవు. ఆయన చూపులను అందుకుంటాడు (అల్ అన్ ఆమ్–103) (لا تدركه الابصار، انعام). ఆయునను పోలిన వస్తువు ఏదీ లేదు (షూరా) (ليس كمثله شيء، شوریٰ) ఆయన ఎన్నడూ ఏదేని శారీరక రూపం ధరించడు. ఎవరిలోనూ ప్రవేశించడు. ఎవరితోనూ జత కట్టడు. (3) 'మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్' అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. (అల్ మాయిద – 72) (لقد كفر الذين قالوا ان الله هو المسيح ابن مريم، مائدہ) (4) ఆయన ప్రతి దానిని

సృష్టించినవాడు. (అల్ అన్ ఆమ్) (خلق كل شيء، انعام) (5) ఆయన ఎవరికీ తండ్రిగానీ, కొడుకుగానీ కాదు (ఇఖ్లాస్) (لم يلد ولم يولد، اخلاص) (6) విశ్వ ప్రభుసత్తాక శక్తులన్నీ ఆయన చేతిలో ఉన్నాయి (యాసీన్). (بيده ملكوت كل شيء، يس) (7) ఆకాశం నుండి భూమి వరకు గల ప్రపంచ వ్యవహారాలను నిర్వహిస్తున్నవాడు ఆయనే (సజ్దహ్-5) (يدبر الامر من السماء الى الارض، سجده) (8) ఆయన భూమికీ, ఆకాశాలకూ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తానికీ ప్రభువు. (సాఫ్ఫాత్-5) (رب السموات والارض وما بينهما۔ صافات) (9) జీవన్మరణాలను సృష్టించిన వాడు. (అల్ ముల్క్ - 2) (خلق الموت والحيوة، ملك) ఆయనే మరణం ఇచ్చాడు, ఆయనే జీవితాన్ని ప్రసాదించాడు. (అన్ నజ్మ్-44) (انه هو امات واحيى، النجم) (10) శాంతిప్రదాత, సంరక్షకుడు. (అల్ హష్ర్-23). (المؤمن المهيمن، حشر) (11) గుప్తమై ఉన్నదీ, బహిర్గతమై ఉన్నదీ, జరిగినదీ, జరగబోయేదీ - అన్నీ ఎరిగినవాడు. (అల్ బఖర) (هو بكل شيء عليم، بقره) (12) ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు. (అల్ అన్ ఆమ్) (وهو السميع العليم، انعام) (13) నిశ్చయంగా ప్రతిదీ చేయగల సమర్థుడు. (అల్ బఖర -20) (ان الله على كل شيء قدير، بقره) (14) సర్వాధికుడు, తన ఉత్తర్వులను తిరుగులేని విధంగా అమలుపరచేవాడు. ఎల్లప్పుడూ గొప్పవాడుగానే ఉండేవాడు. (అల్ హష్ర్ : 23) (العزيز الجبار المتكبر، حشر) (15) ఆయన వివేచన కలవాడు, అన్నీ ఎరిగినవాడు (సబా-1) (وهو الحكيم الخبير، سبا) (16) అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు (అల్ ఫాతిహా-2). (الرحمن الرحيم، الفاتحه) తన దాసుల పట్ల ప్రేమ, వాత్సల్యం కలవాడు (అల్ బఖర). (والله رءوف بالعباد، بقره) ఆయన కారుణ్యం ప్రతి చిన్న వస్తువును ఆవరించి ఉంది (ఆరాఫ్). (وسعت رحمتي كل شيء، اعراف) (17) న్యాయశీలుడు. విశ్వసించి మంచి పనులు చేసినవారికి న్యాయంగా ప్రతిఫలం ఇచ్చేవాడు. (యూనుస్-4). (ليجزي الذين امنوا وعملوا الصلحت بالقسط، يونس) ఎవరికీ ఏ కాస్త కూడా అన్యాయం చేయనివాడు (ఖాఫ్-29). (وما انا بظلام للعبيد، ق) ఆయన ఆదేశాలు ఉపదేశాలన్నీ నిజమైనవీ, న్యాయబద్ధమైనవై ఉంటాయి. (అల్ అన్ ఆమ్). (وتمت كلمت ربك صدقا وعدلا، انعام) (18) మహత్తర శక్తి సంపన్నుడు, దుష్టత్వానికి తగిన శాస్తి జరిపించేవాడు. (ఆలి ఇమ్రాన్-4) (والله عزيز ذو انتقام، آل عمران) (19) క్షమాపణ కోరే వారిని క్షమించేవాడు, ప్రేమించేవాడూను. (అల్ బురూజ్-14) (وهو الغفور الودود، بروج) నిశ్చయంగా పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు.

(అన్ నస్ర్-3) (اِنَّهٗ كَانَ تَوَّابًا، نصر) (20) సత్కార్యాలకు విలువ ఇచ్చేవాడు. (తగాబున్-17) (وَاللّٰهُ شَكُوْرٌ، تغابن) (21) తాను సంకల్పించుకున్న దానిని చేసి తీరేవాడు. (అల్ బురూజ్-16) (فَعَّالٌ لِّمَا يُرِيْدُ، بروج) (22) తాను తలచిన వారితో సంభాషించగలవాడు. (అల్ బఖర) (وَمِنْهُمْ مَّنْ كَلَّمَ اللّٰهُ، بقرہ) (23) తాను కోరిన దానిని చేసేవాడు. (ఆలి ఇమ్రాన్) (كَذٰلِكَ اللّٰهُ يَفْعَلُ مَا يَشَآءُ، آل عمران) ఆయన కోరనంత వరకు ఏదీ జరగదు. ఆఖరికి ఆయన ప్రమేయం లేకుండా ఎవరూ ఏదీ కోరలేరు. (దహ్ర్ : 30) (وَمَا تَشَآءُوْنَ اِلَّآ اَنْ يَّشَآءَ اللّٰهُ، دہر) (24) సర్వసంపన్నుడు, ఏ అక్కరా లేనివాడు, నిరపేక్షాపరుడు (ఫాతిర్-15) (وَاللّٰهُ هُوَ الْغَنِيُّ، فاطر) (25) స్వయంగానే స్తుతిపాత్రుడు, మహిమాన్వితుడు (హూద్) (اِنَّهٗ حَمِيْدٌ مَّجِيْدٌ، ہود) (26). ఏ లోపమూ లేనివాడు, ఎంతో పరిశుద్ధుడు, దైవత్వస్థాయికి తగనిదేదీ ఆయనలో లేదు, శాంతిప్రదాత ఆయన. (అల్ హష్ర్-23) (اَلْمَلِكُ الْقُدُّوْسُ السَّلٰمُ، حشر) (27) ఆయన అన్ని విధాలా సాటిలేనివాడు, ఎవరినీ పోలినవాడు కాడు, ఏ వస్తువుతోనూ ఆయనను పోల్చేందుకు వీలుపడదు (షూరా). (لَيْسَ كَمِثْلِهٖ شَيْءٌ، شوریٰ) ఆకాశాలలోనూ, భూమిపైనా ఆయన గుణగణాలు సర్వోన్నతమైనవి (అర్ రూమ్-27). (وَلَهُ الْمَثَلُ الْاَعْلٰى فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ، روم) (28) ఆయన మాత్రమే ఆరాధ్య దైవం. ఆయన తప్ప వేరొక దైవం లేనేలేడు. (అల్ బఖర) (لَآ اِلٰهَ اِلَّا هُوَ، بقرہ) భూమ్యాకాశాలలో కేవలం ఆయన గొప్పతనం, ఘనత్వం మాత్రమే కొనియాడబడుతోంది. (జాసియ). (وَلَهُ الْكِبْرِيَآءُ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ، جاثیہ) ఆయన తప్ప వేరెవరిలోనూ ఆరాధ్య దైవం కాగలిగే, ఘనత వహించే గుణం లేశమయినా లేదు. ఆయన తప్ప మిగతావన్నీ నిస్సహాయమైనవి. పాలించబడేవే. ఆయనకు దాసులే. అందరూ ఆయన ఆజ్ఞలకు కట్టుబడి ఉన్నవారే. (అర్ రూమ్ : 26) (وَلَهٗ مَنْ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ كُلٌّ لَّهٗ قٰنِتُوْنَ، روم) ఆయన తన ప్రభుత్వాధికారంలో ఎవరినీ భాగస్వామిగా చేర్చుకోడు (అల్ కహఫ్ : 26). (وَلَا يُشْرِكُ فِيْ حُكْمِهٖٓ اَحَدًا، کہف) అల్లాహ్ అస్థిత్వం, ఆయన గుణగణాల గురించిన ఈ వివరాల తరువాత, దీనికి సంబంధించిన మరికొన్ని అంశాలను కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

(1) అల్లాహ్ అస్థిత్వం విషయానికి వస్తే దాని వాస్తవికతను మానవ గ్రాహ్యా శక్తి అందుకోజాలదు. అందువల్ల ఆయనను, ఆయన గుణగణాలనుబట్టే తెలుసుకోగలం. ఊహించగలం. ఆ గుణగణాల దర్పం ఈ జగతి అంతటిలో

ఉట్టిపడుతోంది. అందుకే కుర్ఆన్‌ను అందజేసిన సందేశహరుడు (స) ఇలా ఉపదేశించారు :

“దేవుని సృష్టితాల గురించి చింతన చేస్తూ ఉండండి. కాని ఆయన అస్థిత్వం గురించి మాత్రం యోచన చేయకండి.”

تَفَكَّرُوا فِي خَلْقِ اللهِ وَلَا تَفَكَّرُوا فِي اللهِ۔
(روح المعانی جزو ۲۷، ص ۶۸)

దేవుని అస్థిత్వం ఎంతో ఉన్నతమైనది. దాని వాస్తవికత మానవ మేధోశక్తికి, అతని ఊహలకు అందనంత ఉన్నత స్థాయిలో ఉంది. దేవుని సంగతి అలా వుంచితే, సాధారణ సృష్టితాల గురించి కూడా మనకు తెలిసింది చాలా తక్కువే. వాటి లక్షణాల, అలవాట్ల ఆధారంగా మనం ఎంతో కొంత తెలుసుకోగలుగుతాము. అలాంటప్పుడు ఈ జగతిలో ఉన్న వాటన్నింటికంటే పూర్తిగా విలక్షణమైన ఆ మహోన్నతుని వ్యక్తిత్వం గురించి మనం ఎలా ఒక నిర్ధారణకు రాగలుగుతాము? అది జగతిలోని వస్తువులన్నింటికంటే భిన్నమైనది. దానిని ఏ వస్తువుతోనూ పోల్చతరం కాదు. ఆయన మాత్రమే సృష్టికర్త. ఆయన మినహా మిగతావన్నీ సృష్టించబడినవే. ఆయన తనంతటతానే ఉనికిలోకి వచ్చినవాడు. కాగా మిగిలినవన్నీ ఉనికిలోకి రావడం సాధ్యమైనవి మాత్రమే. ఆయనలోని ప్రతి గుణం పరిపూర్ణమైనది. పరాకాష్ఠకు చేరుకున్నది. కలకాలం కళకళలాడుతూ ఉండేది. నిఖిల జగతిలో ఇలాంటి గుణగణాలలో ఒక్కదానినయినా పుణికిపుచ్చుకున్న వారెవరూ లేరు. మొత్తానికి అవగతమయిందేమిటంటే మానవుని చింతనకు, గ్రహణశక్తికి అందగలిగేది ఏదయినా ఉందంటే అది అల్లాహ్ గుణగణాల పరిజ్ఞానం మాత్రమే. ఆయన అస్థిత్వానికి సంబంధించిన వాస్తవికతను చేరుకోవటం హేతువుపరంగా అసంభవం. అందువల్ల దివ్య కుర్ఆన్ తన చర్చను కేవలం గుణగణాల వరకే పరిమితం చేసింది.

దేవుని అస్థిత్వం, గుణగణాలకు సంబంధించిన ఈ అంశంపై మరికొన్ని ప్రశ్నలను లేవనెత్తేందుకు కూడా ఆస్కారం ఉంది. ఉదాహరణకు : ఈ లక్షణాలే సరిగ్గా ఆయన ఉనికా? లేక అవి తమకంటూ వేరే ఒక ఉనికిని కలిగి ఉన్నాయా? ఒకవేళ అవి వేరుగా – ప్రత్యేకంగా – ఉనికి కలిగి ఉంటే మరి ఆయన స్వీయ అస్థిత్వంతో వాటికి గల సంబంధం ఎటువంటిది? అవి ఏ విధంగా ఆయన ఉనికిలో ఉంటూ మనగలుగుతాయి? – నిజానికి ఇలాంటివన్నీ తాత్వికమయిన వాదోపవాదాలు, మానవ పరిశుద్ధ నైజానికి పొసగవు. మానవ ఆలోచనల ఆత్మజ్ఞాన లేమికి నిదర్శనాలే. దివ్య కుర్ఆన్ ఇలాంటి ప్రశ్నలకు జవాబు ఇవ్వలేదు. అసలు అలాంటివాటిని

ప్రస్తావించటం కూడా సమంజసంగా భావించలేదు. ఈ విషయమై అదేమైనా చేసిందంటే మనిషికి అతని జ్ఞాన పరిమితిని, అవగాహనా హద్దులను గుర్తుచేసి, ఈ రకమయిన వక్ర భావాల నుండి దూరంగా ఉంచింది. 'వహీ' అంటే అసలేమిటి? దాని వాస్తవికత ఏమిటి? దాని వైనం ఎటువంటిది? అని కొంతమంది ప్రశ్నించినపుడు వారితో ఇలా అనబడింది : 'వహీ' (దివ్యవాణి) వాస్తవికత, వైనం మీ జ్ఞానపరిధిలోకి గానీ, మీ అవగాహనా కక్ష్యలోకి గానీ రాదు. ఆ వైనాన్ని గురించి మీకు చెప్పాలన్నా ఎలా చెప్పేది? మీ గ్రాహ్యశక్తి ఎంత పరిమితమైనదంటే ఒకవేళ 'వహీ' వాస్తవికతను మీ ముందర ఆవిష్కరించినట్లయితే ఒక చంటి పిల్లవాని ముందు తాత్విక విషయాలపై ఉపన్యాసమిచ్చినట్లే ఉంటుంది (అల్ ఇస్రా).

అదీగాక – ఇలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా, వాటికి సమాధానాలు ఇవ్వకుండా ఉండటానికి మరో కారణం కూడా ఉంది. అదేమంటే ఇలాంటి తర్కవితర్కాలతో, వితండవాదనలతో కుర్ఆన్ అవతరణా ఉద్దేశానికి దూరపు సంబంధం కూడా లేదు. అన్ని దైవగ్రంథాల మాదిరిగానే కురాన్ అవతరణా లక్ష్యం కూడా కేవలం మార్గదర్శనమే. ప్రజలను నైతికంగా సంస్కరించటం, వారి అంతరంగాలను పరిశుద్ధపరచటం, వారికి మంచిని గురించి ప్రబోధించటం, సత్యావలంబీకులుగా జీవించమని ఉపదేశించటం కురాన్ లక్ష్యం. ఇది నిజ యజమాని అయిన అల్లాహ్ ఇష్టపడిన జీవన విధానం. ఈ విధానాన్ని అవలంబించినప్పుడే మానవుడు తన జీవిత లక్ష్యాన్ని సాధించగలడు. తన పరిణామాన్ని సత్పరిణామంగా చేసుకోగలడు. ఈ ధ్యేయం కొరకు అతను; నన్ను సృష్టించిన ఒక సృష్టికర్త ఉన్నాడు. నా యజమాని ఆయన. ఆయనకు ఈ ఈ గుణాలు, లక్షణాలున్నాయి. నా వరకు నేను ఈ వ్యవహారంలో ఈ ఈ విధులను నిర్వర్తించాల్సి ఉంది అని తెలుసుకుంటే సరిపోతుంది. కాని అతను ఇంతటితో సరిపుచ్చుకోకుండా అనవసరమయిన వివరాల్లోకి పోదలిస్తే, దేవుని స్వభావం యొక్క వాస్తవికతను కనుగొనాలని మొండిపట్టుపడితే, ఆయన అస్థిత్వానికి – లక్షణాలకు మధ్య గల సంబంధం ఎట్టిదో తనకు తెలియాల్సిందేనని హఠం చేస్తే – అతని ఆసక్తి, కృషి ఎంత సమంజసమైనదయినా – ఏ దైవగ్రంథం కూడా ఈ విషయమై అతనిని ప్రోత్సహించదు. దీనిని తన అవతరణా ఉద్దేశంతో సంబంధం లేని పనిగా భావించి, దాని కోసం ప్రాకులాడే వారిని మందలిస్తుంది.

(2) అత్యంత ముఖ్యమైన ఈ విషయంలో గుర్తుంచుకోవలసిన రెండవ అంశం;

గుణగణాల అధిక సంఖ్య అస్థిత్వపు అధికసంఖ్యకు ప్రతిరూపం కానేకాదు. పైగా ఈ గుణాలు, లక్షణాలు, శక్తులు అన్నీ ఒక్కడైన 'అల్లాహ్'లో ఇమిడి ఉన్నాయి. అందుకే దివ్య కురాన్ ఈ యదార్థాన్ని నిర్దిష్టంగా ప్రకటించి, దానిని పగటి వెలుతురులా ప్రస్ఫుటం చేసింది.

ادْعُوا اللّٰهَ اَوِ ادْعُوا الرَّحْمٰنَ ؕ اَيًّا مَّا تَدْعُوْا فَلَهُ الْاَسْمَآءُ الْحُسْنٰى ۚ ---(بنی اسرائیل:۱۱۰)

"అల్లాహ్ అని అయినా పిలవండి లేదా రహ్మాన్ అని అయినా సరే. ఏ పేరుతో అయినా పిలవండి. ఆయనకు గల పేర్లు అన్నీ చక్కనివే."

*(బనీ ఇస్రాయీల్ - 110)*

అంటే మీరు దైవత్వం యొక్క ఏ గుణాన్ని శక్తిని ముందుంచుకుని ఆరాధ్య దైవం గురించి ఊహించుకున్నా, ఆ అస్థిత్వం సదా ఒక్కటే అయి ఉంటుంది. ఆయనే అల్లాహ్. మీరు కారుణ్యం లేక వాత్సల్యం గురించి మనసులో ఒక ఊహ పెట్టుకుని 'రహ్మాన్' (కరుణామయుడు) అన్నప్పుడు ఆ అస్థిత్వం అల్లాహ్ కాక మరేదయినా వేరే అస్థిత్వం అనుకుంటే పొరపాటే.

యదార్థమేమిటంటే మన కళ్ళముందున్న ఈ ప్రపంచంలో పరస్పర విరుద్ధమయిన సంఘటనలెన్నో ఉనికిలోకి వస్తుంటాయి. ఇక్కడ కారుణ్యా జల్లు కురవడంతో పాటు, భయకంపితుల్ని చేసే భూకంపాలు కూడా వస్తుంటాయి. ఇక్కడ రుచులు, సుఖసౌఖ్యాల సామగ్రి లభించటంతో పాటు కష్టాలు కడగండ్లను తెచ్చే వరదలు తుఫానులు కూడా వస్తుంటాయి. ఇక్కడ ఆరోగ్యంతో పాటు అనారోగ్యమూ ఉంది. జీవితంతో పాటు మరణం కూడా ఉంది. ఇక్కడ శాంతి భద్రతలూ ఉన్నాయి. అరాచకం, అశాంతి, అలజడులు కూడా ఉన్నాయి. దీనికి విరుద్ధంగా ఈ సంఘటనలన్నింటి వెనుక ఒక మూల సరోవరం ఉన్నది, అది అల్లాహ్. ఈ లోకంలో ఏది జరిగినా ఆయన ఆజ్ఞతోనే జరుగుతుంది. వ్యక్తమయ్యే సంఘటనల వెనక ఉన్న శక్తులన్నీ ఆ ఒకే అస్థిత్వం యొక్క భిన్న లక్షణాలు. అవన్నీ ఆ ఒక్క అస్థిత్వంలోనే ఇమిడిపోయి ఉన్నాయి. ఏ శక్తి కూడా తనదంటూ వేరైన ఉనికిని కలిగి లేదు.

(3) మూడవ ముఖ్య విషయం; అల్లాహ్‌కు గల ఈ గుణగణాలన్నీ సుగుణాలే. అన్ని రకాల దోషాల నుండి అవి పవిత్రంగా ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానినీ దుర్గుణం అని అనేందుకు ఆస్కారమే లేదు. ఆ విషయాన్ని కురాన్ స్వయంగా ఈ విధంగా చాటిచెప్పింది :

“ఆయనే అల్లాహ్; ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు. ఆయన చక్రవర్తి. ఎంతో పరిశుద్ధుడు, సురక్షితుడు.” *(అల్ హష్ర్ : 23)*

هُوَ اللّٰهُ الَّذِىْ لَآ اِلٰهَ اِلَّا هُوَۚ اَلْمَلِكُ الْقُدُّوْسُ السَّلٰمُ (الحشر:٢٣)

ఈ విధంగా కూడా విపులీకరించింది :

“ఆయనకు గల పేర్లన్నీ చక్కనివే.” (బనీ ఇస్రాయీల్ : 110)

فَلَهُ الْاَسْمَآءُ الْحُسْنٰىۚ ...(بنی اسرائیل:١١٠)

ఈ సందర్భంగా ఎదురయ్యే అవాంఛనీయ సంఘటనలకు, చేదు అనుభవాలకు కళవళ పడవలసిన అవసరం లేదు. ఈ ప్రపంచంలో నిత్యం ఎదురవుతూ ఉండేవే ఇవి. ఎందుకంటే ఈ సంఘటనలు తమ తాత్కాలిక ప్రభావం రీత్యా పరిమిత భావంలోనే అవాంఛనీయం. తమ అంతిమ ఫలితం దృష్ట్యా, సర్వతోముఖ ప్రయోజనాల రీత్యా ఎంతమాత్రం చేదు సంఘటనలు కావు. రోగి శరీరంపై (శస్త్ర చికిత్స నిమిత్తం) డాక్టరు కత్తెర నడిపించటంలాంటిదే ఇదీను! రోగి నోట్లో వైద్యుడు చేదు మందు పోయటం ఎలాంటిదో ఇదీ అలాంటిదే! తోటలోని మొక్కలను తోట మాలి కత్తెరతో కత్తిరించటం, హంతకులను, విద్రోహులను న్యాయస్థానం ఉరికంబంపైకి ఎక్కించటం పైకి అవాంఛనీయంగానే కనిపిస్తుంది. కాని యదార్థం మరియు న్యాయం దృష్ట్యా అవి అవాంఛనీయం కానేకావు. ఈ ప్రపంచంలో అంటువ్యాధుల మహమ్మారి ప్రబలుతూ ఉంటుంది. కరవు రక్కసి తాండవిస్తుంది. వరదలు వస్తుంటాయి. దుర్మార్గులు, అపరాధులు, కల్లోల జనకుల లోగిళ్ళలో సిరులు పొంగిపొరలుతూ ఉంటాయి; అధికార వసంతం వెల్లివిరుస్తూ ఉంటుంది. అదే సమయంలో సజ్జనులను నిరంతరం కష్టాలు కడగండ్లు వెంబడిస్తూ ఉంటాయి. అంతమాత్రాన ఈ లోకేశ్వరుడు అలసత్వానికి లోనై ఉన్నాడనో లేదా ఆయన విధ్వంసాన్ని ఇష్టపడేవాడనో (అల్లాహ్ మన్నించుగాక!) దీనికి రుజువు కానేకాదు. ఎందుకంటే ఈ రకమయిన సంఘటనల ఉపరితలంపై కనిపించే ‘కల్లోలం’ తన వెనుక మహత్తరమయిన ‘సంస్కరణ’ను, దిద్దుబాటును కలిగి ఉంటుంది. బాహ్యంలోని విధ్వంసం అత్యంత ముఖ్యమయిన నిర్మాణానికి మకుటం అయి ఉంటుంది.

సాధారణంగా కల్లోలంలో, విధ్వంసకర కార్యకలాపాలలో సంచలనం రేపే గుణం ఉండటం వల్ల మనం వెంటనే వాటి వైపు దృష్టిని సారిస్తాం. చాలాసేపటి వరకు కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోతాం. కాగా; సంస్కరణలో, నిర్మాణంలో హంగామా ఉండదు. దాని నైజంలో ప్రశాంతత, నిశ్శబ్దస్థితి ఉంటుంది. అందువల్ల దానివైపు

వీక్షకుల దృష్టి అతి కష్టం మీద మరలుతుంది. ఒక ఇంటి నిర్మాణం జరుగుతున్నప్పుడు పెద్దగా చడీ చప్పుడు ఉండదు. కాని అది కుప్పకూలిపోయినప్పుడు ఆ విస్ఫోటనానికి ఊరుఊరంతా, వాడవాడంతా కదలిపోతుంది. మరోవైపు మానవ నైజం కూడా ఎలాంటిదంటే, అది వాంఛనీయమయిన విషయాలకన్నా అవాంఛనీయమయిన విషయాలకు తొందరగా ప్రభావితం అవుతుంది. సుఖం ప్రాప్తించినప్పుడు మానవుడు అంతగా స్పందించడు గాని విపత్కర పరిస్థితి ఏర్పడినప్పుడు ఎక్కువగా కలవరం చెందుతాడు. బెంబేలెత్తిపోతాడు. పది విషయాలు అతనికి సంతోష సామగ్రిని సమకూర్చినా కనిపించనంత స్పందన ఒక్కగానొక్క దుఃఖంతో అవధులు మీరిపోతుంది. ఆ క్షణంలో అతను ఆస్వాదించిన పది సంతోషకర విషయాలను మరచిపోతుంటాడు. ఈ రెండు యదార్థాల సహజ పరిణామం ఎలా ఉంటుందంటే దూరదృష్టి లోపించిన మనిషి ప్రపంచంలో సంభవించే సంఘటనల వెనుక ఉన్న పరమార్థాన్ని గ్రహించటంలో విఫలుడౌతాడు. బాహ్యంలోని చెడుగునయితే అతను చూసుకుంటాడు గాని దాని లోపల నిగూఢమైవున్న పరమార్థాల ఉన్నతస్థాయి ఉపాయాల వరకు అతని దృష్టి చేరదు. అన్యథా ఆ సంఘటనలలో ఏ ఒక్కటి కూడా సంస్కరణ, నిర్మాణ కోణాలు లేకుండా ఉండదు. కాబట్టి ఈ సంఘటనకు మూలకారణమైన ఆ 'గుణం' కూడా అవశ్యంగా 'మేలు'తో కూడిన గుణమై ఉంటుంది.

(4) నాల్గవ విషయం; దేవుని ఈ గుణగణాలలో ఆచరణకు – ప్రభావానికి మధ్య సంపూర్ణ సమన్వయం ఉంది. వాటిలోని ఏ ఒక్క గుణం కూడా మరో గుణానికి వ్యాఘాతంగా పరిణమించేలా పని చేయదు. దీనికి ప్రతిగా ప్రతి గుణం తన పరిధిలో ప్రభావం చూపుతుంది. అది ఒక నిర్ణీత హద్దు వరకూ – సమతూకంతో కూడిన హద్దువరకూ – వెళుతుంది. సరిహద్దు లేక హద్దుమీరే సంకేతం కనిపించగానే ఆగిపోతుంది. ఉదాహరణకు : దేవుని గుణగణాలలో ఒక గుణం కారుణ్యం (రహ్మత్). అయితే దేవుడు కరుణామయుడు, కృపాశీలుడు అయినంతమాత్రాన సజ్జనుల పట్ల దుష్టుల పట్ల ఒకేవిధంగా వ్యవహరించాలని లేక అందరినీ క్షమించి వదలిపెట్టాలని దీని భావం కాదు కదా! ఆయన దుర్మార్గులను, అపరాధులను దండించటం కూడా కారుణ్యం వాంఛించే అంశమే. ఒకవేళ ఆయన దుష్టులను వదలిపెట్టేసే మాటైతే ఆయన న్యాయశీలుడు, వివేకవంతుడు, మంచికి విలువ ఇచ్చేవాడన్న మాటకు అర్థమే ఉండదు.

అలాగే ఆయనలోని మరో గుణం; అనుకున్న దానిని చేసివేయటం. ఆయన తలచుకున్నది జరిగితీరుతుంది. అయితే మానవ ప్రయత్నానికి, అతని సంకల్పానికి

ప్రమేయం లేనే లేదన్నది దీని భావం ఎంతమాత్రం కాదు. అల్లాహ్ కోరినది మాత్రమే నెరవేరుతుందని, ఏ అర్థ్వతా ఏ కారణమూ లేకపోయినా ఆయన సన్మార్గం ప్రసాదిస్తాడని, తాను కోరుకున్న వారిని సజ్జనులుగా చేసి, తాను కోరుకున్నవారిని దుర్మార్గులుగా మార్చి అపమార్గపు పాతాళంలోకి నెట్టివేస్తాడని, అలాగే తాను కోరిన వారికి క్షమాభిక్ష పెడతాడని, తాను కోరిన వారిని నరకంలో పడవేస్తాడని ప్రపంచంలో వారు చేసుకున్న కర్మలతో ఎలాంటి నిమిత్తం లేదని అనుకుంటే పొరపాటే. ఒకవేళ అదే నిజమైతే ఆయన మహా వివేకి, న్యాయశీలుడు, సత్యానికి విలువ ఇచ్చేవాడన్న దానిలో అర్థమే మిగిలి ఉండదు. అందుకే దివ్య కుర్‌ఆన్ "అల్లాహ్ తాను కోరిన వారిపై కటాక్షవీక్షణాలను ప్రసరింపజేస్తాడు." (وَيَتُوبُ اللّٰهُ عَلٰى مَنْ يَّشَآءُ) అని చెప్పటంతో పాటు, "అల్లాహ్ అంతా తెలిసినవాడు, వివేకవంతుడు" (తౌబా-15) (وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ، توبہ ١٥) అని చెప్పటం కూడా అవసరమని భావించింది. అంటే దైవేచ్ఛ, కళ్ళు మూసుకుని గైకొనే నిర్ణయాలపై ఆధారపడి లేదని తెలుసుకోవాలి. అలా ఎన్నటికీ జరగదు. అక్కడ ఏ నిర్ణయం జరిగినా సంపూర్ణ జ్ఞానంతో జరుగుతుంది. న్యాయం ధర్మాల కనుగుణంగా తీర్పు జరుగుతుంది. వివేచన, యుక్తికి సంబంధించిన ఏ ఒక్క కోణం కూడా విస్మరించబడదు.

(5) ఐదవ ముఖ్య విషయం ; దేవుని గుణగణాల అభివ్యక్తికై కుర్‌ఆన్ ఉపయోగించిన పదాలలో అనేక పదాలు మనుషుల కోసం ఉపయోగించబడేవే. ఉదాహరణకు : జ్ఞాని, ఎరిగినవాడు, వినేవాడు, చూసేవాడు, శక్తిమంతుడు, విలువ ఇచ్చేవాడు, ప్రేమమయుడు, దయామూర్తి, వివేకవంతుడు, న్యాయశీలుడు మొదలగునవి. అయితే ఇది కేవలం పద సంబంధమయిన సంబంధమే. వాస్తవబద్ధమైన సంబంధం కాదు. అంటే ఈ పదాలు మనుషుల కోసం ప్రయోగించేటప్పుడు వాటికి అర్థం, వాస్తవం వేరు. అల్లాహ్ కొరకు వాటిని ఉపయోగించేటప్పుడు ఉండే అర్థం, వాస్తవం వేరు. మొదటి పరిస్థితిలో ఆ పదజాలాన్ని ప్రయోగించినప్పుడు భావం చాలా పరిమితంగా ఉంటుంది. అధమ స్థాయిలో ఉంటుంది. రెండవ పరిస్థితిలో వాటి భావార్థం అనంతమైనది, అత్యున్నతమైనదై ఉంటుంది. ఉదాహరణకు 'జ్ఞానం' (ఇల్మ్) గుణాన్నే తీసుకోండి – అల్లాహ్ కూడా తెలిసినవాడే. మనిషి కూడా తెలిసినవాడే. కాని అల్లాహ్ 'తెలిసినవాడు' (అలీమ్) అన్నదానిలో ఎంతో విస్తృతి ఉంది. (1) ఆయన సర్వం తెలిసినవాడు. ఆ విషయం ఏ కాలానికి సంబంధించినదయినా, అది ఎక్కడిదయినా, దేనికి సంబంధించిన వ్యవహారమయినాసరే ఆయన జ్ఞానపరిధిలో

ఉంటుంది. (2) ఆయనకు తెలిసిన ఆ విషయం ఖచ్చితంగా ఉంటుంది. అది వాస్తవవిరుద్ధమై ఉండదు. (3) ఆ జ్ఞానం ఆయన సొంతగుణం. అది వేరొకరి భిక్ష కాదు. ఇతర సాధనాల ద్వారా లభ్యమైనది కూడా కాదు. (4) అది శాశ్వతమైనది, క్షణభంగురమైనది కాదు.

దీనికి ప్రతిగా మానవుడు 'తెలిసినవాడు' అనే దానికి భావం కేవలం ఇదే : (1) అతనికి కేవలం కొన్ని విషయాలు మాత్రమే తెలుసు. అదీ చాలా కొద్దిగా మాత్రమే. (2) భవిష్యత్తు గురించి అతనికి తెలిసింది శూన్యం. గతం గురించి కూడా అతను బహుదూరం వరకూ వెళ్ళలేదు. కడకు వర్తమానం గురించిన అతని జ్ఞానపరిధి కూడా చిన్నదే. పైగా అతనికి తెలిసినవన్నీ నిజమైనవి, ఖచ్చితమైనవి కానవసరం లేదు. (3) అతని ఈ (జ్ఞాన) గుణం అతని సొంతం కాదు. అది దైవప్రసాదితం. ఏ మనిషికయినాసరే దేవుడు ప్రసాదించినంత జ్ఞానమే ప్రాప్తమవుతుంది. (4) అతని జీవితం ఎలా నశ్వరమో, క్షణభంగురమో అతని ఈ గుణం కూడా నశ్వరమైనదే.

ఇతర గుణగణాల సంగతీ యింతే.

ఈ సందర్భంగా ఎవరయినా ఒక అభ్యంతరాన్ని లేవనెత్తవచ్చు – వాస్తవం ఇదైనప్పుడు దివ్య కుర్‌ఆన్ దేవుని గుణగణాల అభివ్యక్తి కొరకు ఇలాంటి పదాలను ఎందుకు ప్రయోగించినట్టు? అన్న ఆక్షేపణ జనించవచ్చు. ఎందుకంటే అంతకు మించి చేయగలిగింది కూడా ఏముంటుంది? కురాన్ మానవులమైన మన మార్గదర్శకత్వం కొరకే కదా వచ్చినది!? అగోచర విషయాలలోని ఒక భాగం దేవుని గుణగణాలు. వాటిని గురించి ఎంతో కొంత మనకు తెలియజేయటం అవసరం. అదీ మన వాడుక భాషలోనే తెలియజేయబడాలి. మన మధ్య ప్రాచుర్యంలో ఉన్న పదజాలాన్నే ఉపయోగించాలి. ఇది తప్ప మార్గాంతరం లేదు. అందుకే ఇతర అగోచర విషయాల మాదిరిగా దేవుని గుణగణాల వివరణపై కూడా మనకు బాగా తెలిసిన పదాలే ఉపయోగించబడ్డాయి. ఇక్కడ ఒక సందేహం! ఈ సమిష్టి పదజాలం మూలంగా కొందరు మందబుద్ధిగలవారు దైవిక గుణాలను కూడా మానవీయ గుణాలుగా ఊహించే ప్రమాదం ఉందికదా! అన్న భయం ఉంటుంది.

అయితే సూత్రప్రాయంగానూ, తఫ్సీళ్ళ పరంగానూ ఈ విషయం పూర్తిగా విడమరచి చెప్పటం జరిగింది–సూత్రప్రాయంగా ఏమనబడిందంటే "لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ" (అల్లాహ్‌ను పోలిన వస్తువు ఏదీ లేదు–షూరా). "وَلَهُ الْمَثَلُ الْأَعْلَىٰ فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ" (ఆకాశాలలోనూ, భూమిపైనా ఆయన గుణగణాలు సర్వోన్నతమైనవి. – రూమ్). తఫ్సీళ్ళ పరంగా అవగాహన చేసుకునేందుకు వివిధ గుణగణాల సందర్భంగా

అవసరమయిన వివరణలు ఇవ్వబడ్డాయి. దీని తరువాత అపోహకు ఆస్కారమే మిగిలి ఉండదు. ఉదాహరణకు : ఈ జ్ఞాన గుణాన్నే తీసుకోండి! దివ్య కుర్‌ఆన్ అల్లాహ్‌ను 'జ్ఞాని'గా పేర్కొన్నచోటల్లా ఆ 'జ్ఞానసంపన్నత' గురించి సోదాహరణంగా విశ్లేషించి చెప్పింది. "ఆయన ప్రతి దాని గురించి తెలిసినవాడు" (وَهُوَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ - بقرہ) "నిశ్చయంగా అల్లాహ్ గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు" (إِنَّ اللَّهَ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ - آل عمران) "ఆయన దృశ్యాదృశ్య విషయాలన్నీ ఎరిగినవాడు" (عَالِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ - حشر) "నిశ్చయంగా అల్లాహ్‌కు ఆకాశాలలోనూ, భూమిలోనూ దాగివున్న ప్రతి వస్తువును గురించి తెలుసు." (إِنَّ اللَّهَ يَعْلَمُ غَيْبَ السَّمَاوَاتِ وَالْأَرْضِ - حجرات)

(6) దివ్య కుర్‌ఆన్ దేవుని అస్థిత్వం, గుణగణాల భావనను సమర్పించే సమయంలో కేవలం ఒకే వర్గాన్ని – సామాన్య మానవ వర్గాన్ని – దృష్టిలో పెట్టుకుంది. ప్రత్యేకంగా ఒకానొక వర్గాన్ని ముందుంచుకుని విషయాన్ని వివరించలేదు. సామాన్య ప్రజల బుద్ధీ వివేకాలకు అందని ఊహాగానాలకు అది ఆస్కారం ఇవ్వలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే శిష్ఠులు – సామాన్యులు అనే విచక్షణను అది పాటించలేదు. శిష్ఠులకు ఒకటి చెప్పి, సామాన్య జనులకు వేరొకటి చెప్పే పంథాను అది అనుసరించలేదు. అది అన్ని వర్గాల ప్రజల ముందు ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా అల్లాహ్ ఉనికిని, ఆయన గుణగణాలను సమర్పించింది. దైవగ్రంథాల అవతరణలోని మర్మం గురించి ఏ వ్యక్తి కూడా తికమకపడరాదు; మానవ జీవితంలో ఏ విప్లవం తీసుకువచ్చే ఉద్దేశంతో కుర్‌ఆన్ అవతరించిందో అతనికి స్పష్టంగా తెలియాలి.

దివ్య కుర్‌ఆన్ అత్యంత కీలకమయిన ఈ పరిభాష – అంటే 'అల్లాహ్' అనే పదాన్ని ప్రయోగించినప్పుడు దాని అంతరార్థం ఏమై ఉంటుందో పైన పొందుపరచబడిన చర్చను చదివిన తరువాత బోధపడుతుంది. వేరొక మతధర్మం, వేరొక ధార్మిక భాషలోని పారిభాషిక పదం ఈ భావాన్ని తనలో ఇముడ్చుకోగలిగిందో లేదో తెలియదు. ఒకవేళ 'అవున'ంటే 'అల్లాహ్' యొక్క తర్జుమా ఆ పదంతో చేయవచ్చు. అన్యథా, అలా చేయటం సరైనది కాదు.

## ప్రవక్త, సందేశహరుడు (నబీ, రసూల్)

దివ్య కురాన్‌లోని మరో ముఖ్యమయిన పారిభాషిక పదం 'నబీ' మరియు 'రసూల్.' అల్లాహ్ తన మార్గదర్శకత్వం కొరకు ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న వ్యక్తి నబీ, రసూల్ అవుతాడు. తాను స్వయంగా ఆ మార్గాన్ని అవలంబించి, దైవదాసులకు ఆ మార్గబోధన చేయటం ప్రవక్త కర్తవ్యమై ఉంటుంది.

అరబీ నిఘంటువులో ఎత్తయిన భూభాగాన్ని 'నబీ' అంటారు. మార్గచిహ్నాన్ని కూడా 'నబీ'గా వ్యవహరిస్తారు. అలాగే రసూల్ అంటే నిఘంటువులో 'పంపబడిన' అన్న అర్థం వస్తుంది. ఆ పంపబడినది సందేశం కూడా కావచ్చు. సందేశహరుడు కూడా కావచ్చు. అల్లాహ్ మార్గదర్శకత్వం అవతరించిన వ్యక్తిని 'నబీ'గా పేర్కొనటంలోని ఔచిత్యం ఏమిటంటే; అతను తన స్థాయి, అంతస్తు రీత్యా మానవులందరిలోకెల్లా ఉన్నతుడై ఉంటాడు. మానవుల మోక్షానికి, సాఫల్యానికి మార్గనిర్దేశన చేసేవాడై ఉంటాడు. అలాగే అతనిని 'రసూల్' (సందేశహరుడు) అని ఎందుకంటారంటే; అతను సకల లోకాల పరిపాలకుని తరఫు నుండి ప్రజల వద్దకు పంపబడిన సందేశహరుడు, దౌత్యవేత్త, రాయబారి! ఆ సార్వభౌముని ఆజ్ఞలను మానవాళికి చేరవేసేవాడు!!

'నబీ' మరియు 'రసూల్' గురించి దివ్య కురాన్ ఇచ్చిన వివరణ ఇది :

(1) అతను మానవుడు, కేవలం మానవమాత్రుడై ఉంటాడు. అచ్చం మాలాంటి, మీలాంటి మానవుడే. ప్రవక్తలంతా తమ గురించి إِنْ نَحْنُ إِلَّا بَشَرٌ مِّثْلُكُمْ (నిజంగానే మేము మీవంటి మానవులం తప్ప మరేమీ కాము– ఇబ్రాహీమ్:11) అని చెప్పుకున్నారు. మరి మానవుల్లో కూడా 'పురుషులను' మాత్రమే ప్రవక్తలుగా చేయటం జరిగేది. స్త్రీలలో ఎవరినీ ప్రవక్తలుగా ఎంపిక చేయటం జరగలేదు. "(ప్రవక్తా!) నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరూ పురుషులే. వారి వైపునకే మేము 'వహీ'ని పంపుతూ వచ్చాము." (యూసుఫ్ : 109) (وَمَا أَرْسَلْنَا مِن قَبْلِكَ إِلَّا رِجَالًا نُّوحِي إِلَيْهِمْ - يوسف) ప్రవక్తలు మానవ మాత్రులైనపుడు సహజంగానే మనుషుల మాదిరి భౌతిక అవసరాలు వారికీ ఉంటాయి. "వారు అన్నం తినేవారే. బజారులలో సంచరించేవారే." (అల్ ఫుర్ఖాన్ :20) (إِنَّهُمْ لَيَأْكُلُونَ الطَّعَامَ وَيَمْشُونَ فِي الْأَسْوَاقِ - فرقان) ఇంకా – "మేము వారిని ఆలుబిడ్డలు కలవారుగానే చేశాము" (అర్రాద్ : 38) (وَجَعَلْنَا لَهُمْ أَزْوَاجًا وَذُرِّيَّةً - رعد)

ఈ వివరణల తరువాత దైవప్రవక్తలు (అలైహిముస్సలాం) మానవమాత్రులే అన్నది పగటి వెలుతురులా తేటతెల్లమైపోయినప్పటికీ, ఈ అంశం యొక్క ఎనలేని ప్రాధాన్యత దృష్ట్యా నకారాత్మక కోణం నుండి కూడా ఎలాంటి తప్పుడు భావనకు ఆస్కారం లేకుండా చేయటం అవసరమనిపిస్తోంది. అందుకే దైవప్రవక్తలు దైవదూతలు కారు అనే విషయం కూడా ఈ సందర్భంగా గుర్తు చేయాల్సివస్తోంది. ఇదిగో ఈ నేపథ్యంలో ఈ విధంగా సెలవీయబడింది : "భువిలో దైవదూతలు నిశ్చింతగా తిరుగుతూ ఉండి ఉంటే, మేము తప్పకుండా ఆకాశం నుండి

దైవదూతనే వారికోసం ప్రవక్తగా పంపి ఉండేవారం.” (బనీ ఇస్రాయీల్ : 95) (قُلْ لَّوْ كَانَ فِي الْاَرْضِ مَلٰٓئِكَةٌ يَّمْشُوْنَ مُطْمَئِنِّيْنَ لَنَزَّلْنَا عَلَيْهِمْ مِّنَ السَّمَآءِ مَلَكًا رَّسُوْلًا) అల్లాహ్ అవతారపురుషుడుగా రావటంగానీ, ఆయన స్వయంగా మానవ వేషధారణలో ప్రత్యక్షమవటం అనేదిగానీ జరగదు. అందుకే క్రైస్తవులలోని ఒక వర్గం వారు “అల్లాహ్‌యే మర్యమ్ కుమారుడగు మసీహ్” అని చెప్పినప్పుడు, దివ్య కురాన్ దీనిని ‘కుఫ్ర్’ (సత్య తిరస్కారం)గా ఖరారు చేసింది. (అల్ మాయిద : 72) (لَقَدْ كَفَرَ الَّذِيْنَ قَالُوْٓا اِنَّ اللّٰهَ هُوَ الْمَسِيْحُ ابْنُ مَرْيَمَ).

(2) ప్రవక్త, సందేశహరుడు (నబువ్వత్, రిసాలత్) అనేది దైవప్రసాదితమయిన వరం, అదొక పదవీబాధ్యత. దాని కొరకు అల్లాహ్ తరపున మానవకోటిలో నుండి విశిష్ఠ వ్యక్తుల ఎంపిక జరుగుతుంది, నియామకం జరుగుతుంది. “అల్లాహ్ (తన ఉత్తరువులను అందజేయడానికి) తన సందేశహరులను దైవదూతల నుండీ, మానవుల నుండి ఎంపిక చేసుకుంటాడు. ఆయన అంతా వినేవాడు, అన్నీ చూసేవాడు.” (అల్ హజ్జ్ : 75) (اَللّٰهُ يَصْطَفِيْ مِنَ الْمَلٰٓئِكَةِ رُسُلًا وَّمِنَ النَّاسِ اِنَّ اللّٰهَ سَمِيْعٌ بَصِيْرٌ) ఈ విధంగా ఈ పదవికి ఎంపిక అయ్యే లేక నియమితులయ్యే వ్యక్తుల ప్రమేయం లేదా సంకల్పం ఏమీ ఉండదు. మానవుడు తన పట్టుదల, కృషి, పోరాటం ద్వారా ఈ హోదాను సాధించలేడు. ఎవరిని తన ప్రవక్తగా ఎంపిక చేసుకోవాలో నిర్ణయించేది అల్లాహ్‌యే. (اَللّٰهُ اَعْلَمُ حَيْثُ يَجْعَلُ رِسَالَتَهٗ انعام) ధ్యానం, తపస్సు, కఠోర అభ్యాసాల ద్వారా ఒక వ్యక్తి ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించగలడు. తనలో అత్యుత్తమ శ్రేణికి చెందిన సాత్విక గుణాన్ని సృజించుకోగలడు. అయితే ఈ కఠోర సాధన ద్వారా ప్రవక్తాపదవిని అందుకోవటం అతని తరం కాజాలదు. ‘నుబువ్వత్’ అనేది ఒక పదవీబాధ్యత. ఒక కీలకమయిన విధి నిర్వహణ. అది మానవుని స్వయంకృషి మూలంగా ప్రాప్తించేది కాదు; పైగా విశ్వసార్వభౌముని ఉత్తరువు ద్వారా ఈ గొప్ప దైవికమయిన హోదా లభిస్తుంది.

(3) దైవప్రవక్త (నబీ) ఏ సూచన ఇచ్చినా, ధార్మికంగా, షరీఅత్‌పరంగా ఏ ఉపదేశం చేసినా అది అతని సొంత అభిప్రాయం అయి ఉండదు; అది అల్లాహ్ తరపు నుండి వెలువడిన ఆజ్ఞ అయి ఉంటుంది. అందుకే ప్రతి ప్రవక్తా తన జాతి జనులలో, ‘నేను మీకు నా ప్రభువు ఆజ్ఞలను వినిపిస్తున్నాను. ఆయన సందేశాన్ని అందజేస్తున్నాను’ (اُبَلِّغُكُمْ رِسٰلٰتِ رَبِّيْ اعراف) అనే అనేవాడు. ప్రవక్త చెప్పే ప్రతి

విషయం అల్లాహ్ తరఫుననే ఉంటుందంటే, ప్రవక్తకు విధేయత చూపటం అంటే అల్లాహ్‌కు విధేయత చూపటమే. అతని మాటను ధిక్కరించటమంటే అల్లాహ్ ఆజ్ఞను ఎదిరించటమే. "దైవప్రవక్తకు విధేయత చూపినవాడు, అల్లాహ్‌కు విధేయత చూపాడు" (وَمَنْ يُّطِعِ الرَّسُوْلَ فَقَدْ اَطَاعَ اللّٰهَ - نساء ۸۰) అని కుర్‌ఆన్‌లో స్పష్టంగా విపులీకరించటం జరిగింది. "మేము (అంటే అల్లాహ్) ఏ ప్రవక్తను పంపించినా దైవాజ్ఞననుసరించి (జనులు) అతనికి విధేయత చూపాలనే పంపాము" (అన్ నిసా: (وَمَآ اَرْسَلْنَا مِنْ رَّسُوْلٍ اِلَّا لِيُطَاعَ بِاِذْنِ اللّٰهِ - نساء ۶۴) 'సందేశహరుదు' (రసూల్) అనే పదం కూడా స్వయంగా ఈ విషయంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తోంది. ఎందుకంటే 'రసూల్' అంటేనే పంపబడినవాడు అని అర్థం. అతనేది చెప్పినా తన తరఫున చెప్పడు. తనను పంపించిన వాని తరఫుననే చెబుతాడు. కాబట్టి అతనిని అనుసరించటమంటే దైవాన్ని అనుసరించటమే అవుతుంది. అతనికి అవిధేయత చూపటమంటే దైవానికి అవిధేయత చూపటమే అవుతుంది.

ఈ విశదీకరణ ద్వారా దైవప్రవక్త, దైవసందేశహరుడు (నబీ, రసూల్) గురించి కుర్‌ఆనీ పరిభాష ద్వారా నిర్ధారితమయ్యే భావార్థం ఏమిటో మీరు గ్రహించే ఉంటారు. దైవసామీప్యం, మత ఔన్నత్యం, పవిత్రతకు సంబంధించి ఉన్న ఇతర అసంఖ్యాకమయిన పదాల, పారిభాషిక పదాల కంటే ఇది మౌలికంగా ఎంతో భిన్నమైనది. మహాత్ముడు, వలీ (దేవుని ప్రియతముడు), సన్యాసి, బైరాగి, సాధువు, సంతు, గురూ, ఋషి, ముని – ఇలాంటివే ఇతర పదాలలో ఏ ఒక్క దానిలో కూడా ఈ భావం ఇమడదు. కాబట్టి ఈ కుర్‌ఆనీ పారిభాషిక పదానికి గల వాస్తవికత, ఔన్నత్యం దృష్ట్యా ఆ పదాన్ని యధాతథంగా ప్రయోగించటం మంచిది. ఒకవేళ ఇతర భాషల్లో తర్జుమా చేసినపుడు ఇతర పదాల్లో ఇంచుమించు ఆ భావార్థం వస్తే సరి. లేకుంటే అలాంటి ఇతర పదాలను ప్రయోగించే విషయంలో జాగ్రత్తపడాలి. ఉదాహరణకు : పారసీక భాషలో 'పైగంబర్' అనే పదం ఉంది. ఆ పదాన్ని చదివిన వెంటనే పాఠకుల దృష్టి నబీ, రసూల్ వైపు మళ్ళుతుంది.

చివర్లో నబీకి – రసూల్‌కి మధ్య గల ఒక వ్యత్యాసాన్ని కూడా అర్థం చేసుకోవాలి. 'నబీ' అనే పదం కేవలం దైవప్రవక్త అన్న భావంలోనే ప్రత్యేకంగా ప్రయోగించబడింది. అందులో ఇతర అర్థాలకు ఆస్కారమే లేదు. కాని 'రసూల్' (సందేశహరుడు) అనే పదం ఈ విధంగా ప్రత్యేకమయినది కాదు. దివ్య కురాన్ 'నబీ' అనే పదాన్ని ఉపయోగించినప్పుడల్లా అల్లాహ్ తరఫున 'వహీ' (దివ్యవాణి) అవతరించిన వ్యక్తి

అన్న భావంలోనే ఉపయోగించింది. కాని 'రసూల్' అనే పదంలో 'నబీ' అనే అర్థం కూడా ఇమిడి ఉన్నప్పటికీ అనేకచోట్ల అది దాని 'నిఘంటువు' భావంలో కూడా ఉపయోగించబడింది. అంటే ఆ పదం (రసూల్) దైవప్రవక్తల కోసం కూడా ప్రయోగించబడింది, ప్రవక్తేతరుల కోసం కూడా. అనేకచోట్ల దైవదూతలను కూడా 'దేవుని సందేశహరులు' అనడం జరిగింది. ఎందుకంటే వారు కూడా అల్లాహ్ తరఫున వివిధ విధుల నిర్వహణలో నిమగ్నులై ఉంటారు.

## వహీ (దివ్యవాణి)

దివ్య కురాన్‌లోని మూడవ ముఖ్య పారిభాషిక పదం 'వహీ'. అల్లాహ్ తరఫున దైవప్రవక్తపై అవతరించే మార్గదర్శక సూచనలను 'వహీ' (దైవవాణి) గా వ్యవహరించటం జరిగింది.

నిఘంటువు ప్రకారం 'వహీ' అంటే 'తీక్షణమైన సంజ్ఞలు' అని అసలు అర్థం. అవి చేత్తో చేసే సంజ్ఞలూ కావచ్చు, కళ్లతో చేసేవీ కావచ్చు, శబ్దంతో, మాటలతో చేసేవీ కావచ్చు. సంజ్ఞ లేక సంకేతం అనేది ఎవరికయినా ఏదయినా విషయం తెలియజేయటానికి ఉద్దేశించినదే అయి ఉంటుంది. మరోవైపు అందులో 'రహస్య' భావన కూడా అంతర్లీనమై ఉంది. అందుచేత ఈ పదానికి రహస్యంగా సమాచారం అందజేయటం, రహస్యంగా బోధపరచటం అన్న అర్థాలు కూడా వస్తాయి. మనసులో ఏదయినా విషయాన్ని వేయటం, మార్పిడి చేయటం అన్న భావమూ వస్తుంది. ఈ పదానికి ఉత్పత్తి స్థానం 'ఏహా'. దాని ద్వారా ఏర్పడే క్రియలు ఈ విభిన్న అర్థాలన్నింటికీ వర్తిస్తాయి. అంటే ప్రత్యేకంగా ఒక్క వస్తువుకు కాకుండా వివిధ వస్తువుల కొరకు ఉపయోగపడతాయి. అందుకే దివ్య కుర్‌ఆన్‌లో ఈ క్రియలు అల్లాహ్, మానవుడు, షైతాన్ లాంటి పదాలన్నింటి కొరకు ప్రయోగించబడ్డాయి. అయితే కేవలం వహీ (దివ్యవాణి) కొరకు మాత్రమే ఈ పదం ప్రయోగించబడినపుడు ఇతరత్రా భావాలకు తావుండదు. అప్పుడు దేవుని నుండి ఆయన ప్రవక్తలకు అందే మార్గదర్శక సందేశం నేపథ్యంలోనే దీని అర్థమే తీసుకోబడుతుంది. అప్పుడది సామాన్య జనుల పంచేంద్రియాలకు అందనిదై ఉంటుంది. అంటే ప్రత్యేకమయిన 'వహీ' పదం దివ్య కుర్‌ఆన్ యొక్క ఓ ప్రత్యేక పరిభాష. కురాన్‌లో ఎక్కడెక్కడ ఈ పదం వచ్చినా ఈ పరిభాషలోనే వచ్చింది. 'వహీ' కేవలం అల్లాహ్ తరఫు నుండి అయి ఉంటుంది. కేవలం ఆయన సందేశహరులకు మాత్రమే అది వర్తిస్తుంది.

దైవప్రవక్తలపై అవతరించే దేవుని మార్గదర్శకత్వాన్ని 'వహీ' గా పేర్కొనటంలోని

ఔచిత్యం ఏమిటంటే, దాని అవతరణ ఇతర మానవుల కంటికి కానరాకుండా – రహస్యంగా – ఉంటుంది.

'వహీ' అనేది కేవలం అర్థానికి మరోపేరు కాదు; అందులో అర్థంతో పాటు పదాలు, పదబంధం, వరుసక్రమం లాంటివన్నీ చేరి ఉన్నాయి. వేరే మాటల్లో చెప్పాలంటే అల్లాహ్ తరఫు నుండి ప్రవక్తలపై ఏ మార్గదర్శకత్వం అవతరిస్తుందో, ఏ విధంగానయితే దాని భావార్థాలు కూడా అల్లాహ్ తరఫు నుండి అయి ఉంటాయో అదేవిధంగా దీని (వహీ) పదాలు కూడా ఆయన తరఫుననే అయి ఉంటాయి. ఆ పదాల ఆధారంగా జరిగే వాక్య నిర్మాణం కూడా, దాని వరుస క్రమం కూడా ఆయన తరఫు నుండే అయి ఉంటుంది. అందుకే ఈ 'వహీ'ని చాలా స్పష్టంగా 'కలాముల్లాహ్' (అల్లాహ్ వాక్కు) అని అనటం జరిగింది.

ఈ 'వహీ' (అంటే దివ్య కురాన్) మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) వరకు చేరడాన్ని 'అవతరణ' (నుజూల్) లేదా అవతరింపజేయటం (ఇన్‌జాల్, తన్‌జీల్), దించటంగా పేర్కొనటం జరిగింది. ఇంతకీ ఈ అవతరణ అంటే ఏమిటి? అది 'అవతరించే' లేక అవతరింపజేయబడే ప్రక్రియ ఏ విధంగా ఉనికిలోకి వచ్చింది? దీనికి సంబంధించిన వివరాలు ప్రామాణిక హదీసులలో లభిస్తాయి. దీని సారాంశం ఇది :

(అ) దేవుని ఓ ప్రత్యేక దూత – జిబ్రీల్ (అలైహిస్సలాం–ఈ వాక్కును తీసుకుని మహనీయ ముహమ్మద్ (స) మనోఫలకంపై అవతరించేవాడు.

"ఓ ప్రవక్తా! దీనిని (ఈ కురానును) తీసుకుని విశ్వసనీయమైన ఆత్మ (జిబ్రీల్) నీ హృదయ ఫలకంపై అవతరించింది." *(అష్ షుఅరా : 193)*

نَزَلَ بِهِ الرُّوحُ الْأَمِينُ ۝
عَلَىٰ قَلْبِكَ ۔ (شعراء)

"కనుక నిశ్చయంగా అతను, ఆయన (అల్లాహ్) అనుజ్ఞతో దానిని నీ మనోఫలకంపై దించాడు."*(అల్ బఖర)*

فَإِنَّهُ نَزَّلَهُ عَلَىٰ قَلْبِكَ
بِإِذْنِهِ (بقرہ)

ఈ దైవదూతే దివ్య కురానును మహాప్రవక్త (స)కు అందజేయటంలో వారధి. అల్లాహ్ ఎప్పుడు ఎన్ని సూక్తులు అవతరింపజేయదలచినా వాటిని హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలాం)కు ఇచ్చి, ఆయనను తన అంతిమ ప్రవక్త (స) వద్దకు పంపించేవాడు. ఆ దైవదూత వాటిని ఎంతో నిజాయితీగా, బాధ్యతాయుతంగా ప్రవక్త మహనీయుల

(స) వారి హృదయఫలకంపై దించేవాడు. ఈ సందర్భంగా దైవదూత పాత్ర కేవలం ఒక వారధిలాంటిది; విశ్వ సార్వభౌముని సేవకుని లాంటిదే. అందులో దైవదూత సొంత అభిప్రాయానికీ, ఇచ్ఛకు ఎలాంటి ప్రమేయం లేదు. దైవాజ్ఞ కానంత వరకూ ఆ దూత ఏతెంచేవారు కారు. 'ఆయన అనుజ్ఞతో' అన్న వాక్యం ఈ సందర్భంగా గమనించదగింది. వేరొక సూక్తిలో స్వయంగా ఆ దైవదూత ఇలా స్పష్టం చేస్తారు : "ఓ ప్రవక్తా! మేమెప్పుడు ('వహీ'ని తీసుకుని) దిగివచ్చినా, మీ ప్రభువు ఆజ్ఞ అయినప్పుడే దిగివస్తాము." (وَمَا نَتَنَزَّلُ إِلَّا بِأَمْرِ رَبِّكَ مریم) ఆ 'వహీ'లో, 'దైవవాక్కు'లో ఆ దైవదూత ఎలాంటి హెచ్చుతగ్గులు, మార్పులు చేర్పులు చేయడు. ఆయన్ని "الرُّوحُ الْأَمِينُ" 'రూహుల్ అమీన్' (నమ్మకస్థుడైన దైవదూత)గా పేర్కొనటం కూడా గమనార్హ విషయమే.

దైవదూత జిబ్రీల్ (అ) ఈ కురానును ప్రవక్త (స) హృదయ ఫలకంపై దించాడనే విషయం కురాన్‌లో వేరొకచోట ఈ విధంగా కూడా ప్రస్తావించటం జరిగింది :

"ఇది (ఈ కురాన్) ఒక వహీ. ఇది అతనిపై అవతరింపజేయబడుతుంది. గొప్ప శక్తిమంతుడు (అయిన దూత) దానిని అతనికి నేర్పుతున్నాడు."

*(అన్ నజ్మ్ : 3, 4)*

إِنْ هُوَ إِلَّا وَحْيٌ يُوحَىٰ ۝
عَلَّمَهُ شَدِيدُ الْقُوَىٰ.
(النجم)

దీనినిబట్టి సుబోధకమయ్యేదేమిటంటే 'హృదయ ఫలకంపై దించటం' అనేది సాధారణ విషయం కాదు. పూర్తిగా నేర్పటం, కంఠస్థం చేయించటం అన్న భావం అందులో ఇమిడి ఉంది. ఒకసారి ఈ 'వహీ' దేవుని తరఫున అవతరించిన మీదట అది యథాతథంగా దైవప్రవక్త (స)కు జ్ఞాపకం అయిపోయేది.

(ఆ) మహనీయ ముహమ్మద్ (స) పవిత్ర హృదయంపై దివ్యవాణి అవతరించినపుడు ఆయన తీవ్రమయిన ఒత్తిడికి లోనయ్యేవారు. ఆయన (స) తనచుట్టు ప్రక్కల ఉన్నవారితో పూర్తిగా వేరైపోయినట్లుగా ఉండేవారు. ముఖారవిందం ఎర్రగా కందిపోయేది. ఆయన శరీరావయవాలపై బాగా బరువు పడినట్లుగా, ఆయన అలసిపోయినట్లుగా ఉండేవారు. తీవ్రమయిన చలికాలంలో సయితం 'వహీ' అవతరించినప్పుడు ఆయన నుదుటిపై చెమట బిందువులు ఏర్పడేవి (బుఖారీ–బాబు

కైఫ కాన బిదఅల్ వహీ). ఆ సమయంలో ఆయన ఒంటెపై ఉంటే, ఒంటెపైనున్న తొట్ల సయితం కంపించిన శబ్దం వినవచ్చేది (ఫత్‌హుల్ బారీ : ఒకటవ సంపుటం).

ఒకసారి హజ్రత్ హారిస్ బిన్ హిష్షామ్ (రజి) అనే సహచరుడు, "తమరిపై దైవసందేశం (వహీ) ఎలా అవతరిస్తుంది?" అని ప్రశ్నించినపుడు, ఆయన (సఅసం), ఇలా సమాధానమిచ్చారు : "ఒక్కోసారి దివ్యవాణి అవతరించినప్పుడు నా చెవులలో గంటలు మ్రోగినట్లనిపిస్తుంది. ఈ తరహా సందేశ అవతరణ నాకు భరించరానిదిగా ఉండేది. ఒక్కోసారి దైవదూత మానవాకారంలో నా ముందు ప్రత్యక్షమవుతాడు. నాకు వినిపించిన సందేశాన్ని నేనతనికి తిరిగి అప్పజెబుతాను. అతను వినిపించిన వాక్కును నేను కంఠస్థం చేసుకుంటాను."

ఈ పలుకుల ద్వారా విదితమయిన దేమిటంటే; దైవదూత రెండు రూపాలలో ఏతెంచేవాడు. ఒకటి : మానవాకారం. రెండు : తన అసలు రూపం. రెండవ రూపం గురించి ఆయన (స) వివరిస్తూ, అది తన పాలిట చాలా కఠినంగా ఉండేదని చెప్పారు. ఆ మాటకొస్తే మొదటి పరిస్థితి కూడా అంత సులభమైనది కాదు. దీని భావమేమిటంటే దైవదూత ద్వారా దైవసందేశాన్ని గ్రహించటం మామూలు విషయం కాదు. అది అసాధారణమయిన, అనితర సాధ్యమైన ప్రక్రియ. దానిని సాధారణ విద్య నేర్పటంగా, నేర్చుకోవటంగా భావించరాదు. దైవదూత నుండి దైవ సందేశాన్ని గ్రహించటానికి ఆయన (స) బహుశా బాహ్యేంద్రియాలతో పని తీసుకోకుండా, తన అంతఃశక్తులను సమీకరించుకుని వేరొక 'అవస్థ'లోకి వెళ్ళిపోయేవారు. ఈ విధంగా ఆయన (స) మనకు తెలిసిన లోకం నుండి వేరుపడి దైవసందేశాన్ని తన హృదయ ఫలకంపై ముద్రించుకోగలిగే యోగ్యత సాధించేవారు. ఈ అనిర్వచనీయమైన అనుభూతి, ముఖారవిందం ఎర్రగా కందిపోయే స్థితి, ముచ్చెమటలు పట్టే వైనం, చెవులలో గంటలు మ్రోగే శబ్దం – ఇదంతా ఆ ప్రత్యేక అవస్థకు ప్రబల నిదర్శనమే. మొత్తానికి దాని నిజ స్థితి గురించి దైవానికే ఎరుక. మనకు తెలిసింది చాలా తక్కువ. మెలకువలో ఉండగా, అందరి మధ్యనా దైవప్రవక్త (స) ఉన్నప్పుడు కూడా దైవసందేశం అవతరిస్తే ఆయన అందరితో తెగత్రెంపులు చేసుకున్నవారుగా అయిపోయేవారు. నిద్రావస్థలో ఉండగా మన పరిస్థితి ఎలా ఉండేదో వహీ అవతరించినప్పుడు ఆయన (స) పరిస్థితి అలాగే ఉండేది.

ఇవీ వహీ అవతరణ గురించి మనకు తెలియపరచబడిన విశేషాలు!

ఇక మిగిలింది ఈ 'వహీ'కి సంబంధించిన అదనపు పరిశోధన – ఇంతకీ అసలీ వహీ అంటే ఏమిటి? అదెలా ఉంటుంది? దాని వాస్తవికత ఏమిటి? సాధారణ

మనిషి వహీ వాస్తవికతను గురించి అవగాహన చేసుకోగలడా? అనేది. 'లేదు' అని సమాధానమిస్తుంది కురాన్. కురాన్ అవతరిస్తున్న కాలంలో కొంతమంది వ్యతిరేకులు ఈ ప్రశ్నను లేవనెత్తారు కూడా. ( يَسْـَٔلُونَكَ عَنِ ٱلرُّوحِ (బనీ ఇస్రాయీల్ : 85). దీనికి సమాధానంగా అల్లాహ్ తన ప్రవక్తకు ఇలా సూచించాడు : "ప్రవక్తా! వారితో ఇలా అను – ఈ 'వహీ' నా ప్రభువు ఆజ్ఞానుసారం వస్తుంది. కాని మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహు స్వల్పం." (బనీ ఇస్రాయీల్ – 85). మనిషి ఏ తెలివితేటలతో, గ్రహణశక్తితో పుట్టించబడ్డాడో వాటి ఆధారంగా 'వహీ'ని గురించి తెలుసుకోవటం సాధ్యం కాదు. బౌద్ధికంగా చూస్తే ఇదెంతో సముచితమయిన సమాధానం. ప్రవక్తా పదవి (దైవదౌత్యం) మానవులకే ప్రసాదించబడినప్పటికీ, అది మానవుని బుద్ధివివేకాలకు, పరిజ్ఞానానికి అందనిది. అదొక అదనపు 'శక్తి'. ఈ మహాభాగ్యానికి నోచుకున్న అదృష్టవంతుడు మాత్రమే దాని వాస్తవికతను అర్థం చేసుకోగలుగుతాడు. చదువురాని ఒక మామూలు వ్యక్తి సయితం శాస్త్రీయపరమైన యదార్థాలను గురించి తెలుసుకోలేనప్పుడు దైవదౌత్యానికి, ప్రవక్తాపదవికి సంబంధించిన ప్రత్యేక విషయాలను, వాటి వైనాన్ని గురించి ప్రవక్త కాని వ్యక్తి ఎలా తెలుసుకోగలుగుతాడు? ఇది అసంభవం.

అయితే దీనికి ప్రతిగా నిజస్థితి తద్భిన్నంగా కూడా ఉంటుంది. ఎన్నో విషయాలున్నాయి – వాటి వాస్తవికతను కనుగొనటం సంభవం కాదుగాని ఉపమానాల ద్వారా, మన పరిసరాలలో జరిగే వివిధ సంఘటనల ఆధారంగా మన 'అంచనా'ల చూపులు వాటి దృశ్యాలను సంకేతప్రాయంగా వీక్షించగలవు. 'వహీ' విషయం కూడా అటువంటిదే. నిశ్చయంగా 'వహీ' అంటే ఏమిటో, దాని వైనం ఎటువంటిదో మనకు తెలియదు. తెలుసుకోలేము కూడా. మన జ్ఞానపరిధిలో, మన నిత్య అనుభవంలో ఉన్న కొన్ని వస్తువులను మనం మన 'అంచనా' ను నిచ్చెనగా చేసుకుంటే ఆ అనిర్వచనీయ స్థితి యొక్క కొన్ని దృశ్యాలను చూచాయగానయినా సరే బహుదూరాన ఉండి వీక్షించగలం. వాటిలో ముఖ్యమైనది 'నిజమైన స్వప్నాలు (కలలు).' ఈ స్వప్నాలు ఎలాంటివంటే రానున్న కాలంలో – ఎప్పుడయినా – సంభవించనున్న సంఘటన నిద్రావస్థలో ఉన్న ఒక మనిషికి – సంకేతప్రాయంగా – ఇప్పుడే ఎదురయినట్లుగా కనబడుతుంది. ఈ విధంగా రేపు జరగబోయే దాని సమాచారం ఈ రోజే అతనికి ఓ ప్రత్యేక రూపంలో తెలియపరచబడుతుంది. కాస్త ఆలోచించండి! భవిష్యత్తులో జరగనున్న ఒక సంఘటన గురించి అతనికి బొత్తిగా తెలీదు. అలాంటప్పుడు అతను

దానిని ఎలా ఫీల్ చేస్తాడు? ఏ విధంగా, ఎక్కడి నుండి అతనికి ఆ సమాచారం అందింది?

ఈ జగతి వెనుక ఉన్న అగోచర శక్తిని, గొప్ప వాస్తవాల ఉనికిని నమ్మనివారు ఈ విషయమై ఏమంటారో తెలియదు గాని దైవాన్ని నమ్మేవారు, ఆయన ఘనతను అంగీకరించేవారు మాత్రం 'ఇది ఊర్ధ్వలోకాల భాగ్యం. అప్పుడప్పుడూ కొంతమంది దైవదాసులకు ఇది ప్రసాదించబడుతూ ఉంటుంది' అని భావిస్తారు. అంటే అగోచర విషయాల మహాజ్ఞాని, సంఘటనలను ఉనికిలోకి తెచ్చేవాడు స్వప్నావస్థలో – ఓ విశిష్ఠ పద్ధతిలో – జరగబోయే దానిని ముందస్తుగా తెలియపరిచాడని అనుకుంటారు. స్వప్నంలో – అగోచర లోకానికి సంబంధించిన కొన్ని విషయాలు తెలియపరచబడటం మనిషికి అనుభవైక విషయమే. ఈ అనుభవాలు ఉండగా వహీ అవతరణ గురించి, అల్లాహ్ సన్నిధి నుండి కొంతమంది ప్రత్యేకమయిన దాసులకు మార్గదర్శకత్వం అందటం ఊహించలేనంత కష్టతరమయిన విషయం కాదు. అయితే ఏదయినా కలగన్న ఒక వ్యక్తి నిద్రిస్తుండగా తనకు ఆ విషయం ఎలా తెలియపరచబడింది? తాను కన్న ఆ కల వాస్తవికత ఏమిటి? అనేదే తెలియనప్పుడు 'వహీ' అంటే ఏమిటో, దాని వాస్తవికత ఏమిటో అతనెలా తెలుసుకోగలుగుతాడు?

"ముస్లింలకు వచ్చే (నిజమయిన) కలలు ప్రవక్తృత్వంలోని నలభై ఆరవ వంతు" (తిర్మిజీ – కలల అధ్యాయాలు) (قُلِ الرُّوْحُ مِنْ اَمْرِ رَبِّيْ وَمَآ اُوْتِيْتُمْ مِّنَ الْعِلْمِ اِلَّا قَلِيْلًا ـ بنی اسرائیل) అని ప్రవక్త మహనీయులు (స) ప్రవచించారు. స్వయంగా ఆయన (స) విషయానికి వస్తే 'వహీ' అవతరణకు కొంతకాలం ముందు నుండే – నిరంతరం ఆరు మాసాల వరకూ – ఆయన (స)కు నిజమయిన కలలు వచ్చేవి. ఆయన (స) కలలో చూసినది తరువాత కాలంలో నిజంగా జరిగేవి. అంటే ఒకవిధంగా ఇది ఆయన(స) సాధారణ జీవితానికి – దైవదౌత్య జీవితానికి మధ్యన ఉన్న 'సంధికాలం'. ఈ నిజమయిన స్వప్నాలు ఒకరకంగా ఆయనకు లభించబోయే ప్రవక్తా పదవికి, దైవదౌత్యానికి 'ఉపోద్ఘాతం' వంటివి. ఎందుకంటే వాటికి దైవవాణితో, ప్రవక్తాపదవిలో ఒకింత సామ్యం ఉంది. అదీగాక 'మంచి స్వప్నాలు' (రూయాయె సాలెహా) కేవలం దైవప్రవక్తలకే ప్రత్యేకం కావు. ఇతరులకు కూడా ఈ కలలు వస్తాయి. 'వహీ' పరంపర సమాప్తం అయినప్పటికీ 'నిజమయిన కలల' ద్వారం మాత్రం ప్రళయదినం వరకూ తెరచి ఉంచబడింది. బహుశా వహీ అవతరణకు సంబంధించి ప్రాథమిక భావన – ఊహామాత్రంగానయినా – జనుల మదిలో మెదలుతూ ఉండాలన్నది దాని ఉద్దేశం కావచ్చు.

# దైవదూతలు

దివ్య కురాన్‌లో 'దైవదూతలు' (మలాయిక) అనే సృష్టితాల ప్రస్తావన పదే పదే వస్తూ ఉంటుంది. అనేక కారణాల వల్ల ఈ పదం కూడా దివ్య కురాన్‌లోని అత్యంత ముఖ్యమయిన పారిభాషిక పదాల్లో ఒకటయింది. ఎందుకంటే ఈ దైవదూతల (మలాయిక)లో కొందరు దైవప్రవక్తల (అలైహిముస్సలాం)కు దైవసందేశం (వహీ) అందజేయటంలో వారధిగా ఉన్నారు. మరో కారణమేమంటే ఈ దైవదూతల ఔన్నత్యం, స్థాయి సాధారణంగా మనుజ జాతికి 'ఒక పరీక్ష'గా ఉండేది. దైవదూతల యెడల గౌరవం, భక్తి తత్పరతలో మనుషులు అతిశయిల్లి బహుదైవారాధన (షిర్క్), అవిశ్వాసం (కుఫ్ర్), విగ్రహారాధన వంటి వినాశకర అపమార్గాలకు లోనయ్యారు. కొన్నిచోట్ల దైవదూతలను దేవుని కుమారులుగా (అల్లాహ్ క్షమించుగాక!) చేసుకుంటే, మరికొన్నిచోట్ల దైవత్వ గుణాలను పుణికిపుచ్చుకున్న వారుగా తలపోశారు. ఈ విధంగా దేవీదేవతల భావన ఉనికిలోకి వచ్చింది. అందుచేత వారి గురించి కూడా కురాన్ నిర్ధారించిన భావనను ఇదమిత్థంగా తెలుసుకోవసిన ఆవశ్యకత ఉంది.

దైవదూతలు సామాన్య జనులకు అగోచరంగా ఉంటారు. వారు మన పంచేంద్రియాల పరిధికి వెలుపల ఉన్నవారు. కాబట్టి 'వహీ' మాదిరిగా దైవదూతల వాస్తవికతను కూడా మనం తెలుసుకోలేము. ధార్మిక లక్ష్యాల, పరమార్థాల దృష్ట్యా ఆ వివరాలు మనకు తెలియాల్సిన అవసరం కూడా లేదు. వారి లక్షణాల గురించి, స్థాయి గురించి మనకు అవగతమైతే చాలు. కాబట్టి మనకు ఆ జ్ఞానం మాత్రమే వొసగబడింది. కురాన్ ప్రబోధనల, ప్రవక్త మహనీయుల (సఅసం) ఉపదేశాల వెలుగులో దైవదూతలస్థాయి, లక్షణాలు ఇవి –

(1) దైవదూతలు అల్లాహ్ సామీప్యం పొందిన వారు. వారు గౌరవనీయులు. అల్లాహ్ దృష్టిలో మంచి స్థానం పొందినవారు. (అల్ అన్బియా : 26)

(بَلْ عِبَادٌ مُّكْرَمُوْنَ - انبياء ، ۲۶)

(2) వారు నిత్యం దైవాజ్ఞలకు, దైవేచ్ఛకు కట్టుబడి ఉంటారు. వారిలో దైవాజ్ఞలను ధిక్కరించే, తలబిరుసులుగా ప్రవర్తించే సామర్థ్యమే లేదని కురాన్ చెప్పలేదు గాని, క్రియాత్మకంగా వారెన్నడూ అవిధేయతకు పాల్పడరనీ, విధేయత వారి విధానమని, వారు ఆయన ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటారని కురాన్ మాటిమాటికీ చెబుతుంది.

(وَهُمْ بِأَمْرِهِ يَعْمَلُونَ - انبياء - ۲۷) వారు అల్లాహ్ పవిత్రతను కొనియాడటంలో, ఆయన గొప్పతనాన్ని కీర్తించటంలో సదా నిమగ్నులై ఉంటారు. (అల్‌బఖర-30). (نَحْنُ نُسَبِّحُ بِحَمْدِكَ وَنُقَدِّسُ لَكَ - بقره) దైవభీతి ఎల్లవేళలా వారిపై ఆవరించి ఉంటుంది. (అల్ అన్బియా : 28) (وَهُمْ مِنْ خَشْيَتِهِ مُشْفِقُونَ انبياء ۲۸)

(3) వారికి అసాధారణమయిన శక్తులు, అగణ్యంగా ప్రసాదించబడ్డాయి. వారి సంఖ్య కూడా అగణ్యమే. అది మన లెక్కలకు, అంచనాలకు అందనిది.

(4) వారు ఈ జగతిలో 'ప్రభుత్వ సేవకుల' వంటివారు. వారు దైవాజ్ఞలననుసరించి ఈ విశ్వవ్యవస్థ నంతటినీ నడిపిస్తున్నారు. మన ఈ ప్రపంచం మొదలుకుని జగతి యొక్క ఆఖరి హద్దుల వరకూ ప్రవేశపెట్టబడే శాసనాలు, ఉత్తర్వులు ఈ దైవదూతల ద్వారానే అమలు జరుగుతుంటాయి. అయితే ఈ వ్యవహారంలో వారి సొంత అభిప్రాయాలకు, వారి ఇష్టాయిష్టాలకు ఎలాంటి ప్రమేయం ఉండదు. తమ యజమాని నుండి అందిన ఆజ్ఞను పాలించటం వరకే వారి పని. వారికి ఇవ్వబడిన ఆజ్ఞలను, అప్పగించిన పనిని ఖచ్చితంగా నిర్వర్తించడానికే వారికి అసాధారణమయిన శక్తులు ఇవ్వబడ్డాయి.

అంతస్తులు, తరగతుల రీత్యా దైవదూతలలో అనేక వర్గాలున్నాయి. దానికి సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే పరిమితం. అయితే మౌలికంగా వారిలో రెండు వర్గాలున్నాయనవచ్చు. (1) సామాన్యవర్గం (2) ప్రత్యేక వర్గం. ప్రత్యేక వర్గానికి చెందిన దైవదూతలను కుర్‌ఆన్ 'రూహ్' అనే పేరుతో పిలిచింది. ఈ దైవదూతలు సాధారణ దైవదూతల కంటే ఉన్నతులు. అల్లాహ్ సామీప్యం పొందినవారు. దైవాజ్ఞల సౌభాగ్యం తొలుత వారికే లభిస్తుంది. ఆ తరువాత వారు దైవాజ్ఞలను తమకన్నా దిగువ శ్రేణిలో ఉన్న సంబంధిత దూతలకు చేరవేస్తారు. ఈ విశిష్ఠ దూతల సారధి జిబ్రీల్ (అలైహిస్సలాం). దైవప్రవక్తల (అలైహిముస్సలాం) వరకు దైవసందేశాన్ని చేరవేసిన దైవదూత ఈయనే. అంతిమ దైవప్రవక్త (స) హృదయ ఫలకంపై దివ్య కురానును దించినది కూడా ఈయనే.

## ఇస్లామ్

కురాన్ ఏ ధర్మం (దీన్) వైపునకు పిలుపు ఇస్తుందో అది కురాన్‌లో 'ఇస్లామ్'గా పేర్కొనబడింది. నిఘంటువు ప్రకారం ఇస్లాం అంటే విధేయతా భావంతో తలవంచటం, తనను తాను బేషరతుగా సమర్పించుకోవటం అని అర్థం. ఈ పదం కేవలం నిఘంటువు భావంలో కాకుండా ధార్మిక భావనతో ప్రయోగించినప్పుడు కేవలం అల్లాహ్ సమక్షంలో

తలొగ్గటం, తనను తాను నిర్నిబంధంగా అర్పించుకోవటం అన్న అర్థం వస్తుంది. కురాన్ తాను పరిచయం చేసిన జీవన విధానానికి 'ఇస్లామ్' అని నామకరణం చేయటం ద్వారా దానికి సర్వవిధాలా సార్థకత చేకూరినట్లయింది. ఎందుకంటే దాని రాకలోని ప్రధాన ఉద్దేశం దైవదాసులు హృదయపూర్వకంగా తమను తాము కురాన్ ద్వారా ప్రసాదించబడిన దైవాజ్ఞల ముందు తలవంచాలన్నదే.

కేవలం ఈ ఒక్క జీవన ధర్మమే కాదు, అల్లాహ్ తరఫు నుండి వచ్చిన ప్రతి జీవనధర్మం ఉద్దేశం, వాస్తవికత ఇదే. అన్ని దైవిక మత గ్రంథాల రాకలోని లక్ష్యం ఒక్కటే – మానవులు తమ జీవితాలను ఆయనకు సమర్పించుకోవటం! ఈ విధంగా వారు తమ నిజ యజమాని ఆజ్ఞలను శిరసావహించాలి. కనుక భావపరంగా వాటన్నింటిలో ఉన్న ధర్మం 'ఇస్లామే!' అందుకే దివ్య కుర్ఆన్ సయితం ఈ యదార్థాన్ని మాటిమాటికీ వ్యక్తంచేసింది. అది ఇలా అంటోంది : ధ్యేయం, లక్ష్యం రీత్యా ధర్మాలన్నీ ఒక్కటే. ఏ ప్రవక్తపై ఏ గ్రంథం అవతరింపజేయబడినా అది వాస్తవానికి 'ఇస్లామ్' (సంపూర్ణ దైవవిధేయత) సందేశాన్నే తీసుకుని అవతరించింది. కాబట్టి అసలుసిసలు నైజం దృష్ట్యా 'ఇస్లామ్' అనేది ఒక్క కుర్ఆన్‌ని అవలంబించే వారి జీవన విధానం కాదు, అది సమస్త మానవ జాతి జీవన విధానం అయి ఉండేది. ఇంకా చెప్పాలంటే, ఇస్లామ్ యావజ్జగతి ధర్మం అయి ఉండేది. భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువులు – తమకు ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా – అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండేవి (ఆలి ఇమ్రాన్ : 83). కాని సమస్త దైవ ధర్మాలన్నీ తమ ధ్యేయం దృష్ట్యా 'ఇస్లాం ధర్మమే' అయినప్పటికీ నామకరణం విషయానికి వచ్చేసరికి దివ్య కుర్ఆన్ ప్రత్యేకంగా అది అందజేసిన జీవన విధానాన్నే 'ఇస్లామ్' గా ఖరారుచేసింది. ఈ జీవన సంవిధానానికి గల ఈ విశిష్ఠత దానికి ఇచ్చిన హక్కు ఏమిటంటే, 'ఇస్లామ్' అనే పదం కేవలం దాని వాస్తవికతకు, ఉద్దేశానికి మాత్రమే దర్పణం కారాదు; పైగా అది ఆ పేరుతోనే, ఆ 'ధ్వజం'తోనే వర్థిల్లాలి. ఇతర ధర్మాల వరకు అది కేవలం వాటి వాస్తవాలకు, ఉద్దేశాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించేదిగా ఉంది. వాస్తవంలో ప్రతి దైవ గ్రంథం 'కుర్ఆన్' అనటం ఎలాంటిదో ఇదీ అలాంటిదే. అయితే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ద్వారా అందజేయబడిన అంతిమ దైవగ్రంథానికి మాత్రమే దాని పేరు, మకుటం ప్రత్యేకించబడ్డాయి.

కుర్ఆన్ ద్వారా అందజేయబడిన ధర్మానికి గల ఇంకొక విశిష్ఠత ఏమిటంటే అది ఎవరో ఒక వ్యక్తి పేరు మీదనో లేక ఒక జాతి పేరు మీదనో లేదు. అది దాని వాస్తవానికి, ఉద్దేశానికి ప్రతిబింబంగా మాత్రమే ఉంది. వ్యక్తి లేక జాతి పేరు మీద

ఉంటే దాని పేరు వినగానే ఎవరయినా అది ఎవరి జీవన విధానమో, దేని వైపునకు పిలుస్తోందో ఇట్టే ఊహిస్తారు. ప్రపంచంలోని ఇతర ధర్మాలు తమ పేర్లద్వారా ఈ రకమయిన మార్గదర్శకత్వం వహించలేవు. ఎందుకంటే అవి తమ ఆశయాలను, వాస్తవాలను అభివ్యక్తం చేసే బదులు వ్యక్తుల, జాతుల పేర్లతో పిలువబడుతున్నాయి. క్రైస్తవమతాన్ని క్రైస్తవమతంగా పిలవటానికి కారణం ఆ మతధర్మాన్ని పరిచయం చేసినవారు ఏసుక్రీస్తు (ఈసా–అలైహిస్సలం) కావటమే. బౌద్ధమతాన్ని ఆ పేరుతో ఎందుకు పిలుస్తున్నారంటే దానిని స్థాపించినవారు గౌతమబుద్ధుడు కాబట్టి. పారసీక మతం కూడా అంతే. అది కూడా దాని మూలస్థాపకుడైన జర్‌దుష్ట్ పేరుతో పిలువబడుతుంది. యూదమతానికి యూదుత్వం ఎందుకన్నారంటే ఒకప్పుడు ఇస్రాయీల్ సంతతివారిలో 'యహూదా' అనే తెగ గౌరవోన్నతులు, గొప్ప పేరుప్రతిష్ఠలు గల తెగగా ఉండేది. దాని నీడలో ఇతర ఇస్రాయీలీ తెగలు ఎదగలేకపోయాయి. యావత్తు ఇస్రాయీలీ వంశీయులపై యహూదా తెగ ఆధిపత్యం కొనసాగింది. దైవప్రవక్త మూసా (మోషే) ద్వారా ప్రసాదించబడిన షరీఅత్ (ధర్మశాస్త్రం) కూడా ఈ పేరుతోనే పిలువబడింది. అయితే కుర్‌ఆన్ మాత్రం తన సందేశాన్ని, తన ధర్మాన్ని మహనీయ ముహమ్మద్ (స) వ్యక్తిత్వం లేక ఆయన(స) జాతి వైపు అంకితం చేసి దానిని ముహమ్మదీయ మతం అనో, అరబ్బీ మతం అనో, హాషిమీ మతం అనో నామకరణం చేయలేదు. దానికి 'ఇస్లామ్' అనే పేరు మాత్రమే పెట్టింది. ఈ పేరే దానికి శోభాయమానం. సూత్రప్రాయంగానయినా, విశ్వజనీనత రీత్యానయినా, దాని పరిపూర్ణత దృష్ట్యానయినా అదే దానికి తగిన నామం.

## మోమిన్, ముస్లిం (విశ్వాసి, విధేయుడు)

కుర్‌ఆన్‌లోని అతి ముఖ్యమయిన పారిభాషిక పదాల్లో 'మోమిన్', 'ముస్లిం' పదాలు కూడా ఉన్నాయి. ఇవి ఒకే వాస్తవం యొక్క రెండు వైపుల వంటివి –ఒకటి : జ్ఞానపరమయింది. రెండవది : క్రియాత్మకమైనది. కాబట్టి పైకి అవి రెండూ వేర్వేరుగా పారిభాషిక పదాలుగా కనిపిస్తున్నప్పటికీ యదార్థానికి అవి ఒక్కటే. ముమ్ముందు ఈ విషయం సుస్పష్టం కానున్నది.

దివ్య కురాన్‌ను నిజభావంలో, అది వాంఛించే పద్ధతి ప్రకారం దైవగ్రంథంగా అంగీకరించినవాడు 'మోమిన్' (విశ్వాసి). అంటే అది ఏ విశ్వాసాలను లేక సూత్రప్రాయమయిన యదార్థాలను తన సందేశానికి ప్రాతిపదికగా చేసుకుందో అవి సత్యబద్ధమని మనస్ఫూర్తిగా ఒప్పుకోవాలి. నోటితో కూడా దానిని ధ్రువపరచాలి.

ఆ మేరకు ప్రకటించాలి. ఆ విశ్వాసాలు లేక సూత్రప్రాయమయిన వాస్తవాలు అయిదు. కురాన్ మాటల్లోనే చెప్పాలంటే అవి వరుసగా ఇవి :

"సత్కార్యం అంటే మనిషి (1) అల్లాహ్‌నూ, (2) అంతిమదినాన్నీ, (3) దైవదూతలనూ, (4) అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, (5) ఆయన ప్రవక్తలనూ విశ్వసించటం."

*(అల్ బఖర : 177)*

وَلٰكِنَّ الْبِرَّ مَنْ اٰمَنَ بِاللّٰهِ وَ
الْيَوْمِ الْاٰخِرِ وَالْمَلٰٓئِكَةِ وَ
الْكِتٰبِ وَالنَّبِيّٖنَ ؕ (بقرة)

**(1) 'అల్లాహ్‌ను విశ్వసించటం'** అంటే అర్థం కేవలం ఆయన్నే ఆరాధ్య దైవంగా అంగీకరించాలి. సమస్త దైవత్వపు లక్షణాలు ఆయనకే ప్రత్యేకమని భావించాలి. మరి ఆ లక్షణాలు సహజంగా వాంఛించే వాటిని సంపూర్తిగా ఆయన కొరకే నెరవేర్చాలని తలపోయాలి – అంటే సమస్త అధికారాలు, సమస్త హక్కులు ఆయనకే చెందుతాయనే విషయాన్ని ఒప్పుకోవాలి. ఉదాహరణకు : దాసులకు ఆజ్ఞాపించే, వారికొరకు శాసనాలను నిర్మించే అధికారం, వారి గురించి నిర్ణయాలు గైకొనే అధికారం, మొరలు ఆలకించి వాటిని ఆమోదించే అధికారం, దాసులను క్షమించే లేక శిక్షించే అధికారం, వారికి లాభనష్టాలను కలిగించే అధికారం, వారికి సుఖశాంతులు వొసగే, కష్టాలకు గురిచేసే, జీవన్మరణాలను వొసగే అధికారం. అలాగే బేషరతుగా (తన దాసుల చేత) విధేయతకు కట్టుబడేలా చేయించుకునే హక్కు, తాను కోరిన దానిని నెరవేర్చుకునే హక్కు, తన దాస్యం చేయించుకునే హక్కు మొదలగునవి. (అల్లాహ్‌ను సరిగ్గా ఇలాగే విశ్వసించాలన్నది కుర్‌ఆన్ సందేశం. ఇదే ఇస్లాంకు అసలు ప్రాతిపదిక. దీనినే దేవుని ఏకత్వపు విశ్వాసం అంటారు).

**(2) 'అంతిమదినాన్ని విశ్వసించటం'** అంటే భావం; ఒకానొక రోజు రానున్నది. అప్పుడు ఈ ప్రపంచం నశించనున్నది. ఈ ప్రపంచ వ్యవస్థ అంతా అల్లకల్లోలం అయిపోతుంది. ఈ పుడమిపై ఏ ఒక్క ప్రాణి కూడా సజీవంగా మిగలదు. ఆ తరువాత ప్రపంచంలోని ఆది మానవుడు మొదలుకుని అంతిమ మానవుని వరకు అందరూ మళ్లీ బ్రతికించబడి అల్లాహ్ సమక్షంలో హాజరుపరచబడతారు. వారు ఈ ప్రపంచంలో చేసుకున్న కర్మల రికార్డులన్నీ వారి ముందు ఉంచబడతాయి. ఒక్కో వ్యక్తి నుండి లెక్క తీసుకోబడుతుంది. సదాచరణకు మంచి ప్రతిఫలం, దుష్కర్మలకు దుష్ఫలం వొసగబడుతుంది. అంటే ఎవరి కర్మల పత్రం విశ్వాసం (ఈమాన్)తో, సదాచరణ (అమలె సాలెహ్)తో, విధేయతా భావంతో, దాస్యభావంతో కూడుకుని ఉంటుందో అతనికి అల్లాహ్ మరో ప్రపంచంలో భోగభాగ్యాలతో నిండిన జీవితాన్ని

ప్రసాదిస్తాడు. ఆ భోగభాగ్యాలు, ఆ సుఖసౌఖ్యాలు ఎన్నటికీ తరగనివి – శాశ్వతమైనవి. మరెవరి కర్మల పత్రంలో విశ్వాసానికి బదులు అవిశ్వాసం (కుఫ్ర్), ఏకేశ్వరోపాసనకు బదులు బహుదైవోపాసన (షిర్క్), సదాచరణకు బదులు పాపకార్యాలు, విధేయతకు బదులు అవిధేయత ఉంటాయో ఆ కర్మల పత్రం నిజదైవంపై తిరుగుబాటుకు సాక్ష్యాధారం సమకూర్చేదిగా పరిణమిస్తుంది. అలాంటి వ్యక్తికి బాధాకరమయిన జీవితం వొసగబడుతుంది. ఈ జీవితం కూడా శాశ్వతమైనదే.

**(3) 'దైవదూతలను విశ్వసించటం'** అంటే అర్థం వారి ఉనికిని సత్యబద్ధమైనదిగా అంగీకరించటం. 'దైవదూతలు' అనే శీర్షిక క్రింద ఇంతకు ముందు ప్రస్తావించబడిన లక్షణాలను, విధులను యధాతథంగా నమ్మినడుచుకోవటం అన్నమాట.

**(4) 'దైవగ్రంథాలను విశ్వసించటం'** అంటే భావం మానవజాతి మార్గదర్శకత్వం నిమిత్తం అల్లాహ్ తరఫు నుండి అవతరించిన గ్రంథాలన్నింటినీ అల్లాహ్ గ్రంథాలుగా అంగీకరించటం. వాటిలో ఏ ఏ గ్రంథాల గురించి "ఇవి అల్లాహ్ అవతరింపజేసినవి" అని కురాన్ ఖచ్చితంగా ప్రకటించిందో వాటిని ఆ పేర్లతో సహా దైవగ్రంథాలని నమ్మాలి. మరే గ్రంథాల సాక్ష్యాధారాలు లేవో వాటిని కేవలం 'అగోచరమైనవి'గా – అంటే పేర్లు లేని ఆ గ్రంథాలు కూడా దైవగ్రంథాలై ఉంటాయని నమ్మకం కలిగి ఉండాలి.

దైవ గ్రంథాలను విశ్వసించే విషయంలో ఒక ముఖ్యమైన కోణం ఏమిటంటే ప్రస్తుతం మనకు తెలిసిన గ్రంథాలలో అన్నింటినీ దైవగ్రంథాలుగా – సమదృష్టిలో – చూడాలి. అయితే క్రియాత్మకంగా మాత్రం దివ్య కురాన్‌ను అంతిమ దైవగ్రంథంగా పరిగణించాలి. అది పూర్వపు గ్రంథాలను రద్దుపరచిన గ్రంథం అనీ, ఇప్పుడు దానిని అవలంబించటంపైనే ప్రతి వ్యక్తి మోక్షం ఆధారపడి ఉందన్న సంగతిని మరువరాదు.

**(5) 'ప్రవక్తలను విశ్వసించటం'** అంటే అర్థం మొదటి నుండి చివరి వరకు అల్లాహ్ తరఫు నుండి ప్రభవింపజేయబడిన ప్రవక్తలను – ఎలాంటి విచక్షణ చూపకుండా, భేదభావం పాటించకుండా – అందరినీ దైవప్రవక్తలుగా నమ్మటం. వారిలో ఎవరెవరి పేర్లను దివ్య కురాన్ ప్రస్తావించిందో వారిని ఆ పేర్లతో సహా విశ్వసించాలి. మిగతా వారిని – పేర్లు లేకపోయినా – వారు దైవప్రవక్తలేనని సూత్రప్రాయంగా అంగీకరించాలి.

ఈ విశ్వాసంలోని మరో ముఖ్యమయిన అంశం ఏమిటంటే ముహమ్మద్ (సఅసం) ను అంతిమ దైవప్రవక్త (స)గా విశ్వసించాలి. సమస్త మానవాళికి ఆయన

(స)ను అనుసరించటం అవసరమని కూడా అంగీకరించాలి. అంటే ఆయన (స) ప్రభవించిన తరువాత ప్రళయదినం వరకూ ఆయన దైవదౌత్యమే ఉంటుంది. ఇతర ప్రవక్తలలో ప్రతి ఒక్కరి దైవదౌత్య హయాం దైవాజ్ఞననుసరించి పరిసమాప్తం అయింది. ఇప్పుడు ఇతర ప్రవక్తల అనుసరణ దైవసన్నిధిలో స్వీకారయోగ్యం కాదు.

**ముస్లిం :** విశ్వాసి అయిన పిదప (మోమిన్ అయిన తరువాత) ఆ విశ్వాసం కోరే క్రియాత్మక విధులను నిర్వర్తించడానికి సమాయత్తమయిన వ్యక్తిని ముస్లిం అంటారు. అతను కుర్ఆన్‌ను, ఇస్లాంను అవలంబించే వాడై ఉంటాడు. దైవాజ్ఞల ముందు తనను తాను సమర్పించుకుంటాడు. అంటే ఈ పదానికి అల్లాహ్ ఆజ్ఞలను శిరసావహించేవాడు, విధేయత చూపేవాడు అని అర్థం వస్తుంది. ఆదేశాలను, ఉపదేశాలను ఖచ్చితంగా పాటించనంతవరకూ కుర్ఆన్‌ను విశ్వసిస్తున్నానని అంటే అందులో అర్థమే లేదు. కాబట్టి ఏ వ్యక్తి అయినాసరే కురాన్‌ను నమ్మి, దాని మౌలిక విశ్వాసాలను అంగీకరించి విశ్వాసి (మోమిన్)గా పరివర్తన చెందాడంటే 'కుర్ఆన్ మరియు ఇస్లామ్' అనబడే మార్గదర్శక నియమావళిని తన క్రియాత్మక జీవితానికి మూలాధారంగా చేసుకుంటాడు. ఈ కారణంగానే కుర్ఆన్‌ను (దైవగ్రంథంగా) ఒప్పుకోగానే ఆ వ్యక్తి 'విశ్వాసి' (మోమిన్) మాత్రమే కాదు, విధేయుడు (ముస్లిం) కూడా అయిపోతాడు.

'ముస్లిం' అనే పదం లక్షణ స్థాయి ఒక్కటే కలిగిలేదు. అది కుర్ఆన్‌ను, ప్రవక్త మహనీయుల (స)ను నమ్మి నడుచుకునే వారి 'పేరు' మరియు 'నామధ్యేయం' కూడా. అందుకే ఈ విధంగా సెలవీయబడింది –

هُوَ سَمّٰىكُمُ الْمُسْلِمِيْنَ (ج)

"ఆయన (అల్లాహ్) మీకు 'ముస్లిమ్' అనే పేరునే పెట్టాడు."

*(అల్ హజ్జ్ : 78)*

ఏ విధంగానయితే కుర్ఆనీ ధర్మం (జీవన విధానం) వ్యక్తి పేరు మీదనో, జాతి పేరు మీదనో లేదో అదేవిధంగా దానిని నమ్మినడుచుకునే వారి పేరు కూడా వ్యక్తుల, జాతుల పేరు మీద లేదు. పైగా అది వాటన్నింటికంటే ఉన్నతంగా ఉంది. దాని పేరు 'ఇస్లాం' అయితే, వారి పేరు 'ముస్లిం'. ఈ విధంగా కేవలం గుణంతో కూడినదైనందున ఈ నామం కూడా నామధేయుని సూత్రప్రాయమైన స్థాయికి ప్రాతినిధ్యం వహించేది అయింది. అయితే అన్యులు తమ సామాజిక స్వభావం, వారసత్వంగా పుణికిపుచ్చుకున్న భావజాలం, ఆచార సంప్రదాయాల కారణంగా

ముస్లింకి – ముహమ్మదీయునికి మధ్య గల వ్యత్యాసాన్ని అర్థం చేసుకోలేకపోయారు. తత్ఫలితంగా వారు ఇస్లాం ధర్మావలంబీకులను 'ముస్లింలు' అనే బదులు 'ముహమ్మదీయులు' అనసాగారు.

ఈ 'ముస్లిం' పదమే పారసీక భాషలో రెండు అదనపు అక్షరాలతో 'ముసల్మాన్'గా మారింది.

## కుఫ్ర్ - కాఫిర్

'ఈమాన్' అనే పదానికి పూర్తిగా వ్యతిరేకమైనది 'కుఫ్ర్'. నిఘంటువు ప్రకారం కుఫ్ర్ అనే పదానికి అర్థం దాచేది, మరుగుపరిచేది. అలాగే 'కాఫిర్' అంటే దాచిపెట్టేవాడు, మరుగుపరిచేవాడు అన్న అర్థం వస్తుంది. ఈ (కాఫిర్) అరబీ భాషలో అనేక పదాలకు గుణవాచకంగా ప్రయోగించబడుతుంది. ఉదాహరణకు : రాత్రి, సముద్రం, రైతు మొదలగునవి. రాత్రి యావత్తు ప్రపంచాన్ని తన చీకటి తెరలలో కప్పేసుకుంటుంది. సముద్రం తన లోపల జీవరాసులను దాచుకుంటుంది. రైతు వ్యవసాయం చేస్తున్నప్పుడు విత్తనాలను నేలలో కప్పి పెడతాడు. కాబట్టి నిఘంటువు పరంగా వీటిలో ప్రతి ఒక్కటీ 'కాఫిరే.'

కురాన్ పరిభాషలో కుఫ్ర్ రెండు అర్థాలలో ఉపయోగించబడింది. (1) అల్లాహ్ పట్ల కృతఘ్నుత లేక అల్లాహ్ మేళ్లను మరవటం. (2) ధర్మం (దీన్) యొక్క మౌలిక విశ్వాసాలలో ఏదేని విశ్వాసాన్ని తిరస్కరించటం. చెప్పడానికైతే 'కుఫ్ర్'కు రెండు వేర్వేరు అర్థాలున్నాయి. కాని వాస్తవానికి ఈ ద్విత్వంలో కూడా పరస్పరం అవినాభావ సంబంధం ఉంది. సహజమైన ఏకత్వం ఉంది. ఒకవేళ ఆ రెండింటికి మధ్య వ్యత్యాసం ఏదయినా ఉందనుకుంటే అది విత్తనానికి – మొక్కకు మధ్య ఉండే వ్యత్యాసం వంటిదే. లేదా అది సూర్యునికి – దాని ద్వారా వ్యాపించే వెలుతురుకి మధ్య ఉండే తేడాలాంటిదే! మనిషిలో తిరస్కారభావమనేది కృతఘ్నుత (మేలును మరువటం) వల్లనే జనిస్తుంది.

'కుఫ్ర్'కు గల నిఘంటుపరమైన అర్థానికి – పారిభాషిక భావానికి మధ్య గల అనుబంధాన్ని అర్థం చేసుకోవటానికి సుదీర్ఘమయిన వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు. కృతఘ్నుడు, తిరస్కారి అయిన వ్యక్తి దేవుని మేళ్లను, ఉపకారాలను దాచిపెడతాడు. పరిపాలకుడు, పోషకుడైన దేవుని హక్కును దాచిపెడతాడు. తన దాస్యభావాన్ని దాచిపెడతాడు. చివరకు లోకేశ్వరుడైన అల్లాహ్ మహోపకారం, దాస్యభావన, విధేయతాభావం పొందుపరచబడివున్న తన అసలు నైజాన్ని కూడా దాచేస్తాడు.

కాబట్టి అల్లాహ్ పట్ల కృతఘ్నుతను, ఆయన గుణగణాల నిరాకరణను 'కుఫ్ర్'గా అభివర్ణిస్తే దీనికి అంతకన్నా చక్కని నిర్వచనం మరొకటి ఉండదు.

'కుఫ్ర్' (సత్యతిరస్కారం), 'కాఫిర్' (సత్యతిరస్కారి, అవిశ్వాసి) లాంటి పదాలు ఖుర్‌ఆన్‌లో చెప్పబడినప్పుడు సాధారణంగా ఈ రెండవ రకం భావాలే వాటిలో అంతర్లీనమై ఉంటాయి. అంటే – (కాఫిర్ అంటే) అల్లాహ్ గుణగణాలలో ఏ ఒక్క దానినయినాసరే త్రోసిపుచ్చేవాడు లేదా ఆ గుణగణాలు కోరేవాటిని కాదనేవాడు లేదా అంతిమదినాన్ని తిరస్కరించేవాడు లేదా వహీని, దైవదౌత్యాన్ని తృణీకరించేవాడు లేదా దైవదూతల ఉనికిని త్రోసిపుచ్చేవాడు లేదా ఏ ప్రవక్తనయినా ప్రవక్తగా అంగీకరించనివాడు లేదా ఏదేని దైవగ్రంథాన్ని దైవగ్రంథంగా విశ్వసించడానికి ఒప్పుకోనివాడు అన్నమాట.

విశ్వాసంలో వివిధ శ్రేణులున్నట్లే 'తిరస్కార' భావంలో 'కుఫ్ర్' యొక్క శ్రేణులు వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు : సత్యం ప్రస్ఫుటం, పరిచయం అయిన మీదట దానిని త్రోసిపుచ్చటం ఒక 'కుఫ్ర్'. మరొకటి తెలీకపోవటం చేత తిరస్కరించబడేది. ఈ రెండూ ఎన్నటికీ ఒక్కటి కాలేవన్నది సుస్పష్టమే. అందువల్ల న్యాయబద్ధంగా ఈ రెండింటి ఫలితాలు కూడా ఒక్కటి కాలేవు, కాకూడదు. ఇలాంటి కొన్ని తిరస్కార (కుఫ్ర్) భావాలు దైవసన్నిధిలో క్షమార్హంగా నిలిచినా ఆశ్చర్యపోనవసరం లేదు. కురాన్ ఉపదేశాల వల్ల తెలిసేది కూడా ఇదే. ఉదాహరణకు : ఒక ప్రవక్త సందేశం ఒక వ్యక్తి వరకు చేరదు. ఒకవేళ చేరినా చేరవలసిన రీతిలో చేరదు. అందువల్ల ఆ వ్యక్తి ఆ ప్రవక్త దైవదౌత్యాన్ని విశ్వసించడు. ('కుఫ్ర్'కు ఒడిగడతాడు). అలాంటి వ్యక్తి నిశ్చయంగా క్షంతవ్యుడుగా భావించబడతాడు. కాగా, దీనికి భిన్నంగా దేవుని ఏకత్వాన్ని కాదన్నవాడు ఎట్టి పరిస్థితిలోనూ క్షమార్హుడు కాజాలడు. ఎందుకంటే దేవుని ఏకత్వపు (తౌహీద్) భావన ప్రతి మనిషి నైజంలో ప్రోదిచేయబడి ఉంది. దీనికి సంబంధించిన స్పష్టమయిన నిదర్శనాలు కళ్లున్న ప్రతి ఒక్కరి ముందు, ప్రతి చోటా విస్తరించి ఉన్నాయి. కనుక ఈ తిరుగులేని యదార్థం విషయమై మానవుడు సుతరామూ క్షంతవ్యుడు కాడు. అలాగే కుఫ్ర్ (తిరస్కారం)కు సంబంధించిన కొన్ని రూపాలు కఠినాతికఠిన శిక్షకు కారణం కావచ్చు. పరలోకంలోనే కాదు, ఈ ప్రాపంచిక జీవితంలో కూడా వారి వ్యవహార సరళికి గాను – శాస్తిగా – దుష్పరిణామాన్ని మూటకట్టుకోవలసి ఉంటుంది. అందుకే ఖుర్‌ఆన్ చెప్పింది – నిజమే చెప్పింది – అది చెప్పినది ఒకట్రెండుసార్లు కాదు, ఎన్నోసార్లు దాని రుజువులను కూడా మన చర్మచక్షువులు వీక్షించాయి. సత్యసందేశం వైపునకు పిలుపు ఇవ్వబడినప్పటికీ తిరస్కరించిన వారికి

జరిగిన శాస్తి అది! దైవప్రవక్తల (అలైహిముస్సలాం) ద్వారా వారు ఆ 'పిలుపు'ను అందుకున్నారు. సత్యం వారి ముందు ప్రస్ఫుటం అయింది. వాదోపవాదాలు, తర్జనభర్జనలకు సంబంధించి ఇక ఏ అవకాశమూ మిగలనంత స్థాయిలో వారి వెనుక కృషి చేయటం జరిగింది. అలాంటి జనులకు పరలోకంలో ఎదురయ్యే పరిణామం ఎలాగూ తప్పదు. కాని ఈ ప్రపంచంలో సయితం అలాంటి జనాన్ని దండించటం జరిగింది. వారి అవశేషాలు కూడా మిగలకుండా ఉండేలా రూపుమాపటం జరిగింది. వారు భూకంపాలు, వరదలు, తుఫానులు, ఉప్పెనలు, రాళ్లవాన, అగ్ని పర్వతాలు, లావాల ద్వారానయినా తుదముట్టించబడ్డారు లేదా దైవాన్ని నమ్మినడుచుకునే అభిమానధనుల ఖడ్గాలతో నయినా వారి 'దుంప' త్రెంచి వేయటం జరిగింది. ఆఖరికి 'జిమ్మీలు' గా బ్రతికే హక్కు కూడా వారికి లేకుండా చేయటం జరిగింది – మరిచూడబోతే ఇతర తిరస్కారులకు ఈ 'హక్కు' ద్వారా లబ్ధిపొందే అవకాశం శాశ్వతంగా మిగిల్చి ఉంచబడింది!

## షిర్క్ - ముష్రిక్

### (బహుదైవోపాసన–బహుదైవోపాసకుడు)

'షిర్క్' అంటే అసలు, పొత్తు, కూడిక, భాగస్వామ్యం అనే శాబ్దిక అర్థం వస్తుంది. షరీఅత్ పరిభాషలో షిర్క్ అంటే ఏ దైవేతరుణ్ణి అయినాసరే దేవుని అస్థిత్వంలో, లేదా ఆయన గుణగణాలలో లేదా ఆ గుణగణాలు వాంఛించే విషయాలలో 'భాగస్వామి'గా ఎంచటం.

దేవుని అస్థిత్వంలో భాగస్వామ్యం కల్పించే వైనం మచ్చుకు ఈ విధంగా ఉంటుంది :

(1) ఆయన ఉనికిని వేరొకరి ఉనికిగా లేదా వేరొకరి ఉనికిని ఆయన ఉనికిగా ఖరారు చేయటం.

(2) వేరెవరినయినా ఆయనకు సరిసమానుడుగా నిలబెట్టడం.

(3) వేరెవరినయినా ఆయన తండ్రిగానో, కొడుకుగానో నిర్ధారించటం.

దేవుని లక్షణాలలో, గుణాలలో 'భాగస్వామ్యం' కల్పించటమంటే భావం ఆ లక్షణాలు వేరితరులలో కూడా ఉన్నాయని నమ్మటం. అంటే అల్లాహ్‌లో ఉన్నవే ఇతరులలో కూడా ఉన్నాయని ఖరారు చేయటం.

దేవుని గుణగణాలు వాంఛించే వాటిలో భాగస్వామ్యం కల్పించటమంటే భావం,

ఆ గుణాల సహజ పరిణామంగా అల్లాహ్‌కు చెందవలసిన అధికారాలు, హక్కులలో ఏదయినా అధికారం లేక హక్కు వేరొకరికి కూడా ఉంటుందని తలపోసి తదనుగుణంగా నడుచుకోవటం! ఉదాహరణకు : దేవుని ఒక గుణం ఏమిటంటే ఆజ్ఞాపించే, నిర్ణయం గైకొనే అధికారం పూర్తిగా ఆయనకే ఉంది. ఈ అధికారం ప్రకారం జనుల విధి వ్రాత (జాతకం) ఆయన స్వాధీనంలో ఉంటుంది. రెండవది : మొరలను ఆలకించే, విజ్ఞాపనలను వినే, వేడుకోళ్లను సమ్మతించి ఆమోదించే హక్కు ఆయనదే. ఇక ఎవరయినా తమకు కష్టాలొచ్చినప్పుడు వేరొకరిని మొరపెట్టుకుంటే లేదా దేనినయినా పొందటానికి తన నిజదైవాన్ని తప్ప వేరొకరి సమక్షంలో అభ్యర్థన చేసుకుంటే అది అల్లాహ్‌కు చెందవలసిన ప్రత్యేక హక్కులో భాగస్వామ్యానికి ఒడిగట్టినట్లవుతుంది.

ఈ రకమయిన నమ్మకాలను కలిగివుండేవాడు కుర్‌ఆన్ పరిభాషలో ముష్రిక్ (బహుదైవోపాసకుడు) అనబడతాడు.

షిర్క్‌ను కురాన్ 'ఘోరమయిన అన్యాయం' (జుల్మె అజీమ్) గా ఖరారు చేసింది. అంటే అల్లాహ్‌కు చెందవలసిన అతి పెద్ద హక్కును కాజేయటమన్నమాట! ఈ నేరం ఎట్టి పరిస్థితిలోనూ క్షమార్హం కాదని కూడా చెప్పింది కురాన్.

## గ్రంథవహులు (అహ్లె కితాబ్)

'అహ్లె కితాబ్' అంటే గ్రంథం కలవారు, గ్రంథవహులు అని అర్థం. అయితే దివ్య కురాన్ పరిభాషలో 'కితాబ్' అనే పదానికి ఒక ప్రత్యేకమయిన, పరిమితమయిన భావార్థం నిర్ధారితమయి ఉంది. అంటే, దైవగ్రంథం నేపథ్యంలో ఈ పదం ఉపయోగించబడుతుంది. 'అహ్లె కితాబ్' అనే పదం కూడా అంతే. ఈ పదం కురాన్‌లో ఎక్కడ వచ్చినా అది యూదులు, క్రైస్తవుల నేపథ్యంలోనే ఉంటుంది. ఇతర దైవగ్రంథాలను అవలంబించే వ్యక్తులుగానీ, జాతులుగానీ 'అహ్లె కితాబ్' పరిధిలోకి రారు. 'కితాబ్' (గ్రంథం) అనగానే దైవగ్రంథం అయినప్పుడు 'అహ్లె కితాబ్' (గ్రంథవహులు) అన్నప్పుడల్లా దైవగ్రంథాలను నమ్మే వారందరికీ ఆ పదం వర్తించాలి కదా! అది కేవలం యూదులు, క్రైస్తవులకే ఎందుకు ప్రత్యేకించబడింది? అన్న సందేహం ఎవరికయినా కలగవచ్చు.

దీనికి సమాధానం ఏమిటంటే దైవగ్రంథాలలో కేవలం మూడు గ్రంథాలను మాత్రమే దివ్య కురాన్ ధ్రువపరిచింది – అవి (1) తౌరాత్ (2) ఇంజీల్ (3) జబూర్. కాబట్టి అది ఎప్పుడు 'గ్రంథవహులు' అనే పదాన్ని ప్రస్తావించినా సహజంగా ఈ మూడు గ్రంథాల అనుయాయులకు మాత్రమే అది పరిమితమవుతుంది.

(1) తౌరాతు గ్రంథం పేరుతో ఉనికిలోనికి వచ్చినది యూదు సముదాయం. (2) 'ఇంజీల్' ద్వారా ప్రభవింపజేయబడిన సమాజం క్రైస్తవ సమాజం (3) ఇకపోతే జబూర్ గ్రంథం, దీని ఆధారంగా ప్రత్యేకంగా ఒక సముదాయం ఉనికిలోనికి రాలేదు. ఎందుకంటే అది శాశ్వతమయిన గ్రంథం కాదు. అది తౌరాతు గ్రంథానికి 'అనుబంధం' మాత్రమే. సుప్రసిద్ధ ఇస్రాయీలీ ప్రవక్త హజ్రత్ దావూదు (అలైహిస్సలాం)పై అది అవతరించింది. దానిని యూదులు, క్రైస్తవులు కూడా విశ్వసిస్తారు.

ఈ గ్రంథాలు మినహా మిగిలిన ఏ ఏ గ్రంథాలు నేడు దైవ గ్రంథాలుగా భావించబడుతున్నాయో వాటిని గురించి కుర్‌ఆన్ మౌనం వహించింది. అందుచేత – దాని సనదు రీత్యా – వాటిలో ఏ గ్రంథాన్ని కూడా దైవగ్రంథంగా, దాని అనుయాయులను 'గ్రంథవహులు'గా పేర్కొనడానికి ఎలాంటి అవకాశం మిగల్లేదు. కాకపోతే ఊహలు, అంచనాల (కియాస్) ద్వారం మాత్రం ఎప్పటికీ తెరచుకునే ఉంటుంది. అయితే 'ఊహ' సరైనదై ఉండాలని ఏమీ లేదు. ఇందులో పొరపాటుకూ ఆస్కారముంటుంది, కనుక ఊహ (కియాస్)ను కుర్‌ఆన్ 'ధ్రువీకరణ'కు 'ప్రత్యామ్నాయం'గా ఎట్టి పరిస్థితిలోనూ ఖరారు చేయలేము.

తెలియవచ్చిన దేమిటంటే 'అహ్లె కితాబ్' (గ్రంథవహులు) అనే పారిభాషిక పదం యూదుల, క్రైస్తవుల యెడల 'పతాక' (టైటిల్) స్థాయిని కలిగి వుంది. ఏదయినా మూడవ వర్గాన్ని ఆ 'పరిధి'లో ప్రవేశించిన వర్గంగా ఊహించటం తగదు.

**–సమాప్తం–**